
సాక్షి
ఫన్‌డే
ఆదివారం ::: 7 అక్టోబర్ 2012
గోపిక
అజ్ఞాతవాసం
మహతి
ఇంటర్వ్యూ
మొండిమనిషి
గాదె ఇన్నయ్య ఇన్నర్‌వ్యూ

## క్విక్ బైట్స్..!

## చేతికి చిక్కని ఫోన్!



సరికొత్త యాపిల్ ఐఫోన్5 రోడ్డుమీద కనపడితే ఏంచేస్తారు? అటూ ఇటూ చూసి మిమ్మల్ని ఎవరూ గమనించట్లేదు అనుకుంటే వెంటనే దాన్ని సొంతం చేసేసుకుంటారు కదూ! అది మానవ సహజం. అందుకు భిన్నంగా ఎవరైనా ప్రవర్తిస్తారేమో చూద్దామనుకున్నారు ఆమ్‌స్టర్‌డామ్‌కు చెందిన ఒక వెబ్‌సైట్ ఉద్యోగులు. వెంటనే వారు ఒక రద్దీ ప్రదేశంలో పేవ్‌మెంట్ మీద గ్లాస్టిక్‌తో దాన్ని గట్టిగా అతికించి, ఏం జరుగుతుందో గమనించేందుకు వీలుగా కెమెరాలను అమర్చారు. దాటిన పోయే వారెందరో ఆపిల్ ఫోన్‌ను చూసి, సొంతం చేసుకునేందుకు చేసే రకరకాల వింత చేష్టలను చూడసాగారు. ఒకరైతే, ఎంత లాగినా రాకపోయేసరికి చివరికి దాన్ని కాలితో గట్టిగా తన్నేందుకు కూడా వెనుకాడలేదు!

## నెట్టు నెట్టే బుక్కు బుక్కే!



వేలాదిమంది బ్రిటన్ వాసులకు సెలవు వచ్చిందంటే చాలు పుస్తక పఠనంలో లీనమైపోతున్నట్లు ఒక అధ్యయనంలో వెల్లడైంది. 'హాలిడేస్‌ని ఎంత బాగా ఎంజాయ్ చేసినా, కనీసం ఒక్క పుస్తకమైనా చదవకపోతే రిలాక్స్ అయినట్లుగా ఉండద'ని ఒక పుస్తక ప్రియుడు వ్యాఖ్యానించాడు. టైమ్ ఎంత తక్కువగా ఉన్నా, పుస్తకాలు చదివే అలవాటు అంతకంతకూ తగ్గిపోతున్నా సెలవు దొరికిందంటే చాలు పుస్తకం పట్టుకోకుండా ఉండలేకపోతున్నట్లు మరో గ్రంథప్రేమికుడు చెప్పాడు. కాగా బుక్‌స్టాల్స్‌లో అయ్యే సేల్స్ కంటే వెబ్‌సైట్లు వెతికి ఆర్డర్ చేసి పుస్తకాలు తెప్పించుకుని చదువుతున్నవారే ఎక్కువగా ఉన్నట్లు అధ్యయనంలో తేలింది. కాగా ఈ ఏడాది జరుపుకో బోయే క్రిస్మస్ పండుగ సందర్భంగా పబ్లిషర్సందరూ కలిసి 'ఒలింపిక్ లిట్' పేరిట ప్రముఖ క్రీడాకారుల జీవితగాథలను పుస్తకరూపంలో తీసుకొచ్చేందుకు సన్నాహాలు చేస్తున్నారు.

## చక్కర్లు కొట్టిన దొంగ పైలట్



సొంతంగా కుట్టుకున్న కెప్టెన్ యూనిఫామ్, నకిలీ ఐడీ కార్డ్ ధరించిన ఓ 32 ఏళ్ల ఆగంతకుడు తనపేరు ఆండ్రియా సిర్లో అని, చీఫ్ పైలట్‌నని చెప్పుకుంటూ ఫేస్‌బుక్‌లో ఒక ఖాతా సృష్టించాడు. ఆ తర్వాత ఏకంగా ఏవియేషన్ అధికారుల కళ్లుగప్పి ఫారిన్ కమర్షియల్ ఎయిర్‌లైన్స్ వారి డొలోమిటి ఫ్లైట్‌లో థర్డ్ పైలట్ హోదాలో కాక్‌పిట్‌లో కూర్చున్నాడు. మ్యూనిచ్ నుంచి ట్యూరిన్ వరకు ప్రయాణించాడు. సదరు వ్యక్తి అంత చిన్న వయసులోనే చీఫ్ పైలట్‌నని చెప్పుకోవడం, పైగా 3వ పైలట్ స్థానంలో కూర్చోవడం, కనీసం ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్ బటన్స్ కూడా ఆపరేట్ చేయలేకపోవడం చూసిన పోలీసులకు అనుమానం వచ్చి గట్టిగా బెదిరించారు. దాంతో తానసలు చీఫ్ పైలట్ కాదు కదా, కనీసం పైలట్ ట్రైనింగ్ కూడా తీసుకోలేదని బయటపడింది.

## రణగొణ ధ్వనులతో రంజైన సంగీతం!



వాహనాల రణగొణ ధ్వనులన్నీ వీనుల విందైన వీణానాదంలా మారిపోతే ఎంత హాయిగా ఉంటుంది! ఇదే ఆలోచన వచ్చింది లండన్‌లోని ఓ పర్యావరణ పరిరక్షణ సంస్థ వారికి. అంతే, తక్షణం వారి ఆలోచనను అమలులో పెట్టేశారు. శబ్దతరంగాలను సంగీతంలా మార్చే ప్రత్యేకమైన స్పీకర్లు, మైక్రోఫోన్లను అమర్చుకున్న ఈ సౌండ్ టాక్సీ లండన్ నగర వీధులలో తిరుగుతూ, శబ్దకాలుష్యాన్నంతటినీ కమ్మటి సంగీత ధ్వనులుగా మార్చుతూ, నగర వాసులను సంభ్రమాశ్చర్యాలలో ముంచెత్తుతోంది. సౌండ్ ఆర్టిస్ట్, డిజైనర్ యూరి సుజకి బుర్రలో పుట్టిన ఈ ఆలోచన సత్ఫలితాలనిస్తున్నట్లు ఆయా సంగీత వాయిద్యాలను వింటున్న వాహన చోదకుల ముఖాలలో కదిలే సంతోష తరంగాలను బట్టి తెలుస్తోందని సుజకి అధికారిక సంతృప్తి వ్యక్తం చేసింది.

## పాయింట్ ఆఫ్ ద వీక్

| 7 | 8 | 9 | 10 | 11 | 12 | 13 |
|---|---|---|---|---|---|---|
| మోడ్రన్ హీబ్రూ క్యాలెండరు ప్రారంభమైన రోజు (క్రీపూ.3761) | భారత వైమానిక దళం ఏర్పాటైంది. (1932) | పాలపుంతలో సూపర్ నోవా కనిపించిన రోజు. ఆ తర్వాత ఇప్పటివరకు కనిపించలేదు. (1604) | మహమ్మద్ ప్రవక్త మనుమడు హుస్సేన్ ఇబ్న్ అలీకి, ఖలీఫా యాజిద్‌కి మధ్య కర్బాలా యుద్ధం జరిగిన రోజు (క్రీ.శ.680) | శ్రీలంకలో ఇండియన్ పీస్ కీపింగ్ ఫోర్స్ 'ఆపరేషన్ పవన్'ను ప్రారంభించింది. (1987) | బ్రిటిష్ పాలకులు కొన్ని జాతులపై దాష్టీకం చేయడానికి క్రిమినల్ ట్రైబ్స్ చట్టం తెచ్చారు. (1871) | టర్కీ రాజధానిని ఇస్తాంబుల్ నుంచి అంకారాకు మార్చారు. (1923) |


76% of our Diabetic patients are happy now
షుగర్ గురించి
ఆందోళన చెందుతున్నారా?
డయాబెటిక్ సెల్
పాజిటివ్ హోమియోపతి సౌజన్యం
మా ప్రత్యేక చికిత్సలు
డయాబెటిస్
గ్యాస్ట్రిక్ అల్సర్
థైరాయిడ్
సంతాన లేమి
అలర్జీ, ఆస్తమా
చర్మ వ్యాధులు
World's Safest Diabetic Treatment
100% Natural and No Side Effects
An ISO 9001 - 2000 Certified ®
పాజిటివ్ హోమియోపతి
అమీర్‌పేట • S.R. నగర్ • కూకట్‌పల్లి • విక్రమ్‌పురి • కాచిగూడ • దిల్‌షుక్‌నగర్ • మెహిదీపట్నం
అపాయింట్‌మెంట్ కొరకు సంప్రదించండి: 92461 87788
• నిజామాబాద్ • కర్నూల్ • గుంటూరు • వైజాగ్ • విజయవాడ • తిరుపతి
• రాజమండ్రి • బెంగుళూరు
www.positivehomeopathy.com
SMS 'POSITIVE' to 55352, ఉచిత సలహాలకై: 1800 425 0144

● సూక్తి

**తెలివైనవాడికి జీవితం ఓ కల. పిచ్చివాడికి ఒక ఆట.**
**డబ్బున్నవాడికి అది హాస్యం. పేదవాడికి విషాదం.**

షోలెమ్ అలీచెమ్, రష్యన్ రచయిత

● సూచిక



6
**టేక్ ఇట్ ఈజీ**
అందరూ కుశలమే!


14
**రాలిన మొగ్గలు**
మొజార్ట్


18
**నిజాలు దేవుడికెరుక!**
కిరాతకుడు


20
**కథనం**
గతం గతః


● వారఫలం

**అక్టోబర్ 7 నుండి 13 వరకు**

నిర్వహణ: **సింహంభట్ల సుబ్బారావు**

**మేషం:** ఆర్థిక పరిస్థితి అంత బాగుండక పోవచ్చు. పనుల్లో జాప్యం. ఆలోచనలు కలసిరావు. ఇంటాబయటా ఒత్తిడులు పెరుగుతాయి. దూరప్రయాణాలు ఉంటాయి. వ్యాపారాలలో నిరుత్సాహం. ఉద్యోగులకు అదనపు పనిభారం. రాజకీయ, కళారంగాల వారికి విదేశీ పర్యటనలు వాయిదా.

**వృషభం:** శ్రమపడ్డా ఫలితం కనిపించదు. వ్యవహారాలలో కొద్దిపాటి ఆటంకాలు ఎదురుకావచ్చు. ఆస్తి వివాదాలు నెలకొంటాయి. బంధుమిత్రులతో స్వల్ప వివాదాలు. ఆరోగ్యభంగం. వ్యాపారాలు నిరాశ కలిగిస్తాయి. పారిశ్రామిక, రాజకీయవర్గాలకు ఒత్తిడులు తప్పవు.

**మిథునం:** ఇంటాబయటా ప్రోత్సాహం. ఆర్థిక పరిస్థితి మెరుగ్గా ఉంటుంది. దీర్ఘకాలిక సమస్యలు తీరతాయి. ఉద్యోగయత్నాలు ఫలిస్తాయి. ఒక ప్రకటన ఆకట్టుకుంటుంది. మీ ఆశయాలు నెరవేరతాయి. భవిష్యత్‌పై ఆశలు చిగురిస్తాయి. రాజకీయ, పారిశ్రామికవర్గాలకు విదేశీ పర్యటనలు.

**కర్కాటకం:** ముఖ్యమైన పనులు వాయిదా పడతాయి. ఆకస్మిక ప్రయాణాలు. ఇంటాబయటా చికాకులు. శ్రమకు తగిన ఫలితం కనిపించదు. ఒక సమాచారం కొంత ఊరట నిస్తుంది. వ్యాపార లావాదేవీలు మందకొడిగా సాగుతాయి. పారిశ్రామిక, కళారంగాల వారికి నిరుత్సాహం.

**సింహం:** పనులు చకచకా సాగుతాయి. ఆర్థిక వ్యవహారాలు సంతృప్తికరంగా ఉంటాయి. పలుకుబడి కలిగిన వారితో పరిచయాలు. ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో పాల్గొంటారు. ఆస్తి వివాదాలలో లబ్ధి పొందుతారు. వ్యాపారాలు పుంజుకుంటాయి. రాజకీయ, కళారంగాల వారికి పదవులు.

**కన్య:** కొత్త పనులు చేపడతారు. ఆర్థిక వ్యవహారాలు ఉత్సాహంగా సాగుతాయి. ప్రత్యర్థులు మిత్రులుగా మారతారు. కొత్త కాంట్రాక్టులు పొందుతారు. గృహ, వాహనయోగాలు. వ్యాపారాలలో ముందడుగు వేస్తారు. పారిశ్రామిక, రాజకీయవర్గాలకు విదేశీ పర్యటనలు ఉంటాయి.

**తుల:** ఆదనపు రాబడి ఉంటుంది. సన్నిహితులతో వివాదాలు తీరతాయి. పరిస్థితులు అనుకూలిస్తాయి. చిన్ననాటి మిత్రులను కలుసుకుని ఉత్సాహంగా గడుపుతారు. వ్యాపారాలలో లాభాలు. ఉద్యోగులకు విధి నిర్వహణలో ప్రోత్సాహం. రాజకీయ, కళారంగాల వారికి సన్మానాలు.

**వృశ్చికం:** ఆర్థిక పరిస్థితి నిరుత్సాహపరుస్తుంది. ధన వ్యయం. కుటుంబసభ్యులతో మాటపట్టింపులు. పనులు నెమ్మదిగా సాగుతాయి. ఆరోగ్యభంగం. దూర ప్రయాణాలు చేస్తారు. శ్రమాధిక్యం. వ్యాపార లావాదేవీలు మందకొడిగా సాగుతాయి. రాజకీయ, కళారంగాల వారికి నిరుత్సాహం.

**ధనుస్సు:** ఆర్థిక వ్యవహారాలు కాస్త మందగిస్తాయి. ఆకస్మిక ప్రయాణాలు ఉంటాయి. కొన్ని వ్యవహారాలు ముందుకు సాగవు. భాగస్వామ్య వ్యాపారాలు సాదాసీదాగా సాగుతాయి. ఉద్యోగులకు అదనపు బాధ్యతలు. రాజకీయ, కళారంగాల వారికి అవకాశాలు నిరాశ కలిగిస్తాయి.

**మకరం:** కుటుంబంలో శుభకార్యాలు. ఆర్థిక వ్యవహారాలు ఉత్సాహంగా సాగుతాయి. పలుకుబడి పెరుగుతుంది. ఆశ్చర్యకరమైన సంఘటనలు. విలువైన వస్తువులు కొంటారు. వ్యాపారాలలో లక్ష్యాలు సాధిస్తారు. రాజకీయ, పారిశ్రామికవర్గాలకు అరుదైన అవకాశాలు దక్కుతాయి.

**కుంభం:** ఊహించని విధంగా కార్యక్రమాలు పూర్తి కాగలవు. ఆర్థిక పరిస్థితి మెరుగ్గా ఉంటుంది. దీర్ఘకాలిక రుణబాధలు తొలగుతాయి. సోదరులు, మిత్రులతో ఆనందంగా గడుపుతారు. పారిశ్రామిక, రాజకీయవర్గాలకు విదేశీ పర్యటనలు ఉంటాయి. వాహన, గృహయోగాలు.

**మీనం:** ఆర్థిక వ్యవహారాలు నిరాశ కలిగిస్తాయి. ధన వ్యయం. నిర్ణయాలు వాయిదా వేస్తారు. దూరపు బంధువుల నుంచి కీలక సమాచారం. వ్యాపార లావాదేవీలు సామాన్యంగా ఉంటాయి. ఉద్యోగవర్గాలకు ఆకస్మిక మార్పులు. రాజకీయ, కళారంగాల వారికి నిరుత్సాహం.

● లేఖ



**సంచిక బాగుంది!**

బ్రహ్మాండనాయకుడి బ్రహ్మోత్సవాల సంచిక చాలా బాగుంది. ప్రతి అంశం మమ్మల్ని ఎంతగానో ఆకట్టుకుంది.

- పి.బాలయ్య, హైదరాబాద్

**పదిలపరుచుకునే ఫన్‌డే!**

బ్రహ్మోత్సవాల సందర్భంగా బ్రహ్మాండనాయకుని స్తుతిస్తూ విడుదలైన ఫన్‌డే సంచిక పదికాలాల పాటు పదిలపరుచుకునే విధంగా ఉంది. ఈ సందర్భంగా నాలాంటి వయోవృద్ధులకు వేంకటేశ్వరుని దర్శన భాగ్యాన్ని కలుగజేస్తూ, ఎన్నో మహత్తర విషయాలను తెలియజేసినందుకు కృతజ్ఞతలు.

- దామరాజు శంకరం, విజయనగరం

**భలే బాగుంది!**

బ్రహ్మోత్సవాల సంచిక భలే బాగుంది. తిరుమలనాథుని గురించి ఎంత చెప్పినా తక్కువే. ఇంత పెద్ద ఎత్తున ఆదాయ, వ్యయాల లెక్క తేల్చి, ప్రతిరోజూ శ్రీవారికి చెప్పటం మామూలు విషయం కాదు. అయినా దాన్ని ఆదరించడం అభినందనీయం.

- పచ్చల కోటేశ్వరరావు, గుంటూరు

**ఆనందంలో ముంచెత్తాయి!**

తిరుమల బ్రహ్మోత్సవాల ప్రత్యేక సంచిక ఎన్నో విషయాలను వివరంగా తెలిపింది. స్వామివారి ఆభరణాలు, వారికి జరిగే సేవలు, బ్రహ్మోత్సవాలు, అన్నదాన పథకాలు, పేద విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు అందించడం, ఉచిత వివాహాలకు సహాయం మున్నగు అంశాలు మమ్మల్ని ఎంతో ఆనందంలో ముంచెత్తాయి.

- పి.ఆదిత్యమూర్తి, గొల్లలమామిడాడ

**అద్భుతంగా ఉంది!**

తిరుమల బ్రహ్మోత్సవాల సంచిక అద్భుతంగా ఉంది. చదువుతున్నంతసేపూ బ్రహ్మోత్సవాలను ప్రత్యక్షంగా చూస్తున్న అనుభూతి కలిగింది. శేషాచలం కొండలో ఉన్న జీవ వైవిధ్యం గురించి తెలుసుకుని ఆశ్చర్యపోయాను.

- సంపంగి రేణుక, కోరటికల్

**ఆద్యంతం ఆకట్టుకుంది!**

తిరుమలేశుని గురించి మొత్తం వివరాలను ఒకేసారి అందించడమంటే మాటలు కాదు. తెలుసుకోవడమూ సులభం కాదు. కానీ దాన్ని సాధ్యం చేశారు మీరు. తిరుమల ప్రత్యేక సంచిక ఆద్యంతం ఆకట్టుకుంది. బ్రహ్మోత్సవాల చరిత్ర, ఉత్సవ విశేషాలు, వాహన సేవలు... ప్రతిదీ చక్కగా వివరించినందుకు ధన్యవాదాలు.

- మహేశ్, అనంతపురం

మా చిరునామా
ఫన్‌డే
సాక్షి తెలుగు దినపత్రిక
6-3-249/1, రోడ్ నం.1, బంజారాహిల్స్,
హైదరాబాద్ - 34. funday.sakshi@gmail.com

Designing: Sampangi Mallesh



టేక్ ఇట్ ఈజీ

# అందరూ కుశలమే!



ముఖ్యమంత్రి కిరణ్‌కుమార్‌రెడ్డి ఇందిరమ్మ బాట ప్రారంభించాడు. ముందుగా ఒక మహిళను లేపి కష్టసుఖాలు అడిగాడు.

"మీ ప్రభుత్వంలో చానా మంచిగా వుండాం సార్. కరెంట్ బిల్లు సగం తగ్గిపోయింది. మా ఆయన పనిచేసే ఫ్యాక్టరీని పవర్ లేక మూసేశారు. హాయిగా ఇంటికాడ వుండి రోజూ కబుర్లు చెబుతున్నాడు. వీధిలైట్లు లేకపోయినా, వీధిలోకి వెళ్ళి మా ఎదురింటి ఆవిడ కిందపడి కాలు విరగ్గొట్టుకుంది. దాంతో నాతో గొడవపడేవాళ్ళే లేకుండా పోయారు. మా అత్తకి అత్తాకోడలు సీరియల్ ఇష్టం. నాకేమో కోడలు అత్త సీరియల్ అంటే ప్రాణం. టీవీ రిమోట్ కోసం ఇద్దరూ కర్రలు తీసుకుని కొట్టుకునేవాళ్ళం. మీ పుణ్యమా అని సీరియల్ వచ్చే టైంలో కరెంట్ తీసేస్తున్నారు. సఖ్యంగా వుండడంతో మా అత్తకు సుగర్, నాకు బీపీ కంట్రోల్‌లో వున్నాయి. గ్యాస్ ఇవ్వరనే భయంతో రోజుకి ఒక్కపూటే మొత్తం వంట చేసేస్తూ వుండడంతో పని భారం తగ్గింది. బస్సు చార్జీలు పెంచడంతో ఊళ్ళకు వెళ్ళడం మానేసే సరికి డబ్బులు మిగులుతున్నాయి. అన్నిటికీ మించి చీకటంటే భయం పోయింది. ఒకరొన్నొకరు తాకనవసరం లేకుండా చీకట్లో నడవడం నేర్చుకున్నాం." అని ఆమె చెప్పింది.

హాస్టల్ విద్యార్థిని లేపాడు

"సార్, హాస్టల్‌లో నీళ్ళచారు, పురుగుల అన్నం పెట్టేవారు. అప్పుడప్పుడు కోడిగుడ్డు ఇచ్చేవారు. మీరు గ్యాస్ భయం పెట్టేసరికి బియ్యాన్ని నానబెట్టి వడ్డించేస్తున్నారు. పొట్ట కంట్రోల్ తప్పి వారంలో సగం రోజులు స్కూలుకి వెళ్ళే బాధ తప్పింది. గుడ్లు ఇవ్వడం పూర్తిగా మానేశారు. దాంతో కోళ్ళ జాతిని సంరక్షిస్తున్నామనే పక్షిజాతీయ భావనతో మేము తృప్తిగా నిద్రపోతున్నాం. స్కూల్లో మా అవతారం చూసి డ్రిల్లు క్లాసులకి పిలవడం మానేశారు. ఇదంతా మాకు చాలా హాయిగా వుంది" అని చెప్పాడు.

ఒక కార్మికుడు లేచి " సార్, మా యజమానిపైన చాలా కోపముండేది. వాడి ఫ్యాక్టరీకి మీరు కరెంట్ లేకుండా చేసే సరికి, బ్యాంకులకి అప్పులు కట్టలేక దివాళా తీశాడు. వాడు మాతో పాటు రోడ్డుమీదికొచ్చాడు. మేము తీర్చుకోలేని పగను మీరు తీర్చేశారు. చాలా థ్యాంక్స్" అన్నాడు.

ప్రజలంతా సుఖశాంతులతో చీకట్లో వున్నందుకు ముఖ్యమంత్రి సంతోషిస్తూ సభను ముగించాడు.

● జి.ఆర్.మహర్షి

● మహర్షిజం

## ఎగిరే గుర్రం

ఒక తెలుగుదేశం నాయకుడు ఎన్టీయార్ ట్రస్ట్ భవన్‌లోకి ఒక గుర్రాన్ని తీసుకొచ్చాడు. నేరుగా చంద్రబాబు దగ్గరకొచ్చి "ఇది మామూలు గుర్రంకాదు. ఎగిరే గుర్రం సార్, దీన్ని అమ్మినవాడు చెప్పాడు" అని అన్నాడు.

గుర్రాన్ని చంద్రబాబు ఎగాదిగా చూసి "నీకేమైనా పిచ్చా? గుర్రం ఎగురుతుందంటే ఎలా నమ్మావ్?" అని అడిగాడు.

"మళ్ళీ అధికారంలోకి వస్తామని మీరు నమ్ముతున్నప్పుడు, గుర్రం ఎగురుతుందని మేం నమ్మితే తప్పా?" అన్నాడు నాయకుడు.



## డబ్బుల చెట్టు



ఎట్లకేలకు డబ్బులు కాచే చెట్టును మన్మోహన్‌సింగ్ కనుక్కున్నాడు. ఆ చెట్టు ప్రత్యేకత ఏమంటే నెలకు పది వేలకు మించి డబ్బులు కాయవు. ప్రజలందరికీ ఆ చెట్టును ఉచితంగా పంపిణీ చేశాడు. కాకపోతే ఆ చెట్టును తీసుకున్న ప్రతి ఒక్కరూ నెలకు పదిహేను వేల రూపాయల పన్ను చెల్లించాల్సి వచ్చింది.

## ప్రభుత్వ పథకం

సబ్సిడీపై వేరుశెనగ పప్పులిచ్చి, మన దగ్గరున్న జీడిపప్పులు లాక్కుంటే దాన్ని ప్రభుత్వ పథకమంటారు.



## టీడీపీ కార్యకర్త ఆవేదన

నడిచ్చే, అధికారం నడిచొస్తుందని నమ్ముతున్నాడు మా చంద్రబాబు. చివరికి ఆయనకి కాళ్ళ నొప్పులు, జై కొట్టినందుకు మాకు చేతుల నొప్పులు మిగిలేలా వున్నాయి.










# మీ ఇంట్లోనే పవర్‌ఫుల్ స్పోకెన్ ఇంగ్లీష్ టీచర్

## ఇంగ్లీష్ కోర్స్ రూ.600/- లకే

మూడు డివిజన్ల ఇంగ్లీష్ కోర్స్: డివిజన్-1, డివిజన్-2, డివిజన్-3 + అడిషనల్ బుక్స్, ఒక డైరీ మరియు ఒక ఆడియో సి.డి. = ఇవన్నీ రూ.600/-లు

**డివిజన్-1** Basic నుంచి ఇంగ్లీష్ చదవటం, రాయటం, నేర్పుతూ, ప్రతి ఒక్కరికీ కావలసిన స్థాయిలో స్టాండర్డ్ ఇంగ్లీష్ నేర్పబడుతుంది.

**డివిజన్-2** తప్పులు లేకుండా ఇంగ్లీషు రాయుటకు కావలసిన ఆంగ్ల వ్యాకరణం పరిపూర్ణంగా సులభ సూత్రాలతో చాలా ఈజీగా నేర్పబడుతుంది.

**డివిజన్-3** ఎంతో సులభంగా, ఏ సందర్భంలోనైనా తడబడకుండా, తప్పులు లేకుండా, మంచి నీళ్ళు త్రాగుతున్నట్లుగా మంచి ఇంగ్లీషు మాట్లాడటం నేర్పబడుతుంది.

**పూర్తి డబ్బు వాపస్**

మనస్ఫూర్తిగా మీకు కోర్సు నచ్చలేదని అనిపిస్తే కోర్సు పుస్తకాలు 15 రోజుల్లోపల మాకు తిప్పి పంపండి. మీ డబ్బుని (కేవలం పోస్టు ఖర్చులు మాత్రం మినహాయించి) మీకు ఎమ్.ఓ. చేస్తాం. కోర్స్ మెటీరియల్ సైజు 18cm x 24cm లోనూ, డైరీ సైజు 12cm x 17.5cm లోనూ (ఆఫ్ సెట్ మల్టీకలర్ కవర్‌తో) ఉంటాయి. విద్యార్థుల సౌకర్యాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రతి సంవత్సరానికి క్రొత్త డైరీగా ఉపయోగించుకునే విధంగా ప్రత్యేకంగా రూపొందించబడిన డైరీ.




SMS పంపండి (లేదా) కూపన్ పంపండి.

**Phone: 0-99405 70931**

పై సెల్‌ఫోన్ నెంబరుకు మీ పేరు, ఇంటి నెం. ఊరిపేరు, పిన్‌కోడ్, ఫోన్ నెం.లతో సహా వివరంగా మీ అడ్రసును SMS చేయండి. పై ఫోన్ నెంబరు 24 గంటలూ కంప్యూటర్‌కు కనెక్ట్ చేయబడి ఉంటుంది. మీరు పంపే ఎస్.ఎమ్.ఎస్. అడ్రసు ఫోన్ నుండి కంప్యూటర్‌కు వెళ్తుంది. మీ అడ్రసు ప్రకారం మేము కోర్సు మెటీరియల్ పంపుతాము. దయచేసి ఫోన్‌లో అడ్రసు చెప్పడానికి ప్రయత్నించవద్దు. SMS పంపడానికి అవకాశం లేనివారు ఈ ప్రకటనలో ఉన్న కూపన్‌ను పూర్తిచేసి పంపండి.

**STUDENTS' ENGLISH INSTITUTE**

No.17/A, Chari Street, T. Nagar, Chennai - 600 017.

నాకు కోర్సు మెటీరియల్ పంపండి. పోస్ట్‌మేన్‌కి రూ.600/- + 30/- (M.O.కమీషన్) మొత్తం రూ.630/-లు చెల్లించి ప్యాకెట్‌ని తీసుకుంటానని హామీ ఇస్తున్నాను.

Name: ..............................

Address: .............................. Pincode

# శ్రీరంజని వంటి అక్కయ్య ఉంటే బాగుండనుకున్నా!



పెద్దిభొట్ల సుబ్బరామయ్య
రచయిత, సాహితీవేత్త

అది 1947 ప్రాంతం. అప్పటికి నాకు తొమ్మిది పదేళ్లుంటాయేమో! మా నాన్న నెల్లూరులో స్టేషన్ మాస్టర్. అప్పుడే క్రమంగా లోకాన్ని చూడటం మొదలుపెట్టాను. మా నాన్నగారు లంకలకోడేరులో ఒక మాస్టారికి (అది నా విద్యాభ్యాస ప్రారంభం) నన్నప్పగిస్తూ, 'మావాడికి చదువు నేర్పక్కరలేదు. భయభక్తులు నేర్పండి చాలు' అనడం బాగా గుర్తు. ఆ తర్వాత ఆ మాస్టారు నాకు భయభక్తులు తప్ప చదువు చెప్పినట్లు గుర్తులేదు. 1947 ఆగస్టు 15 నాటికి నెల్లూరులో స్టోన్‌హౌస్ పేటలో ఉండేవాళ్లం. ఆ పేట మొదట్లో మిస్సానారి అద్భుతమైన పార్కు. సొరకాయ (సర్కారు) బడి. మా వాకిట్లో సువాసనలీనుతూ తెల్లవారేసరికి బండెడు పూలు రాల్చే పున్నాగ చెట్టు. అర ఫర్లాంగు దూరంలో పెద్ద ఆవరణ నిండా నేరేడు చెట్లు...

అవి నేను ఫస్టు ఫారమ్ చదివే రోజులు. ఇద్దరు ముగ్గురు అల్లరి వెధవలు, మా ఇంటి వెనుక మాతో పాటు చదివే ఒక తమిళుల అమ్మాయి (సరోజ), అందరం సెలవు దొరికితే చాలు మా వెనక పెద్ద ఖాళీస్థలంలో అద్భుతంగా పెరిగిన ఒక బాదంచెట్టు, అవతల ఒక సీమచింతచెట్టు కింద చేరి అలసిపోయేదాకా ఒకటే అల్లరి. అప్పుడే చంద్రలేఖ, స్వప్నసుందరి వంటి సినిమాలు. వీధుల్లో త్రిభుజాకారంలో చక్రాల బండి ఒకటి తోసుకుంటూ 'ఏ సినిమా చూడాలి', 'చంద్రలేఖ చూడాలి' అని అరుస్తూ నలుగురైదుగురు మనుషులు. అప్పుడే నెల్లూరు వినాయక థియేటర్లో 'చంద్రలేఖ' చూసి ఉక్కిరిబిక్కిరైపోయాను. దాన్లో డ్రమ్ముల డ్యాన్సు చూసి అదిరిపోయాను. అందులో టి.ఆర్.రాజకుమారిని చూసి ప్రేమించేశాను. 'గుణసుందరి' కథ చూసి శ్రీరంజని వంటి అక్కయ్య ఉంటే బాగుండుననుకున్నాను. 'యోగి వేమన' చూసి అందులో రాజమ్మ 'వదలజాలరా' అనే జావళికి చేసిన మూడు, నాలుగు నిమిషాల నాట్యం చూసి ఆమెను మోహించేశాను. ఇప్పటికీ ఆ సినిమాను



నెలకు మూడు, నాలుగు సార్లయినా చూసి ఆమెను మోహిస్తూనే ఉంటాను.

ఇంటి వెనుక పెద్ద ఖాళీస్థలంలో బాదం చెట్టు. పెద్ద పెద్ద ఆకులతో ఒక్కొక్క ఆకులోనే భోజనం చేయవచ్చు. కింద వెలుతురు ముక్కలు ముక్కలుగా కత్తిరించి పోసినట్లుండేది. సీమచింత చెట్టు నిండా ఎర్రగా పండిన గుబ్బలు. కోతులను మనం బతిమాలుకుని చేతులు చాపి నిలబడితే చాలు– గుబ్బలు తెంపి విసిరేసేవి. ఆ గింజలతోను, సిగరెట్టు పెట్టెలతోను ఆటలు. అన్నింటిలోకీ కాప్‌స్టన్ సిగరెట్టు పెట్టె విలువ ఎక్కువ. అప్పుడే కొత్తగా వెనుక రబ్బరు ఉండే పెన్సిళ్లు వచ్చాయి. పాళీ, నిబ్బు రెండూ లేని సిరా పోసుకుని రాసే లోక పెన్నులూ వచ్చాయి. బ్లాక్ బర్డ్, రత్నం, బ్రహ్మం పెన్నులు పెద్దవాళ్లకు. మాకు సిరాబుడ్డిలో ముంచి రాసుకునే పెన్సిళ్లే గతి. స్కూళ్లలో బల్లమీద సిరాబుడ్డి, కలం పెట్టుకునేందుకు అనువుగా లోతైన గుంటలుండేవి.

ముఖ్యమైన విషయం ఏమిటంటే - మనందరికీ స్వాతంత్ర్యం సిద్ధించిన ఆగస్టు 14వ తేదీ... ఆ రోజున నెల్లూరు పట్టణమంతా అద్భుతంగా అలంకరించారు. మిస్సానారి పార్కు వెనక వీధిలో ముగ్గురు మరాఠీలు, బాలరాజు తీసిన ఘంటసాల బలరామయ్యగారి ఇల్లుండేది. ఆ ఇల్లొక టూరిస్టు కేంద్రం. వారింట్లో రేడియో ఉండేది. దాంతో పార్కులో మైకులు బిగించారు. రాత్రి ఎనిమిది గంటల నుండే జనం పోగైనారు. నేను, మిత్రులు ముందు వరుసలో ఆసీనులమైనాం. సరిగ్గా పదకొండు గంటల యాభై ఎనిమిది నిమిషాలకు అద్భుతమైన ఆ క్షణాలు రానే వచ్చాయి. 'ట్రస్ట్ విత్ డెస్టినీ' అంటూ ఆ మహానేత నెహ్రూగారి అద్భుత కంఠస్వరం వినగానే జనం మహానందంతో ఊగిపోయారు. ఆ మాటలేవో మాకు అర్థం కాకపోయినా మేమూ గంతులు వేశాం.

ఆ తర్వాత చాలా కాలానికి మేమున్న స్టోన్‌హౌస్ పేటకు ఒక మిత్రుడితో కలిసి వెళ్లా. అంతా రూపు మారిపోయింది. ఆ పాతకాలపు కాంతియుత వాతావరణమంతా కాలగర్భంలో కలిసిపోయి కేవలం ధన సంస్కృతితో విరగబడిపోతున్నది. పార్కు, బడి, స్కూలు అన్నీ మారిపోయి, ఆ చెట్లు చేమలు అన్నీ కొత్తరకం అలజడి, అల్లరి, రొద రాజ్యం చేస్తున్నాయి. అప్పట్లో మేమున్న ఇల్లు ఉన్న ప్రాంతం కనుక్కుందామని గంటసేపు విఫలయత్నం చేశాను! మొత్తమ్మీద ఎక్కడెక్కడికో చేసిన నా జీవన ప్రయాణం చివరికి విజయవాడలో ఆగింది!

సేకరణ: డి.వి.ఆర్.భాస్కర్

## సుష్మితాసేన్

ఫాలోవర్లు: 1,80,925



**భారతదేశానికి మొట్టమొదటి మిస్ యూనివర్స్ కిరీటాన్ని తెచ్చిపెట్టిన ఘనత సుష్మితాసేన్‌ది. పెళ్లి కాకుండానే ఇద్దరు పిల్లలను దత్తత తీసుకుని తన మంచి మనసును సైతం చాటుకున్న సుష్మితకు ప్రతి విషయంలోనూ క్లారిటీ ఉంది. ఆమె ట్వీట్స్ చూస్తే ఆ విషయం అర్థమవుతుంది.**

- మీరు ఎవరి నుంచి ఏమీ ఆశించకండి. నిజాయితీగా వ్యవహరించండి. మీరు అలా ఉండగలిగితే, మిమ్మల్ని చూసి మిగిలినవాళ్లు కూడా అలాగే ప్రవర్తిస్తారు!
- నువ్వు అందరితో మంచిగా ఉంటావు కాబట్టి అందరూ నీతో మంచిగా ఉండాలని కోరుకోవడం అమాయకత్వమే అవుతుంది. అలా కోరడం ఎలా ఉంటుందంటే... నేను నిన్ను తినను కాబట్టి నువ్వు కూడా నన్ను తినకు అని సింహాన్ని అడిగినట్టుంటుంది!
- మనం ఏ విషయంలోనైనా ఫెయిలయ్యాము అని అన్నామంటే, మనం దాన్ని సాధించడానికి అస్సలు ప్రయత్నించనట్టు లెక్క. ఎందుకంటే నిజాయితీగా ప్రయత్నిస్తే సాధించలేనిది ఏదీ ఉండదు!
- భారతీయురాలినైనందుకు నేనెప్పుడూ గర్వపడుతుంటాను. ఇంత గొప్ప దేశానికి మొట్టమొదటి మిస్ యూనివర్స్ కిరీటాన్ని తెచ్చినందుకు ఇంకా గర్వపడతాను!
- స్వచ్ఛమైన, పారదర్శకమైన సామాజిక, రాజకీయ వ్యవస్థ పౌరుల హక్కులను కాపాడగలుగుతుంది. అవినీతి మాత్రం వాటికి భంగం కలిగిస్తుంది. అందుకే లోక్‌పాల్ బిల్లు పాస్ అయ్యి తీరాలి!
- దేన్నైనా మన బలంతో సాధించాలి కానీ అవతలివారి బలహీనతతో కాదు. ఎందుకంటే, నిజమైన గెలుపు మన కృషి వల్లే లభిస్తుంది తప్ప, అవతలి వారు ఓడిపోవడం వల్ల కాదు!
- స్త్రీకి పురావస్తు శాస్త్రవేత్తకంటే ఉత్తమమైన భర్త ఎవరూ ఉండరు. ఎందుకంటే అతడికి మాత్రమే పాతబడేకొద్దీ భార్య మీద ప్రేమ పెరుగుతుంది!
- దేన్నైనా దీర్ఘకాలం పాటు నిర్లక్ష్యం చేస్తే, సమస్య మరింత తీవ్రతరమవుతుంది. నిద్రపోతున్న సమాజాన్ని లేపడానికి ఎవరో ఒక సమర్థుడు నడుం కట్టాలి!


అన్ని వేళలా అందుబాటులో
వార్తలు 24x7
సాక్షి ఇప్పుడు మీ మొబైల్‌లో



మరిన్ని వివరాలకు ఇ-మెయిల్ :
mobile@sakshi.com

సాక్షి

- ఇప్పుడు మీరు అభిమానించే సాక్షి వార్తా పత్రికను మీ మాతృభాషలో మీ మొబైల్ హ్యాండ్ సెట్‌పై చదువుకోగలరు.
- మీ మొబైల్‌లో సాక్షి మొబైల్ అప్లికేషన్ డౌన్‌లోడ్ చేసుకోవడానికి sakshi అని టైప్‌చేసి 57333కు sms చేయండి లేదా http://sakshi.newshunt.com నుండి డౌన్‌లోడ్ చేసుకోండి. ఈ సదుపాయం ఉచితం.
- WAP సైట్ http://m.sakshi.com ను చూడండి.
- GPRS కలిగిన ఏ మొబైల్ హ్యాండ్‌సెట్ పైనైనా అంటే ఐడియా, ఎయిర్‌టెల్, వోడాఫోన్, రిలయన్స్, బిఎస్ఎన్ఎల్ మొ॥ వాటిపైనైనా సాక్షి మొబైల్ అప్లికేషన్ పనిచేస్తుంది.
- ఇతర దేశాలకు చెందినవారు కూడా http://sakshi.newshunt.com నుంచి సాక్షి అప్లికేషన్ డౌన్‌లోడ్ చేసుకోవచ్చును.
- మీ మొబైల్‌లో సాక్షి అందించే తాజా వార్తలు, వివిధ విభాగాలకు చెందిన వార్తలు అన్ని వేళల్లో పొందవచ్చును.
- Ipad, Iphone & Android Applicationsలో కూడా చూడవచ్చు.

Scan this QR Code with your smart phone for more Information

● ఇన్నర్‌వ్యూ

**విప్లవమంటే నెత్తురు చిందించడమా? గుండెలు వెలిగించడమా? ఒకప్పుడు గాదె ఇన్నయ్య మొదటిదే నిజమనుకుని ఉంటారు. ఇప్పుడు రెండోదే సరైనదంటారు. విప్లవోద్యమంలో చేయిని పోగొట్టుకున్న ఇన్నయ్య దశాబ్దం క్రితమే తెలంగాణ ప్రత్యేకోద్యమానికి కాలూ చేయీ అయ్యారు. దాన్నుంచి విడిపడి, అనాథ పిల్లలకు కాళ్లూ చేతులతో పాటు గుండెకాయి కూడా అవుతున్నారు. రెండొందల మందితో 'డాడీ' అనిపించుకుంటున్నారు. ప్రవాహంలాంటి జీవితాన్ని గడుపుతున్న గాదె ఇన్నయ్య అంతరంగం ఈవారం...**

# మొండి మనిషి



చెప్పేదొకటి, చేసేదొకటి నాకు నచ్చదు. అదే నా మంచి అలవాటు, చెడ్డ అలవాటు కూడా! అందుకే చిన్నప్పటి నుంచే ఎదురు తిరగటం అలవాటైంది. నిజానికి మా ఇంటినుండే నా పోరాటం మొదలైంది.

**నాన్నకన్నా సిద్ధాంతం మిన్న**

మాది వరంగల్ జిల్లా జాఫర్‌గఢ్ మండలం సాగరం గ్రామం. వంద ఎకరాల భూస్వామ్య కుటుంబం. 12 మంది పాలేర్లు, 30 మంది రోజు కూలీలు. అయితే, వాళ్లకు ఇచ్చేది చాలా తక్కువనిపించేది. అందుకే పాలేర్ల జీతాలు పెంచాలని పని బంద్ చేయించాను. నాన్నతో సహా ఊళ్లో రైతులందరికీ కోపం వచ్చింది. అయినా వెనక్కి తగ్గలేదు. రైతుల తరఫున నాన్న చర్చలకు రావటంతో 600 ఉన్న జీతం 900కు గ్రామ చావడిలో ఒప్పందం కుదిరింది. అలాంటి మొండితనంతో పెరిగాన్నేను.

**కొండపల్లి, సత్యమూర్తి...**

అయిదో తరగతి వరకు మా ఊళ్లోనే కాన్వెంట్ స్కూల్లో చదివాను. ఆరు, ఏడు సికింద్రాబాద్ సెయింట్ మేరీలో. తర్వాత వరంగల్ సెయింట్ గ్యాబ్రియల్‌లో హైస్కూల్. పీపుల్స్‌వార్ అగ్రనేతలు కొండపల్లి సీతారామయ్య, కేజీ సత్యమూర్తి ఈ స్కూల్లోనే టీచర్లుగా పనిచేశారు. నేను చేరేనాటికి వాళ్లు అజ్ఞాతంలో ఉన్నారు. వాళ్ల గురించి తెలుసుకోవాలనే ఆసక్తి ఉండేది. మిషనరీ స్కూల్ కావటం, ఫాదర్స్‌కు శిక్షణనిచ్చే సెమినరీ ఉండటంతో బైబిల్ పఠనం, విశ్లేషణ మా దినచర్యలో భాగంగా ఉండేవి. దాంతో మత ప్రచారకుడిగా స్థిరపడాలనే భావన ఉండేది. అయితే, బోధించే అంశాలకు, ఫాదర్ల ఆచరణకు పొంతన లేకపోయేది. దాంతో వారికి వ్యతిరేకంగా బొగ్గుతో గోడలపై నినాదాలు రాశాను. ఓ రోజు రాత్రి వాళ్లున్న గదికి తాళం వేసి వచ్చాను. దాన్ని గృహ నిర్బంధం అంటారని అప్పుడు తెలియదు. అయితే, తెల్లారాక దొరికి, సస్పెండ్ అయ్యాను. మా నాన్న వాళ్లను బతిమిలాడి, నాతో క్షమాపణ లెటర్ ఇప్పించి, తిరిగి చేర్పించాడు.

**భూస్వామి కొడుకు భక్తాటన**

వరంగల్‌లోని సీకేఎం కాలేజీలో ఇంటర్ చదువుతున్నప్పుడు నా మనస్తత్వానికి తగ్గట్టుగానే రాడికల్ విద్యార్థి సంఘంతో సంబంధాలేర్పడ్డాయి. 1981లో గుంటూరులో ఆర్ఎస్‌యూ సభలకు వెళితే విజయవాడలో అరెస్టు చేశారు. అయినా తప్పించుకుని లారీ ఎక్కి మళ్లీ సభకు వెళ్లాను. ఇంటర్ పరీక్షలవగానే, వేసవి సెలవుల్లో ఇంటికి వెళ్లకుండా నేరుగా రాడికల్ విద్యార్థి సంఘం పిలుపు మేరకు 'గ్రామాలకు తరలండి' ప్రచారంలో పాల్గొన్నాను. రాడికల్ నేత పులి అంజయ్య ఇచ్చిన శిక్షణ తరగతులకు హాజరై... 35 రోజులు, 8 మంది సభ్యులున్న బృందంతో పల్లెపల్లె తిరిగాం. దొరలు, భూస్వాములకు వ్యతిరేకంగా పాటలు, ఉపన్యాసాలు. పొద్దంతా సర్వే. రాత్రి మీటింగ్. ఎవరు పెడితే అక్కడే భోజనం. ఎక్కడ చోటు దొరికితే అక్కడే మకాం.

ఓ రోజు విస్నూరులో అక్కడి దొరలకు భయపడి భోజనం పెట్టేందుకు ఎవరూ ముందుకు రాలేదు. అందరం ఆకలితో నకనకలాడుతుంటే... ఓ పెద్దమనిషి వచ్చి జోలె పట్టమని సలహా ఇచ్చాడు. చుట్టుపక్కల ఎక్కడా దొరకనంత అన్నం! ప్రజలకు దొరలంటే ఎంత భయం ఉందో, లోలోపల ఎంత కసి ఉందో... తెలిసొచ్చింది.

**పోలీసు... పేపర్ వెయిటు...**

సీకేఎం కాలేజీలోనే డీప చేస్తున్నప్పుడు, పోలీసుల్ని క్యాంపస్‌లో అడుగు పెట్టవద్దనీ, ప్రశాంత వాతావరణం చెడగొడుతున్నారనీ ఓ రోజు ఆందోళన చేశాం. ప్రిన్సిపాల్ మాకు సర్దిచెప్పేందుకు ప్రయత్నిస్తుంటే మళ్లీ పోలీసులు వచ్చారు. 'గట్టిగా మాట్లాడుతున్నవేందిరా?' అంటూ పైపైకి వచ్చారు. కోపమొచ్చింది. టేబుల్ మీదున్న పేపర్ వెయిట్ తీసి విసిరేశాను.

## ప్రొఫైల్



భార్య పుష్ప, కూతురు స్నేహాతో...

| | | |
|---|---|---|
| పేరు | : | గాదె ఇన్నయ్య |
| స్వస్థలం | : | వరంగల్ జిల్లా జాఫర్‌గఢ్ మండలం సాగరం |
| తల్లిదండ్రులు | : | థెరేసమ్మ, సొల్మన్ రెడ్డి |
| జన్మదినం | : | 1963 ఏప్రిల్ 1 |
| ప్రత్యేకత | : | విప్లవోద్యమంలో, తెలంగాణోద్యమంలో పనిచేశారు. ప్రస్తుతం 205 మంది అనాథల సంరక్షకుడు. |
| రాసిన పుస్తకాలు | : | తెలంగాణ కన్నీటి గాథ- ఉద్యోగస్తుల వివరాలు, తెలంగాణ భూముల ఆక్రమణ, కాశ్మీర్ కార్పిచ్చు కావటానికి కారకులెవరు?, మూసీనది మురుగుకాల్వ కావటానికి కారకులెవరు? సింగూరు ముంపు గ్రామాల బాధితుల గోడు. |

పోలీస్ తలుపు తోలి, అల్లకల్లోలైంది. అరెస్టయ్యాను. కండిషన్ బెయిల్ వచ్చింది. కానీ, జిల్లా పరిధిలో ఉండొద్దని కోర్టు తీర్పునిచ్చింది. కాలేజీలోంచి సస్పెండ్ చేశారు. హైదరాబాద్‌లో అడ్డా. అక్కడే నాంపల్లి పోలీస్‌స్టేషన్‌లో అటెండెన్స్ వేయాలి. హైకోర్టులో కన్నబీరన్ నా తరఫు న్యాయవాది. తిరిగి కాలేజీలో చేర్చుకోవాలని కోర్టు సూచించింది. దాంతో మళ్లీ వరంగల్ వచ్చాను.

### కిషన్‌జీ, పరిటాల...

జైల్లో ఉన్నప్పుడే కాలేజీ జనరల్ సెక్రెటరీగా పోటీ చేసి గెలిచాను. ఆర్ఎస్‌యూలో క్రియాశీల పాత్ర నాది. ఏ చిన్న సంఘటన జరిగినా పోలీసులు నాకోసం వెతికేవాళ్లు. నిర్బంధం నడుమ దాగుడు మూతల జీవితం. చివరి పరీక్ష రోజున నన్ను ఎలాగైనా పట్టుకునేందుకు పోలీసులు కాలేజీ చుట్టూ మఫ్టీలో మాటేశారు. కానీ కాలేజీ సిబ్బంది వేరే రూట్లో నన్ను బయటికి పంపించారు. అప్పుడు జిల్లా దాటాను. చదువుకు ఎగనామం పెట్టాను. ఫుల్‌టైమ్ ఆర్ఎస్‌యూలోనే. కిషన్‌జీ మా లీడర్. మొదట్లో మెదక్ జిల్లా బాధ్యతలు అప్పగించారు.

రాయలసీమలో అజ్ఞాతంలో ఉద్యమ నిర్మాణానికి పెనుకొండ, గుంతకల్లు ప్రాంతంలో తిరిగాను. అప్పటికే పరిటాల శ్రీరాములు, హరి చనిపోయారు. పరిటాల రవితో పని చేశాను. నాకు ఎక్కువగా హరి పోలికలు ఉన్నాయని... అక్కడి వాళ్లు నన్ను హరి అని పిలిచేవారు. అదే పేరుతో ఉద్యమ నిర్మాణం చేపట్టాను.

అక్కడ అటవీ ప్రాంతంలో ఉన్నప్పుడు, ఒక ప్రమాదంలో బాంబు పేలి, కుడిచేతి వేళ్లన్నీ తెగిపోయాయి. వైద్య సౌకర్యాలకు దూరంగా ఉన్న ప్రాంతం. చేతికి గుడ్డ చుట్టినా ఆగకుండా రక్తం కారుతూనే ఉంది. పోలీసుల కంట పడకుండా బెంగళూరు సమీపంలో నాకు పరిచయమున్న డాక్టర్ ఇంటికి వెళ్లాం. 300 కిలోమీటర్ల దూరం. వెంట ఉన్న అనుచరులకు ఆ ఇల్లు చూపించేంత వరకే గుర్తుంది. రక్తం కారుతుండటంతో కోమాలోకి వెళ్లాను. శరీరమంతా విషపూరితమైంది. మతిమరుపు వచ్చింది. ఎలాగైనా వేళ్లు అమర్చాలని పార్టీ సెంట్రల్ కమిటీ ప్రయత్నం చేసినా ఫలితం లేకపోయింది. దాదాపు ఏడాదిన్నర చికిత్స సాగింది. అడవిలో పని చేయటం కష్టమైంది. అప్పటికే ఎడమ చేతితో రాయటం నేర్చుకున్నా. కుడి చేయి పోయిందనే బాధ లేదు. ఉద్యమంలో ఎందరో ప్రాణాలు త్యాగం చేశారు. చేయెంత? చికిత్స కాలంలోనే అనారోగ్యం కారణంగా పార్టీ సూచన, అనుమతితోనే బయటికొచ్చాను. పుష్పను పెళ్లి చేసుకున్నాను. తను గుంటూరు జిల్లా తెనాలి జేఎంజే కాలేజీలో ల్యాబ్ అసిస్టెంట్‌గా చేసేది. వాళ్లది నంద్యాల మండలం పోలూరు (కర్నూలు జిల్లా). పాప స్నేహ. ప్రస్తుతం ఫిజియోథెరపీ నేర్చుకుంటోంది.

### బతకాలనుంటే...

కొత్త జీవితం మొదలైంది. లొంగిపోయిన నక్సలైట్లు ప్రభుత్వ సాయం పొందాలి, లేదా సారా వ్యాపారం చేయాలనేది అప్పట్లో పోలీసుల కండిషన్. నేనేమీ సాయం తీసుకోలేదు. వరంగల్‌లో సూర్యోదయ పేరుతో ప్రింటింగ్ ప్రెస్ పెట్టాను. పాత పరిచయాలు పెరిగాయి. ఓరోజు ఓ డీఎస్పీ వచ్చి 'బతకాలనుకుంటే వరంగల్ వదిలి వెళ్లిపో. ఎందుకు, ఏమిటని అడగకు' అని చెప్పి వెళ్లాడు.

ప్రాణాలకు ప్రమాదం ఉందని రాత్రికి రాత్రే హైదరాబాద్‌కు పయనమయ్యాను. కూకట్‌పల్లి ఏరియాలో టెలిఫోన్ బూత్ పెట్టాను. 'ఆల్ ఇండియా పీపుల్స్ రెసిస్టెన్స్ ఫోరమ్' స్టేట్ జాయింట్ సెక్రెటరీగా పనిచేశాను. నక్సలైటు ఖైదీలందరినీ రాజకీయ ఖైదీలుగా గుర్తించాలనే డిమాండ్లతో జైల్లో జరిగిన పోరాటానికి మద్దతుగా ట్యాంక్‌బండ్‌పై టెంట్ వేశాం. కన్నబీరన్ నేతృత్వంలో అప్పటి ముఖ్యమంత్రి ఎన్టీఆర్‌ను కలిసి నక్సలైట్ల మీద నిషేధం ఎత్తివేయాలని కోరాం. అంతగా పట్టించుకోలేదేమో అనిపించింది. కానీ అదే రోజు అసెంబ్లీలో నిషేధం ఎత్తివేస్తున్నట్లు ప్రకటించారు.

### విప్లవం నుంచి ఉద్యమం

రాయలసీమ జిల్లాల్లో పని చేసినప్పుడు అక్కడి వెనుకబాటుతనాన్ని కళ్లారా చూశాను. ప్రత్యేక రాయలసీమ పోరాట కమిటీలన్నింటిలో పాలుపంచుకున్నా. అందుకే తెలంగాణకు జరిగిన అన్యాయాలపై స్టడీ చేయాలనుకున్నా. స్టాటిస్టికల్ సర్వే ఆఫ్ ఇండియాతో పాటు హైదరాబాద్‌లో ఉన్న లైబ్రరీలన్నీ తిరిగాను. పాశం యాదగిరి నడిపే వర్తమానం పత్రిక కార్యాలయంలో అడ్డా. తెలంగాణకు జరిగిన అన్యాయాలను గణాంకాలతో సహా విశ్లేషించి, 'దగా పడ్డ తెలంగాణ(1997)' రాశాను. అసెంబ్లీలోనూ ఆ పుస్తకం చర్చకు వచ్చింది. అందులో తప్పులున్నాయని నిరూపిస్తే రాజీనామాకు తాను సిద్ధమని అప్పటి ముషీరాబాద్ ఎమ్మెల్యే కోదండరెడ్డి టీడీపీ ప్రభుత్వానికి సవాలు విసిరారు. ప్రొఫెసర్లు, తెలంగాణ వాదులు ఆ పుస్తకాన్ని 'తెలంగాణ బైబిల్' అంటున్నారు.

అదే ఏడాది భువనగిరిలో 'తెలంగాణ హక్కుల సాధన సమితి' పేరుతో సభ పెట్టాం. కాళోజీ, జయశంకర్, గద్దర్ హాజరయ్యారు. తర్వాత 30 రోజులు పది జిల్లాలు తిరిగి, లక్షలాది కరపత్రాలు పంచాం. సింగూరు ముంపు గ్రామాల

పరిరక్షణ కమిటీ పేరుతో ముంపు బాధితుల తరఫున పోరాటం చేశాం.

**టీఆర్ఎస్...కేసీఆర్...**

ఎమోషనల్‌గా తెలంగాణ ఉద్యమాన్ని ముందుకు తీసుకెళ్లాలనే ఆలోచన ఉండేది తప్ప, రాజకీయ పార్టీల చేతుల్లో పెట్టే ఆలోచన లేదు.



తన ఆశ్రమంలోని పిల్లలతో గాదె ఇన్నయ్య దంపతులు

అయితే, మిత్రుల ద్వారా కేసీఆర్ పలుమార్లు కబురు చేయటంతో... కలిసి మాట్లాడుకున్నాం. తెలంగాణ ఏకైక అజెండా కావటంతో దగ్గరయ్యాం. రోజుల తరబడి చర్చల తర్వాత టీఆర్ఎస్ పార్టీ యోచన ఖాయమైంది. 2001 ఏప్రిల్ 27న జలదృశ్యంలో టీఆర్ఎస్ పురుడు పోసుకుంది. జెండా రూపకల్పన, పాటలు, ప్రచార వ్యూహం... ఈ ఉద్యమానికి నాది మంత్రసాని పాత్ర. టీఆర్ఎస్ వ్యవస్థాపక సభ్యుడిగా అప్పుడు క్షణం తీరిక లేదు. నల్గొండలో మొదటి వార్షికోత్సవ సభ వరకు అదే అనుబంధం కొనసాగింది.

తర్వాత టీఆర్ఎస్‌కు దూరమయ్యాను. 'తెలంగాణ రాష్ట్ర పార్టీ' పేరుతో కొత్త పార్టీ పెట్టాం. మా ఆలోచనలన్నీ లీక్ చేసి టీఆర్ఎస్‌తో చేయించేవాళ్లు. ఆ రాజకీయ ఎత్తుగడల్లో భాగంగా వైఎస్‌తో నా ఆలోచనలు పంచుకున్న సందర్భాలూ ఉన్నాయి.

2006లో తెలంగాణ రాష్ట్ర సాధన లక్ష్యంగా 'తెలంగాణ లిబరేషన్ టైగర్స్' పేరిట ఒక ఆత్మాహుతి దళం ఏర్పడింది. సింగూరు పైపులైన్ పేల్చివేతతో పాటు హైదరాబాద్‌లో వరుసగా 11 చోట్ల బాంబు పేలుళ్లు జరిగాయి. ఐమాక్స్‌లో బాంబులు దొరికాయి. ఆ కుట్ర కేసులో పోలీసులు నన్ను అరెస్టు చేసి జైల్లో పెట్టారు. ఆరు నెలలు చర్లపల్లి జైల్లో ఉన్నా. అక్కడ జీవితం మరో మలుపు తిరిగింది.

**అనాథలే అయినవాళ్లు**

చర్లపల్లిలో నాతో పాటు ఉన్న ఖైదీలందరిలో ఒకే కోణం దాగి ఉంది. అమ్మానాన్నల్లేని అనాథలు. వీళ్లతో కలిసి బతికితేనే నా జీవితానికి అర్థం, సంతృప్తి ఉంటాయనిపించింది. జైలు నుంచి బయటకు వచ్చాక ఎన్నో ఆశ్రమాలు తిరిగాను. బ్లైండ్ స్కూల్స్ చూశాను. బెంగళూరులో పండిట్ రవిశంకర్ ఆర్ట్ ఆఫ్ లివింగ్ ఆశ్రమంలో కూడా ఉన్నా.

ఇక, మా నాన్న నుంచి వారసత్వంగా వచ్చిన సంపాదనతో... 2005లో మా ఊరి సమీపంలోనే రేగడితండా గ్రామ పంచాయతీ పరిధిలో ప్రజాదరణ ఆశ్రమం ఏర్పాటు చేశాను. 11 ఎకరాల భూమిలో... పిల్లలకు విద్యావసరాలు, భోజన, వసతి సదుపాయాలకు అనుగుణంగా హోమ్ నిర్మించాను. 35 మందితో మొదలైంది. ఇప్పుడు 205 మంది బాలబాలికలున్నారు. వివిధ రాష్ట్రాలతో పాటు రాష్ట్రంలోని వివిధ జిల్లాలకు చెందిన వారున్నారు. ఆశ్రమ నిర్వహణకు ప్రతి నెలా రూ.2 లక్షల వరకు ఖర్చు అవుతోంది. వ్యక్తిగతంగా నా ఆస్తులు, వివిధ వనరుల ద్వారా నెలకు సగటైఆ వేల ఆదాయం వస్తుంది. దీనికితోడు మానవతా వాదులు, ఆత్మీయుల విరాళాలతో ఆశ్రమం నిరాటంకంగా నడుస్తోంది. కేజీ నుంచి పీజీ, వివిధ వృత్తి విద్యాకోర్సులు చదువుతున్నారు. స్కూల్ రికార్డుల్లో అమ్మానాన్నలుగా మా పేర్లే నమోదు చేయించాం. వారందరూ మమ్మీ, డాడీ అని పిలుస్తుంటే ఎంతో ఆనందం!

**పంచభూతాలే ప్రార్థన**

ఇక్కడున్న పిల్లలకు కులం లేదు. మతం లేదు. సూర్యచంద్రులు, భూమి, గాలి, నీరు, నిప్పుల్ని తలచుకుంటూ ప్రార్థన చేస్తారు. దేశాలు, రాష్ట్రాలు, వాటి రాజధానులు, రాష్ట్రపతులు, ప్రధానమంత్రులు, ముఖ్యమంత్రులు, వివిధ దేశాల్లో కరెన్సీలు... ఇవన్నీ శ్లోకంలా అప్పజెప్పుతారు. నర్సరీ నుంచి 5వ తరగతి వరకు ఫౌండేషన్ కోర్సు. వాళ్లకు ఇక్కడే బోధన జరుగుతుంది. ఇక, ఇంటర్మీడియెట్ క్యారెక్టర్ బిల్డింగ్ ఏజ్. అందుకే ఓ ప్రైవేటు కాలేజీని హోమ్‌లోనే నిర్వహించేలా ఒప్పందం చేసుకున్నాం. మిగతా తరగతులు, పై చదువులకు వెళ్లే పిల్లలు సమీప విద్యాలయాలకు వెళ్లి వస్తారు. డిగ్రీ, పీజీలు చదివే విద్యార్థులు చిన్న పిల్లలకు స్టడీ అవర్స్‌లో బోధిస్తారు. జమాఖర్చులు సహా నిర్వహణ బాధ్యతలు పిల్లల కమిటీలే చూసుకుంటాయి.

వైఎస్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు అనాథ పిల్లలకు 'క్యాస్ట్‌లెస్ జీవో' ఇప్పించాలని విజ్ఞప్తి చేశాను. కొద్ది రోజులకే జీవో జారీ చేశారు. దానిప్రకారం అనాథ పిల్లలను పదోతరగతి వరకు ఎస్సీ, ఆ తర్వాత ఎస్సీ కేటగిరీల్లో వచ్చే రిజర్వేషన్ సౌకర్యాలు వర్తిస్తాయి. ఈక్రమంలోనే... 18 ఏళ్లు నిండిన అనాథ పిల్లలకు సైతం ఓటరు గుర్తింపు కార్డు, రేషన్ కార్డు, ఆధార్ కార్డులు జారీ చేయాలని ఇటీవలే ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాం. వీళ్ల సంక్షేమం కోసమే నా ఆరాటం, నా పోరాటం.

సంభాషణ: బొల్లం శ్రీనివాస్
సాక్షి, వరంగల్
ఫొటోలు: పెద్దపెల్లి వరప్రసాద్

## కానిస్టేబుల్ ప్రాణం ఎందుకు తీయాలి?

పార్టీలో ఉన్నప్పుడు పీపుల్స్‌వార్ అగ్రనేత కొండపల్లి సీతారామయ్యతో కొద్దిసేపు గడిపిన ప్రత్యేక అనుబంధం నాకుంది. 2001లో ఆయన హైదరాబాద్‌లోని ఉస్మానియా ఆసుపత్రిలో చికిత్స పొందుతూ తప్పించుకున్నారు. ఆ ఘటనలో ఓ కానిస్టేబుల్ చనిపోయాడు. పోలీసులకు దొరక్కుండా తప్పించుకునేందుకు ఎస్కేప్ టీం సభ్యులు టెన్షన్ పడుతుంటే కానిస్టేబుల్ కోసం కొండపల్లి తీవ్రంగా ఆవేదన చెందారు. 'కానిస్టేబుల్ ప్రాణం తీసేందుకైతే నన్ను తప్పించటంలో అర్థం లేదు. ఇలా చేస్తే పీపుల్స్‌వార్ పార్టీ అంటే ప్రజలకు నమ్మకం పోతుంది. అసలు ఎన్ని రౌండ్లు కాల్చారు? ఎందుకు కానిస్టేబుల్‌ను కాల్చాల్సి వచ్చింది?' అంటూ కొండపల్లి కోపంతో ఊగిపోవటంతో తోడుగా ఉన్న నక్సలైట్లు బిత్తరపోయారు. అదీ ఆయన నాయకత్వ లక్షణం, మానవీయ దృక్పథం. *(2008లో ఆ కేసులో పోలీసులు నన్ను అరెస్టు చేసి ముషీరాబాద్ జైల్లో పెట్టారు. ఆగస్టు 15న జెండావందనం బహిష్కరణ, రాజకీయ ఖైదీలుగా గుర్తించాలనే డిమాండ్లతో జైల్లోనే తొమ్మిది రోజులు నిరాహార దీక్ష చేశాం.)*

## Icon of the Week

**పేరు: జయప్రకాష్ నారాయణ్ (1902-1979)**
**ఊరు: సితాబ్దియారా, బీహార్**
**సందర్భం: జయంతి**

లోక్‌నాయక్ జయప్రకాష్ నారాయణ్ స్వాతంత్ర్యానికి ముందు, తర్వాత తన జీవితాన్ని దేశానికే అంకితం చేశారు. ఎమర్జెన్సీపై ఆయన లేవదీసిన వ్యతిరేకతతో బాగా గుర్తింపు పొందారు.

- ఉత్తరప్రదేశ్‌కు-బీహార్‌కు సరిహద్దున ఉండే స్వగ్రామం సితాబ్దియారాలో పుట్టారు. ఉన్నత విద్యను అమెరికాలో అభ్యసించారు. అక్కడ ఉన్నప్పుడే మార్క్స్ సిద్ధాంతాలకు ఆకర్షితులయ్యారు.
- ప్రముఖుల అరెస్టుతో నాయకత్వం కోల్పోయిన క్విట్ ఇండియా ఉద్యమాన్ని ముందుండి నడిపించారు.
- ఆచార్య వినోబాభావే సర్వోదయ ఉద్యమంలో పాలుపంచుకున్నారు. తన భూమిని పేదలకు పంచారు.
- ఎమర్జెన్సీని తీవ్రంగా వ్యతిరేకించి, అరెస్టయి చాన్నాళ్లు జైల్లో ఉండిపోయారు.



## Another Mahatma

**పేరు : కల్పనా దత్తా (1913-1995)**
**ఊరు: శ్రీపూర్, బ్రిటిష్ ఇండియా (బంగ్లాదేశ్)**
**ప్రత్యేకత : స్వాతంత్ర్య సమరయోధురాలు**

చిన్న వయసులోనే స్వాతంత్ర్య సమరంలో పాల్గొన్న మహిళల్లో కల్పన ఒకరు. స్వాతంత్ర్య పోరాట స్త్రీ ప్రముఖుల్లో కమ్యూనిస్టులుగా నిలిచిన వారిలో ఈమెది ప్రత్యేక స్థానం.

- స్వగ్రామం శ్రీపూర్‌లోని హైస్కూల్‌లో చదువు పూర్తిచేశారు. ఉన్నత విద్య కోసం కలకత్తాకు వచ్చి, మహిళా విద్యార్థి సంఘం 'ఛాత్రి సంఘ'లో చేరారు.
- 17 ఏళ్ల వయసులోనే ఇండియన్ రిపబ్లికన్ ఆర్మీలో చేరారు. 'చిట్టగాంగ్ ఆయుధాగారం ముట్టడి'లో పాలుపంచుకున్నారు.
- ప్రీతిలత వాడేదార్‌తో కలిసి యూరోపియన్ క్లబ్ ముట్టడికి నాయకత్వం వహించారు. ఆ దాడిలో అరెస్టయ్యారు. విడుదలయ్యాక డిగ్రీ పూర్తిచేశారు. కమ్యూనిస్టు పార్టీలో చేరి రాజకీయ సేవలందించారు.
- పూరన్‌చంద్ జోషీని వివాహమాడారు. ఇద్దరు పిల్లలు. పెద్ద కొడుకు చాంద్ జోషీ జర్నలిస్టు.



## Better half



**పేరు : కవిత**
w/o: **వినోద్‌ఖన్నా**
**ఊరు : ముంబై**

వినోద్ ఖన్నా గీతాంజలి నుంచి విడాకులు పొందిన అనంతరం కవిత దఫ్తారీని వివాహమాడారు. పేజ్-3 పర్సన్‌గా ఆమె తరచూ మీడియాలో కనిపిస్తుంటారు.

- పియర్సన్ కాలేజ్ నుంచి గ్రాడ్యుయేషన్, లండన్‌లోని లింకన్స్ ఇన్ సొసైటీ కాలేజీ నుంచి బారిష్టరు పూర్తి చేశారు.
- కవిత-వినోద్‌లది ప్రేమ వివాహం. ఓసారి వినోద్ పుట్టిన రోజు వేడుకకు వచ్చిన కవితను చూసి మెచ్చిన వినోద్ ఆరోజు ఆమె వివరాలేమీ తెలుసుకోలేకపోయారు. చివరకు మిత్రుల ద్వారా ఆమె గురించి తెలుసుకుని, ఆమెతో పరిచయం పెంచుకున్నారు. ఇద్దరి భావాలూ ఒకటే కావడంతో ఒక్కటి కావాలని నిర్ణయించుకున్నారు.
- పెళ్లికి ముందు వినోద్ గురించి సరైన అభిప్రాయం ఉండేది కాదట కవితకు. కొత్త పరిచయం ఏర్పడ్డాక ఇలాంటి మనిషితోనే బతకాలి అనుకున్నారట.
- వీరికి ఇద్దరు పిల్లలు సాక్షి, శ్రద్ధ. వినోద్ మొదటి భార్య కొడుకులు రాహుల్, అక్షయ్ ఖన్నాలంటే కవితకు చాలా ఇష్టం.

## Our pride



**పేరు : జగ్జీత్ సింగ్ (1941-2011)**
**ఊరు : ముంబై**
**ప్రత్యేకత : ప్రఖ్యాత గజల్ గాయకుడు**

ప్రపంచవ్యాప్తంగా పేరొందిన భారతీయ గాయకుల్లో ఒకరు. ఆయనను అందరూ 'గజల్ కింగ్' అని కూడా పిలుస్తారు.

- సొంత ఊరు రాజస్థాన్‌లోని గంగానగర్. హర్యానాలోని కురుక్షేత్ర విశ్వవిద్యాలయం నుంచి చరిత్రలో పీజీ చేశారు.
- సంగీతంపై అవగాహన పెంచుకున్నాక ఇంట్లో చెప్పకుండా ముంబై వెళ్లిపోయారు. ఒక వాణిజ్య ప్రకటనకు సంబంధించిన జింగిల్స్‌లో అవకాశం వచ్చింది. నేపథ్య గాయకుడిగా 'ధరతీ న చోరు' తొలి సినిమా.
- అప్పటికి పెద్దగా పరిచయం లేని గజల్ సాహిత్య ప్రక్రియను తన ప్రయోగాలతో సంగీతంలా జనాల్లోకి తీసుకెళ్లారు. హిందీ పాటలను గజల్ రూపంలో అమోఘంగా పాడేవారు. భారత్‌లో అత్యధికంగా అమ్ముడుపోయిన గజల్స్ ఆయనవే.
- గజల్ గాయని చిత్రాసింగ్‌ను పెళ్లాడారు. ఇద్దరూ కలిసి 1970, 80 లలో దేశాన్ని గజల్ గానంతో ఉర్రూతలూపారు.
- ఎన్నో గొప్ప సినిమాలకు పాడారు. యాభైకి పైగా ఆల్బమ్‌లు చేసిన జగ్జీత్‌ను ప్రభుత్వం పద్మభూషణ్‌తో సత్కరించింది.



రాలిన మొగ్గలు

రాగాల్ని, తాళాల్ని ఉచ్ఛ్వాస నిశ్వాసాలుగా చేసుకున్న మేటి సంగీతకారుడు - మొజార్ట్. పాశ్చాత్య సంగీత ప్రపంచం నేటికీ మొజార్ట్‌కి మొక్కుతూనే ఉంటుంది. ఊహ తెలీని చిన్నతనం నుంచే ఉగ్గుపాలతో కాక తియ్యటి స్వరాల పాలతో సాగినవాడు మొజార్ట్. సన్నగా, పల్చగా, తెల్లగా దబ్బపండు ఛాయతో, ముఖంపై మశూచి మచ్చలతోఉండే మొజార్ట్... వేదిక ఎక్కి ఆలాపనలు సాగిస్తున్నప్పుడు గడ్డకట్టిన వెన్నెల శీతవాయువుతో స్నానించి మధుధారలా ప్రవహించేది. కాని అతని నిజ జీవితరంగాన మాత్రం ఎల్లవేళలా విషాద నిషధ రాగాలే!

## ● స్వరజ్ఞాని

# మొజార్ట్

అది సాల్జ్‌బర్గ్ పట్టణం. నేటి ఆస్ట్రియాలో ఉంది. ఆనాడు జర్మన్ దేశపు పవిత్ర రోమన్ సామ్రాజ్యంలో భాగమది. సంగీతమే ప్రపంచంగా బతికేవాడు లియోపాడ్. ఏదో కొద్దిగా సంగీతం నేర్చుకున్నాడు. ఎప్పుడూ బాణీలు కట్టుకుంటూ, కీబోర్డ్ వాయించుకుంటూ ఉండేవాడు. స్థానిక చర్చిలో వయొలనిస్ట్‌గా పనిచేసేవాడు. అతగాడి భార్య అన్నామేరియా పెద్దగా చదువుకోలేదు. మొదట అయిదుగురు పిల్లలు పుట్టారు. పోయారు. ఆరో పిల్లగా ఓ అమ్మాయి పుట్టింది. పేరు మేరీ.

సంగీతంతో తాను సాగించిన పరిశోధనలన్నింటినీ ఓ పుస్తకంగా రాసేకాడు లియోపాడ్. 1756లో ఆ పుస్తకం ముద్రణకు నోచుకుంది. అదే ఏడాది జనవరి 27న ఆ దంపతులు పండంటి మగబిడ్డను నోచుకున్నారు. ఆ పిల్లాడే మొజార్ట్. అతడు ఓ సంగీత ఉద్దండుడు కాబోతాడని ఆ దంపతులకు ఆనాడే తెలుసు.

కూతురు మేరీకి రోజూ సంగీత పాఠాలు చెప్పేవాడు లియోపాడ్. అప్పటికి మొజార్ట్‌కి మూడేళ్లే. అయినా అక్కతో పాటు ముద్దుముద్దుగా స్వరాలాలపించేవాడు. కీబోర్డ్ లాంటి పరికరమైన క్లావియర్‌పై లేలేత వేళ్లతో కొట్టేవాడు. అది చిన్నపిల్లాడి ఆట అనుకున్నారంతా. కాని తండ్రి ఎలా వాయిస్తే అలా... అచ్చం అలాగే కొట్టేవాడు. ఆ లయబద్ధమైన తత్త్వం మొజార్ట్‌కి మూడేళ్లకే రావడం తండ్రిని ఆశ్చర్యంలో ముంచెత్తింది. ఇంకా ఆశ్చర్యకరం... అయిదేళ్లకే మొజార్ట్ కీబోర్డ్‌పై తనదైన సొంత బాణీల్ని సృష్టించడం. ఆ చిట్టి చిన్నారి మొజార్ట్ బాణీలు నేటికీ లభించడం విశేషం.

● ● ●

తన కొడుకు గొప్ప సంగీత విద్వాంసుడు అవుతాడని లియోపాడ్‌కి అర్థమైంది. మొత్తం తన జీవితాన్నంతా పిల్లాడి ప్రతిభను సానబెట్టడానికే అంకితం చేయాలని గట్టిగా అనుకున్నాడు. అంతే! తామిద్దరూ తమ ఇద్దరు పిల్లలతో ఎన్నెన్ని పట్టణాలు తిరిగారో, ఎందరెందరిని కలిశారో. ఆనాటి రాజాస్థానాలను, ప్రముఖ నిలయాలను సందర్శించేవారు ఉన్న ఊరిని, ఇంటిని వదిలిపెట్టి, చెకొస్లవేకియా, జర్మనీ, ఇటలీ, బ్రిటన్, నెదర్లాండ్, ఫ్రాన్స్... సందర్శించని దేశం లేదు.

జర్మనీలోని ఇసార్ నది ఒడ్డున మ్యూనిచ్ పట్టణంలో ఆరేళ్ల బుడతడు మొజార్ట్ 1762లో తొలి ప్రదర్శన ఇచ్చాడు. అందరినీ ఆశ్చర్యంలో ముంచెత్తాడు. ఆహూతులంతా అమృతంలో మునిగిపోయారు. ప్రతి రాజాస్థానాన్నీ, ప్రముఖుడినీ సంప్రదించడం, కొడుకు ప్రతిభ గురించి చెప్పడం, వాళ్ల కాళ్లా వేళ్లా పడడం, ఒక్క అవకాశం ఇప్పించమంటూ ప్రాధేయపడడం. చివరకు ఎలాగోలా కొడుకు ప్రదర్శనను పెద్ద పెద్ద రాజాస్థానాల్లో ఏర్పాటు చేయడం. ఇంతే! ఇదే పని లియోపాడ్‌కి.

ఒక్కసారి అవకాశం దొరికితే చాలు... మొజార్ట్ వెర్రెత్తినట్టు పరవశంతో, తాదాత్మ్యంతో ఆయా సంగీత పరికరాలతో నాదుల తీగలపై సాగిన నాదబ్రహ్మాన్ని పరిచుంబనలతో సాగే సంగీత కచేరీ సాగించేవాడు. 14 ఏళ్ల వయసుకే మొజార్ట్ ఇటలీలోని మిలాన్‌లో కచేరీ ఇచ్చాడు. ఎంత పేరొచ్చిందో అంతులేదు.

అంతా బాగానే ఉంది. చప్పట్లు బాగానే కొట్టేవారు కానీ, ఆర్థికంగా ఎవరూ ఆదుకునేవారు కారు. ఓ పక్క సంపాదన లేదు. మరోపక్క అన్నీ ఖర్చులే. కొన్ని రోజులపాటు దంపతులిద్దరూ పస్తులుండేవారు. పిల్లలకు రొట్టెముక్కలు పెట్టేవారు. అయినా సంగీతము, ప్రదర్శనలు వినా సన్మార్గం కలదా అంటూ ముందుకు సాగేవారు.

● ● ●

ఇక లాభం లేదని సాల్జ్‌బర్గ్ తిరిగొచ్చేసిందా కుటుంబం. ఎక్కడో ఓ ఆస్థానంలో సంగీతకారుడిగా ఉద్యోగం దొరికితే చాలన్న పరిస్థితి. ఆ దశలో 17 ఏళ్ల మొజార్ట్‌కి సాల్జ్‌బర్గ్ ఆస్థానంలో ఆస్థాన సంగీతకారుడిగా స్థానం లభించింది. ఎన్నెన్ని బాణీలు. ఎన్నెన్ని నూతన ప్రక్రియలు. సంగీతోత్సవాలన్నీ మొజార్ట్ స్వరాలతో నిండిపోయాయి. సంగీతకాలలన్నీ అతగాడి పాటక సమూహాలతో దసదమ్మమైపోయేవి.

పియానో, ఫిడేల్ లాంటి రెండేసి

వాయిద్యాలతో పాడటానికి అనుకూలమైన త్రిశ్ర, చతురస్ర గతులతో నడిచే 'సొనాటా' పాటల్ని, నాలుగేసి సంగీత వాద్యాలకు తగిన మూడు తంత్రుల 'క్వార్టెట్' గీతాల్ని ఎన్నో పలికించాడు మొజార్ట్ ఆ రోజుల్లో. ప్రియురాలి గుమ్మం దగ్గర సాయంత్రంపూట నిలబడి ప్రియుడు ఆలపించే 'సెరెనేడ్' ప్రేమగీతాలకు ప్రాణం పోశాడు మొజార్ట్.

ఇంత చేసినా ప్రతిభకు తగ్గ ప్రతిఫలం మాత్రం లభించేది కాదు సాల్జ్‌బర్గ్‌లో! జీతం మరీ తక్కువ. చక్రవర్తి ప్రోత్సాహం అస్సలుండేది కాదు. పుర ప్రముఖులు ప్రదర్శనల ఏర్పాటుకు సహకరించేవారు కారు. ప్రజలకు ఎంతగా మొజార్ట్ సంగీతమంటే ఇష్టమైనా, ప్రదర్శనశాలల్ని మూయించేసింది అప్పటి రాచరిక ప్రభుత్వం. ఇక లాభం లేదని 20 ఏళ్ల మొజార్ట్ మళ్లీ యాత్రలు ప్రారంభించాడు - ఒక్కడే!

ఫ్రాన్స్ వెళ్లాడు. ప్యారిస్ నగరవీధుల్లో కచేరీలిచ్చాడు. జర్మనీ పయనించాడు. మ్యూనిచ్ నగరంలో తన చిన్ననాటి జ్ఞాపకాలు మదిగదిలో మార్మోగుతుండగా పియానోపై మంద్రగీతాలు ఆలపించాడు. ఆగ్స్‌బర్గ్ పట్టణంలో ఆలపించి మాన్‌హీమ్ నగరంలో పియానో, ఫిడేల్, వయొలిన్... ఇలా జుగల్‌బందీ సాగించాడు. అక్కడే సంగీతం నేర్చుకుని అద్భుతంగా పాడే 18 ఏళ్ల అమ్మాయి అలోషియా వెబర్‌తో ప్రేమలో పడ్డాడు. కానీ ఆమె మాత్రం తిరస్కరించింది.

చెప్పలేని వేదన మొజార్ట్‌కి. ప్రేమగీతాలన్నీ విరహ గీతాలయ్యాయి. శ్రుతులన్నీ గతి తప్పాయి. ఏదో తెలీని బాధ గుండెల్లోపల సెగ పుట్టిస్తుంటే... ఇక ఆ నగరంలో ఉండలేకపోయాడు. దానికి తోడు ఆర్థిక ఇబ్బందులు. తిరిగి ప్యారిస్ వచ్చాడు. అక్కడ కొంతకాలం ఉన్నాడు. ప్రదర్శనలు బాగానే ఉన్నా చేతిలో చిల్లిగవ్వ లేని పరిస్థితి. సంగీత పరికరాలు మినహా అన్నీ చివరకు తన దగ్గరున్న ఒకటి రెండు విలువైన దుస్తుల్ని సైతం తాకట్టుపెట్టి పొట్ట పోసుకున్నాడు. అంతలో అమ్మ కన్ను మూసిందన్న కబురు పిడుగులా!

మళ్లీ వెనక్కి సాల్జ్‌బర్గ్‌కి. పాతికేళ్ల వయసు. వెనక్కి తిరిగి చూసుకుంటే ఏం మిగిలింది! అమ్మ మరణం, నాన్న ముసలితనం, అక్క నైరాశ్యం, తనకు అప్పులు... అయినా ఇన్నింటి మధ్యా సంగీత సాధన నిత్యకృత్యం. చివరకు 1781లో మొజార్ట్ వియన్నాలోని కొలరెడో అనే చర్చి ఫాదర్ దగ్గర చేరాడు నాలుగు జీతం రాళ్లకి. అక్కడ పడిన అవమానాలన్నీ ఇన్నీ కావు. చివరకు ఆ ఇంటి సేవకులు సైతం గెంటివేసిన సందర్భాలెన్నో. భరించలేకపోయాడు మొజార్ట్. ఆ ఒక్క ఉద్యోగమూ వదిలేస్తే ఇక కుటుంబమంతా ఆత్మహత్య చేసుకోవాల్సిన పరిస్థితి. ఎలాగోలా ఉద్యోగం చేయమన్నాడు తండ్రి. కానీ మొజార్ట్... ఏదైతే అది అయిందని ఉద్యోగం మానేశాడు.

**మొజార్ట్ ఎలా మరణించాడో నేటికీ స్పష్టంగా తెలీదు. ఇంతవరకూ పరిశోధకులు మొజార్ట్ మరణానికి 118 రకాల కారణాల్ని తెలిపారు. బిలియర్డ్స్ ఆడడమన్నా, చిన్న చిన్న స్టెప్పులతో డ్యాన్స్ చేయడమన్నా మొజార్ట్‌కి ఇష్టం. కుక్కల్ని పెంచేవాడు. గుర్రపు స్వారీ చేసేవాడు.**



బాల్యంలో మొజార్ట్ పియానో సాధన

అదే... ఆ తెగింపే మంచిదయింది మొజార్ట్‌కి. కసిగా రెట్టించిన పట్టుదలతో కచేరీలివ్వడం మొదలుపెట్టాడు. ఎవరో ఏదో ఇస్తారని కాకుండా తన ఆత్మసంతృప్తి కోసం ఆలపించడం మొదలుపెట్టాడు. కనులు మూసుకుని కీబోర్డ్‌పై వేళ్లతో గమకాలు వాయిస్తూ అమేయమైన బ్రహ్మానుభవాన్ని అనుభవిస్తూ ప్రదర్శనలిస్తుంటే ప్రేక్షకులు ఊగిపోయేవారు. పరవశించిపోయేవారు.

తాను ప్రేమించిన ప్రేయసి కాదన్నా, ఆమె చెల్లెలు కాన్‌స్టాంజాని ప్రేమించి పెళ్లి చేసుకున్నాడు. ఆమె కూడా గాయనే. ఇద్దరూ కలిసి కచేరీలు ఇస్తుంటే, ప్రశంసల వెల్లువే కాదు. కానుకల వర్షమూ కురిసింది. కరెన్సీ నోట్లు ఎగురుకుంటూ ముంగిట్లోకొచ్చాయి. పూట గడవని మొజార్ట్ కోటీశ్వరుడయ్యాడు రెండేళ్లకే! విచ్చలవిడిగా ఖర్చు పెట్టేవాడు. సంపన్నులు సైతం కొనలేని ఫోర్ట్ పియానోని నోట్లకట్టల్ని విసిరి కొన్నాడు. భారీ బంగళాల్లో, పెద్ద పెద్ద కార్లల్లో... ఇంటి నిండా నౌకర్లతో గడిపాడు. డబ్బుల్ని గాలిపాటలాగా ఖర్చు చేశాడు. లల్లాయిపాటల్ని మధురమైన స్వరాలుగా మార్చివేశాడు.

అంతలో ఆస్ట్రియా-టర్కీ యుద్ధం వచ్చింది. రాజ్యమూ, ప్రజలూ సంక్షోభంలో పడటంతో కళలకు ఆదరణ తగ్గింది. సంగీతాన్ని ప్రేమించేవారు, సొమ్మిచ్చి పోషించేవారు కనుమరుగయ్యారు. దాంతో మొజార్ట్‌కి వచ్చిన సిరి వెళ్లిపోయింది. సంగీతం మాత్రం మిగిలింది. చివరి రోజుల్లో కష్టాలు అనుభవించాడు. 1791లో 35 ఏళ్ల వయసులో తీవ్రజ్వరం రావడంతో డిసెంబర్ 5 నాటి ఓ ఉదయం కన్నుమూశాడు.

సంగీతంలో ఉదాత్త, అనుదాత్త స్వరాలుంటాయి. జీవితంలో ఉత్థాన పతనాలుంటాయి. మొజార్ట్ జీవిత సంగీతంలో ఇవన్నీ ఉన్నాయి.

● ఆకెళ్ల రాఘవేంద్ర

? ఎందుకు

## వినాయకుడి పూజలో తులసిని ఎందుకు వాడరు?



ఓసారి వినాయకుడు గంగా తీరంలో విహరిస్తుంటే, ధర్మధ్వజ యువరాణి అతణ్ని చూసి ఇష్టపడింది. తనను పెళ్లి చేసుకోమని వినాయకుడిని అడిగితే కాదన్నాడు. దాంతో కోపగించుకుని దీర్ఘకాలం బ్రహ్మచారిగా ఉండమంటూ శపించింది యువరాణి. ప్రతిగా వినాయకుడు ఆమెను రాక్షసుడి దగ్గర దీర్ఘకాలం ఉండమని శపిస్తాడు. భయపడిన యువరాణి మన్నింపు కోరింది. శాంతించిన వినాయకుడు కొంతకాలం రాక్షసుడి దగ్గర ఉండి, తర్వాత పవిత్రమైన తులసిగా జన్మిస్తావని చెప్పాడు. అందుకే వినాయకుడు తులసిని ఇష్టపడడు. కాబట్టి ఆయన పూజలో తులసి నిషిద్ధం.

ఏమిటి ?

## ...నోట నువ్వు గింజ నానదు...



భారతయుద్ధం ముగిశాక మరణించిన బంధుమిత్రులందరికీ ధర్మరాజు పితృకార్యం చేస్తున్నాడు. అక్కడికి వచ్చిన కుంతీదేవి కర్ణుడికి కూడా జరిపించమని కోరింది. ఎందుకని అడగ్గా తాను కన్యగా ఉన్నప్పుడు కర్ణుడు పుట్టిన వైనాన్ని వివరించింది. సొంత అన్నను చేతులారా చంపుకున్నాము, ముందే చెబితే ఇలా జరిగేది కాదు కదా అంటూ దుఃఖించాడు ధర్మరాజు. తల్లిమీద కోపంతో, 'ఇకమీదట స్త్రీల నోట రహస్యం దాగదు' అంటూ శపించాడు. అప్పట్నుంచే ఇది వాడుకలోకి వచ్చింది. నువ్వు గింజ నానడానికి ఎంతో సమయం పట్టదు. ఆ కొద్ది సమయం కూడా స్త్రీలు రహస్యాలు దాచలేరు అని దీని భావం.

? ఎవరు

**వ (అబ్బాయి)**
వైభాన్ - విష్ణుమూర్తి
విహాన్ - ఉదయం
విశ్వత్ - విశ్వం

**వ (అమ్మాయి)**
వ్యోమిని - దైవికమైనది
విముద - లక్ష్మీదేవి
విభ - నిర్భయమైనది



# ఏ స్మార్ట్‌లో ఏముంది?



మొదట్లో ఫోన్లు చాలా ఖరీదుగా ఉన్నా ధరలు చాలా వేగంగా దిగొచ్చాయి. ఇపుడు మళ్లీ జనం స్మార్ట్ ఫోన్ల బాట పట్టడంతో ప్రతి కంపెనీ తన సత్తా నిరూపించుకోవడానికి విభిన్నమైన ఫీచర్లతో స్మార్ట్ ఫోన్లు విడుదల చేస్తోంది. ఈ మధ్యనే విడుదలైన స్మార్ట్ ఫోన్లు దాదాపు అన్నీ ఒకేరకమైన ఫీచర్లతో వినియోగదారులను ఆకర్షిస్తున్నారు. చిత్రమేంటంటే చౌక ఫోన్లు తయారుచేసే మైక్రోమాక్స్ కూడా వీటితో పోటీ పడింది. ప్రస్తుతం ఎక్కువమందిని ఆకర్షిస్తున్న నాలుగు స్మార్ట్ ఫోన్ల ప్రత్యేకతలేంటో చూద్దాం.

**యాపిల్ ఐఫోన్ 5:** అన్నింటిలోకి బరువు తక్కువ. ధర ఎక్కువ. మెమొరీ స్లాట్ ఉండదు. ఇంటర్నల్ మెమొరీ మాత్రమే. ఎనిమిది గంటల టాక్‌టైం ప్లస్‌పాయింట్. అత్యుత్తమ నాణ్యతతో కూడా ఫొటోలు, వీడియోలు తీసుకోవచ్చు. ధర 48 వేలు ఆపైన (మెమొరీని బట్టి). బ్యాటరీ : 1440 ఎంఏహెచ్.

**శాంసంగ్ ఎస్3 :** రెండు మూడు అప్లికేషన్ల పాపప్‌తో ఒకేసారి రన్ చేయొచ్చు. ఐఫోన్ కంటే స్క్రీన్ పెద్దది. వెడల్పు ఎక్కువ. 64 జీబీ వరకు ఎక్స్‌పాండబుల్ మెమొరీ. 3జీలో 11 గంటల టాక్‌టైం. 2100 ఎంఏహెచ్. ధర: 35000

**శాంసంగ్ గెలాక్సీ నోట్ 2:** వేగవంతమైన 1.6 గిగాహెర్ట్జ్ కోర్టెక్స్ ఎ-9 ప్రాసెసర్. ఇప్పుడున్న అన్ని ఫోన్ల కంటే పెద్ద స్క్రీన్. 5.5 అంగుళాల స్క్రీన్ దీని ప్రత్యేకత. స్క్రాచ్‌ప్రూఫ్ స్క్రీన్. ఫుల్‌హెచ్‌డీ. బ్యాటరీ సామర్థ్యం అన్నింటికన్నా ఎక్కువ: 3100 ఎమ్‌హెచ్. ధర 39900.

**మైక్రోమాక్స్ సూపర్‌ఫోన్ ఎ100:** ఇది అతి తక్కువ ధరలో వచ్చే స్మార్ట్ ఫోన్. చాలావరకు పైమూడు స్మార్ట్ ఫోన్ల సామర్థ్యాలున్నాయి. బరువు కూడా తక్కువే. పైగా డ్యూయల్ సిమ్. ఐఫోన్, ఎస్3ల కన్నా పెద్ద స్క్రీన్. బ్యాటరీ 2000 ఎంఏహెచ్. కెమెరా (5మెగా పిక్సల్), డిస్‌ప్లే (480x854)ఇంటర్నల్ మెమొరీ(4 జీబీ) మాత్రం మిగతా వాటికంటే తక్కువ. అయితే ధర కేవలం పదివేలు. ధరతో పోల్చిచూస్తే మాత్రం పైవేవీ దీనికి సాటిరావు.



# కిరాతకుడు





మెల్విన్ రీస్

**ఏ జంతువుకీ లేని జ్ఞానం మనిషికి ఉంది.**
**కానీ ఆ జ్ఞానం పెడతోవ పట్టినప్పుడు మనిషి జంతువుకన్నా దారుణంగా ప్రవర్తిస్తాడు.**
**మనిషి జన్మకే కళంకాన్ని తీసుకొస్తాడు.**
**మనిషిని చూసి మనిషి భయపడే పరిస్థితిని కల్పిస్తాడు.**
**దానికి ఉదాహరణ, చాలా యేళ్ల క్రితం అమెరికాలో జరిగిన ఓ ఉదంతం.**
**ఆ ఉదంతంలో కొందరు అమాయకులున్నారు.**
**వాళ్ల ప్రాణాలు తీసిన ఓ కిరాతకుడు ఉన్నాడు.**
**అతడే మెల్విన్ రీస్.**
**ఆ మానవమృగం చేసిన ఘోరాలు... ఈవారం నిజాలు దేవుడికెరుకలో!**

జనవరి 11, 1959, వర్జీనియా. ఓ కేసు గురించి సబార్డినేట్స్‌కి వివరిస్తున్నాడు పోలీస్ చీఫ్. అంతలో ఫోన్ మోగింది. ఓసారి దానివైపు చూసి తిరిగి తన పనిలో పడిపోయాడు చీఫ్. కానీ మళ్లీ మళ్లీ మోగడంతో తీయక తప్పలేదతనికి. రెండు నిమిషాల తర్వాత ఫోన్ పెట్టేసి... ''మనం వెంటనే మేరీ ల్యాండ్ వెళ్లాలి'' అంటూ లేచి గబగబా బయటికి నడిచాడు. సబార్డినేట్స్ ఇద్దరూ అతణ్ని మౌనంగా అనుసరించారు.

• • •

''ఈ బిల్డింగ్ గుర్తుందా'' అడిగాడు చీఫ్, వెనుక నడుస్తున్న సబార్డినేట్స్‌ని.

''రెండేళ్ల క్రితం ఓ కేసు గురించి వచ్చాం కదా సార్'' చెప్పారిద్దరూ.

అంతలో ఇద్దరు వ్యక్తులు వారికి ఎదురొచ్చారు. ''మేమే సార్ మీకు ఫోన్ చేసింది'' అన్నారు వినయంగా.

''మీరిక్కడికెందుకు వచ్చారు'' అడిగాడు చీఫ్.

''ఈ వెనకంతా తోటలే సార్. ఎప్పుడైనా ఎండు కట్టెల్లాంటివి అవసరమైతే ఇక్కడికే వచ్చి తీసుకుంటాం'' చెప్పాడో వ్యక్తి. అలాగా అన్నట్టు తలాడించి, వారిని అనుసరించారు పోలీసులు.

రెండు క్షణాల్లో బిల్డింగ్ వెనుక ఉన్న తోటల్లోకి చేరుకున్నారు. అక్కడ ఒకచోట ఆగి, ''ఇదిగో చూడండి'' అన్నాడో వ్యక్తి.

పోలీసులు అతడు చూపినవైపే పరిశీలనగా చూశారు. పెద్ద బురదగుంట అది. అందులోంచి ఒక చేయి బయటికి కనిపిస్తోంది. అక్కడక్కడా గుడ్డపీలికలు కూడా కనిపిస్తున్నాయి.

''మైగాడ్'' అన్నాడు చీఫ్ టోపీ తీస్తూ. ''వెంటనే స్క్వాడ్‌ని రమ్మనండి'' అంటూ ఆదేశించాడు. పావుగంటలో స్క్వాడ్ అక్కడికి చేరుకుని పని మొదలుపెట్టింది.

బురదగుంటలోంచి రెండు శవాలను బయటికి తీశారు. ఒకటి ముప్ఫయ్యేళ్ల వ్యక్తిది. తల వెనుక షూట్ చేయడంతో చనిపోయాడు. అతని రెండు చేతులూ కట్టేసి ఉన్నాయి. రెండోది అయిదేళ్ల పాప శవం. చూస్తేనే మనసు వికలమయ్యేంత దారుణంగా ఉంది ఆ దృశ్యం.

''దేవుడా... ఏమిటిది''... పోలీసులను పిలిచిన వ్యక్తులిద్దరూ బిక్కచచ్చిపోయారు. వారి ముఖాల్లో ఆశ్చర్యం, భయం, బాధ!

ఆధారాల కోసం వెతుకులాట మొదలుపెట్టారు పోలీసులు. తోటంతా గాలిస్తుంటే మరోచోట, ఒక గుంటలో పాతికేళ్ల స్త్రీ, ఏడాదిన్నర పాప శవాలు!

''సార్... కొద్దిరోజుల క్రితం కనిపించకుండా పోయిన జాక్సన్ ఫ్యామిలీ ఇదే నంటారా''... అడిగాడు సబార్డినేట్. అవునన్నట్టు తలూపాడు చీఫ్.

దురాగతాలను చూసి చూసి కరడు కట్టిన ఖాకీ గుండెలు సైతం కాసేపు బాధతో విలవిల్లాడాయి. పెద్దవాళ్లు సరే. ఆ చిన్నారులు ఏం పాపం చేశారు! వాళ్లనింత దారుణంగా అంతమొందించడానికి ఎవరికైనా చేతులెలా వస్తాయి!

''బాడీస్‌ని పోస్ట్‌మార్టమ్‌కి పంపించండి''... భావోద్వేగాలకు మన వృత్తిలో తావులేదు అన్నట్టుగా అన్నాడు చీఫ్. ఓ క్షణం పాటు షాక్‌తో పనిచేయడం ఆపేసినవాళ్లంతా, చీఫ్ ఆదేశంతో తిరిగి పని ప్రారంభించారు.

• • •

''మార్గరెట్‌ని చంపినవాడే ఈ హత్యలూ చేశాడు''... రిపోర్టులను నిశితంగా పరిశీలిస్తూ అన్నాడు పీటర్ హార్కిన్స్... ప్రముఖ సైకాలజిస్ట్.

''ఎలా చెప్పగలరు''... ఆసక్తిగా అడిగాడు చీఫ్.

''ఆమెపై అత్యాచారం ఏ రకంగా జరిగిందో, ఈమెపై కూడా అదేరకంగా జరిగింది. అవే గాయాలు, అలాంటివే గుర్తులు. ఇంత పాశవికంగా, క్రూరాతి క్రూరంగా ప్రవర్తించేవాళ్లు చాలా అరుదు. ఇన్నేళ్ల అనుభవంతో చెబుతున్నాను. వాడే వీడు, వీడే వాడు.''

దీర్ఘంగా నిట్టూర్చాడు చీఫ్. ఒక్కసారి కళ్లముందు మార్గరెట్ కదలాడింది.

ఆ రోజు జూన్ 28, 1967. ఒక వ్యక్తి తనకు ఫోన్ చేసి, మేరీల్యాండ్‌లోని ఒక రోడ్డులో కారులో వెళ్తుండగా, తమ మీద ఎవడో దాడి చేశాడని, తన ప్రేయసి మార్గరెట్‌ని తీసుకుపోయాడని చెప్పాడు. మార్గరెట్‌ని ఎలాగైనా కాపాడమని వేడుకున్నాడు. అతడు చెప్పిన అడ్రస్‌కు వెళ్తే రోడ్డుమీద ధ్వంసమైన కారు కనిపించింది. రోడ్డుకు కాస్త దూరంలో ఓ బిల్డింగ్! వెళ్లి చూస్తే ఓ గదిలో మంచమ్మీద దారుణాతి దారుణ స్థితిలో పడివుంది మార్గరెట్. ఒంటిమీద బట్టలు లేవు. ఆమెపై జరిగిన హింసకు గుర్తుగా ఒళ్లంతా గోళ్ల రక్కులు, పంటి గాట్లు. తుపాకీతో పలుమార్లు కాల్చడంతో ఉదరభాగం చిల్లులు పడి రక్తం ధారలుగా బయటికి పొంగుకొచ్చింది. ఆ దృశ్యాన్ని చూసినవాళ్లకి దాన్ని మర్చిపోవడం అంత తేలిక కాదు.

అయితే ఆ గదిలో పోలీసులను షాక్‌కి గురిచేసింది ఇంకొకటుంది. గది గోడల నిండా ఓ స్త్రీని ఎంత క్రూరంగా రేప్ చేయవచ్చో తెలిపేలా ఉన్న వందలకొద్దీ చిత్రాలున్నాయి. దాన్నిబట్టి ఈ దారుణానికి ఒడిగట్టినవాడు ఎంత శాడిస్టో అంచనా వేసుకోగలిగాడు చీఫ్. కానీ అతనెవరో మాత్రం తెలుసుకోలేకపోయాడు.

ఫోన్ రింగవడంతో ఆలోచనల్లోంచి బయటికొచ్చాడు చీఫ్. మాట్లాడాలనిపించక లేచి బయటికి వెళ్లిపోయాడు. మనసంతా కేసు చుట్టూ తిరుగుతోంది.



**ఆరడుగుల మూడంగుళాల పొడవు... మెరిసిపోయే మేనిఛాయ... ఈ అందమైన రూపం వెనుక అంత దారుణమైన మనస్తత్వం దాగివుందా అని ఆశ్చర్యపోయారు మెల్విన్‌ని చూసినవాళ్లంతా.**

కొన్ని రోజుల క్రితం బంధువులింటికి వెళ్లిన జాక్సన్ అనే వ్యక్తి కుటుంబంతో సహా మాయమయ్యాడని వారి బంధువొకరు కంప్లయింట్ ఇచ్చారు. విచారణ చేస్తుండగా ఒకచోట కారు కనిపించింది. కానీ జాక్సన్ ఫ్యామిలీ ఏమయ్యారో మాత్రం తెలియలేదు. చివరికి ఇప్పుడిలా... ఈ స్థితిలో కనిపించారు.

'ఎవడు వాడు! ఎందుకిలా చేస్తున్నాడు! ఎవరైతేనేం... ఈసారి మాత్రం వాణ్ని వదిలే ప్రసక్తి లేదు'... మనసులోనే గట్టిగా అనుకున్నాడు చీఫ్.

• • •

''సార్... ఇటు చూడండి''... సబార్డినేట్ పిలుపుతో ఆ గదిలోకి వెళ్లాడు చీఫ్. ఈసారైనా ఏదైనా ఆధారం దొరుకుతుందేమోనని ఆ భవనంలో మరోసారి గాలింపులు చేపట్టారు.

''ఏంటి... ఏమయ్యింది'' కంగారుగా అడిగాడు. వెంటనే అతని చేతిలో ఓ డైరీని పెట్టాడా సబార్డినేట్.

అది మేరీల్యాండ్ యూనివర్సిటీ డైరీ. అందులో ఏవో కాలేజీ ఫంక్షన్ ఫొటోలు కూడా ఉన్నాయి. ముఖ్యంగా ఒక అమ్మాయి ఫొటోలు ఎక్కువగా ఉన్నాయి.

''వెరీగుడ్... పదండి వెళ్దాం'' అన్నాడు చీఫ్ హుషారుగా. అరగంట తిరిగేసరికి యూనివర్సిటీ వద్ద ఉన్నారు. ఆ ఫొటోలో ఉన్న అమ్మాయి ఎవరా అని విచారణ చేస్తే, ఆమె ఆ యూనివర్సిటీ పాత విద్యార్థిని వాండా టిప్టన్ అని తెలిసింది. ఎలాగో ఆమెను పట్టుకున్నారు. ఆమె నోటివెంట వినిపించింది వాళ్లకు కావాల్సిన పేరు... మెల్విన్ రీస్.

మెల్విన్, వాండా యూనివర్సిటీలో సహ విద్యార్థులు. ఆ తర్వాత స్నేహితులయ్యారు. ప్రేమికులుగా మారారు. అయితే అతని వికృత మనస్తత్వం కారణంగా అతనికి దూరమయ్యానని చెప్పింది వాండా. అతడు ప్రస్తుతం ఓ మ్యూజిక్ స్టోర్‌లో పని చేస్తున్నట్టు తెలిసిందని హింట్ కూడా ఇచ్చింది. దాంతో మెల్విన్‌ను పట్టుకున్నారు పోలీసులు.

ఆరడుగుల మూడంగుళాల పొడవు... మెరిసిపోయే మేనిఛాయ... ఇంత అందమైన రూపం వెనుక అంత దారుణమైన మనస్తత్వం దాగివుందా అని ఆశ్చర్యపోయారు మెల్విన్‌ని చూసినవాళ్లంతా. అతడు మార్గరెట్, జాక్సన్ కుటుంబాలనే కాదు, మరో నలుగురు స్త్రీలను కూడా పొట్టనపెట్టుకున్నాడని విచారణలో తేలింది. పైశాచికంగా అమాయకులను బలి తీసుకున్న మెల్విన్‌ని క్షమించకూడదని నిర్ణయించుకున్న న్యాయస్థానం, అతనికి మరణశిక్ష విధించింది.

అయితే కొన్ని కారణాల వల్ల హైకోర్ట్ మెల్విన్ మరణశిక్షను రద్దు చేసి, జీవితాంతం జైలులోనే ఉండమని శాసించింది. ప్రాణాల విలువ తెలియని ఆ క్రూరుడికి ప్రాణం త్వరగా పోవడం కంటే, బతికున్నన్నాళ్లూ నరకాన్ని అనుభవించి చావడమే వాడికి సరైన శిక్ష అన్నారంతా. కానీ దేవుడు మరొకటి తలిచాడు. ఆ నరరూపరాక్షసుడిని ఇక భూమిమీద ఉంచకూడదనుకున్నాడో ఏమో... మృత్యు దేవతను మెల్విన్‌పై ఉసిగొల్పాడు. ఐదేళ్ల శిక్షను అనుభవించిన తర్వాత మెల్విన్ ఓ రోజు హఠాత్తుగా గుండె నొప్పితో చనిపోయాడు. అక్కడితో మానవ జన్మకే కళంకాన్ని తెచ్చిన ఓ కిరాతకుడి చరిత్ర ముగిసిపోయింది.

● సమీర నేలపూడి

# గతం గతః

అరిపిరాల సత్యప్రసాద్



దండపాణి ఆనందంతో పెట్టిన పొలికేక దాదాపు నాలుగుసార్లు ప్రతిధ్వనించింది. అయినా అతని మనసు శాంతించలేదు. ముప్ఫయ్యేళ్ల కఠోర శ్రమ ఫలించి కళ్లముందు నిలిస్తే ఎవరికైనా అంతే ఆనందం కలుగుతుంది మరి. పైగా ఎన్నో ఏళ్లుగా ప్రపంచం ఎదురుచూస్తున్న వైజ్ఞానిక విప్లవం అది. కేవలం కలలకో, కథలకో, సినిమాలకో పరిమితమైన ఊహ. ఇప్పుడు దండపాణి పుణ్యమాని వాస్తవం అయ్యింది. దాని పేరు - టైమ్ మెషీన్.

ముప్ఫై యేళ్ల క్రితం ఇలాంటిది సాధ్యమేనని దండపాణి చెప్తే అందరూ ఎద్దేవా చేశారు. ఇదే ధ్యాసలో పిచ్చివాడయ్యాడని ఉద్యోగంలోంచి తీసేశారు. పిచ్చి కుదరాలని పెళ్లి చేశారు. అయినా ముదిరిందని మందులు, మాకులు, పాకులు ఇప్పించారు. శాంతియాగాలు, భూతవైద్యాలు చేయించారు. అన్నింటినీ సహించాడు దండపాణి. తాతలు సంపాదించిన ఆస్తి మొత్తం ధారపోసి తన ఇంటిపైన రెండు గదులూ ఒక ఖార్ఖానా చేసి, ఎలాగైతేనేం చివరికి కనుక్కున్నాడు. ఆ ఆనందంలోనే గెంతుతూ అరవడం మొదలుపెట్టాడు. 'ఇప్పుడు... ఇప్పుడు అనండిరా నన్ను పిచ్చోడని.'

"ఏమిటండీ ఆ పిచ్చి కేకలు" అంది అతని భార్య సక్కుబాయి లోపలికి వస్తూ.

గాలి తీసిన బెలూన్‌లా, పంక్చర్ అయిన టైరులా ఆనందం అంతా జారిపోయి నిలబడ్డాడు దండపాణి.

"మీ పిచ్చికి ఇప్పటికే చుట్టుపక్కలవాళ్లు మెంటల్ హాస్పిటల్‌కి కంప్లైంట్ ఇస్తామంటున్నారు. ఈ గోలకి పోలీస్‌స్టేషన్‌కి కూడా ఇస్తారు" అంది.

"పోలీసులేమిటే! ఇదిగో ఇప్పుడు నేను కనుక్కున్న విషయం తెలిసిందంటే ప్రెసిడెంట్ ఆఫ్ ఇండియాకి ఫోన్ చేసి చెప్తారు" అన్నాడు గర్వంగా.

"అయ్యో రామా! అంత పెద్దమనిషికి చెప్పేంత తప్పు ఏం చేశారండీ?"

"తప్పు కాదే మొద్దూ. కనిపెట్టాను... ఇంతవరకూ ఎవరూ కనిపెట్టలేకపోయిన టైమ్ మెషీన్‌ని కనిపెట్టాను"

"సరే! కనిపెడితే కనిపెట్టారు. ఇంక చాలు. కిందకి రండి పోదాం."

"ఒసి నా పల్లెటూరి మొద్దూ! నేను కనిపెట్టింది ఏమిటో తెలుసా? కాలవాహకం. దీని ద్వారా మనం ఎన్ని సంవత్సరాలైనా ముందుకి, ఎన్ని సంవత్సరాలైనా వెనక్కి వెళ్లొచ్చు."

సక్కుబాయి దగ్గరగా వచ్చి ఆ మెషీన్‌ని చూసింది. "ఇదేమిటండీ మా కోటప్పకొండ జాతరలో చిన్న ప్రభలా ఉంది. దీనికి ఇంత మహత్తు ఉందా?" అంది ఆశ్చర్యంగా.

"మరి ఏమనుకున్నావు?" అన్నాడు.

"అయితే ఒక పని చేసిపెట్టరూ? ఇస్తరాకులు సీరియల్‌లో ఆ పంకజాక్షికి తన రెండో మొగుడికి నాలుగో పెళ్లాం ఉందన్న సంగతి తెలుస్తుందా? తెలియదా? కొంచెం చూసి చెప్తారూ" అంది బతిమిలాడుతూ.

"ఒసే సక్కూ! ఇంత కష్టపడి కనిపెట్టింది ఈ ఇస్తరాకులు, ఇనపరేకులు సీరియల్స్ గురించి తెలుసుకోవడానికి కాదు. దీంతో నేను సాధించాల్సింది చాలా ఉంది. నువ్వు కిందకి వెళ్లి ఆ సీరియళ్లు చూసుకో. నేను ఈ మెషీన్ ఎక్కి అలా షికారుకి వెళ్లొస్తాను" చెప్పాడు దండపాణి.

"షికారా? నేనూ వస్తానండీ. ఎప్పుడో పెళ్లయిన రెండు నెలలకి సైన్స్ మ్యూజియమ్‌కి తీసుకెళ్లారు. మళ్లీ ఇప్పటికి వింటున్నాను షికారనే మాట. నన్నూ తీసుకెళ్లండి" అంటూ బతిమిలాడింది ఆమె.

"ఏమిటే! నేనేమన్నా బిగ్‌బజార్‌కి వెళ్తున్నానా? కాలంలోకి ప్రయాణం... భవిష్యత్తులోకి వెళ్లి..." అతను చెప్పకముందే అందుకుంది సక్కుబాయి.

"మీరు తీసుకెళ్తారని అనుకోవడమే తప్పు. అన్నట్టు రాత్రి భోజనానికి వస్తారా? ఏం వండమంటారు?"

ఏం చెప్పాలో తెలియక తలబాదుకున్నాడు దండపాణి. "నేను ఏదో ఒకటి తింటాలే గానీ నువ్వు జాగ్రత్తగా పడుకో. నేను ఇలా వెళ్లిన సంగతి ఎవరితో అనకు" చెప్పి టైమ్ మెషీన్‌లోకి ఎక్కాడు.

"సరే! వచ్చేటప్పుడు చంటాడికి ఏమన్నా తీసుకురండి."

దండపాణి టైమ్ మెషీన్ ఎక్కి కూర్చున్నాడు. ఎక్కడికి వెళ్లాలి? ముందుకా? వెనక్కా?

'వెనక్కి వెళ్లి ఇందిరాగాంధీనో, బాపూజీనో చూసి వస్తే ఎలా ఉంటుంది?' అనుకున్నాడు. 'అంత దూరం వెళ్లి ఊరికే చూసిరావడం ఎందుకు? ఫలానా వాళ్లు ఫలానా తేదీన వాళ్లని చంపబోతున్నారని

చెప్తే పాపం జాగ్రత్త పడతారు కదా?' అని మరో ఆలోచన వచ్చింది.

'తీరా వెళ్లి చెప్పిన తర్వాత పిచ్చివాడని తీసిపారేస్తారేమో' అని అనుమానం వచ్చింది. 'అసలు నీకు ఇదంతా ఎలా తెలుసు అని అనుమానించి లోపల వేసి కుళ్లబొడుస్తారేమో' అని భయం వేసింది.

'ఇదంతా కాదు. వెనక్కి వెళ్లడం కన్నా ముందుకి వెళ్లడమే కరెక్ట్. ఈ ప్రపంచాన్ని సాంకేతికంగా ముందుకు నడిపించే యంత్రం కనుక్కున్నాను కాబట్టి, నేను ముందుకే వెళ్తాను' అనుకున్నాడు స్థిరంగా.

'రాబోయే కాలంలో ఎలాంటి మార్పులు సంభవించబోతున్నాయో కనిపెట్టవచ్చు. అసలు ఇలాంటి పరికరం ముందు ముందు ఎలా ఉపయోగపడుతుందో తెలుసుకోవచ్చు. ఇలాంటి మెషీన్ కనిపెట్టినందుకు తనకు ఎంత పేరు వచ్చిందో కళ్లారా చూసి రావచ్చు' అంటూ ఉత్సాహపడ్డాడు.

మెషీన్‌లో బటన్లు నొక్కి, 2032 అని సంవత్సరం నొక్కాడు. ఒక్కసారి అన్నీ సక్రమంగా ఉన్నాయో లేదో చూసుకుని అసలైన ఎర్ర బటన్ నొక్కాడు. టైమ్ మెషీన్ మాయమయ్యింది.

• • •

ప్రపంచం మొత్తం మారిపోయింది. ఇరవై ఏళ్లలో అనుకున్నదాని కన్నా ఎక్కువ అభివృద్ధి జరిగినట్లు తెలుస్తోంది. చిన్న చిన్న ఇళ్ల స్థానంలో పెద్ద పెద్ద సౌధాలు ఉన్నాయి. చిన్న చిన్న గుడిసెలు ఉండాల్సిన చోట 'ఈ స్థలం ఫలానా ఎం.ఎల్.ఎ.కి చెందును' అని రాసిన బోర్డులు కనిపించాయి. రోడ్ల నిండా గుంతలు. కార్లు విపరీతంగా పెరిగిపోయాయి. కాలుష్యం ప్రమాద స్థాయి లోను, పర్యావరణం పతనావస్థలోను ఉన్నట్టు గుర్తించాడు. ఊరంతా తిరిగి సంభ్రమంగా చూశాడు.

రాబోయే కాలాన్ని అతి దగ్గరగా చూసే అవకాశం తనకి మాత్రమే వచ్చినందుకు సంతోషించాడు. పేపర్లో అచ్చులో వార్తల బదులు కదులుతున్న బొమ్మలు కథలు చెప్పడం చూశాడు. టీవీకి, పేపరుకు అంటు కడితే పుట్టిన కొత్త పరికరం కాబోలని ఆశ్చర్యపోయాడు. అయితే వార్తల్లో పెద్ద మార్పేమీ లేదని గ్రహించాడు. నేరం చేసినట్టు రుజువైనా రాజ్యమేలుతున్న నాయకుల గురించి, చంద్రమండలంలో జరిగిన ల్యాండ్ మాఫియా గురించి తెలుసుకున్నాడు. డెబ్బై యేళ్ల హీరో పదహారేళ్ల హీరోయిన్‌తో పాటలు పాడుతూ వేసిన స్టెప్పులను చూశాడు. రోబోలతో వివాహాలు ఎక్కువైపోతున్నాయని సంసారాల శాఖమంత్రి చేసిన ప్రకటన గురించి చదివాడు. అన్ని సంవత్సరాలైనా బాబాలను, పరుగెత్తే రైళ్లను, కార్లను, దానివల్ల పెరిగిపోయిన ప్రమాదాలను గమనించాడు. తిరిగి వెళ్లిన తరువాత అందరితో చెప్పాలని ఒక పుస్తకంలో రాసుకున్నాడు. ఆ తరువాత ఆకలేస్తే దగ్గర్లో కనపడ్డ రెస్టారెంటుకు వెళ్లాడు. సర్వర్ వచ్చి ఏదో మెషీన్‌తో దండపాణిని పైనుంచి కిందదాకా తనిఖీ చేశాడు. ఆ తరువాత వినయంగా నమస్కరించి,

**"అదేమిటే...**
**నాకోసం ఎదురు**
**చూడటం ఏమిటి?**
**అప్పటినుంచీ నేను**
**తిరిగి రాలేదా? నన్ను**
**ఆఖరుగా ఎప్పుడు**
**చూశావు?" అడిగాడు**
**దండపాణి.**

''సార్! మీకు షుగర్ లెవెల్స్ ఎక్కువగా, హార్ట్ బీట్ తక్కువగా ఉన్నాయి. అందువల్ల...'' అన్నాడు సర్వర్.

''ఇదేమిటి? హోటల్ అనుకుని హాస్పిటల్‌కి వచ్చానా?''

''లేదు సార్. మీ ఆరోగ్యం సంగతి తెలిస్తే కదా, మీకు ఎలాంటి ఫుడ్ పెట్టాలో తెలిసేది. మీకు ఉన్న రోగాలకి చక్కెర వెయ్యని డ్రింకు, ఉప్పు వెయ్యని పచ్చికూరలు, యమహో వారి ప్యాకేజ్డ్ కాకరకాయ జ్యూస్ ఇవ్వగలం. మీకు ఇష్టమైతే చెప్పండి'' అన్నాడు అతను.

మనిషి ఆరోగ్యం స్పర్శమాత్రంగా తెలుసుకునే ఆ మెషీన్ ఏమిటో తెలుసుకోవాలని అనుకున్నాడు. అయితే తనకి ఇష్టమైనవి తిననీయకుండా, రోగిష్టివాడికి పథ్యం ఇస్తున్నట్టు పెట్టే తిండి తినాలని అనిపించలేదు. సరిగ్గా అప్పుడే అతనికి భార్య సక్కుబాయి గుర్తుకువచ్చింది.

''ఎలా ఉందో, ఏం చేస్తోందో, నా ఇల్లు ఎలా ఉందో, అసలు తను ఇప్పుడు ఎంత ముసలాడు అయిపోయాడో'' లాంటి ప్రశ్నలకు సమాధానం తెలుసుకోవాలని అనిపించింది. వెంటనే తన ఇల్లు ఉండాల్సిన చోటుకి వెళ్లాడు.

ఇల్లు అక్కడే ఉంది. దాదాపు ఇరవై ఏళ్ల క్రితం చూసిన ఇల్లు ఇప్పటికీ అలాగే ఉండటం చూసి ఆశ్చర్యపోయాడు. కొంచెం రంగులు వెలిసిపోయాయంతే. ఇంతకాలం ఏ కబ్జాదారుడి కన్నూ దానిమీద పడకపోవటమే ఆశ్చర్యంగా అనిపించింది. కాలింగ్ బెల్ నొక్కాడు.

'ఎవరదీ?' అంటూ వచ్చింది ఒక ముసలామె. ఆమెను చూడగానే పెద్దగా నవ్వటం మొదలుపెట్టాడు దండపాణి.

''ఎవరండీ మీరు? ఎందుకు నవ్వుతున్నారు?'' అడిగిందా ముసలామె.

''ఒసేయ్ సక్కుబాయ్! నేనే దండపాణిని.''

ఆమె కళ్లలో ఆశ్చర్యం చూసి ఇంకా నవ్వు వచ్చిందతనికి. సక్కుబాయి కాస్సేపు స్తబ్దుగా ఉండిపోయింది. ఆ తరువాతే మొదలైంది -

''చచ్చినోడా! ఎందుకు వచ్చావు? నేను బతికే ఉన్నానో లేదో అని చూడటానికి వచ్చావా?'' అంది నిష్ఠూరంగా.

''అదేమిటి అలా అంటావు. నేను నీతో లేనా? నేను నువ్వు అనుకుంటున్న నేను కాదు. ఇరవై ఏళ్ల క్రితం నుంచి టైమ్ మెషీన్ ఎక్కి వచ్చాను'' చెప్పాడతను.

ఆమె తల కొట్టుకుంది.

''ఇంకా ఆ విషయాలే మాట్లాడుతున్నారా? నా ఖర్మ!!''

''ఇందులో తప్పేముందే. అప్పుడు ఎప్పుడో ఎక్కాను. ఇక్కడ దిగాను. అందుకే నీకన్నా వయసులో అందంగా ఉన్నాను'' కాలర్ ఎగరేస్తూ చెప్పాడతను.

''ఎందుకు ఉండవూ! నీకోసం ఎదురుచూసి చూసే కదా నేను ఇలా తయారయ్యాను'' అందామె.

''అదేమిటే... నాకోసం ఎదురు చూడటం ఏమిటి? అప్పటినుంచీ నేను తిరిగి రాలేదా? నన్ను ఆఖరుగా ఎప్పుడు చూశావు?'' అడిగాడు దండపాణి.

''ముదనష్టపోడా! అప్పుడెప్పుడో ఇరవై ఏళ్ల క్రితం రాత్రికి భోజనానికి వస్తానని వెళ్లావు. నేను నీకోసం గోంగూర పచ్చడి చేసి ఎదురుచూస్తూ కూర్చున్నా'' గుర్తుతెచ్చుకుంటూ అంది సక్కుబాయి.

''అంటే ఆ తరువాత మళ్లీ నేను

కనిపించలేదా?'' ఆశ్చర్యంగా అడిగాడు.
''ఎక్కడా? మళ్లీ ఇప్పుడే కదా కనిపించావు'' అంది కొంచెం బాధగా.
''అదేమిటీ? నేను ఇప్పుడే ఇరవై ఏళ్లు వెనక్కి వెళ్లి, నేను ఎందుకు తిరిగిరాలేదో కనుక్కుంటాను'' అంటూ కదలబోయాడు.
అప్పుడు చెయ్యి పట్టుకుని ఆపింది సక్కుబాయి. ''ఇదుగో ఆ దిక్కుమాలిన మెషీన్ దగ్గరకు మళ్లీ వెళ్లారా, మిమ్మల్ని చంపి నేనూ చస్తాను'' అంది ఆవేశంగా.
''అదేమిటే! అప్పట్లోకి వెళ్తే కదా అసలేం జరిగిందో తెలిసేది. నీకర్థం కాదు కానీ, ఒక్క గంట ఓపిక పట్టు. అలా వెళ్లి ఇలా వచ్చేస్తాను'' అంటూ చెయ్యి విడుల్చుకోబోయాడు. ఆమె పట్టు వదలలేదు.
''ఆ దరిద్రపుగొట్టు మెషీన్ అప్పుడు ఎక్కిపోయ్యావు మళ్లీ రావడానికి ఇరవై ఏళ్లు పట్టింది. మళ్లీ వెళ్లావంటే నేను చచ్చిన తరువాత కానీ రావు. నేను వెళ్లనివ్వంతే.''
''ఇదెక్కడి గోలే సక్కూ! నీకు అర్థం కావటం లేదు. నేను ఇప్పుడు వెళ్తేనే నువ్వు చేసిన గోంగూర పచ్చడి తినేది. నీకు ఎదురుచూపులు తప్పేది'' వివరించడానికి వృథా ప్రయాస చేశాడు దండపాణి.
సక్కుబాయి కాస్త మెత్తబడ్డట్టే అనిపించింది.
''సరే ముందు ఇక్కడ కూర్చోండి'' అంటూ కుర్చీ చూపించింది. దండపాణి కూర్చోగానే పడుగులాంటి నడకతో బయటికి వెళ్లి బయట నుంచి గడియ వేసేసింది. జరిగింది దండపాణి అర్థం చేసుకునే లోపల తన ఇంట్లోనే బందీ అయిపోయాడు.
''సక్కూ! ఇదేమిటే. ఇలా బంధించావు? ముందు తలుపు తీ'' అన్నాడు కిటికీ దగ్గరకు వచ్చి.
''తలుపు తీయాలేం తలుపు?... ఉండండి. ఆ దిక్కుమాలిన మెషీన్ని నాశనం చేస్తేగాని మీరు బుద్ధిగా ఉండరు'' అంటూ పెరటి మొక్కల దగ్గర ఉన్న గునపం తీసుకుని టైమ్ మెషీన్ దగ్గరకు పరుగెత్తింది.
''వద్దే! నా మాట విను. ఆ మెషీన్ పాడుచేస్తే మళ్లీ నేను వెనక్కి పోలేను. మళ్లీ అది తయారుచేసేందుకు నా దగ్గర నోట్స్ కూడా లేదు. వద్దే. వద్దెటూరి మొద్దు'' అరుస్తూనే ఉన్నాడు దండపాణి. అప్పటికే సక్కుబాయి టైమ్ మెషీన్ పగలగొట్టడం మొదలుపెట్టింది.

# అభినవ పారిజాతాలు



**వానమామలై శతపద్య పారిజాతాలు**
**రచన: డా॥ తిరుమల శ్రీనివాసాచార్య**
పేజీలు: 134; వెల: ₹ 80
ప్రతులకు: ప్రముఖ పుస్తక కేంద్రాలు

అభినవ పోతనగా వాసికెక్కిన వానమామలై వరదాచార్యులు రాసిన తొమ్మిది కావ్యాల్లోని 108 పద్యాలను ఎన్నుకుని వాటిని 'శతపద్య పారిజాతాలు'గా తలచి వ్యాఖ్యానించారు డా॥ తిరుమల శ్రీనివాసాచార్య.
వానమామలై కలం నుండి జాలువారిన 'సూక్తి వైజయంతి, స్తవరాజ పంచశతి, పోతన చరిత్రము, ఆహ్వానము, మణిమాల, జయధ్వజం, వైశాలిని, విప్రలబ్ధ, కూలిపోయే కొమ్మ' వంటి కావ్యాల్లోని పద్యాలు ఇందులో చోటుచేసుకున్నాయి. అన్నమయ్య ఆధ్యాత్మిక భావనతో సరితూగేలా అభినవ పోతన రచన కొన్నిచోట్ల సాగింది. పద్య వృత్తాలతో పాటు వాటిలోని అలంకారాలను సైతం పేర్కొనడం విశేషం. వానమామలై కవిత్వం అంటే అభిమానమున్నవారందరినీ ఈ పరిమళ వ్యాఖ్య అలరిస్తుంది. తెలుగుపై మమకారం ఉన్నవారందరినీ ఆకట్టుకుంటుంది.

• ప్రదీప్

# అమృతధార



**అమృతధార- ఖడ్గధార**
**(నిసర్గదత్త మహరాజ్ బోధ)**
**రచన: నీలంరాజు లక్ష్మీప్రసాద్**
పుటలు: 108, వెల: ₹ 80
ప్రతులకు: రచయిత
91/3, ఆర్.టి., విజయనగర్ కాలనీ
హైదరాబాద్- 500 057

బొంబాయి నగరంలోని ఖేట్‌వాడిలో జన్మించిన నిసర్గదత్త మహరాజ్... ఒక సామాన్య వ్యాపారిగా జీవించి, బీడీబాబాగా పేరొంది, ఆధ్యాత్మికవేత్తగా ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందారు. ఆయన చేసిన ప్రసంగాల గురించి, ముముక్షువులు ఆయనను వేసిన ప్రశ్నలు- ఆ ప్రశ్నలకు బాబా ముక్కుసూటిగా, పదునుగా ఇచ్చిన సమాధానాలను గురించీ ఈ పుస్తకంలో సవివరంగా చదవవచ్చు.

• డి.వి.ఆర్. భాస్కర్

కొరుకుడు పడని కఠోర ఆధ్యాత్మిక సత్యాలను సైతం అరటిపండు వొలిచినట్టుగా చెప్పడంలో అందె వేసిన చేయి నీలంరాజు లక్ష్మీప్రసాద్.
దాదాపు నూట పదిహేనేళ్ల క్రితం

## ● ఎక్నాలెడ్జ్‌మెంట్

**మహిళల సాంస్కృతిక వికాసం**
**సంపాదకులు: మద్దాళి రఘురామ్**
పుటలు: 144, వెల: ₹ 100
ప్రతులకు: అన్ని ప్రముఖ పుస్తక కేంద్రాలు

**శ్రీ లక్ష్మీనరసింహ శతకము**
**రచన: ద్యావరి నరేందర్ రెడ్డి**
పేజీలు: 40; వెల: అమూల్యం
ప్రతులకు: రచయిత, 5-5-27/1, ధనుర్‌గల్లి, తాండూర్, రంగారెడ్డి

**పూతరేకులు (జోకులు)**
**రచన: సుధామ**
పేజీలు: 58; వెల: ₹ 50
ప్రతులకు: ప్రముఖ పుస్తక కేంద్రాలు

**జగద్గురు ఉపదేశామృతము**
**ఆంగ్లమూలం: సురేష్ చంద్ర**
**ఆంధ్రానువాదం: తుమ్మలపల్లి హరిహరశర్మ**
పుటలు: 176, వెల: ₹ 50
ప్రతులకు: శ్రీశ్రీజగద్గురు శంకరాచార్య మహాసంస్థానం, దక్షిణామ్నాయ శ్రీ శారదాపీఠం, శృంగేరి- 577 139

**నిప్పులగ చెప్పుండ?(కవిత్వం)**
**రచన: దంతోజు అశోకాచారి**
పేజీలు: 81; వెల: ₹ 30
ప్రతులకు: డా. బీంపల్లి శ్రీకాంత్ ఇంటినం. 8-5-38, టీచర్స్ కాలనీ, మహబూబ్‌నగర్- 509 001

**కోవెల దీపాలు**
**రచన: గరికపర్తి శ్యామల**
పుటలు: 67; వెల: ₹ 50
ప్రతులకు: ప్రముఖ పుస్తక కేంద్రాలు

● ఆదర్శం

# ‘పులుల’గురువు

**వాళ్లు ఆడపిల్లలు. ఇంకా చెప్పాలంటే పులిపిల్లలు! దురదృష్టం కొద్దీ మానసికవైకల్యం బారినపడ్డారు. వీరిని బాగు చేసుకునేందుకు తల్లిదండ్రులు నానా తంటాలూ పడుతున్నారు. అంతకంటే ఎక్కువగా ఒక సామాన్యుడు ఈ పిల్లల కోసం తపిస్తున్నాడు. తనకు పట్టుబడిన జానపదకళారూపమైన పులివేషాన్ని నేర్పించి వారి బుద్ధిమాంద్యాన్ని తగ్గించేందుకు పాటుపడుతున్నాడు. అహోరాత్రాలు అదే ధ్యాసగా శ్రమిస్తున్నాడు.**



పిల్లలకు పులి ఆట నేర్పుతున్న గోవిందరెడ్డి

మేరిగి గోవిందరెడ్డి నలభై ఎనిమిదేళ్ల కిందట వైజాగ్ రేసపువాని పాలెంలో పుట్టాడు. తల్లిదండ్రులు సరోజిని, వెంకట రెడ్డి. మున్సిపల్ స్కూల్లో టెన్త్‌వరకూ చదివాడు. బాల్యంనుంచే ఇతడికి పులి వేషాలంటే పిచ్చి. ఇంటి పక్కనే భూలోకమాంబ ఆలయం. ఇక్కడ ఏ ఉత్సవం జరిగినా వేషం కట్టేవాడు. ఒళ్లంతా పసుపు రంగు రాసుకోవడం, నల్లటి చారలు గీసుకోవడం, తోక తగిలించుకోవడం, పులి బుర్ర పెట్టుకోవడం, ఆడటం. జనం జేజేలు పలికేవారు. అలా ఈ వేషాల పోటీకి న్యాయనిర్ణేత స్థాయివరకూ ఎదిగాడు. పెళ్లయింది. శిరీష, సురేష్, శ్యామల పుట్టారు. వారికీ పులి ఆట నేర్పించాడు. అయితే ఒక్కగానొక్క కొడుకు సురేష్ మూగ బధిర బాలుడయ్యేసరికి మనస్తాపం మొదలైంది. పిల్లాణ్ణి తీసుకుని ఆసుపత్రులకు తిరిగాడు. కొంతలో కొంత బాగుపడ్డాడు. టెన్త్ వరకూ చదివించడంతో ఈ అబ్బాయికిప్పుడు చిన్నపాటి ఉద్యోగం కూడా దొరికింది.

**తర్వాత?**

కన్నకొడుకు అంగవైకల్యం గోవిందరెడ్డిలో మార్పు తీసుకువచ్చింది. ఎందరెందరో శ్రమిస్తేనే ఈ బిడ్డ ఒక దారికొచ్చాడనే భావన బాగా నాటుకుంది. ఇందువల్ల తాను కూడా అంగవికలురకు సాయపడాలన్న నిర్ణయానికొచ్చాడు. తనకు చేతనయిన పులివేషాన్ని వారికి నేర్పించదలిచాడు. ''ఈ వేషం కట్టడం చాలా మంచిదండీ. ఒంట్లో కీళ్లన్నీ కదలాలి. డప్పు చప్పుళ్లకు అనుగుణంగా అడుగులు వేయాలి. వాస్తవానికి ఇదో చక్కని కసరత్తు. కాసేపయినా సరిగ్గా చేయగలిగితే చాలు. గ్రామాల్లో పాత తరానికి చెందిన కొందరు ఇప్పటికీ గట్టిగా ఉన్నారంటే మన సంస్కృతిలో భాగమైన పులివేషాలను నేర్వడం వల్లనే'' అంటాడు గోవిందు. ఇంతటి ఆరోగ్యప్రదాయిని అయిన ఈ వేషాన్ని ఒక చికిత్సావిధానంగా మార్చేందుకు గోవిందు పెద్ద ప్రయత్నమే చేశాడు. నిపుణుల, వైద్యుల సలహాలు తీసుకున్నాడు. బుద్ధిమాంద్యం గల పిల్లల శారీరక, మానసిక స్థితిగతులను, పటుత్వాన్నీ ఆకళింపు చేసుకున్నాడు. ''మానసిక వికలాంగుల్లో మెదడును, చెవిని కలిపే నరాలు దెబ్బతింటాయి. వాటిలో శక్తి నింపాల్సి ఉంటుంది. ఇందుకు నాదం ప్రధానం. డప్పుమోతలు శ్రవణేంద్రియాల్లోకి చేరగానే పిల్లలు స్పందించగలుగుతారు. మెదడు మెరుగైన సంకేతాలను ఇవ్వగలుగుతుంది. అలాగే నేత్రాలు కూడా. పసుపు పచ్చని కాంతివంతమైన రంగును ఒళ్లంతా పూసుకుని నృత్యం చేస్తారు గనుక కంటి చూపుమెరుగవుతుంది. అన్నింటికీ మించి వారికి కూడా కొంత వ్యాయామం, ఫిజియోథెరపీ అవసరం. ఈ ఆటను మానసిక వికలాంగులు బాగా ఎంజాయ్ చేస్తారు కూడా'' అంటాడీ పులివేషాల గురువు.

**రుణానుబంధం**

గోవిందరెడ్డి విశాఖపట్నంలోని వికలాంగులకు శిక్షణనిచ్చే పాఠశాలల చుట్టూ తిరిగాడు. పిల్లలను ఎంపిక చేసుకున్నాడు. ఇరవయ్యేళ్లుగా దాదాపు వంద మందికి పులివేషాల్లో శిక్షణనిచ్చాడు. గడచిన ఆయిదేళ్ల నుంచీ మానసికంగా ఎదగని బాలికలకు కూడా తర్ఫీదునిస్తున్నాడు. ''ఆడపిల్లల శరీరతత్వానికి, హార్మోన్ల సమతౌల్యానికి ఎక్సర్‌సైజులు చేయాల్సి ఉంటుంది. అంగవికలురైన పిల్లల్లోనూ ఆడ మగ తేడాలు చూసే పద్ధతి కొంతవరకూ ఉంది. ఈ ఆలోచనావిధానాన్ని మార్చాలి. ఈ విషయంలో లెపెన్స్‌హిల్స్ పాఠశాల యాజమాన్యం అందిస్తున్న సహకారం మరువలేనిది. ఏదో జన్మలో ఆమాయకమైన ఈ పాపలకి నేను తోబుట్టువునయ్యుంటాను. వీళ్లలో కొందరు నన్ను డాడీ అంటుంటారు. కొందరు మమ్మీ అంటుంటారు. ఇదంతా రుణానుబంధమే''... కన్నీటితెర కమ్మేయగా చెప్పుకొచ్చాడు.

**అదే పరమార్థం**

పులివేషం కోసం ఒళ్లంతా పూసుకునే పసుపురంగు వార్నిష్ ప్రమాదకరమైనది. అందుకే పులి చారల దుస్తులను ప్రత్యేకంగా తయారు చేయించాడు గోవిందరెడ్డి. ఇతడి శిక్షణ కేంద్రానికి వెళితే బుజ్జిబుజ్జి పులిపిల్లలు చాలా కనిపిస్తాయి. అవి మానసికంగా ఎదగకపోవచ్చు. కానీ నాదం వినగానే లయబద్ధంగా చిందులు వేస్తాయి. తోకలూపుకుంటూ తల్లిపులి చుట్టూ తిరుగాడే బుల్లి పులుల్లా గోవిందుణ్ణి అంటిపెట్టుకుంటున్నాయి. ఆచార్య దేవోభవ అనే మాటకు అర్థమై నిలుస్తున్నాయి.

● డా॥ చింతకింది శ్రీనివాసరావు

**ఆ అమ్మాయి ముద్దబంతి పువ్వు. ఆనందం ఆరబోసినట్టుంటుందామె నవ్వు. కథానాయిక అందంగా ఉండడం సినీలోకంలో కొత్త కాకపోయినా ఆనందమే అందం అని నిరూపించేలా కనిపించడం కాస్త విశేషమే. అందుకే... ఆమెను చూసి దక్షిణాది ప్రేక్షకులు ముద్దుగుమ్మవంటూ ముచ్చటపడ్డారు. ఆకట్టుకున్నావంటూ ఆదరించారు. స్వల్పకాలంలోనే అందరికీ తమ ఇంటి అమ్మాయిలా అనిపించిన ఆ పక్కింటమ్మాయి ఇప్పుడు 'కనబడుటలేదు'. 'మల్లీశ్వరివే మధురాశల మంజరివే' అంటూ కుర్రాళ్లు మళ్లీ మళ్లీ పాడేలా చేసిన ఆమె మళ్లీ రాదా?**



# మల్లీశ్వరివే... మళ్లీ కనిపించవే...

కేరళ కొబ్బరిదే కాదు... సంప్రదాయపు సిరులొలికించే అందమైన అమ్మాయిలకూ కేరాఫేమో అనిపిస్తుంది గోపికను చూస్తే. కేరళలోని త్రిస్సూర్‌లో ఉన్న వల్లూర్... గిర్లీ ఆంటో (గోపిక అసలు పేరు) జన్మస్థలం. ఆంటో ఫ్రాన్సిస్, టెస్సీ ఆంటోల ఇద్దరు కూతుర్లలో ఒకరామె. సెయింట్ రాఫెల్ స్కూల్లో 12వ తరగతి చదివి, కాలికట్ యూనివర్సిటీలో సోషియాలజీ పూర్తి చేసుకుంది. సరదాగా పార్టిసిపేట్ చేసిన తొలి బ్యూటీ పెజెంట్‌లోనే మిస్ కాలేజ్‌గా సెలెక్టయింది. ఆ స్ఫూర్తితో మిస్ త్రిస్సూర్ టైటిల్‌నూ గెలిపెట్టింది. ఫస్ట్ రన్నరప్‌గా నిలిచి, టైటిల్ విజేత కన్నా మిన్నగా బోలెడు మోడలింగ్ అసైన్‌మెంట్లలోకి... అలా అలా సినిమాల్లోకి వచ్చేసింది. ''సినిమా ఎప్పుడూ నా కెరీర్ ప్లానింగ్‌లో లేదు. ఎయిర్‌హోస్టెస్ కావాలనుకున్నాను. అనుకోకుండా సినీ నటిని అయిపోయాను'' అంటుంది గోపిక.

**సోతిందియా... వలచిందయా!**

మలయాళ సినిమా 'ప్రణయ మానితూవల్' ద్వారా గోపిక సినీరంగానికి పరిచయమైంది. అందులో ఆమెను చూసి యువకులు మధురమైన ఊహల్లో తేలిపోయారు. రెండో సినిమా '4 ది పీపుల్' (యువసేన) ఆమెను సక్సెస్‌ఫుల్ తారగా మార్చేసింది. అందులోని 'లజ్జావతియే (మల్లీశ్వరివే)' పాట ఆమెను యువ అభిమానుల్ని అమాంతం పెంచేసింది. ఆ తర్వాత ఒకదాని వెంట ఒకటిగా దూసుకొచ్చిన అవకాశాలతో మలయాళం, తమిళం, తెలుగు భాషల్లో బిజీ నటిగా మారింది. ఎన్నో బాక్సాఫీస్ హిట్స్ కొట్టింది. తెలుగులో రవితేజకు 'స్వీట్ మెమొరీస్' అందించాక, లేత మనసులు, వీడు మామూలోడు కాదు, వీధి తదితర చిత్రాల్లో నటించింది. మూడు ఆసియా నెట్ అవార్డులు, ఒక ఫిల్మ్‌ఫేర్ అవార్డును దక్కించుకుంది. దాదాపు 30 సినిమాల్లో మెరిసి, ఐదేళ్లలోనే ఇన్ని సాధించి, ఒక్కసారిగా ఎందుకు తెరమరుగైంది?

**వివాహంతో వెండితెరకు గుడ్‌బై...**

తక్కువ కాలమే సినిమారంగంలో ఉన్నా చాలావరకూ మంచి సినిమాల్లోనే నటించింది గోపిక. అవార్డ్స్‌తో, బాక్సాఫీస్ హిట్స్‌తో కెరీర్ విజయవంతంగా సాగిపోతున్న దశలోనే అజిలేష్ చాకో అనే నార్తర్న్ ఐర్లాండ్‌కు చెందిన వైద్యుడిని పెళ్లాడింది గోపిక. అప్పుడే సినీ రంగం నుంచి దూరంగా వెళ్లింది. ఆ దూరాన్ని కంటిన్యూ చేస్తూ దాదాపు నాలుగేళ్లుగా ఐర్లాండ్‌లోనే నివసిస్తోంది. మంచి స్క్రిప్ట్, పాత్ర లభిస్తే పెళ్లయిన తర్వాత కూడా నటిస్తానని ప్రకటించినప్పటికీ వివాహానంతరం ఒక సినిమా మాత్రమే చేసింది. ప్రస్తుతం గోపికకు రెండేళ్ల వయసున్న కూతురు అమీ ఉంది. భర్తతో, కూతురితో హాయిగా, ప్రశాంతంగా జీవిస్తోన్న గోపిక... తన పునరాగమనం గురించి మాత్రం నోరు విప్పడం లేదు. రానని, వస్తానని చెప్పకుండా సస్పెన్స్ మెయిన్‌టెయిన్ చేస్తోంది.

అభినయ ప్రాధాన్యమున్న పాత్రల్లో నటించి మెప్పించిన గోపిక... సినిమారంగం అంటే స్కిన్‌షో మాత్రమే అనుకుని దూరంగా జరిగిపోయే అమ్మాయిలకు స్ఫూర్తినిచ్చే నాయిక. మరోసారి సిల్వర్ స్క్రీన్ ద్వారా మనల్ని పలకరించినా పలకరించకపోయినా... మన స్వీట్ మెమొరీస్‌లో ఆమె ప్లేస్ పదిలమనేది నిస్సందేహం.



తమ చిన్నారితో గోపిక, అజిలేష్

● ఎస్.సత్యబాబు

ఇంటర్వ్యూ

నెగిటివ్ పాత్రలకు మహతి పెట్టింది పేరు. నిర్లక్ష్యమైన చూపులతో, క్రూరమైన హావభావాలతో కూడా ప్రేక్షకుల్ని తెరకు కట్టి పారేయొచ్చని నిరూపించారామె. కానీ తెరవెనుక ఆమె చాలా సౌమ్యురాలు. అందరికీ సేవ చేయాలని తపిస్తారు. అందుకోసం ఏవేవో పథకాలను రూపొందిస్తుంటారు. తన కెరీర్ గురించి, తన లక్ష్యాల గురించి ఆమె చెబుతున్న కబుర్లు...



# కనిపిస్తే తిడుతున్నారు!

**కెరీర్ ఎలా మొదలైంది?**

ఓసారి రామోజీ ఫిల్మ్ సిటీకి వెళ్తే, ప్రియాంక షూటింగ్ జరుగుతోంది. అక్కడ నిలబడి చూస్తుంటే, ఆ సీరియల్ టీమ్ నా దగ్గరకు వచ్చి 'నటిస్తావా' అని అడిగారు. నేను సరే అనడంతో ఆడిషన్ చేశారు. నేను సెలక్టవ్వడం, అదే సీరియల్లో నాకో పాత్రను ఇవ్వడం నేను ఊహించనంత వేగంగా జరిగిపోయాయి.

**అంతే తప్ప, నటి కావాలన్నది మీ కోరిక కాదా?**

భలేవారే. మొదట్నుంచీ నటన అంటే పిచ్చి నాకు. మాది వరంగల్ జిల్లా పెంచికల్ పేట. చిన్నప్పుడు స్కూల్లో నువ్వు ఏమవుతావని టీచర్లు అడిగితే... అక్క టీచర్ అనేది, అన్నయ్య పోలీస్ అనేవాడు. నేను మాత్రం హీరోయిన్ అనేదాన్ని. ఊరికి సరైన రోడ్డు కూడా లేదు, ఇక్కడ పుట్టిన ఈవిడ నటి అవుతుందట అని నవ్వేవారు.

**ఊళ్లోవాళ్లు సరే. ఇంట్లోవాళ్లు ఒప్పుకున్నారా?**

వాళ్లు ఒప్పుకోడానికి ఏమీ లేదు. ఎందుకంటే నాకు చిన్న వయసులోనే పెళ్లయిపోయింది. మావారు దుర్గాప్రసాద్ మొదట్లో వ్యాపారం చేశారు కానీ తర్వాత వి.వి.వినాయక్ దగ్గర అసిస్టెంట్‌గా చేశారు. డిగ్రీ అయ్యేనాటికే మాకు ఇద్దరు పిల్లలు. నాకు నటించే అవకాశం వచ్చింది ఇవన్నీ జరిగాకే. ఇప్పుడు నా పిల్లల్ని కూడా నటుల్ని చేయాలనుకుంటున్నాను. బాబు వాహిద్‌తో 'సూపర్‌మామ్' చేస్తున్నాను. వాడు హీరో అవుతానంటున్నాడు. పాప అఫ్సానాని సీరియల్స్‌కి తీసుకొస్తాను.

**అదేంటి, మీ పిల్లలకి ముస్లిం పేర్లు ఉన్నాయి?**

నేను ముస్లింని. నా అసలు పేరు రిజ్వానా. ఇండస్ట్రీకి వచ్చాక మావారు నా పేరు మహతి అని మార్చారు. పిల్లల అసలు పేర్లు అవయినా కార్తీక్, ఐశ్వర్య అని పిలుస్తుంటాం.

**ఎక్కువగా నెగిటివ్ పాత్రలే ఎందుకు చేస్తారు?**

నా కళ్లు, నా పర్సనాలిటీ చూసి మొదట్లో విలన్ పాత్రలు ఇచ్చారు. బాగా పండించడంతో నేను వాటికి బాగా పనికొస్తానని అందరూ ఫిక్సైపోయారు. కానీ నాకు మాత్రం విసుగొచ్చేసింది. అందుకే మొన్న 'పెళ్లినాటి ప్రమాణాలు' సీరియల్లో చేయమని అడిగితే నో అన్నాను.

**ఎందుకని... నెగిటివ్ పాత్రల్ని అందరూ పండించలేరు కదా మీలాగ?**

మొదట్లో నేనూ అలాగే అనుకున్నాను. కానీ బయటికి వెళ్తే జనం తిడుతున్నారు. కొందరైతే మర్యాదగా కూడా మాట్లాడరు. 'ఏయ్ చూడు, అది ఆ సీరియల్లో విలనే కదా' అంటుంటారు. మా అబ్బాయి కూడా 'నువ్వు పాజిటివ్ పాత్రలు చేయవచ్చు కదమ్మా. స్కూల్లో అందరూ నిన్ను తిడు తున్నారు' అని బాధగా చెబుతుంటాడు. అందుకే ఇక చేయను. మేకప్ లేకుండా, కాటన్ చీర కట్టుకుని, కడవల కొద్దీ కన్నీళ్లు కార్చే సాఫ్ట్‌పాత్ర కోసం చూస్తున్నా.



భర్త దుర్గాప్రసాద్‌తో మహతి

**ఇంతవరకూ చేసినవేవీ తృప్తినివ్వలేదా?**

అలాంటిదేం లేదు. అన్నీ మంచి సీరియల్సే చేశాను. భార్యామణి, అంతఃపురం సీరియల్స్‌కి అవార్డులు కూడా తీసుకున్నాను. భార్యామణిలో రోల్ నాకు చాలా ఇష్టం. టిప్‌టాప్‌గా తయారయ్యి, ఎప్పుడూ ఫోన్‌లో మాట్లాడుతూంటాను. స్వతహాగా నాకు బట్టలన్నా, నగలన్నా పిచ్చి. ఆ పాత్రకు కూడా హెవీ మేకప్ అవసరం కాబట్టి నచ్చినట్టు తయారవుతాను. నాలుగేళ్లుగా అందులో నటిస్తున్నా ఇంతవరకూ కట్టిన చీర కట్టలేదు తెలుసా!

**నిర్మాతగా కూడా మారినట్టున్నారు...?**

అవును. మహతి ప్రొడక్షన్స్ ద్వారా 'అత్త బంగారం కోడలు సింగారం' షో చేస్తున్నాను. మావారే దానికి దర్శకుడు.

**భవిష్యత్ ప్రణాళికలేమిటి?**

చాలా ఉన్నాయి. నేను రెండు మూడు నెలలకోసారి పేదలకు బట్టలు, ఆహారం పంపిణీ చేస్తుంటాను. ఎవరైనా నిరాశ్రయులైన వృద్ధులు కనిపిస్తే ఆశ్రమానికి తీసుకెళ్లి వదిలి పెడతాను. కానీ అలా కాకుండా నేనే ఒక ఆశ్రమం కట్టి, అలాంటివారందర్నీ అందులో ఉంచి చూసుకోవాలనుకుంటున్నాను. అంతేకాక, ఇలాంటి అభాగ్యులందరి మీదా ఓ షో ప్లాన్ చేస్తున్నాను. స్లాట్ కోసం వెయిటింగ్. అలాగే మా ఊరికి రోడ్డేయించాలి, ఆస్పత్రి కూడా కట్టించాలి. ప్రస్తుతానికింతే!

● సమీర నేలపూడి

# బందులో ప్రయాణం



రేపటికోసం బట్టలు సర్దుకుంటున్నప్పుడు... టీవీలో 'బంద్' గురించిన స్క్రోలింగ్ వస్తోంది. అయినా వెళ్లాల్సిందే. కానీ బస్సులు నడుస్తాయా?

● ● ●

ఇంకా చలి వీడలేదు. మంచులోని గొర్రెలు నగమే నిద్ర లేచాయి. హోటల్లో చాయ్ పెట్టడానికి స్టవ్ వెలిగిస్తున్నాడు. రెండు కాకులు తోవలో ఆడుతున్నాయి. మూడుపల్లి-బండ మీద నిలిచిన వినాయకుడి నుంచి పాట తేలివస్తోంది. 'ఓం సుందరం ఓంకార్ సుందరం.'

కూరగాయల ఆటో వ్యతిరేక దిశలో వెళ్తోంది. "రుద్రంగి కాడ అంగడి... కూరగాయలు అటు పోతున్నట్టున్నయ్." మెయిన్‌రోడ్డు మీదున్న వడ్కాళ్లో నన్ను 'బాంచ్' మీద దింపడానికి వచ్చాడు బావ.

ఆరు, ఆరుంపావుకల్లా యాదగిరిగుట్ట బస్సు రావాలి. అది ఎక్కి సిద్దిపేటలో దిగి, హైదరాబాద్ బస్సు ఎక్కడం ఒక ఆప్షన్. లేదూ, వేములవాడ వెళ్లి నేరుగా హైదరాబాద్ బస్సు ఎక్కేయడం మరొకటి. కానీ ఏదీ రావట్లేదు.

నాతోపాటు వస్తానన్న భాస్కర్... బంద్‌వల్ల ఇంజినీరింగ్ కౌన్సిలింగ్ వాయిదా పడిందని రావట్లేదు. జేఎన్‌టీయూ కూడా పరీక్షలో వాయిదా వేసింది. ఇవ్వాళ కచ్చితంగా ఆఫీసులో ఉండిపోవాలనుకున్నాను. మరి వెళ్తాగలనా?

"ఇవ్వాళ పోకపోతే ఏమన్నంటరా?"

"ఎట్లున్న పోవాలె బావ, వొచ్చి నాల్రోజులైందిగదా!"

కాసేపటికి కోరుట్ల బస్సు వచ్చింది. అటువైపు వెయిట్ చేస్తున్న ఇద్దరు మహిళలు- గంపావిడ, కాళ్లకు కడాలున్నావిడ- ఎక్కారు. సంఖ్యను సమం చేయడానికన్నట్టుగా ఇద్దరు మహిళలు దిగారు. చేతుల్లోవున్న ప్లాస్టిక్ డబ్బాలు, స్టీలుగిన్నెలు చూడగానే వాళ్లెవరో తెలిసిపోయింది. ఇళ్లిల్లూ తిరిగి, దువ్వెన్లో చిక్కుబడ్డాక గూట్లో పెట్టిన ఆడవాళ్ల వెంట్రుకలు కొంటారు.

యాదగిరిగుట్ట రాలేదు. వేములవాడ వచ్చింది.

"తొందరేంలేదు, మెల్లగెక్కుండ్రి," అంటూ కండక్టర్ దిగాడు. ఉన్న ఏడెనిమిదిమంది కిటికీల్లోంచి తలలు రిక్కించారు. ప్యాంటు దులుపుకుంటూ కండక్టర్ మళ్లీ బస్సెక్కాడు. 'రైట్.'

కొంగ ఒకటి పొలంలో వాలుతోంది. గూనపెంకుల ఇంట్లోని జామచెట్టుకు ముక్కురాస్తోంది బూడిదరంగు పిట్ట. గొంగళి కప్పుకున్న ముసలాయన పొలం గట్టు మీద నడుస్తున్నాడు. టేకుచెట్లు పూతకు వచ్చాయి. గోరింటలు, వట్టుకుచ్చులు పూసేదీ ఈ కాలంలోనే. కొనాయపల్లెలో వంకాయరంగు లంగాజాకెట్ అమ్మాయి ముగ్గేస్తోంది.

బస్సు దిగి, ఆటో ఎక్కి, బద్దిపోచమ్మ గుడి, రాజరాజేశ్వరాలయం దాటాక- వేములవాడ బ్రిడ్జి మీద కొందరు అమ్మాయిలు నడుస్తున్నారు. వీళ్లకివ్వాళ కాలేజీ ఉందా?

పిచ్చికవులు బాల్యాన్ని వెనక్కి అడుగుతారుగానీ, నాకైతే మళ్లీ కౌమారం కావాలి. ఆ తొలి ఉద్వేగాలు, తొలి అస్తిత్వ ప్రకటనలు... ఏమి ఆనందమది! దాని గురించి ఉత్తినే ఆలోచిస్తూ జీవితం గడిపేయొచ్చు.

● ● ●

తిప్పాపురం బస్టాండులో ప్రయాణికులతో సమానంగా పోలీసులున్నారు. యాత్రికుల్లో గుళ్లో కొట్టించిన రెండు గుండ్లు! అల్లమురబ్బా తాత తిరుగుతున్నాడు. ఎవరున్నారని అమ్ముతడే! ముగ్గురు సైనికులు లాఠీలు పట్టుకొని వచ్చారు.

"హైదరాబాద్ బండి ఒస్తుందా సర్?"

"చెప్పలేం సార్, ఏడిటి లోపట్నే రెండుమూడు ఎళ్లిపోయినై."

ఒకవేళ బయల్దేరినా మధ్యలో ఆపేస్తే! ఇక్కడున్నట్టూగాదూ, అటు పోయినట్టూగాదూ. లోపల చిన్న భయమైతే ఉంది. పోలేకపోతే కొంపలేమీ మునగవుగానీ... మళ్లీ తయారవ్వాలి, మళ్లీ 'పోయొస్తా'నని చెప్పాలి, ప్యాక్‌చేసిన మక్కగారెల్ని మళ్లీ డబ్బాలోవేసి, పొద్దున మళ్లీ కట్టాలి అమ్మ. "నిన్న పోతున్నానంటివిగదరా," అంటాడు మల్లన్న. "బంద్‌గదా పోలే"దనాలి. ఇవన్నీ నాకు అవసరమా?

ఇంతలో ఒక బస్సొచ్చింది. "కరీంనగర్ ఎవరున్నంటే ఎక్కాలె, ఎవరుండద్దు బస్టాండ్ల." పోలీసు హడావుడి. "ఎక్కడాపొద్దు." డ్రైవర్‌తో చెప్పాడు కంట్రోలర్. జనం దాదాపు ఖాళీ! తర్వాతి బస్సు?

బస్టాండు నుంచి రోడ్డు మీదకు వస్తే... ఏమైనా దొరక్కపోతుందా?

తెలంగాణతల్లి విగ్రహం ముందర కొన్ని ఆటోలు, నాలుగైదు 'తవేరా'లు పిల్చేస్తున్నాయి. 'కరీంనగర్ కరీంనగర్.'

"ఓమ్మా హైదరాబాదా? అంత్ల గూసోపో."

"రెండు వందల యాభై ఐట, గోరం గదన్నా." బస్సులోనైతే వందలో వెళ్లిపోవచ్చు. ఆదనపు నూటయాభై కోసం ఆమె కాసేపు విలవిల్లాడింది. "ఇవ్వాళ్నే వెళ్లాల్నామ్మా?"

"మావోళ్లు దావఖాన్లున్నరు, ఈసింత్లి పీసుగెల్ల ఒక్క బస్సున్నుండకపోదా అనుకున్న."

కనీసం రెండొందలకైనా తీసుకుంటాడేమోనని అడిగిచూసింది.

''మాకు వద్దామ్మా.. డీజిల్ ధర ఎంతైందో ఎరికేనా?''

ఇవ్వాళే చేసితీరాల్సిన పనులు లేనివాళ్లు ప్రయాణాలు మానుకునివుంటారు. ఆ పదిమంది నిండటానికి చాలాసేపు పట్టింది. అందులో ఒకమ్మ... కూతురు దగ్గరికి వెళ్తోంది. వాళ్ల అల్లుడు రాజా రాష్ట్రపతిభవన్ సెక్యూరిటీలో పనిచేస్తాడు. ఒంటిగంటకు ఢిల్లీ రైలెక్కాలి. ఈలోగా చేరుకోగలమా? మధ్యలో ఆపుతారా?

• • •

మొత్తానికి ప్రయాణమైంది. రోడ్ల మీద జనసాంద్రత తగ్గింది. టీ స్టాళ్లు, హెయిర్ సెలూన్లు తప్ప ఏమీ తీసిలేవు. మైదాకు చెట్లు గాలికి ఊగుతోంది. తాటిచెట్లు ఎక్కడానికి గౌడన్న గోచీ బిగిస్తున్నాడు. పశువులు మేతకు వెళ్తున్నాయి. పత్తి చేన్లో రైతన్న దౌర కొడుతున్నాడు. వీళ్లంతా పని చేయాల్సిందే. వీళ్లు సమ్మెలూ చేయలేరు, బందుల్లోనూ పాల్గొనలేరు. ఆ పంటతో దొరికే ఆ కాస్త విరామం కూడా వీళ్లకు లేదు.

నాకోసమే రోడ్డుపక్కన ఎదురుచూస్తున్న సర్వన్నకు సిరిసిల్లలో మొక్కజొన్న కంకుల సంచీ ఇచ్చాను. బదులుగా టిఫిన్‌బాక్స్ చేతిలో పెట్టాడు. వదిన నాకోసం సేమ్యాపాయసం పంపింది. ఇది నేనూహించనిది. సో స్వీట్!

• • •

ఎప్పుడైనా ఒక ఆటో, ఒక సైకిల్, ఒక బైకు రోడ్డుమీద కనబడుతున్నాయి. కుక్క ఒకటి ఏ వాహనం కిందోపడి చచ్చిపోయింది. దేయినంటి మహిళ తనను కొనిపోయే వాహనం కోసం చూస్తోంది.

కళ్లు మూసుకున్నప్పుడు కనురెప్పల కింద కనబడే వింతచిత్రాల్లా ఏవేవో వెనక్కి వెళ్లిపోతున్నాయి. ఇలాంటి ప్రయాణంలో కూడా డ్రైవర్... 'జరా జరా' (మనోహరా) పాటను పదే పదే ప్లే చేయడం వల్ల ఒక రొమాంటిక్ మూడ్ కొనసాగింది. ఆలింగనం చేసుకోవాల్సిన గొంతు. ఇక బంద్ అనగానే నాకీ పాట గుర్తొస్తుందేమో!

సిద్దిపేట టౌన్లోంచి కాకుండా బైపాస్ మీదుగా వెళ్లాడు. మెట్‌పల్లి బస్సు ఎదురైంది. ''ఒక్క పురుగు లేదు.'' ఉటూర్నారుదీ అంతే. ''నైట్ ఆల్ట్ బండ్లు.''

రోడ్డు నిర్మాణ పనులు సాగుతున్నాయి. ''రెండో బండి ఇప్పుడు స్టార్టయిందట.'' ఫోన్ మాట్లాడిన తర్వాత, తన వెనక సీటుల్లో ఉన్నదాని గురించి చెప్పాడు డ్రైవర్. అప్పటికి గంట ప్రయాణం సాగింది. అంటే, ఈలోగా కోసం రెండు బస్సుల జనం ప్రయాణించేది. ఒక్క తమేరాడు మాత్రమే హైదరాబాద్ వస్తున్నాడు.

కుకునూర్‌పల్లి దగ్గర పసుపుపచ్చ కార్యకర్తలు బంద్ చేస్తున్నారు. ఆపబోతే డ్రైవర్ ఒడుపుగా తప్పించుకొచ్చాడు.

తలమీద వడ్లమూటతో ఒకామె పనికి వెళ్తోంది. గౌరారంలో పాలక్యాన్ల ఆటో వెళ్తోంది. హకీంపేట్ ట్రాన్స్‌పోర్ట్ అకాడెమీ దగ్గర 211బి ఎదురైంది. పోలీసు వాహనం దాన్ని దాటేసి వేగంగా వెళ్తోంది. ఒకచోట లారీలు ఆగివున్నాయి. షట్టర్లు మూసివున్నాయి. అంటే, దానర్థం దారిలో ప్రతి షట్టరూ మూసివుందని కాదు. సంకేత వాక్యాలతో ఇదే సమస్య!

• • •

పదిన్నరకల్లా జూబ్లీ బస్టాండుకు వచ్చేశాం. బస్సులు కనబడనంతగా పోలీసులు! దారివెంట సాగుతుంటే... ప్లైవుడ్ దుకాణం తెరిచివుంది.

**ఆటోలో... డ్రైవరు, కళ్లద్దాల తెల్లజుట్టాయన మధ్య బందుకు మరో ముఖ్య కారణమైన ఎఫ్‌డీఐ మీద సంభాషణ సాగుతోంది.**

మాంసంకొట్టు తీసివుంది. టైర్ సర్వీస్ కూడా. మొబైల్ పాయింట్ తీయలేదు. స్టీలు గిన్నెలు అమ్మట్లేదు. బరస్ అమ్మట్లేదు. స్వెటర్లు కొనొచ్చు. గ్యాస్‌స్టవ్ రిపేరుకియ్యొచ్చు. స్వీట్‌హౌజ్ తీశారు. డ్రెస్సెస్ మూసివుంది. మెడికల్ హాల్ నడుస్తోంది. షాపింగ్‌మాల్ తీయలేదు. జువెలరీ కూడా. కంప్యూటర్ ఇన్‌స్టిట్యూట్ సగం తెరిచివుంది. ఫర్నిచర్ తీయలేదు. బొమ్మల దుకాణం తీయలేదు. పాలిషాపు తీశారు. జిరాక్స్ తీశారు. ఫ్యాన్లది తీయలేదు. షూ దుకాణం మూసివుంది, చెప్పులది తెరిచివుంది. బంకులో పెట్రోలు పోస్తున్నారు. ఆసుపత్రికి వెళ్తున్నారు. రబ్బరుముద్రలు చేస్తున్నారు. గులాబీ కండువాల్లోంచి ఒకతను 'ఓయ్, ఓయ్,' అంటే... మూయాల్నా, వద్దా... అని టీవీ, దింటి స్టేషనరీషాపు మూసేశాడు కుర్రాడు.

బేకరీ తీసివుంది. ఖాదీ భండార్ తీయలేదు. చెప్పులు కుడుతున్నాడు. జామకాయలు అమ్ముతోంది. ఆప్టిక్స్, ట్రావెల్స్, వైన్స్, ఆటోపార్ట్స్, ఆయుర్వేదిక్ పనిచేస్తున్నాయి. టీ స్టాల్, ఫ్లోర్ మిల్, బ్యాంగిల్ స్టోర్, బ్రాస్ బ్యాండ్, పాన్ బ్రోకర్స్ పనిచేయట్లేదు. గ్లాసు షాపు తీస్తున్నాడు. సీటు కవర్ల కుట్టే షాపు తీయలేదు. కాసేపయ్యాక తీస్తాడేమో!

కమల కండువాలు బైకుల మీద వెళ్తూ నినాదాలు చేస్తున్నాయి. బియ్యం, థియేటర్, కిరాణా, ఎల్‌పీసీ తెరిచివున్నాయి. ఇస్త్రీ కూడా చేస్తున్నాడు. టైలర్ తీయలేదు. టెంట్‌హౌజ్ తీయలేదు. వెల్డింగ్, పాన్‌షాపు తీశారు. హార్డ్‌వేర్, పెయింట్స్ తీయలేదు. పచ్చళ్లు, పెరుగు, తమలపాకులు అమ్ముతున్నారు. పట్టుమిమన్న, పుస్తకాలు అమ్మట్లేదు. పరుపులు, పూజాసామగ్రి కొనొచ్చు. ఎర్రటొప్పాల ర్యాలీ వెళ్తోంది. పెంచిన పెట్రోల్, డీజిల్ ధరలు వెనక్కి తీసుకోవాలంటూ బ్యానర్ చేతిలో పట్టుకున్నారు. పోలీసులు వెంట నడుస్తున్నారు. బైకుల్లో వెళ్తున్నవాళ్లు... నిరసనను చూస్తూ దాటేస్తున్నారు.

ఆటోలో... డ్రైవరు, కళ్లద్దాల తెల్లజుట్టాయన మధ్య బందుకు మరో ముఖ్య కారణమైన ఎఫ్‌డీఐ (ఫారిన్ డైరెక్ట్ ఇన్వెస్ట్‌మెంట్-విదేశీ ప్రత్యక్ష పెట్టుబడి) మీద సంభాషణ సాగుతోంది.

''...దానికి అనుమతిస్తే వాల్‌మార్ట్... రిటైల్ సామాన్లు అమ్ముతారుమాదు... అట్లాంటివొస్తయి.''

''అంటే బిగ్‌బజార్, రిలయన్స్ లెక్కనా సార్?''

''అట్లాంటివే. కానీ అవి మనయే. ఇవి వీటికన్నా చాలా పెద్దయి.''

''దీంతోని పబ్లిక్కు బెనిఫిటా? నష్టమా?''

''ఉద్యోగాలొస్తయే, మంచిదంటరు వాళ్లు... చిన్నచిన్నోళ్లు నష్టమైపోతరంటరు వీళ్లు''

''కాని అట్లాంటోడొచ్చి నిలవడ్డడంటే... కొడుకులు... గవర్నమెంట్లనే మారుస్తరే''

''మనవాళ్లు ఎప్పుడు అమ్ముడుపోదమా అని ఎదురుచూసెటోళ్లే గదా!''

• • •

కొంత మందగించిన జీవితం సాయంత్రానికల్లా మళ్లీ పుంజుకుంది. ఇంతకీ, బంద్ వల్ల, ''పబ్లిక్కు బెనిఫిటా? నష్టమా?''

● పూడూరి రాజిరెడ్డి

## ప్రేమలేక



ప్రియా
ఆరోజు గుర్తుందా?
మనమిద్దరం
కారులో
ప్రయాణిస్తున్నాం.
సడెన్‌గా మన
కుక్కపిల్ల కారు
విండో నుంచి-
తల బయటపెట్టింది.
నువ్వు కూడా నీ తలను బయటపెట్టావు.
అప్పుడు-
రోడ్డు మీద పోయే జనాలు
**'ట్విన్స్ ట్విన్స్'** అని అరవడం ప్రారంభించారు!

## ఇలాంటి.....



"ఎలాంటి భర్త కావాలమ్మా?" అనే
ప్రశ్నకు-
కుమారి కాంతం ఇలా జవాబు
ఇచ్చింది.
'అమీర్‌ఖాన్‌లా
అందంగా కనిపించాలి!
బిల్‌గేట్స్‌లా
బోలెడు సంపాదించాలి.
మన్మోహన్‌లా
మౌనంగా ఉండాలి.
ఎదురు మాట్లాడకుండా చెప్పింది చేయాలి'

## లవ్ రూట్లో....

మనసులో ప్రేముండాలే గానీ సందేశాలకు కొదవా?
'మేఘసందేశం' గురించి మెనీ టైమ్స్ వినే ఉంటారు.
'చిలకసందేశం' గురించి చిన్నప్పుడే విని ఉంటారు.
మరి మీకు 'వ్యాన్ సందేశం' గురించి తెలుసా?
'విల్ యూ మ్యారీ మి' అని వ్యాన్ మీద రాసిన ఒక డ్రైవర్ ఆ వ్యాన్‌ను డర్హామ్ (ఇంగ్లాండ్)లోని జాక్ట్ రెనాల్డ్స్ ఇండస్ట్రీ ఏరియాలో తెగ తిప్పాడు.
ఆ డ్రైవరు ఎవరో తెలియదు. అతడు ప్రేమించింది ఎవరినో తెలియదు.
అతని ప్రేమ మాత్రం అందరికీ తెలిసిపోయింది!




## మీ గాళ్ ఫ్రెండ్‌కు ఈ జోక్ చెప్పి-సవ్వించండి!



ఒక కుర్రాడు ఎంబీఏ ఫామ్ నింపుతూ వాచ్‌మెన్‌ను అడిగాడు: 'మంచి కాలేజీయేనా?'
వాచ్‌మెన్: చాలామంచి కాలేజీ సార్. నేను కూడా ఈ కాలేజ్‌లోనే ఎంబీఏ పూర్తిచేశాను.

## ప్రేమచరణం

ప్రేమ నీకు కావాలంటే పిరికివాడు కారాదు
గువ్వ గూడు కట్టేచోట కుంపటెట్టి పోరాదు
ఓర్వలేని సంఘం ఒప్పుకోదు నేస్తం
జాతిమత భేదాలన్నీ స్వార్థపరుల మోసం

## బిల్‌గేట్స్ అన్నాడు...

'వెన్ యు హ్యావ్ మనీ ఇన్ హ్యాండ్
యు ఫర్‌గెట్ హూ ఆర్ యూ!
వెన్ యూ హ్యావ్ నో మనీ
ఇన్ యువర్ హ్యాండ్
ది హోల్ వరల్డ్ ఫర్‌గెట్
యు'



## నేను ఇలా అన్నాను.....

నీ హృదయంలో ప్రేమ ఉంటే
ఈ ప్రపంచాన్నే మరిచిపోతావు!
నీ హృదయంలో ప్రేమే లేకపోతే
ఈ ప్రపంచం నిన్ను మరిచిపోతుంది.

- స్వామి లవ్వానంద

## తిక్క కుదురుతుంది!



మిత్రమా!
ఆమెను మరచిపోలేకున్నావా?
అయితే ఇలా చెయ్:
ఆమె గుర్తొస్తే
ఫోన్ చెయ్
మళ్లీ గుర్తొస్తే
మళ్లీ ఫోన్ చెయ్
ఎప్పుడూ గుర్తుకొస్తే
మాంచి లవ్‌లెటర్ రాసి ఇవ్వు
ఇంకా ఇంకా గుర్తుకొస్తే
పెళ్లి చేసుకో... అమ్మతోడు ఆమె గుర్తుకొస్తే ఒట్టు!




## లవ్‌వర్డ్స్

5 **లవ్‌బుల్ వర్డ్స్:** అయామ్ ఎలోన్ విత్ అవుట్ యూ
4 **ఫ్లెజెంట్ వర్డ్స్:** ఐ కేర్ ఫర్ యూ
3 **స్వీట్ వర్డ్స్:** ఐ లవ్ యూ
2 **స్పెషల్ వర్డ్స్:** మిస్ యూ
1 **ఇంపార్టెంట్ వర్డ్:** యూ

యాకుబ్ పాషా

# 'షరతులు' చదవాల్సిందే !

టెర్మ్స్ అండ్ కండిషన్స్... ఇంగ్లిష్ భాషలో ఎవ్వరికీ నచ్చని పదాలివి. ఎవరూ పట్టించుకోని పదాలు కూడా ఇవే. ఆన్‌లైన్ సర్వీసులు వాడుకున్నపుడు, వస్తువులు కొంటున్నప్పుడు, ఆర్థిక లావాదేవీలు నిర్వహిస్తున్నప్పుడు... చివరకు ఓ మెయిలు ఓపెన్ చేస్తున్నా కూడా టెర్మ్స్ అండ్ కండిషన్స్‌ని నిర్లక్ష్యం చేస్తుంటాం. దాని పక్కనే ఉన్న బాక్సులో టిక్ కొట్టి అందరికీ జరిగేదే మనకూ జరుగుతుందన్నట్టు కొందరు, అసలు అదో నామ్‌కే వాస్తే అన్నట్టు ఇంకొందరు, అది అవసరమే లేదన్నట్టు మరికొందరు ఓకే చేస్తుంటారు. చాలా విషయాల్లో మీరు నిర్లక్ష్యం చేసినా పర్లేదు కానీ ఓ మూడు విషయాల్లో మాత్రం 'షరతులు- నియమాలు' తప్పకుండా చదివి తీరాలి. చదవకపోతే చాలా నష్టపోవాల్సి ఉంటుంది.



**గృహరుణం:** ఇప్పుడు సొంత డబ్బుతో ఇల్లు కట్టుకోలేం కాబట్టి మాటికి ఎనభై శాతం మంది బ్యాంకుల దయాదాక్షిణ్యాలతో సొంతింటి కలను నెరవేర్చుకుంటున్నారు. రుణాలు తీసుకునేవారిలో ఎక్కువ మంది 15 లేక అంతకంటే ఎక్కువ సంవత్సరాలపాటు లోను తీసుకుంటారు. అంత సుదీర్ఘకాలం బ్యాంకుతో లావాదేవీలు జరుపుతాం కాబట్టి వారు పెట్టే షరతులు తెలుసుకోవడం తప్పనిసరి. పొరపాటున పరిస్థితులు తారుమారైతే ఈఎంఐ ఎలా కట్టాలి? ఎన్నాళ్లు వాయిదా వేయొచ్చు? అసలు కట్టలేకపోతే అంతవరకు కట్టిన సొమ్ము మనకు వస్తుందా? వస్తే ఎంత? బ్యాంకు మన ఇంటిని వేలం వేసేలోపు మన పరిస్థితులు బాగుపడితే మళ్లీ మనం దక్కించుకోవచ్చా అనేవన్నీ అందులో ఉంటాయి. కాబట్టి చదవడం తప్పనిసరి.

మనీమాన్యితం

అప్పులు లేకపోతేనేం అప్పులు ఉన్నవాళ్లం
అసలు లేని వాళ్లకన్నా నయమనుకుందాం
పస్తులనుకుంటే పరువుకి కష్టం
ఉపవాసముంటే ఏమిటంట కష్టం

**బీమా పాలసీలు:** ఆరోగ్యబీమానో, జీవిత బీమానో తీసుకుంటే సాధారణంగా ఏజెంటు చెప్పింది విని తీసేసుకుంటాం. ఏజెంటు ఇచ్చిన షరతులు-నియమాల పేజీని తిప్పి చూడకుండా ఓకే చేస్తాం. అది చాలా తప్పు. తప్పకుండా అన్నీ చదవాలి. ఎందుకంటే మీరు ఒక ఆరోగ్య బీమా తీసుకున్నంత మాత్రాన మీకు వచ్చే ప్రతి వ్యాధికీ బీమా కంపెనీ డబ్బులు ఇవ్వదు. మీకు బీమా ఉందనే ధీమాతో ఆస్పత్రిలో చేరితే అసలు విషయం ఆలస్యంగా తెలుస్తుంది. సాధారణంగా అత్యధికంగా వచ్చే వ్యాధులను బీమా పాలసీలు కవర్ చేయవు. ఆ లిస్టు మీ చేత పాలసీ చేయిస్తున్న వ్యక్తికి కూడా తెలియకపోవచ్చు. కాబట్టి మీరే జాగ్రత్తపడాలి. పాలసీ అసలు ఉద్దేశం నెరవేరకపోతే పాలసీ ఎందుకు?

**ఉద్యోగంలో చేరేటప్పుడు:** గతంలో భారతీయుల్లో ప్రతి నలుగురిలో ఒకరు ఉద్యోగం చేసేవారు. ఇపుడు ప్రతి నలుగురిలో ముగ్గురు ఉద్యోగం చేసే రోజులొచ్చాయి. ఎన్నో అంతర్జాతీయ కంపెనీలు ఇండియాకు వచ్చాయి. కంపెనీ అనే కుటుంబంలో భాగం అయినపుడు దాని నియమనిబంధనలు తెలుసుకోవడం తప్పనిసరి. ఓరల్‌గా చెప్పేవి, లిఖిత పూర్వకంగా ఇచ్చేవి, సహోద్యోగులను అడిగి తెలుసుకోవాల్సినవి ఉంటాయి. లిఖితపూర్వకంగా ఇచ్చేవన్నీ ఉద్యోగ తొలగింపు, క్రమశిక్షణ తదితర నిబంధనలు. అవన్నీ తప్పనిసరిగా చదవండి.



# రెండు పడవలు, నూటా రెండు వ్యాపకాలు!

చాలామంది తమకు తామే సరిహద్దులు సృష్టించుకుంటారు. తమ పరిధి ఇంతే అనుకుంటూ ఉంటారు. దేశంలోని సగం జనాభాకు తమ శక్తి సామర్థ్యాలు ఏమిటో తెలియవు. నిజానికి అక్రమ మార్గాల్లో వెళ్లకుండా నిజాయతీతో కూడిన ఆలోచనలతో ముందుకెళ్తానే మనమేంటో నిరూపించుకోవడానికి ప్రతి ఒక్కరికీ అవకాశాలున్నాయి. అయితే ముందసలు మనం ఏం చేయగలమో తెలుసుకోవాలి. లేదా వైవిధ్యమైన మార్గాల్లో ఎదుగుతున్న బాలీవుడ్ నటుడు అర్జున్ రామ్‌పాల్ వంటి వారిని చూసి నేర్చుకోవాలి.

అర్జున్ రామ్‌పాల్ ప్రతి మెట్టునూ క్రమశిక్షణతో నిర్మించుకుంటూ వచ్చారు. తల్లిదండ్రులు విడిపోయాక తల్లి గ్వెండొలిన్ రామ్‌పాల్ తన రెక్కల కష్టంతో అతడిని పెంచి ప్రయోజకుడిగా తీర్చిదిద్దింది. తను టీచరుగా పనిచేస్తూ తమిళనాడులో ఉన్న కొడైకెనాల్ ఇంటర్నేషనల్ స్కూల్లో అర్జున్‌ను చదివించింది. ఆ తర్వాత అర్జున్ ఢిల్లీ హిందూ కాలేజీలో ఎకనమిక్స్ చేశారు. తొలుత మోడల్‌గా ప్రయత్నించి ఫ్యాషన్ మోడల్‌గా సక్సెస్ అయ్యారు. అదే సమయంలో బాలీవుడ్ తెరపై ప్రయత్నాలు మొదలుపెట్టి 'ప్యార్ ఇష్క్ ఔర్ మొహబ్బత్' సినిమాతో నటుడిగా నిరూపించుకున్నారు. కథానాయకుడిగా మాత్రమే చేస్తే టాలెంట్ పరిమితం అయిపోతుంది. అందుకే భిన్నమైన పాత్రలు చేశారు. ప్రతినాయకుడిగా నటించారు. వేర్వేరు పాత్రలు పోషించారు. నటుడిగా నవరసాలూ పండించి, సినిమా మేకింగ్‌లోకి వచ్చారు. నిర్మాతగా 'ఐ సీ యూ' తదితర సినిమాలు తీశారు. టెలివిజన్‌లో షో 'నాచ్ బలియే'లో జడ్జిగా వ్యవహరించి బుల్లితెరపై మెరిశారు. 2002 నుంచే స్టేజ్ షోల కోసం వరల్డ్ టూర్‌లు కొనసాగిస్తున్నారు. ఇతర బాలీవుడ్ నటులతో కలిసి సుమారు 10 అంతర్జాతీయ షోలు చేశారు. ఒకవైపు సినీ కళా రంగంలో ఇలా రాణిస్తూనే బయటి వ్యాపారాల్లో అడుగుపెట్టారు. 'చేజింగ్ గణేశ' పేరుతో ఒక ఈవెంట్ మేనేజ్‌మెంట్ సంస్థను స్థాపించారు. ఆ తర్వాత 'ల్యాప్' పేరుతో ఓ బార్ నెలకొల్పారు. ఇలా ఒకదాని వెంట ఒకటి ప్రారంభిస్తూ లాభాలు గడిస్తూ ఉంటారు అర్జున్ రామ్‌పాల్. పర్సెప్ట్ కంపెనీతో కలిసి 'లాస్ట్' పేరుతో 'మ్యూజిక్ ఫెస్టివల్స్' నిర్వహించడానికి ఇటీవలే మరో ఒప్పందం కుదుర్చుకున్నారు. ముందు ముందు ఇంకా ఎన్నింటిలో అడుగుపెడతారో చూడాలి.



అర్జున్ రామ్‌పాల్

● ప్రకాష్ చిమ్మల

## పదశోధన - 220

నిర్వహణ : అదృష్టదీపక్



ఆధారాలు

**అడ్డం**

1. దేవతల పానీయం, సుధ (3)
4. సంతోషం (3)
7. చెరువు (3)
9. వణుకు, కంపం (2)
10. లంబాడీల గుంపు (2)
12. బ్యాంకుల్లో మార్చుకునే చెక్కులి (2)
13. గెడ్డం (3)
16. పిమ్మట (4)
18. బంగారం (2)
20. మిరపకాయ రుచి (2)
22. శ్రవణేంద్రియం (2)
24. నుదుటి రాత (6)
27. వాన చుక్క (3)
28. నేలను దున్నడం (2)
29. శునకం (2)
32. భార్య (2)
34. '...' రమంతే తత్ర దేవతాః అని ఆర్యోక్తి (8)

**నిలువు**

1. అసత్యం (3)
2. జన్మనిచ్చినవాడు (2)
3. వస్త్రం మీద నేసే పువ్వు (2)
5. విష్ణు ఖడ్గం (3)
6. హారం (2)
7. ఎక్కువ కాదు - కొరత (3)
8. కాంస్యం (2)
11. ఆంగ్ల వైద్యుడు (3)
14. అన్నం (2)
15. బంజరు నేల, ఒక నిందావాచకం (4)
16. తాంబూలాల పత్రాలు (6)
17. సక్రమంగా లేని వాదులాట (4)
19. అరుపు (2)
21. చెలికత్తె (2)
23. వింత, ఆశ్చర్యకరం (3)
25. చిన్న కొడవలి (2)
26. దేహం లేని తండ్రి (2)
30. పల్లకీ (2)
31. పొలం మన్ను (2)
32. నెయ్యి (2)
33. తెలిసిన వ్యక్తిత్వం (2)

### పదశోధన - 219 జవాబు



## దాగుడు మూతలు

ఇందులో దాగి ఉన్న బొమ్మలను గుర్తించండి?



## పజిల్

ఇక్కడ గుంపుగా గొడుగులు ఉన్నాయి. వాటిలో ఒకేలా ఉండేవి రెండున్నాయి. వాటిని గుర్తుపట్టండి.



**● మెదడుకు మేత**

## Food Facts



- బొప్పాయి పండు కఫాన్ని పోగొడుతుంది!
- మూత్ర సంబంధిత వ్యాధులున్న వారు క్యారెట్‌ను ఎక్కువగా తీసుకుంటే ఫలితం ఉంటుంది!
- ఫుడ్ కలర్ ఎక్కువగా వాడితే మూత్రాశయ వ్యాధులు వస్తాయి!
- మునగాకుకు అధిక బరువును నియంత్రించే లక్షణం ఉంది!
- షుగరు వ్యాధి ఉన్నవాళ్లు చిన్న ఉల్లిపాయలను వాడితే వ్యాధి నియంత్రణలో ఉంటుందట!

## Interesting Facts



- అలెగ్జాండర్ ద గ్రేట్, జూలియస్ సీజర్, చెంఘిజ్‌ఖాన్, నెపోలియన్, ముసోల్లినీ, హిట్లర్... వీళ్లందరికీ పిల్లులంటే చచ్చేంత భయం!
- యూకలిప్టస్ చెట్లు ఎక్కువగా ఉన్న దేశం ఆస్ట్రేలియా. అక్కడ ఐదు వందల రకాల యూకలిప్టస్‌లు కనిపిస్తాయి!
- దక్షిణాఫ్రికాకు 11 అధికార భాషలున్నాయి. దాన్ని రెయిన్‌బో నేషన్ అని కూడా పిలుస్తారు!
- ఒక దేవలోకపు శునకం చంద్రుణ్ని మింగేయడం వల్ల గ్రహణం ఏర్పడుతోందని పూర్వం చైనీయులు నమ్మేవారు. ఆ కుక్కను భయపెట్టడానికి గ్రహణం సమయంలో పెద్ద పెద్దగా డప్పులు వాయించేవారు!
- ఆటమ్ అన్న పదం 'అటమస్' అనే గ్రీకు పదం నుంచి వచ్చింది. అంటే అవిభాజ్యమైనది అని అర్థం!

## Animal Facts



- కప్పలు నీళ్లు తాగవు. శరీరాన్ని తడుపుకుంటూ ఉంటాయంతే!
- ప్రపంచం మొత్తమ్మీద మూడు వేల రకాల పాములున్నాయి!
- ఉడుతలు అంధత్వంతో పుడతాయి. కొన్ని రోజుల తర్వాత వాటికి కళ్లు కనిపిస్తాయి!
- గొర్రెలు తల తిప్పకుండానే వెనుకకు చూడగలవు!
- కోతుల గుంపును మిషన్ అంటారు!

## Human Body Facts



- చేతివే కాదు, కాలి బొటనవేలు ముద్రలు కూడా ఏ ఇద్దరివీ ఒకలా ఉండవు!
- వాసన చూడలేకపోవడాన్ని అనాస్మియా అంటారు!
- ప్రతి ఎనిమిది మందిలో ఒకరు నిద్రలో గురక పెడతారు, పదిమందిలో ఒకరు పళ్లు నూరుతారని ఓ పరిశోధనలో తేలింది!
- మన శరీరంలో రక్తప్రసరణ జరగని ఒకే ఒక్క ప్రదేశం... కార్నియా. అది ఆక్సిజన్‌ను గాలినుంచే నేరుగా తీసుకుంటుంది!
- పుట్టినప్పుడు పిల్లలందరి కళ్లూ నీలిరంగులోనే ఉంటాయి!

**● చిట్టి కథ**

# అతి తెలివి



భాను, వేణు చిన్ననాటి మిత్రులు. వేణు తెలివైనవాడని భానుకి కొంచెం ఈర్ష్య. భాను డబ్బున్నవాడని వేణుకి అతడంటే గౌరవం. భాను పట్నంలో వ్యాపారం చేస్తూ బాగా సంపాదించి అక్కడే స్థిరపడ్డాడు. వేణు ఉద్యోగంలో చేరినా బాధ్యతల చేత అతని ఆర్థిక స్థితి అంతంత మాత్రంగానే ఉంది.

ఒకసారి వేణుకి కొంత ధనం అవసరమై భానుని సహాయం చెయ్యమని అడిగాడు. వేణుకి డబ్బులివ్వడం భానుకి ఇష్టం లేదు. కాని అలా చెప్తే, మిత్రుడిని ఆదుకోలేకపోయాడన్న అపవాదు వస్తుంది. ఎలా అని ఆలోచించాడు.

వేణుని తన ఇంట్లోని ఒక గదిలోకి తీసుకెళ్లాడు. ఆ గదిలో ఆరు స్విచ్చులున్న స్విచ్‌బోర్డు చూపించి, "వేణూ! నువ్వు ఒకే ప్రయత్నంలో ఆ బల్బుని వెలిగించాలి. నువ్వు సరైన స్విచ్ నొక్కావో, నువ్వడిగిన సాయం చేస్తాను. లేకుంటే లేదు" అన్నాడు. వేణు ఎలాగూ ఓడిపోతాడులే అని లోలోపలే ఆనందపడసాగాడు.

వేణు గదిని ఆసాంతం పరిశీలించాడు. ఒక్క బల్బు తప్ప ఫ్యాన్, లైట్లు మరేం లేవు. స్విచ్‌లన్నింటినీ ఓసారి పరీక్షించి, ఓ స్విచ్ నొక్కాడు. వెంటనే బల్బు వెలిగింది. ఆశ్చర్యపోయాడు భాను. 'ఎలా కనిపెట్టావ్' అన్నాడు అయోమయంగా.

'ఒక స్విచ్ కొంచెం అరిగిపోయి, దానిపై మరక, గీతలు పడి మిగిలిన ఐదింటి కంటే భిన్నంగా కనిపించింది. పదేపదే ఉపయోగించే స్విచ్ మాత్రమే ఇలా ఉంటుంది కాబట్టి ఆ స్విచ్‌ని నొక్కాను, అంతే' అన్నాడు వేణు.

దాంతో వేణుకి ధన సహాయం చేయక తప్పింది కాదు భానుకి. అడగ్గానే ఇస్తే పేరైనా దక్కేది. అతి తెలివితో పందెం కాసి ఓడిపోయి వేణుకి సహాయం చేశాడన్న అపవాదు తెచ్చుకున్నాను అని మనసులోనే వాపోయాడు భాను.

**నీతి: తెలివి ఏ ఒక్కడి సొత్తూ కాదు. ఎదుటివాళ్లను పిచ్చివాళ్లని చెయ్యాలని చూస్తే చివరకు మనకే ఆ పరిస్థితి వస్తుంది.**

**● కాండూరి వెంకట సన్యాసిరావ్**

RNI Reg No.APTEL/2008/23482




**Distributors for Vishakapatnam:** Ankush Marketing - 8790002035, **Pigeon Helpline:** Murthy - 8970002011, Vishal - 8790002021. **Distributors for Hyderabad & Secunderabad:** Swastik Marketing - 040 40175134, Agarwal Distributor - 040 66731515, **Pigeon Helpline:** Surender – 8790002003, Janardhan 8790002004, Shankar Babu - 8790002039, Sanjay - 9849728000, Balaji Gas Appliances - 9391029153 (For Gas Geysers), **Trade & Institutional Enquiry** – 9491758750. **Distributors for Medak & Ranga Reddy District:** Laxmi Enterprises - 9246599982, **Pigeon Helpline:** Niranjan Reddy - 8790002006. **Distributors for Vijayawada:** Sardhi Agencies - 9949399320, **Pigeon Helpline:** Ramakrishna - 9703733339.
**Customer Care Toll Free: 1800 425 66666, E-Mail: customercare@stovekraft.com.**

సాక్షి

# ఫన్‌డే

ఆదివారం ::: 14 అక్టోబర్ 2012



## వయొలిన్ శర్మ
ఇన్నర్‌వ్యూ

## వేణు
ఇంటర్వ్యూ



## సర్వదమన్ బెనర్జీ
అజ్ఞాతవాసం



## క్విక్ బైట్స్..!

### మిస్టర్ 'బిన్'



ఎరక్కపోయి ఇరుక్కుపోయేను అన్నట్టు ... పాపం తన తల చెత్తకుండీలో ఇరుక్కుపోయి ఈ మనిషి నానా హైరానా పడ్డాడు. స్కాట్లాండ్‌కు చెందిన టామ్ అనే యాభై రెండు సంవత్సరాల వ్యక్తి చెత్తకుండీలో ఏం పారేసుకున్నాడో ఏమో, లోపల తల పెట్టి వెతుకుతుండగా, తల కాస్తా అందులో ఇరుక్కుపోయింది. దాంతో స్థానికులు ఫైర్‌స్టేషన్ సిబ్బందికి ఫోన్ చేయడంతో వారు కొన్ని గంటలపాటు తంటాలు పడి, ఎలక్ట్రానిక్ రంపంతో ఆ డస్ట్‌బిన్‌ను జాగ్రత్తగా కోసి, మనవాడిని రక్షించారు. అంతసేపూ పాపం! టామ్ ప్రాణాలు అరచేతిలో కాదు, డస్ట్‌బిన్‌లో పెట్టుకుని బతికాడు! సురక్షితంగా బయట పడ్డాక 'ఇంతకీ ఏం పోగొట్టుకున్నావని అలా అమాంతం డస్ట్‌బిన్‌లో తల దూర్చేశావు?' అనడిగితే, సమాధానం చెప్పకుండా సిగ్గు నములుతున్నాడు టామ్!

### ఏ జన్మ బంధమో..!



తల్లి వద్దని తరిమి పారేసిన పందిపిల్లను అక్కున చేర్చుకుందో బాతు. స్కాట్లాండ్‌లోని అరాన్ దీవులలో ఏర్పడిన ఈ అరుదైన అనుబంధం సందర్శకులను అమితంగా ఆకట్టుకుంటోంది. డయానా లూయిస్‌కి చెందిన ఓ పెంపుడు పంది ఎందుకో ఏమో చిట్టచివరగా పుట్టిన పిల్లను దగ్గరికి రానివ్వకుండా తరిమి కొట్టింది. దాంతో దిక్కుతోచని పందిపిల్ల గునగున నడుచు కుంటూ దగ్గరలోనే ఉన్న బాతుల గూటిలోకి వెళ్లింది. వాస్తవానికి బాతు ఆ పందిపిల్లను దగ్గరకు రానివ్వకూడదు. కాని అందుకు విరుద్ధంగా లూసీ అనే ఆ బాతు దానిని ఎంతో ఆప్యాయంగా తన రెక్కలమాటున దాచి, అమ్మ ప్రేమలోని అమృతత్వాన్ని దానికి పంచింది. అంతేకాదు, తనతోపాటు దానిని కూడా మేతకు తీసుకెళుతోంది! ఈ అపురూప బంధాన్ని చూసిన ఇరుగు పొరుగువారు ఆశ్చర్యపోతున్నారు.

### ఈ పోస్ట్‌బాక్స్‌ను తెరిచి పాతికేళ్లయింది!



బర్మింగ్‌హామ్ రైల్వే స్టేషన్‌లో అమర్చిన ఓ పోస్ట్‌బాక్స్‌ను ఓపెన్ చేసి దాదాపు పాతికేళ్లు అయిందట! దానిలో ఉన్న ఉత్తరాలపై గల తేదీలని బట్టి, ఇందులోని ఉత్తరాలను ఆఖరిసారిగా 1989లో క్లియర్ చేశారని తెలుస్తోంది. జనసమ్మర్దంతో ఉండే ఆ ప్రాంతంలోని పోస్ట్‌బాక్స్‌లో ప్రయాణికులు ఉత్తరాలు వేస్తూనే ఉన్నప్పటికీ ఇన్నాళ్లుగా పోస్టల్ సిబ్బంది కంటపడకుండా ఎలా ఉందో అర్థం కావట్లేదని స్థానికులు ముక్కున వేలేసుకుంటున్నారు. ఇటీవల బర్మింగ్‌హామ్ రైల్వేస్టేషన్‌కు మరమ్మతులు చేపట్టారు. ఒక కార్మికుడి చేయి దేనికో తగిలి చీరుకుపోవడంతో ఏమిటా అని పరిశీలించేసరికి ఈ బాక్స్ బయటపడింది. దాంతో రెండున్నర దశాబ్దాలుగా పేరుకుపోయిన వేలాది ఉత్తరాలను గమ్యస్థానానికి చేర్చే ప్రయత్నాలలో పడ్డారు రాయల్ మెయిల్ అధికారులు!

### పాపం పళ్ల డాక్టర్!

డెవిన్ బోస్ట్



పోర్ట్‌ల్యాండ్‌కు చెందిన డెవిన్ బోస్ట్ అనే యువకుడికి చిన్నప్పుడు పళ్లు సరిగా లేవని తల్లిదండ్రులు డాక్టర్ వద్దకు తీసుకెళ్లారు. వాటిని సరిచేసేందుకు బ్రేసెస్ అమర్చాడు డాక్టర్. అయితే వాటిని ఎన్నాళ్లపాటు ఉంచుకోవలసిందీ చెప్పలేదు. దాంతో బోస్ట్ వాటిని తీయలేదు. పెరిగి పెద్దయిన తర్వాత పళ్లు బాగా సలుపుతుండడంతో డాక్టర్ దగ్గరకెళ్లాడు. అతని పళ్లకు అమర్చిన బ్రేసెస్ చూసి షాకయ్యాడు డాక్టర్. రెండేళ్లకే తొలగించాల్సిన వాటిని ఏళ్లతరబడి తొలగించక పోవడం వల్ల కొన్ని పళ్లు పూర్తిగా పుచ్చిపోగా, మరికొన్ని ఇంప్లాంట్స్ అమర్చితే కాని పనికిరాని పరిస్థితి ఏర్పడినట్లు చెప్పాడు! దాంతో నష్టపరిహారం చెల్లించాలంటూ ఆ బ్రేసెస్ అమర్చిన డాక్టర్‌పై దావా వేశాడు బోస్ట్. చిన్నమాట చెప్పడం మరచిన పాపానికి సదరు డాక్టర్ కోర్టు చుట్టూ తిరుగుతున్నారు.

## పాయింట్ ఆఫ్ ద వీక్

| 14 | 15 | 16 | 17 | 18 | 19 | 20 |
|---|---|---|---|---|---|---|
| పాకిస్థాన్‌లో యూనివర్సిటీ ఆఫ్ పంజాబ్‌ను నెలకొల్పారు (1882) | ఎయిర్ ఇండియా (అప్పట్లో టాటా ఎయిర్‌లైన్స్) మొదటి ఫ్లైట్‌ను ప్రారంభించింది (1932) | బ్రిటిష్ పాలకులు బెంగాల్‌ను విభజించారు (1905) | మదర్ థెరెసా నోబెల్ శాంతి బహుమతి అందుకున్నారు (1979) | గంధపు చెక్కల స్మగ్లర్ వీరప్పన్ పోలీసుల కాల్పుల్లో చనిపోయాడు (2004) | ప్రత్యేకాంధ్ర కోరుతూ పొట్టి శ్రీరాములు అమరణదీక్ష మొదలుపెట్టారు (1952) | ఇండియాలోని ఉత్తర కాశీలో భూకంపం వల్ల వెయ్యిమంది మరణించారు (1991) |



సకాలంలో సరైన చికిత్స! సదా మీ ఆరోగ్య రక్ష!!
అతి తక్కువ ఖర్చుతో
ప్రకృతి సిద్ధంగా
ఎలాంటి దుష్ఫలితాలు లేకుండా దూరం చేయడం మా లక్ష్యం
అన్నిరకాల వ్యాధులకు ప్రపంచస్థాయి హోమియో వైద్యం
డయాబెటిస్
థైరాయిడ్
సోరియాసిస్
కిడ్నీ సమస్యలు
గ్యాస్టిక్ అల్సర్
అనుభవజ్ఞులైన డాక్టర్లు
అంతర్జాతీయ ప్రమాణాలు
వారమంతా వైద్యసేవలు
An ISO 9001 - 2000 Certified ®
పాజిటివ్ హోమియోపతి
మీ ఆరోగ్యాన్ని ఆస్వాదించండి!
Toll free No : 1800 425 0144
SMS 'POSITIVE' to 55352
www.positivehomeopathy.com
అమీర్‌పేట • S.R. నగర్ • కూకట్‌పల్లి • విక్రమ్‌పురి • కాచిగూడ • దిల్‌షుక్‌నగర్ • మెహిదీపట్నం
•నిజామాబాద్ •కర్నూల్ •గుంటూరు • వైజాగ్
•విజయవాడ •తిరుపతి •రాజమండ్రి •బెంగుళూరు
ఇతర వివరములకు సంప్రదించండి :
9246187788

● సూక్తి

**పుట్టిన ప్రతి మనిషీ చనిపోతాడు.**
**కాని ప్రతి మనిషీ జీవితాన్ని నిజంగా జీవించలేదు.** - విలియం వాలేస్, స్కాటిష్ విప్లవకారుడు

● సూచిక


6



**టేక్ ఇట్ ఈజీ**
సారొచ్చారొచ్చారు!

14



**రాలిన మొగ్గలు**
పాపాల బైరన్

18



**నిజాలు దేవుడికెరుక!**
లాడెన్‌ను చంపింది అమెరికా కాదా?

20



**కథనం**
క్రిటికల్


● వారఫలం

**అక్టోబర్ 14 నుండి 20 వరకు**

నిర్వహణ: **సింహంభట్ల సుబ్బారావు**

**మేషం:** కొత్త పనులు చేపడతారు. యుక్తితో కొన్ని సమస్యలు పరిష్కరించుకుంటారు. ప్రముఖులతో పరిచయాలు. ఆలయాలు సందర్శిస్తారు. పాత సంఘటనలు గుర్తుకు వస్తాయి. మీ సత్తా చాటుకుని అందరిలోనూ గుర్తింపు పొందుతారు. రాజకీయ, కళారంగాల వారికి సన్మానాలు.

**వృషభం:** ఆర్థిక పరిస్థితి మెరుగ్గా ఉంటుంది. సన్నిహితుల నుంచి శుభవార్తలు. ఆలోచనలు కార్యరూపం దాలుస్తాయి. చిన్ననాటి మిత్రులను కలుసుకుని ఉత్సాహంగా గడుపుతారు. ఉద్యోగులకు పదోన్నతులు. రాజకీయ, పారిశ్రామిక వర్గాలకు విదేశీ పర్యటనలు.

**మిథునం:** సన్నిహితుల నుంచి శుభవార్తలు. ఆర్థిక వ్యవహారాలు అనుకూలిస్తాయి. దీర్ఘకాలిక రుణబాధలు తొలగుతాయి. పనుల్లో పురోగతి కనిపిస్తుంది. ఒక సమాచారం సంతోషం కలిగిస్తుంది. రాజకీయ, కళారంగాల వారికి సన్మానాలు జరుగుతాయి. ఆకస్మిక ధనలాభం.

**కర్కాటకం:** ఆర్థిక వ్యవహారాలు నిరాశ కలిగిస్తాయి. పనుల్లో కొద్దిపాటి ఆటంకాలు. దూరప్రయాణాలు. ఆలయాలు సందర్శిస్తారు. బంధువులతో మాటపట్టింపులు. ఆరోగ్య భంగం. వ్యాపారాలు అంతగా లాభించవు. ఉద్యోగులకు కొన్ని మార్పులు. రాజకీయ, కళారంగాల వారికి ఒత్తిడులు.

**సింహం:** ఆర్థిక పరిస్థితి మందగిస్తుంది. వ్యయప్రయాసలు. పనుల్లో తొందరపాటు. దూరప్రయాణాలు ఉంటాయి. బంధువులతో స్వల్ప వివాదాలు. ధన వ్యయం. ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో పాల్గొంటారు. రాజకీయ, కళారంగాల వారికి అవకాశాలు నిరుత్సాహపరుస్తాయి.

**కన్య:** కార్యక్రమాలు ఉత్సాహంగా పూర్తి చేస్తారు. ఆర్థిక వ్యవహారాలలో పురోగతి సాధిస్తారు. సంఘంలో గౌరవం. విలువైన సమాచారం అందుతుంది. జీవిత భాగస్వామి ద్వారా ఆస్తిలాభం. ఉద్యోగులకు పదోన్నతులు. రాజకీయ, కళారంగాల వారికి ఒత్తిడులు తొలగుతాయి.

**తుల:** పనులలో విజయం. ఆసక్తికరమైన సమాచారం అందుతుంది. పరిచయాలు పెరుగుతాయి. మీ ప్రతిభ వెలుగులోకి వస్తుంది. పోటీపరీక్షల్లో విజయం. ఆస్తి వివాదాలు తీరతాయి. పుణ్యక్షేత్రాలు సందర్శిస్తారు. రాజకీయ, కళారంగాల వారికి సన్మానాలు, పదవీయోగాలు.

**వృశ్చికం:** ఆర్థిక పరిస్థితి మెరుగ్గా ఉంటుంది. సన్నిహితులు, మిత్రులతో ఆనందంగా గడుపుతారు. కొన్ని సమస్యల నుంచి బయటపడతారు. వ్యాపారాలు లాభసాటిగా ఉంటాయి. రాజకీయ, పారిశ్రామికవర్గాలకు విదేశీ పర్యటనలు. విందువినోదాలలో పాల్గొంటారు.

**ధనుస్సు:** పలుకుబడి కలిగిన వారితో పరిచయాలు. సభలు, సమావేశాల్లో పాల్గొంటారు. పాతమిత్రులను కలుసుకుంటారు. నూతన ఉద్యోగప్రాప్తి. వ్యాపారాలు ఉత్సాహంగా సాగుతాయి. ఉద్యోగాలలో చిక్కులు తొలగుతాయి. రాజకీయ, కళారంగాల వారికి పదవులు దక్కుతాయి.

**మకరం:** ఆర్థిక వ్యవహారాలు కొంత అనుకూలిస్తాయి. పరిస్థితులు అనుకూలిస్తాయి. చిన్ననాటి మిత్రులను కలుసుకుంటారు. విద్య, ఉద్యోగావకాశాలు. కాంట్రాక్టులు పొందుతారు. వ్యాపారాలలో ప్రగతి కనిపిస్తుంది. పారిశ్రామిక, రాజకీయ వర్గాలకు నూతనోత్సాహం. ఆలయాలు సందర్శిస్తారు.

**కుంభం:** వ్యవహారాలు అనుకూలిస్తాయి. పాత సంఘటనలు గుర్తుకు వస్తాయి. సంఘంలో గౌరవం. కీలక నిర్ణయాలు తీసుకుంటారు. ప్రముఖులతో పరిచయాలు. వాహనాలు, ఆభరణాలు కొంటారు. రాజకీయ, కళారంగాల వారికి ఆహ్వానాలు అందుతాయి.

**మీనం:** పనులలో జాప్యం. ఆర్థిక పరిస్థితి నిరాశ కలిగిస్తుంది. బంధుమిత్రులతో స్వల్ప విభేదాలు. చిన్ననాటి మిత్రులను కలుసుకుంటారు. ఉద్యోగాలలో ఆకస్మిక మార్పులు. రాజకీయ, కళారంగాల వారికి గౌరవ పురస్కారాలు అందుతాయి. ఆధ్యాత్మిక చింతన పెరుగుతుంది.

● లేఖ



**లెక్కలేనన్నిసార్లు చదివాను!**

'అరచేతిలో చందమామ' కథ చదువుతుంటే చిన్నప్పుడు అమ్మ అరచేతిలో ఉత్తుత్తి బువ్వ పెట్టి వేళ్లతో చేతిపై 'అత్తారింటికి దారేది' అని గిలిగింతలు పెట్టినంత ఆప్యాయత కనిపించింది. ఆ రెండు పాత్రలనూ ఊహించు కుంటూ కథను లెక్కలేనన్నిసార్లు చదివాను.

– వి.శశికళ, నాయుడుపేట

**ఆయనంత ఎదగలేకపోయా!**

గురవారెడ్డి ఇన్నర్‌వ్యూ ఎంతగానో ఆకట్టుకుంది. ఈనాటి డాక్టర్లు, వైద్య విద్యార్థులు ఆయనను ఆదర్శంగా తీసుకోవాలి.

– డాక్టర్ అరవీటి రామయోగయ్య, హైదరాబాద్

**'కౌనా' శీర్షిక చదివిస్తోంది!**

'టేక్ ఇట్ ఈజీ'లో చిరంజీవిపైన మహార్షి రాసిన వ్యంగ్యాస్త్రం బాగుంది. 'కౌనా' శీర్షిక చదివిస్తోంది. 'అజ్ఞాతవాసం'లో నటి నగ్మా విశేషాలు ఆకట్టుకున్నాయి.

– సీహెచ్.ఉమామహేశ్వరరావు, గణపతి నగరం

**మరువరానివి!**

'ఆ రోజుల్లో'లో రావికొండలరావు ఆనాటి సినిమాలు సామాజిక ప్రజాతీకానికి స్ఫూర్తి కలిగించేవిగా ఉన్నాయనడం యదార్థం. గురవారెడ్డి ఇన్నర్‌వ్యూ చదివించింది. 'అరచేతిలో చందమామ' కథ బాగుంది. 'ఆదర్శం'లో ముదిరాజ్ కృష్ణమూర్తి సేవలు మరువరానివి.

– ఎ.పద్మావతి, హైదరాబాద్

**శోచనీయం**

సెప్టెంబర్ 29 సాక్షి 'ఫన్‌డే'లో కొవ్వలి రామకృష్ణ పరమహంస రాసిన 'అరచేతిలో చందమామ' కథ చదివాను. రెండు పేజీల కథ... పొందికగా, చిక్కని శిల్పంతో ఎంతో బాగుంది. చిన్న కథకు ఉండాల్సిన లక్షణాలతో పాటు, టైట్‌గా ఉంది. ఐతే... కథలో "ఎంట్రా! మాడాగాడిలా ఆ చేష్టలు" అనే వాక్యాన్ని రచయిత వరిణతి లోపంతో రాశారు. అది తప్పు. అనాగరికం కూడా. ఒక వ్యక్తిని పేరు పెట్టి చులకన చేయడం సంస్కారం అనిపించుకోదు. ఆ వాక్యాన్ని మీరూ అలాగే ఉంచేశారు. 'చిల్లరకొట్టు చిట్టెమ్మ' సినిమాలో మాడా వెంకటేశ్వరరావుగారు వేసిన పాత్ర పేరు పెట్టకుండా పాత్రధారి పేరు పెట్టడం (వాడుకలో ఉన్నా గానీ) శోచనీయం.

– గొరుసు జగదీశ్వరరెడ్డి
కథారచయిత, హైదరాబాద్


మా చిరునామా
ఫన్‌డే
సాక్షి తెలుగు దినపత్రిక
6-3-249/1, రోడ్ నం.1, బంజారాహిల్స్,
హైదరాబాద్ - 34. funday.sakshi@gmail.com

Designing: Sampangi Mallesh





**టేక్ ఇట్ ఈజీ**

# సారొచ్చారొచ్చారు!



చంద్రబాబు పాదయాత్రకు వస్తున్నాడని తెలియగానే జనం జడుసుకుని పారిపోసాగారు. తెలుగు తమ్ముళ్లు పెద్ద పెద్ద వలలేసి జనాన్ని లాక్కొచ్చారు.

''అన్నా! మీ దగ్గరున్నది కనబడని వల, మా దగ్గరున్నది కనబడే వల. మిమ్మల్ని చూసి జనం పారిపోతారని తెలిసే వలలు తీసుకొచ్చాం'' అన్నారు తమ్ముళ్లు. మెచ్చుకున్నాడు బాబు.

''చేపలు తినాలంటే చేతిలో వల వుండాలి. ఇప్పుడు వల విసిరితేనే వచ్చే ఎన్నికల్లో చేపలు పడేది'' అన్నాడు బాబు.

'' అన్నా, చేపలు పడతాయా లేక మనమే గోతిలో పడతామా?'' సందేహించారు తమ్ముళ్లు.

''వేటగాడికి ఓపికుండాలి'' అన్నాడు బాబు.

జనం వైపు తిరిగి, ''ఈ ప్రభుత్వ హయాంలో మీకు పారిపోడానికి కూడా శక్తి లేకుండా పోయింది. అదే మేము అధికారంలోకి వస్తే ఇళ్లు, వాకిళ్లు వదిలి మీ అంతట మీరే పారిపోతారు'' అన్నాడు బాబు.

''మీరు హైదరాబాద్‌లో మాట్లాడితేనే మేం ఇక్కడ వణుకుతాం. నేరుగా మా దగ్గరికే వస్తే మేం ఎలా బతకాలి బాబయ్యా'' అన్నారు జనం వణుకుతూ.

ఇదేం పట్టించుకోకుండా ఒక మహిళను చూసి, ''ఏమ్మా! మీ ఆయన ఏంచేస్తాడు?'' అని అడిగాడు బాబు.

''తాగి తాగి నచ్చిపోయాడయ్యా'' అని చెప్పింది.

''నేను అధికారంలోకి వస్తే బెల్టు షాపులు ఎత్తేస్తాను'' అన్నాడు బాబు.

''మీరు అధికారంలో ఉండి నిషేధం ఎత్తేసినప్పుడే ఆయన పోయింది'' బాధ కబురు చల్లగా చెప్పింది.

''ఏమయ్యా సేద్యం ఎలా సాగుతోంది'' అని ఓ రైతుని అడిగాడు బాబు.

''తమరి నల్లని పాలనలో ఆటకెక్కిన సేద్యాన్ని ఇంకా కిందకు దింపలేదండి'' అని చెప్పాడు రైతు.

''అప్పుడు ఏం చేయలేకపోయాను. ఈసారి మీకోసం ఏమైనా చేస్తాను'' అన్నాడు బాబు.

''మీరు మమ్మల్ని ఏమైనా చేయగలరు. మా భయం కూడా అదే'' అని వలలు తెంపుకుని పారిపోయారు.

''ఇవి తెలివైన చేపలన్నా. వల కొరికి పారిపోయాయి. కానీ మీ తొమ్మిదేళ్ల పాలనను తొండి ఏళ్లయినా జనం మరిచిపోయేలా లేరు. పాదయాత్రతో కాళ్లు, కీళ్లు అరిగిపోవడం తప్ప అధికారం వచ్చేలా లేదు బాబన్నా'' అని తమ్ముళ్లు నీరసంగా కూలబడ్డారు.

● జి.ఆర్.మహర్షి

● మహర్షిజం



**పులి - సింహం కథ**

జనంలోకి ఒక పులి వచ్చింది. తాను ఈ క్షణం నుంచి మాంసం ముట్టకుండా ప్రజాసేవలో తరిస్తానని ప్రకటించింది. జనం పకపక నవ్వారు. తరువాత ఒక సింహం వచ్చి తాను వేట మానేశానని, తానే జనం, జనమే తానని గొంతెత్తి చాటింది. జనం పక పక నవ్వారు. కాసేపటికి చంద్రబాబు వచ్చి ''మీ కోసం వచ్చాను. అందరికీ నా జీవితం అంకితం'' అన్నాడు. జనం పరుగు పరుగున పులి, సింహం దగ్గరకెళ్లి ''ఆయనకంటే మీ ఇద్దరే కొంచెం నమ్మశక్యంగా వున్నారు'' అని గొణిగారు.

**బాబుగారి వెలుతురు**

పాదయాత్రలో చంద్రబాబు ఒక పిట్టకథ చెప్పాడు.

''ఒక తండ్రి తన ఇద్దరు కొడుకులనూ పిలిచి చెరో వంద రూపాయలు ఇచ్చాడు. ఈ వందతో మీరు ఏమైనా కొనండి. అయితే ఆ వస్తువులతో ఒక గది మొత్తం నిండాలి అని షరతు పెట్టాడు. పెద్దకొడుకు వందతో గడ్డికొని గది నిండా పరిచాడు. అయితే గది మొత్తం నిండకుండా ఇంకా స్థలం మిగిలింది. చిన్న కొడుకు ఒక రూపాయితో కొవ్వొత్తి కొని వెలిగించాడు. గది నిండా వెలుతురు పరుచుకుంది. నేను ఆ చిన్న కొడుకు లాంటివాణ్ని. మీ బతుకుల్లో వెలుతురు నింపుతాను'' అని చెప్పాడు.

''రూపాయితో వెలుతురు పంచి తొండి తొమ్మిది నొక్కావు కదన్నా'' అని నటిగాడు ఓ తెలుగు తమ్ముడు.



**సామాన్యుడి సణుగుడు**

పక్షులు అంతరిస్తున్నాయి, చెట్లు మాయమవుతున్నాయని కోట్లు ఖర్చు పెట్టి సదస్సులు జరుపుతున్నారు. మనుషుల్లో నీతి అంతరించిపోతోంది. దీన్ని ఎవరూ పట్టించుకోవడం లేదు.



**సీఎం డిన్నర్**

జీవ వైవిధ్య సదస్సుకు వచ్చిన విదేశీయులకు సీఎం కిరణ్ ఒక రాత్రి విందు ఏర్పాటు చేశాడు. ప్రారంభంలోనే కరెంట్ పోయింది. ''కరెంట్ వస్తే లైట్ డిన్నర్, రాకపోతే క్యాండిల్ డిన్నర్'' అని ప్రకటించాడు సీఎం.












# మీ ఇంట్లోనే పవర్‌ఫుల్ స్పోకెన్ ఇంగ్లీష్ టీచర్

## ఇంగ్లీష్ కోర్స్ రూ.600*/- లకే

మూడు డివిజన్ల ఇంగ్లీష్ కోర్స్: డివిజన్-1, డివిజన్-2, డివిజన్-3 + అడిషనల్ బుక్స్, ఒక డైరీ మరియు ఒక ఆడియో సి.డి. = ఇవన్నీ రూ.600/-లు

**డివిజన్-1** Basic నుంచి ఇంగ్లీష్ చదవటం, రాయటం, నేర్పుతూ, ప్రతి ఒక్కరికీ కావలసిన స్థాయిలో స్టాండర్డ్ ఇంగ్లీష్ నేర్పబడుతుంది.

**డివిజన్-2** తప్పులు లేకుండా ఇంగ్లీషు రాయుటకు కావలసిన అంగ్ల వ్యాకరణం పరిపూర్ణంగా సులభ సూత్రాలతో చాలా ఈజీగా నేర్పబడుతుంది.

**డివిజన్-3** ఎంతో సులభంగా, ఏ సందర్భంలోనైనా తడబడకుండా, తప్పులు లేకుండా, మంచి నీళ్ళు త్రాగుతున్నట్లుగా మంచి ఇంగ్లీషు మాట్లాడటం నేర్పబడుతుంది.

**పూర్తి డబ్బు వాపస్**

మునుపెన్నడూ లేనట్లుగా మీకీ కోర్సు నచ్చలేదని అనిపిస్తే కోర్సు పుస్తకాలు 15 రోజుల్లోపల మాకు తిప్పి పంపండి. మీ డబ్బుని (కేవలం పోస్టు ఖర్చులు మాత్రం మినహాయించి) మీకు ఎమ్.ఓ.చేస్తాం. కోర్స్ మెటీరియల్ సైజు 18cm x 24cm లోనూ, డైరీ సైజు 12cm x 17.5cm లోనూ (ఆఫ్ సెట్ మల్టీకలర్ కవర్‌తో) ఉంటాయి. విద్యార్థుల సౌకర్యాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రతి సంవత్సరానికి క్రొత్త డైరీగా ఉపయోగించుకునే విధంగా ప్రత్యేకంగా రూపొందించబడిన డైరీ.




**SMS పంపండి (లేదా) కూపన్ పంపండి.**

**Phone: 0-99405 70931**

పై సెల్‌ఫోన్ నెంబరుకు మీ పేరు, ఇంటి నెం. ఊరిపేరు, పిన్‌కోడ్, ఫోన్ నెం.లతో సహా వివరంగా మీ అడ్రసును SMS చేయండి. పై ఫోన్ నెంబరు 24 గంటలూ కంప్యూటర్‌కు కనెక్ట్ చేయబడి ఉంటుంది. మీరు పంపే ఎస్.ఎమ్.ఎస్. అడ్రసు ఫోన్ నుండి కంప్యూటర్‌కు వెళ్తుంది. మీ అడ్రసు ప్రకారం మేము కోర్సు మెటీరియల్ పంపుతాము. దయచేసి ఫోన్‌లో అడ్రసు చెప్పడానికి ప్రయత్నించవద్దు. SMS పంపడానికి అవకాశం లేనివారు ఈ ప్రకటనలో ఉన్న కూపన్‌ను పూర్తిచేసి పంపండి.

**STUDENTS' ENGLISH INSTITUTE**

No.17/A, Chari Street, T. Nagar, Chennai - 600 017.

నాకు కోర్సు మెటీరియల్ పంపండి. పోస్ట్‌మేన్‌కి రూ.600/- + 30/- (M.O.కమీషన్) మొత్తం రూ.630/-లు చెల్లించి ప్యాకెట్‌ని తీసుకుంటానని హామీ ఇస్తున్నాను.

Name: ................................................

Address: ................................ Pincode

# ఆమెలో సరస్వతీదేవిని చూశాను



గోపిని కరుణాకర్
దర్శకుడు

నాకు మా అమ్మమ్మంటే ప్రాణం. తిరుపతి కొండంటే ఇష్టం. నామాలాయన (వెంకన్న) గుడిలోని ప్రసాదాలంటే చాలా ఇష్టం. మీకు నామాలాయన దేవుడు. నాకు క్లోజ్ ఫ్రెండ్.

పడమర మాడ వీధిలో మా అమ్మమ్మ (కేసు ఈశ్వరమ్మ) వాళ్ల ఇల్లు ఉండేది. ఆ ఇంట్లోనే నేను పుట్టాను. మా ఇంటికి ఆనుకుని మైసూరు సత్రం ఉండేది. వెనుక పూల తోటలు, పనస తోటలు, ఆ తోటల్లో గెస్ట్‌హౌస్‌లు ఉండేవి.

గుడికి నాలుగు వైపులా నాలుగు వీధులు. ఆ వీధుల్లో ఉండూరోళ్ల అంటే స్థానికుల ఇళ్లు ఉండేవి. మఠాలు ఉండేవి. సత్రాలు ఉండేవి.

నామాలాయన గుళ్లో నుంచి బయటకొచ్చి నాలుగు మాడ వీధుల్లో ఊరేగుతుంటే చూడటానికి రెండు కళ్లు చాలవు. మనసుని కన్నుగా చేసుకుని చూస్తే తప్ప సంతృప్తి ఉండదు. బ్రహ్మోత్సవాల రోజుల్లోనైతే ఆ వైభోగాన్నీ, ఆ సౌందర్యాన్నీ వర్ణించలేను.

ముఖ్యంగా గరుడ సేవ రోజు దేవుని విశ్వరూపాన్ని చూస్తారు. ఆ రోజు నామాలాయన ఫ్రెండ్‌లా అనిపించడు. దేవుడిలా అనిపిస్తాడు. మామూలుగానైతే నామాలాయన భుజాల మీద చేతులేసి నడవాలనిపిస్తుంది. ఆ రోజైతే చేతులెత్తి మొక్కాలనిపిస్తుంది. ఇందిరాగాంధీ, వి.వి.గిరి, నీలం సంజీవరెడ్డి, శంకర్ దయాళ్‌శర్మ, ఎమ్మెస్ సుబ్బులక్ష్మి లాంటి మహానుభావులు దేవుని వాహనాన్ని తమ భుజాలపై మోయటాన్ని నేను చూశాను. గర్భగుడి చుట్టూ పొర్లుదండాలు పెట్టడం చూశాను.

నా బాల్యమంతా పడమర మాడ వీధిలోనే గడిచింది. మా ఇంటికి ఎదురుగా వైఖానస ఆశ్రమం ఉండేది. ఎమ్మెస్ సుబ్బులక్ష్మి వస్తే ఆ సత్రంలో దిగేవారు. స్టార్ హోటల్లో రూమ్ ఇచ్చినా ఆమె ఉండేది కాదు. ఏసీ గదులు ఆమెకు ఉక్కపోతగా అనిపించేవి.

వైఖానస ఆశ్రమంలో ఆమె సాక్షాత్తూ సరస్వతీ దేవిలా తిరుగుతుండేది. కంచ పోసుకుని, తమిళ అయ్యంగార్ల స్టైల్లో చీర కట్టుకునేది. పొడవాటి జడని చుట్ట చుట్టుకుని కొప్పు వేసుకునేది. కనకాంబరాలు, మల్లెపూలు, సన్నజాజులు కొప్పులో ముడుచుకునేది. పచ్చని పసుపు కొమ్ములా ఉండేది ముఖం. రూపాయి కాసంత ఎర్రని బొట్టు, పడుతున్న పొద్దులా కాంతివంతంగా ఉండేది. సంపెంగ పుష్పంలాంటి ముక్కుకి రెండు వైపులా ముక్కు పుల్లలు, చెవుల్లో రాళ్ల కమ్మలు,



బంగారు అంచు పట్టు చీర, కొంగుని నిండుగా కప్పుకుని, చేతిలో తంబూర పట్టుకుని నాలుగు మాడవీధుల్లో నడుస్తూంటే సాక్షాత్తూ సరస్వతీదేవి నడుస్తున్నట్టు ఉండేది. ధనుర్మాసంలోనైతే నెలరోజుల పాటు తన బృందంతో కొండ మీదే ఉండేది. ఆమె భర్త సదాశివంగారు భక్తుడిలా సపర్యలు చేసేవాడు. మాకు ఆవులుండేవి. పొద్దునే ఐదు గంటలకంతా పాలు పిండి, మా ఇంట్లో ఎవరో ఒకరు ఆమెకు పాలు పట్టుకెళ్లేవాళ్లు. ఒక్కొక్కసారి నా వంతు.

అప్పుడు నాకు పదేళ్లుంటాయేమో! నాకు ఆవిడ అంత గొప్ప వ్యక్తి అని తెలీదు. గుడికి ఎదురుగా ఉండే సదస్సులో పాట పాడే సుబ్బమ్మవ్వగానే తెలుసు. సుశీల, జానకి లాగా తమె సినిమా పాటలు ఎందుకు పాడదో, అన్న అనుకునేవాణ్ణి.

ధనుర్మాసంలో వేకువ జామునే లేచి, చన్నీళ్ల స్నానం చేసి, తన భర్తతో, తన బృందంతో పాటు తిరుప్పావై కీర్తనల్ని ఆలపిస్తూ నాలుగు మాడవీధుల్లో తిరిగేవాళ్లు. సాక్షాత్తూ గోదాదేవి భక్తి పారవశ్యంతో పాడుతున్నట్లు ఉండేది.

పొద్దున్నే లేచి చూడాలి ఆ దృశ్యాన్ని. దట్టమైన మంచులో మన పక్కనుంచి అలా సంకీర్తన చేసుకుంటూ వెళుతుంటే, మేఘాల మీద నడుచుకుంటూ, సంకీర్తన చేస్తున్న నారద తంబుర బృందంలా అనిపించేది.

నాలుగు దిక్కులు గొంతెత్తి భక్తితో కోరస్ పాడేవి. ఆమె తన బృందంతో మహాద్వారంలో నుంచి గుడిలోకి అడుగు పెట్టగానే, నామాలాయన తన భార్యలైన శ్రీదేవి, భూదేవిలతో సహా ఎదురొచ్చి, పూర్ణకుంభంతో ఆహ్వానం పలుకుతున్నట్టు, ఆమెకోసం గర్భగుడిలో దేవుడు ఎదురు చూస్తూ ఉండేవాడు. ఆమెతో పాటు మనం కూడా గుడిలోకి అడుగుపెడితే, సాక్షాత్తూ వైకుంఠంలోకి అడుగుపెట్టినట్లే ఉండేది.

త్యాగరాజు ఆనంద నిలయంలోకి అడుగుపెట్టి 'తెర తీయగరాదా' అని పాడుతుంటే మనం చూళ్లేదు. దేవుని బ్రహ్మోత్సవాలను అన్నమయ్య వర్ణిస్తూ ''బ్రహ్మమొక్కటే పర బ్రహ్మమొక్కటే! తందనానా భళా తందనానా'' అని, ''బ్రహ్మ కడిగిన పాదము! బ్రహ్మము తానైన పాదము'' అని కీర్తనలు ఆలపిస్తుంటే మనం చూళ్లేదు. కానీ ఎమ్మెస్ సుబ్బులక్ష్మిగారు దేవుని ముందు నిలబడి సుప్రభాతం ఆలపిస్తుంటే, భజగోవిందాన్ని భక్తి పారవశ్యంతో ఆలపిస్తుంటే నేను చూశాను. డి.కె.పట్టమ్మాళ్, ఎం.ఎల్.వసంతకుమారి, ఎం.ఎస్.సుబ్బులక్ష్మి త్రయం పాడితే సాక్షాత్తూ మహాశక్తి, మహాలక్ష్మి, మహా సరస్వతి కచేరీ చేస్తున్నట్టుండేది.

ఆ వయసులో నాకు అనిపించలేదు కానీ, ఇప్పుడు ఆ సంఘటనని ఊహించుకుంటూ ఉంటే, ఒళ్లు పులకరిస్తూ ఉంది.

అజ్ఞాతవాసం



ఈ గాలి ఈ నేల ఈ ఊరు సెలయేరు... ఎంత అందమైన పాట! ఆ పాట పాడే వ్యక్తి చూడలేడు. కానీ మనసుతో ప్రకృతిని దర్శించగలడు. గొంతుతో గొప్పగా వర్ణించగలడు. మన మనసుల్ని స్పర్శించగలడు. అందుకే ఆ గానం మనకు గుర్తుండిపోయింది. ఆ గాయకుడి పాత్ర పోషించిన వ్యక్తి రూపం కూడా తలపుల్లో నిండిపోయింది. కళ్లు లేనితనాన్ని పాటకు ఉన్న దివ్యదృష్టిని కలగలిపి అద్భుతంగా తెరపైన ఆవిష్కరించిన ఆ వెండితెర 'వెన్నెల' ఏమైంది? కళాతపస్వి తెరకెక్కించిన ఆ నట వైభవం నేడు ఎక్కడుంది?

# సిరివెన్నెల... సర్వదమన్ ...

సిరివెన్నెల సినిమాలో వేణువూదుతూ ప్రేక్షకుల ఆనందసాగరాల్ని ఈదేలా చేసిన అంధ గాయకుడి పాత్రలో సర్వదమన్ బెనర్జీ జీవించారు. నటనకు ఆస్కార మున్నదైతే వచ్చిన అవకాశం హీరో అయినా, విలనైనా ఒకటేనంటూ స్వయంకృషి ద్వారా నిరూపించిన బెనర్జీ... జన్మతః బెంగాలీ. కలకత్తా వాసి.

**సూక్ష్మంలో మోక్షం...**

తక్కువ సమయంలో, అతి తక్కువ పాత్రలే దక్కించుకున్నా అన్నీ అపురూపాలే' కావడం సర్వదమన్ సాధించిన గొప్ప విజయం. అందమైన రూపంతో పాటు కమర్షియల్ హీరోగా రాణించేందుకు అన్ని అర్హతలున్నా... వాటి కోసమే తాపత్రయ పడకుండా, చేసిన ప్రతి పాత్రా చిరస్థాయిగా నిలిచి పోవాలని తపించాడాయన. సిరివెన్నెల, స్వయంకృషి... కథకూ సంగీతానికీ పట్టం కట్టిన ఈ సినిమాల పేర్లు చెప్పగానే ఆయన వెంటనే గుర్తొస్తారు. శ్రీ దత్త దర్శనం (తెలుగు), ఆది శంకరాచార్య (సంస్కృతం), స్వామి వివేకానంద వంటి చిత్రాల్లోని పాత్రల్లో ఆయన నటన ఆకట్టుకుంటుంది. అన్నీ ఆధ్యాత్మిక, సంగీత ప్రాధాన్యమున్న కళా ఖండాలలో నటించిన బెనర్జీ... బుల్లితెర మీద కూడా పెద్ద విజయాలే నమోదు చేశారు. రామానంద్‌సాగర్ సృష్టించిన 'శ్రీకృష్ణ'తో టీవీ ప్రేక్షకుల అభిమాన నట 'దైవం'గా అవతరించారు. ఓం నమశ్శివాయ, జై గంగామాయ, అర్జున, ఓ ప్రేమ కథ తదితర చిత్రాల్లోనూ నటించారు. తొలి తెలుగు సినిమాతోనే 'నంది'ని అందుకున్న ఈ విలక్షణ నటుడు, సంస్కృతంతో సహా పలు భాషల సినిమాల్లో తనదైన అభినయముద్ర వేసిన ఈ అరుదైన సినీ కళాకారుడు... వయసు మీరకపోయినా ఎందుకని విశ్రమించాడు? పరాజయాలు చుట్టుముట్టక పోయినా పక్కకి ఎందుకు తొలగిపోయాడు?

**కేరాఫ్ హృషికేష్...**

మహోన్నతమైన పాత్రలో లీనమై నటించాక, 'ఆ పాత్ర పోషణ వ్యక్తిగతం గానూ మమ్మల్ని చాలా ప్రభావితం చేసింది' అని చెప్పే ఎందరో నటీనటులను చూస్తుంటాం. అలాంటప్పుడే అని పిస్తుంది... ఈ తరహా పాత్ర పోషణ అనేది కేవలం ప్రేక్షకుల్ని ఆకట్టుకోవడం కోసం మాత్రమే కాకపోవచ్చు. నటుడిగా కన్నా ఒక వ్యక్తిగా తమని తాము పరిపూర్ణం చేసుకోవడం కోసం కూడా కావచ్చునని. ప్రపంచానికి సవ్యమైన తోవను చూపిన ఎందరో చారిత్రక, పౌరాణిక దార్శనికుల పాత్రల్ని చిన్న వయసులోనే పోషించిన సర్వదమన్ బెనర్జీ జీవిత గమనాన్ని గమనించినప్పుడు అదే నిజమనిపిస్తుంది. చక్కని పాత్రల్ని చిక్కటి నటనతో రక్తి కట్టించిన సర్వదమన్... ఆ పాత్రల ప్రభావానికి బాగా లోనైనట్టు కనిపిస్తుంది.

ప్రస్తుతం ఆయన చిరునామా ఆధ్యాత్మిక కేంద్రమైన హృషికేష్. అక్కడ ఉన్న రాజాజీ నేషనల్ పార్క్‌లో ఆయన ధ్యానం నేర్పే పనిలో ఉన్నారు. యోగా, ధ్యాన గురువుగా ప్రశాంతమైన జీవితాన్ని గడుపుతున్న సర్వదమన్ 'శ్రీకృష్ణ' పాత్రతో బాగా ప్రభావితమైనట్టుగా కనిపిస్తారు. ఆ సీరియల్ ద్వారా వచ్చిన ప్రాచుర్యాన్ని, తనను అచ్చం కృష్ణ భగవానుడి ప్రతిరూపంగానే భావించే అభిమానుల వాత్సల్యాన్ని ఆయన ప్రస్తుతం వినమ్రంగా ఆస్వాదిస్తున్నారు. ''ప్రపంచానికి ప్రేమను, వెలుగును పంచడమే నా లక్ష్యం'' అంటూ ఫేస్‌బుక్ ద్వారా నెట్'జనుల'కు ప్రేమ, శాంతి సందేశాలను వినిపిస్తున్నారు. 36 ఏళ్ల వయసులో సినిమాల నుంచి నిష్క్ర మించిన తర్వాత ఆయన హృషికేష్‌కు తన మకాం మార్చారు. సినీరంగానికి, హంగు ఆర్భాటాలకి దూరంగా, కుటుంబ సమేతంగా అక్కడే నివసిస్తున్నారు. ఆయన ఇంటిలోకి ప్రవేశించగానే అపురూప శివలింగం మనకు సాక్షాత్కరిస్తుంది. ఇంటా బయటా ఆధ్యాత్మిక భావాలను వ్యాప్తి చేయడమే లక్ష్యంగా ఆయన కృషి చేస్తున్నారు.

'విజయాలు, ఓటములు దినచర్యలో చిన్నభాగం మాత్రమే. జీవితానికి అంతకు మించిన లోతైన నిర్వచనం ఉంది' అంటూ ఎన్నో మంచి మాటలు చెప్తున్నారు సర్వదమన్. ప్రశాంతతను కోరుకునేవారి వల్ల ప్రపంచానికి మేలు కలుగుతుంది. ఈ నిన్నటి ఉత్తమనటుడు ఆశిస్తున్న ప్రశాంతత ఆయన చుట్టుపక్కల కొలువుదీరాలని మనమూ ఆశిద్దాం.

● ఎస్.సత్యబాబు



**ఆయన్ని మనం విని ఉంటాం, కానీ గుర్తించి ఉండం. దానికి శ్రోతలుగా మనల్ని మనం తప్పు పట్టుకోవాల్సిన పనిలేదేమోగానీ, తెలుసుకోవాల్సిన అవసరమైతే ఉంది. భిన్న సొబగుల పూలు జతచేసి స్వరాల మాల కట్టేవాడు సంగీత దర్శకుడనుకుంటే గనక... అందులోకి ఇమిడిపోయి, ఆ పరిమళాల్లో పరిమళంగా కలిసిపోయి, సొంత అస్తిత్వాన్ని, రద్దుచేసుకుంటూనే ఏకకాలంలో తనదైన అస్తిత్వాన్ని, నిలుపుకునే ఒక 'పక్క వాద్యం'. ఒక సంగీత పుష్పం ... వై.ఎన్.శర్మ. తెలుగు సినిమా మహోజ్జ్వల దశ నుంచి కొన్ని వందలు, వేల పాటల్లో ఆయన వయొలిన్ నాదమై కలిసిపోయారు. ఘంటసాల నుంచి ఇళయరాజా దాకా ఎందరో సంగీత దర్శకులతో పనిచేసిన యనమండ్ర నాగయజ్ఞశర్మ అంతరంగం ఈవారం...**

# వయొలిన్ శర్మ

పూర్వీకులు చేసిన పుణ్యఫలాలు... వారసత్వంగా మనకూ అందుతాయని నమ్మే కుటుంబంలో పుట్టాను. పొడగట్లపల్లి (తూర్పు గోదావరి) ఎందరో సదాచార సంపన్నులకు నిలయం. 'పిడపర్తివారి పంచాంగం' అంటారు చూడండి... ఆయనది మా ఊరే.

## యజ్ఞంచేస్తే పుట్టానని...

మా నాన్న పాఠశాలల్ని తనిఖీ చేసే అధికారిగా పనిచేశారు. అయితే, యజ్ఞయాగాదులు చేసిన కుటుంబం కావడన, ఆయనా అగ్నిష్టోమం చేయ సంకల్పించారు. ఆ కాలంలో త్రికాలసంధ్యకు ఆటంకం రాకుండా ఉద్యోగానికి రాజీనామా ఇచ్చారు. ఆ యజ్ఞం తర్వాత నేను పుట్టాను కాబట్టి, నాకు నాగయజ్ఞశర్మ అని పేరు పెట్టారు. తర్వాత ఇంకో తమ్ముడు (సుబ్రహ్మణ్య శాస్త్రి) కలిగాడు.

## అమ్మే ఆదిగురువు

మా మేనమామ (ఆకెళ్ల వెంకట్రామయ్య) వయొలిన్ వాయించేవారు. అమ్మకు హార్మోనియం వచ్చు. అమ్మ అలా ఇంట్లో హార్మోనియం ముందేసుకుని పాడుతుంటే, నేను అలాగే కళ్లార్పకుండా, చెవులప్పగించి వినేవాణ్ని. అదిగో, అప్పుడే నాకు సంగీతబీజం పడింది. అప్పటికింకా కుర్రకుంకని.

చదువు కోసమని ప్రత్యేకంగా బడికి వెళ్లిందే లేదు. నాన్న ఏవో అక్షరాలు పెట్టించడం, అమ్మ వాటిని దిద్దించడం... వంశపారంపర్యంగా వేదం చదివిన కుటుంబం కాబట్టి, నాకూ ఉపనయనం జరిగాక రేమిళ్ల అవధానులకు అప్పగించారు. ఆ గురుకులంలోనే చదువు. మధ్యలో, బందరులో ఆరు మాసాలు హరినాగభూషణం మాస్టారి దగ్గర వయొలిన్ నేర్చుకున్నాను. ఆ పునాదే, నన్ను నేను నిర్మించుకోవడానికి కారణమైంది.

## పన్నెండేళ్లకు వివాహం

ఏదో ఒక శుభకార్యంలో మా మామగారు నన్ను చూసి, "ఆ అబ్బాయి ఎవరు?" అని ఆరా తీశార్ట. ఫలానా వేంకట సోమయాజి సంతానమని తెలియగానే, మా ఆస్తిపాస్తులు ఏమిటి లాంటి వివరాలతో సంబంధం లేకుండా సంబంధం కలుపుకోవడానికి వచ్చారు. అలా, పన్నెండవ ఏటే నా జీవితంలోకి సరస్వతి ప్రవేశించింది.

సహధర్మచారిణి అడుగిడిన వేళావిశేషం అంటారు... అప్పటికి నాన్న ఉద్యోగం మానేయడం వల్ల ఆదాయం లేదు. కుటుంబం ఎలా సాగాలి? దీనికితోడు మరో కొత్త మనిషి. ఉన్నచోటు నుంచి స్థానభ్రంశం చెందితే దోషం పోతుందని అందరమూ బందరు (మచిలీపట్నం; కృష్ణాజిల్లా) వెళ్లిపోయాం. అప్పుడే నా సినీ ప్రస్థానానికి దారులు దొరికాయి.

## 'బాలమురళీకృష్ణ మాకు బాల్యమిత్రుడే'

ఉదర పోషణార్థం నేను పనిచేయడం ప్రారంభించాను. వయొలిన్ వచ్చినందువల్ల బందరులోని నోబెల్ ట్రెయినింగ్ స్కూల్లో ఒక పీరియడ్ మ్యూజిక్ క్లాస్ బోధించే పని దొరికింది. అలాగే హరికథలు చెప్పేవాణ్ని. బందరుతో పాటు బాపట్ల, గుంటూరు... ఇలా ఊళ్లు తిరుగుతూ ఉండేవాణ్ని. కచేరీలూ చేసేవాళ్లం. బాలమురళీకృష్ణ, మహావాది వెంకటప్పయ్య, రాజనాల వెంకట్రామయ్య లాంటివాళ్లు గాత్రధారులు. నేను వయొలిన్. ఇంకా పక్కవాద్యాలుండేవి. శ్రీరామనవమి, వినాయకచవితి లాంటి పండుగలు వచ్చాయంటే వేడుకలు జరిగినన్నాళ్లూ మాకు కచేరీలు దొరికేవి.

అటు కుటుంబాన్ని పోషిస్తూనే, ఇటు ఆంధ్ర విశ్వవిద్యాలయం మ్యూజిక్ డిప్లొమా చేయసాగాను. సహధర్మచారిణి

సహకారం లేకుండా ఏ మనిషీ పైకిరాలేడు, సంతృప్తిగా జీవితం గడపలేడు. తొలి సంతానమైనా పురిటికి పుట్టింటికి వెళ్లకుండా సరస్వతి మాతోనే ఉండిపోయింది. మాధవి పుట్టినాటికి నాకు పంతొమ్మిది. తనకు పదిహేను.

## సినిమా ఆసక్తి

లోయర్, హయ్యర్ మ్యూజిక్ డిప్లొమా చేతికి వచ్చింది(1850). శాస్త్రీయ సంగీతపు వాడినే అయినా, సినిమా సంగీతమూ ఆసక్తిగొలిపేది. నేను సంపాదించిన పదో, పరకో నాన్న చేతిలో పెడితే... ఒక పావలా ఇచ్చి, ''సినిమా చూసి రా''పొమ్మనేవారు. 'ఆకాశవీధిలో అందాల జాబిలి' పాట విని స్వరాలు రాసుకునేవాణ్ని. 'పిలిచిన బిగువటరా' అని వినిపిస్తే అదేం రాగమో కనిపెట్టేవాణ్ని. వాటిని వయొలిన్ మీద సాధన చేసేవాణ్ని. 'విప్రనారాయణ, దేవదాసు లాంటి చిత్రాల పాటలు వయొలిన్ మీద వాయించబడును' అని ప్రచారం చేసి, సోలో ప్రదర్శనలిచ్చేవాణ్ని.

## మద్రాసు ప్రయాణం

నాన్న అప్పటికే స్వర్గస్థులయ్యారు. సంసార రథాన్ని లాక్కొస్తున్నాను. టీవీ సుబ్బారావు అని... వాళ్లింటికి మ్యూజిక్ మాస్టారిగా వెళ్తుండేవాణ్ని. వాళ్లబ్బాయి తిలక్... కేవీ రెడ్డి 'దొంగరాముడు' తీస్తున్నప్పుడు ఆయన దగ్గర సహాయదర్శకుడిగా పనిచేసేవారు. ''మీలాంటివాళ్లు ఇక్కడ కాదు, మద్రాసులో ఉండాలి,'' అని తిలక్ నన్ను మద్రాసు తీసుకెళ్లి ఘంటసాలకు పరిచయం చేశారు (1854). ఆయన కూడా నాపేరు కర్ణాకర్ణిగా వినివున్నారు.

ఆయన పాడిన పాటలన్నీ వాయించి చూపాను. ఆనందపడి, అక్కున చేర్చుకున్నారు. ఘంటసాల సంగీత బృందంలో సభ్యుడినయ్యాను. కాల్‌షీట్ అంటే ఏడు గంటలు. ఒక్క కాల్‌షీట్ పనిచేస్తే వంద రూపాయలిచ్చేవారు. తర్వాత అదే ఐదువందలయ్యింది, వెయ్యయింది.

'మాయాబజార్' నుంచి ఘంటసాల సంగీత దర్శకత్వం వహించిన అన్ని సినిమాలకూ పనిచేశాను. 'తమ్ముడూ' అంటూ ఎంతో ఆత్మీయంగా చూసుకునేవారు. ''శర్మ లేకపోతే రికార్డింగుకు పోలేను,'' అనేవారు. నాకు ఇంకో అదృష్టం ఏమంటే– పింగళి నాగేంద్రరావు అద్దెకున్న ఇంట్లోనే మేము పై భాగంలో ఉండేవాళ్లం. విజయావారికి ఆయన ఆస్థాన రచయిత కాబట్టి, గొప్ప చిత్రాల్లో పనిచేసే అవకాశం వచ్చింది.

పరిశ్రమలో ఉన్నప్పుడు నలుగురి దగ్గర పనిచేస్తేనే మనం బతుకుతాం. ఓగిరాల, భీమవరపు నరసింహారావు, సుసర్ల దక్షిణామూర్తి, అశ్వత్థామ, ఆదినారాయణరావు, చక్రవర్తి, వేదా, మహదేవన్, ఇళయరాజా లాంటి ఎందరి బృందాల్లోనో నేనున్నాను. వారి పాటల్లో ఒక వాద్యంగా కలిసిపోయాను.

## మ్యూజిక్ నిర్వహణ

చలపతిరావు చాలా క్రమశిక్షణ గల మనిషి. ఫలానా టైముకు రికార్డింగ్ స్టార్టవుతుందంటే అయ్యేది, ఇన్నింటికి ప్యాకప్ అవ్వాలంటే అయ్యేది. ''మిగతాది రేపు చూసుకోవచ్చు,'' అనేవారు. కాబట్టి ఆయనతో నాకు బాగా పొసిగింది.

బృందంలో వయొలినిస్టుగానే కాకుండా ఆయనకు సహాయకుడిగా కూడా పనిచేశాను. కొన్ని సినిమాలకు నేనే మ్యూజిక్ కండక్ట్ చేసేవాణ్ని.

అలాగే రమేష్‌నాయుడు! 'అమ్మమాట' ఒప్పుకున్నప్పుడు నన్ను వచ్చి అడిగారు, తన బృందంలోకి రమ్మని. ''నేను పది సినిమాలకు వాయించేవాణ్ని. బిజీగా ఉంటాను,'' అంటే... ''మీరు ఖాళీగా ఉన్నప్పుడే నా రికార్డింగు పెట్టుకుంటా''నన్నారు. అలా మాకూ కుదిరింది. మేఘసందేశం(1883) దాకా ఆయనకు సహాయకుడిగా ఉన్నాను.

సాలూరు, ఘంటసాల, పెండ్యాల లాంటివాళ్లు మహానుభావులు. ఒకవేళ వాళ్లను మనం ఒరేయ్ అన్నా, నవ్వుతూ 'శర్మగారూ, మీరు ఏదో సరదాగా అనేశారుగానీ ఈ వయసులో మమ్మల్ని అనగూడదు' అని ఎంతో సుతిమెత్తగా చెప్పడంలో వాళ్లకు వాళ్లే సాటి. కానీ రమేష్‌నాయుడు దగ్గర వేరు. ఒరేయ్ శర్మ అంటే ఒరేయ్ నాయుడు... ఇదీ వరస! ఆయనకు కోపం జాస్తి. ఒక్కోసారి నేనూ కసురుకునేవాణ్ని. ఇక విడిపోతామేమో అనుకునేంతగా పోట్లాడుకునేవాళ్లం. రికార్డింగు అయ్యాక అంతా మామూలే.

పెండ్యాల, ఎ.ఎం.రాజా చిత్రాలకు కూడా కొన్నింటికి సహాయకుడిగా పనిచేశాను. కొన్ని సినిమాల్లోని పాటలకు స్వరరచన కూడా చేశాను. కానీ ఇప్పుడు నేను చేశానంటే ఎవరు నమ్ముతారు? చెప్పుకోవడం మాత్రం దేనికి? ఏ సంగీతదర్శకుడు ఆ సినిమా ఒప్పుకున్నాడో వాళ్ల ఖాతాలోనే అవి ఉండిపోతాయి.

## ఘంటసాల స్థానంలో యేసుదాసు

'సీతారామకళ్యాణం'(1960) పాటల రికార్డింగు జరుగుతోంది. 'శ్రీ సీతారాముల కళ్యాణం చూతము రారండీ'... పాట. గాలి పెంచల నరసింహారావు సంగీత దర్శకుడు. మొదట ఒకామెతో పాడించారు. మరోరోజు ఇంకొకరితో. మూడోది సుశీల బృందంతో. అంతా అయ్యాక, నిర్మాత త్రివిక్రమరావు డబ్బులు చెల్లిస్తున్నారు. నా దగ్గరికి వచ్చాక, వంద చేతిలో పెట్టారు. ''అదేమిటండీ మూడు రికార్డింగుల్లో పాల్గొన్నాను గదా,'' అన్నాను.

''కానీ తీసుకుంది ఒకటేగా,'' అన్నారు.

''నేనైతే మూడు రికార్డింగులకూ వచ్చానుగదా... ఆ లెక్కన మూడువందలు

## ప్రొఫైల్

| | | |
|---|---|---|
| పేరు | : | వై.ఎన్.శర్మ |
| స్వస్థలం | : | పొదగట్లపల్లి (తూర్పు గోదావరి) |
| పుట్టినరోజు | : | 6 ఆగస్టు 1929 |
| తల్లిదండ్రులు | : | కామేశ్వరి సోమిదేవమ్మ, వేంకటకృష్ణ సోమయాజి |
| ప్రత్యేకత | : | ఘంటసాల, సాలూరు, చలపతిరావు, ఆదినారాయణరావు, రమేష్ నాయుడు, చక్రవర్తి, మహదేవన్, ఇళయరాజా లాంటి ఎందరో సంగీత దర్శకత్వం వహించిన వందల చిత్రాలకు వయొలినిస్టుగా పనిచేయడం. |
| భార్య | : | సరస్వతి |
| సంతానం | : | మాధవి, రామకృష్ణప్రశర్మ, సూర్యనారాయణశర్మ, మణిశర్మ (అవును, సంగీత దర్శకుడు మణిశర్మే!) |


భార్య సరస్వతి, కొడుకు మణిశర్మ, కోడలు శ్రీవాణి, మనవడు మహతి స్వరసాగర్‌తో శర్మ.

ఇవ్వాలిగదా,'' అన్నాను.

''ఆ సిస్టమ్ మా దగ్గర లేదు.''

''అయితే నాకు ఈ వంద కూడా అక్కర్లేదు,'' అన్నాను. ఆయనకు కోపమొచ్చింది. వాళ్ల సోదరుడు, సినిమాకు దర్శకుడూ అయిన ఎన్టీయార్‌కు చెప్పారు. ఇద్దరూ ఘంటసాల దగ్గరికి వెళ్లి, 'రికార్డింగులో కర్చుంటే మీరు పాడటానికి వీల్లేదు' అని చెప్పొచ్చారు. దాంతో ఆయనకు పాలుపోలేదు. ఎలా? ఎలా?

అప్పుడు మాస్టర్ వేణు ఏదో పాట రికార్డింగు చెయ్యాలి, దాన్ని ఘంటసాల పాడాలి. ఘంటసాల కారు దిగకుండా, డ్రైవర్‌ను పంపి నేనున్నానో లేదో చూసి రమ్మన్నారట. ఉన్నానని తెలియగానే ఆయన అట్నుంచటే తిరిగి వెళ్లిపోయారు. రికార్డింగు ఆపడం ఎందుకని... యేసుదాసు అని కొత్తగా వచ్చాడు, ప్రయత్నిందమన్నాను. ఒకటి అనుకున్నది, మూడు ఆయనతోనే పాడించారు.

ఈ రికార్డింగుల్లో నాకు వచ్చింది మూడొందలు. కానీ ఘంటసాలకు పోయింది ఐదువేల చొప్పున పదిహేను వేలు. దాంతో నేను ఆయన్ని ఒప్పించి, పొద్దున్నే త్రివిక్రమరావు దగ్గరకు వెళ్లాం. ''మీరా షరతు విధించారు, నావల్ల ఆయన నష్టపోవడం బాలేదు, కావాలంటే మీ ప్రొడక్షన్స్‌కు నన్ను తీసుకోవద్దు,'' అన్నాను. అప్పుడే మేకప్ వేసుకుని బయటకు వచ్చిన ఎన్టీయార్‌కు ఈయన విషయం చెప్పారు. నన్ను చూస్తూ– ''మీకిది న్యాయంగా తోచిందా?'' అని అడిగారు ఎన్టీయార్.

''అవునండీ, తోచింది.''

''సరే కానీండి,'' అన్నారు.

తర్వాత వాళ్లకు నేను పనిచేయక పోయినా, మర్యాద అలాగే కొనసాగింది. ఆయన్ని చూడాలని మా ఊరి బంధువులొస్తే తీసుకెళ్లాను. కాఫీలిచ్చి మర్యాదగా పంపారు.

## అయితేనే లోపలికి రండి..

నిజానికి నేను ఎన్ని సినిమాలకు పనిచేశానో గుర్తుపెట్టుకోలేదు. ఆ వివరాలు రాసి పెట్టుకోలేదు. చేసుకుంటూ వెళ్లానంతే. అయినా నాలాంటి వాళ్లెంత మంది! కీరవాణిలాంటి బిడ్డ పుట్టడంవల్లే శివశక్తిదత్తా గురించి మాట్లాడుతున్నాం. మణిశర్మలాంటివాడు నా కుమారుడు అయినందువల్లే నా ప్రతిభా వెలుగులోకి వచ్చిందనుకుంటాను.

మణి నాకు క్యారియర్ తెచ్చేవాడు, కీబోర్డు, గిటార్ ఎలా వాయిస్తున్నారో గమనించేవాడు. ఫలానా గదిలో ఇళయరాజా రికార్డింగ్ చేస్తున్నారంటే, చూడ్డానికి నన్ను అనుమతి తీసుకొమ్మనేవాడు. వాడిమీద చదువుల పోరు పెట్టకుండా ఇందులోనే వదిలేశాను. అనుకున్నట్లుగానే సంగీత దర్శకుడయ్యాడు.

ఓసారి పెండ్యాల చిత్రానికి రికార్డింగుకు వెళ్లి, ఇంటికి ఆలస్యంగా వచ్చాను. ''ఈ వయసులో మీరు పనిచేయడమేమిటి? అమ్మను శ్రమ పెట్టొద్దు, మీరూ శ్రమ పడొద్దు,'' అన్నాడు. ఇక నుంచీ రికార్డింగులకు వెళ్లనని చెబితేనే లోపలికి పోనిస్తానని గుమ్మానికి అడ్డంగా పడుకున్నాడు. ఇక అదే ఆఖరు.

ఇప్పుడు నాకు ఎనభై ఏళ్లు దాటాయి. పొద్దున రెండు గంటలకే లేస్తాను, స్నానాదికాలు ముగించుకుంటాను, బ్రాహ్మీ ముహూర్తంలో పూజలో కూర్చుంటాను. దైవనామ స్మరణలోనే రోజు గడిచిపోతుంది. బాల్యంలో గోదారి గట్టుకెళ్లి స్నానాలు చేయడం, సంధ్యావందనం చేయడం... ఆ తలపులన్నీ గుర్తొస్తాయి. ఈ అపార్ట్‌మెంట్లో గంగ లేదు, గోదావరి లేదు. అన్నింటినీ మనలోకి ఆవాహన చేసుకోవడమే!

సంభాషణ: రాజిరెడ్డి

## సరిగమపదని...



మద్రాసులోని సంగపల్లూరు రాజరాజేశ్వరి ఆలయ గాలిగోపురం నిర్మాణానికి సాయపడిన సందర్భంలో: వై.ఎస్.శర్మ, ఘంటసాల, పూజారి రాజగోపాల్, కె.వి.మహదేవన్

- లవకుశ, దేవుడు చేసిన మనుషులు, మాయాబజార్, పాండవ వనవాసం, మేఘ సందేశం, లాతామనవడు, మూగ మనసులు, లాంధ్ర పాపారాయుడు, గుండమ్మకథ, మీనా, దేవదాసు(కృష్ణ), దత్తపుత్రుడు, అమరశిల్పి జక్కన, నర్తనశాల, సువర్ణసుందరి... వై.ఎస్.శర్మ పనిచేసి, గుర్తు తెచ్చుకోగలిగిన కొన్ని సినిమాలు. శివరంజనిలో 'జోరుమీదున్నావు తుమ్మెదా' పాటలో వినిపించే వయొలిన్ నాదం ఆయనదే.
- సుమనశరంజని లాంటి అరుదైన రాగంలో 'ఊహలు గుసగుసలాడే' (బందిపోటు) లాంటి పాటల్ని ఘంటసాల స్వరపరచడంలో శర్మ భాగస్వామ్యం ఉంది. ఆయనతో ఎన్నో కచేరీల్లోనూ పాల్గొన్నారు. ఘంటసాల దగ్గర జేవీ రాఘవులు, శర్మ సహాయకులుగా ఉండేవారు.
- బెంగాలీలో 5, హిందీలో 3 చిత్రాలకు ఆయన సంగీత దర్శకత్వం వహించారు. ఈ బెంగాలీ చిత్రాలన్నీ నిర్మించింది మరో సంగీత దర్శకుడు రమేష్‌నాయుడు.
- సంగీత దర్శకులు సత్యం, జీకే వెంకటేష్, రాజన్-నాగేంద్ర బృందాల్లో కన్నడం; ఎం.ఎస్.విశ్వనాథన్‌తో తమిళంలో పనిచేశారు.
- మహదేవన్ స్వరాలు ఇష్టపడతారు.
- ఎట్టి పరిస్థితుల్లోనూ ఇంగ్లీషు చదవకూడదని ఒట్టు వేయించుకున్నారట వాళ్ల నాన్న.
- ఎన్టీయార్ ఎపిసోడ్ సమయంలో శేఖర్ (ఏఆర్ రెహ్మాన్ తండ్రి)... 'ప్రతిభ ఉన్నవాళ్లు... మీకేం భయం సార్' అని తమిళ, కన్నడ చిత్రాల్లో అవకాశాలు ఇప్పించారట. ఆ దశలో ఆర్థిక ఇబ్బంది రాకుండా కాపాడింది ఆయనే అంటారు.
- కుమారుడి సంగీతం నచ్చని సందర్భాల్లో, ''నాయనా రూట్ పాడుచేయకురా,'' అని మొదట్లో హెచ్చరించేవారట. ''నాన్నగారూ, నన్నిక కంట్రోల్ చేయొద్దు, అందరితోపాటే నేనూ,'' అన్నారట ఓ రోజు మణిశర్మ.
- మూడేళ్ల క్రితం పూజచేస్తూ పడిపోయారట. అపస్మారక స్థితిలోకి వెళ్తే అపోలోలో చేర్చారు. చికిత్స జరిగి, బయటకు వచ్చింతర్వాత ఉన్నట్టుండి దర్శం ఊడిపోవడం మొదలైందట. ''మందుల ఓవర్‌డోస్ వల్ల ఇలా అయ్యిందేమో,'' అన్నారు.

## Icon of the Week

**పేరు : నిఖిల్ బెనర్జీ (1931-1986)**
**ఊరు : కలకత్తా**
**సందర్భం: జయంతి (ఆదివారం)**

పేరుపొందిన సితార్ విద్వాంసుడు జితేంద్రనాథ్ బెనర్జీ కొడుకు అయిన నిఖిల్ బెనర్జీ సంగీతాన్ని తండ్రి నుంచి వారసత్వంగా పొంది ఆయన పేరు నిలబెట్టారు.

- బడి వయసు కూడా రాకుండానే సితార్ చేతపట్టారు. స్కూలుకు వెళ్లొచ్చాక రోజూ తండ్రి వద్ద ప్రాక్టీస్ చేసేవారు.
- ఆల్ ఇండియా సితార్ కాంపిటీషన్‌లో విజేతగా నిలిచి తొమ్మిదేళ్లకే ఆల్ ఇండియా రేడియోలో ఉద్యోగం పొందారు.
- ఉస్తాద్ అమీర్‌ఖాన్ ప్రభావం నిఖిల్‌పై చాలా ఎక్కువ.
- అమెరికా, యూరప్ దేశాల్లో అనేక ప్రదర్శనలు ఇచ్చారు. ఆయనకు ఆల్బమ్‌లు తయారుచేసుకోవడమంటే అనాసక్తి. అందుకే ఆయన ఆల్బమ్‌లు చాలా తక్కువ.
- గుండెపోటుతో త్వరగానే ఈ లోకాన్ని వదిలి వెళ్లిపోయారు. కూతురు దేవ్‌దత్తా మోడల్, బెంగాలీ నటి.



## Another Mahatma

**పేరు: పద్మజా నాయుడు (1900-1975)**
**ఊరు: హైదరాబాద్**
**ప్రత్యేకత: స్వాతంత్ర్య సమరయోధురాలు**

సరోజినీ నాయుడు కూతురు పద్మజా నాయుడు. స్వాతంత్ర్య మహోద్యమంలో తల్లి వారసత్వాన్ని పుణికి పుచ్చుకుని దేశం కోసం పోరాడారు.

- పదేళ్ల నుంచి స్వాతంత్ర్య పోరాటాల్లో భాగంగా జరిగే సమావేశాలకు తల్లితో పాటు హాజరయ్యేవారు.
- 21 ఏళ్లకే హైదరాబాద్ భారతీయ జాతీయ కాంగ్రెస్ శాఖను ఏర్పాటుచేశారు. స్వదేశీ లీగ్ నెలకొల్పింది ఆమే. క్విట్ ఇండియా ఉద్యమంలో జైలుకెళ్లారు.



- స్వాతంత్ర్యానంతరం క్రియాశీల రాజకీయాల్లో కొన్నాళ్లు కొనసాగారు. ఎంపీగా ఎన్నికైనా రాజీనామా చేసి పశ్చిమబెంగాల్ గవర్నర్‌గా చేశారు.
- రెడ్‌క్రాస్, హస్తకళల సంస్థ, నెహ్రూ స్మారక నిధి వంటి సంస్థలకు సేవలందించారు.
- తన కవితలను 'ది ఫెదర్ ఆఫ్ డాన్' పేరిట ప్రచురించారు.

## Better half



**పేరు : షమీమ్ దేవ్ ఆజాద్**
**w/o: గులామ్ నబీ ఆజాద్**
**ఊరు: జమ్ము**

మనకు ఆమె జాతీయ కాంగ్రెస్ ప్రముఖ నాయకుడు గులామ్ నబీ ఆజాద్ భార్యగా మాత్రమే పరిచయం. కానీ, కాశ్మీరీ ప్రజలకు సుపరిచితురాలు.

- షమీమ్ దేవ్‌కు చిన్నప్పటినుంచే సాహిత్యంపై ఆసక్తి. అయితే, కాలేజీ రోజుల్లో ఆమెకు గీతాలాపనపై ఆసక్తి కలగడంతో సింగర్‌గా పేరు తెచ్చుకున్నారు.
- భర్త ఆజాద్ ఆమెలోని కళను బాగా ప్రోత్సహించేవారు. అప్పటికే రేడియోలో గానాలాపన చేస్తున్న ఆమె టీవీ వైపు కూడా మొగ్గుచూపేందుకు సహకరించారు.
- కాశ్మీరీలపై జరుగుతున్న దాడులను ఆమె తీవ్రంగా నిరసించారు. జానపద గీతాలతో విశేష ప్రచారం తెప్పించారు.
- 'నైటింగేల్ ఆఫ్ కాశ్మీర్'గా ప్రజలు ఆమెను పిలుచుకుంటారు. ఆమె 'హింసను వ్యతిరేకించండి, హక్కుల కోసం పోరాడండి' అంటూ పాడిన 'వియ్ షల్ ఓవర్‌కమ్' గీతం బాగా ప్రసిద్ధి పొందింది. దీంతో పాటు ప్రజలను చైతన్యం చేసే ఎన్నో గీతాలతో సొంతంగా ఆల్బమ్‌లను రూపొందించారు.
- 1970, 80లలో ఆమె చాలా క్రియాశీలకంగా ఉండేవారు.

## Our pride



**పేరు: సుబ్రమణ్యన్ చంద్రశేఖర్ (1910-1995)**
**ఊరు : లాహోర్, పంజాబ్**
**ప్రత్యేకత : నోబెల్ బహుమతి గ్రహీత (1983)**

ప్రపంచ ప్రసిద్ధి పొందిన భౌతిక శాస్త్రవేత్త. నక్షత్రాలపై చేసిన పరిశోధనకు నోబెల్ పొందారు. 20వ శతాబ్దపు ప్రముఖ పాత్రికేయుల్లో ఒకరు.

- ప్రముఖ శాస్త్రవేత్త సర్ సి.వి.రామన్‌కు మేనల్లుడు. తండ్రి రైల్వే ఉద్యోగి. పన్నెండేళ్ల వరకు బడికి వెళ్లలేదు. ఇంట్లోనే తల్లిదండ్రులు, ట్యూటర్ల వద్ద చదువుకున్నారు.
- మద్రాసు ప్రెసిడెన్సీ కాలేజీలో బీఎస్సీ చదువుకుని, ప్రభుత్వ స్కాలర్‌షిప్‌తో ఇంగ్లండ్‌లోని కేంబ్రిడ్జికి వెళ్లారు. అక్కడ పలు విశ్వవిద్యాలయాల్లో చదువుకుని, ఆచార్యులుగా పనిచేశారు.
- ప్రెసిడెన్సీ కాలేజీలో తన జూనియర్ అయిన లలిత దొరైస్వామిని పెళ్లాడారు.
- నక్షత్రాల ద్రవ్యరాశి, వాటి పరిణామక్రమం గురించి ఆల్ఫ్రెడ్ ఫౌలర్‌తో కలిసి చేసిన పరిశోధనలు విప్లవాత్మక మార్పులు తెచ్చాయి. చంద్రశేఖర్ లిమిట్, బ్రౌనియన్ మోషన్, థియరీ ఆఫ్ ఇల్యూమినేషన్ అండ్ పోలరైజేషన్, మ్యాథమేటికల్ థియరీ ఆఫ్ బ్లాక్‌హోల్స్ వంటి సిద్ధాంతాలను కనుగొన్నారు.

రాలిన మొగ్గలు

**పుట్టుకతోనే అవిటి కాలు లార్డ్ బైరన్‌కి. అయినా గజ ఈతగాడు! అమ్మ ప్రేమకు నోచుకోని అభాగ్యుడు కూడా బైరన్. అందుకేనేమో - గాయపడ్డ ఆ మది తెంపరితనాన్ని కోరింది. కవి, రాజకీయవేత్త అయిన బైరన్ జీవితమంతా ఎన్నెన్ని దేశాలు తిరిగాడో! ఎన్నెన్ని ప్రేమ వ్యవహారాలు నడిపాడో! ఆ విహారాల్ని, విశృంఖల శృంగార కలాపాల్ని ఎన్నెన్ని కావ్యాలుగా మలిచాడో! చివరికి ఆ అరాచక సృజనాత్మకతతో అతడు పాపాల బైరన్‌గా పేరుమోశాడు.**

# పాపాల బైరన్



లార్డ్ బైరన్ జన్మించింది పిల్ల జమీందార్‌గా - లండన్‌లో 1788 జనవరి 22న. తల్లి క్యాథరిన్ గార్డన్‌కి విలాసాలంటే ఇష్టం. నిత్యం మద్యపానం, ధూమపానం. నిలకడ లేని చపల చిత్తపు స్త్రీ ఆమె! బైరన్‌ని కుంటి కాలోడా అని తిట్టిపోసేది. దాంతో ఆయాలకు దగ్గరయ్యాడు బైరన్. అదే సమయంలో రాజమందిరాల్లో యవ్వనపు పరిచారికలు తమ వబ్బం కోసం బైరన్‌కి బాగా దగ్గరైపోయేవారు. లేత వయసులో ఘాటు సరసాలు.

అలా బైరన్‌కి తొలిసారి కలయికలోని మాధుర్యాన్ని రుచి చూపించినది మేగ్రే అనే నర్సు. అప్పుడు బైరన్‌కి తొమ్మిదేళ్లే. తెలిసీతెలీని వయసులో వీరి వీరి వాంఛలు, కుదరని లైంగిక పరిత్యాగాలు - వెరసి అగ్నిశిఖలా ఎగసిన శృంగార ప్రవోదనం! ఇదే బైరన్ భావి జీవితాన విచ్చలవిడితనానికి కారణం అయింది! అర్థం కాని ఆ అసంబద్ధ అనుభవాల్ని కవితలుగా రాసేవాడు పద్నాలుగేళ్లకే!

● ● ●

1805లో కేంబ్రిడ్జి విశ్వవిద్యాలయం ట్రినిటీ కాలేజీలో చేరాడు బైరన్. అందరూ దర్జాగా నడుస్తున్నారు. తానేమో అవిటి కాలితో. తొలిసారి దేవుణ్ని తిట్టుకున్నాడు. వెక్కివెక్కి ఏడ్చాడు. కాలు తీసేయమని పదేపదే డాక్టర్లని అడిగేవాడు. దీనికితోడు మనిషి లావు. తనపై తనకే అసహ్యమేసేది బైరన్‌కి. వంకర నడక కనిపించకుండా షూ వేసి కప్పేసేవాడు. అయినా లాభం లేకపోయేది.

ఆ ఆత్మన్యూనత నుంచి బయటపడేందుకు ఎన్నెన్ని వేషాలో. జుట్టుకి వెరైటీ కర్ల్ పేపర్లు పెట్టుకునేవాడు. బాక్సింగ్ నేర్చుకునేవాడు. అథ్లెటిక్స్‌లో పాల్గొనేవాడు. గుర్రపుస్వారీ చేసేవాడు. క్రికెట్ ఆడేవాడు. అన్నింటికీ మించి ఈతకొట్టేవాడు. కాలు వంకర అయినా వీణ్ని అమ్మాయిలు ప్రేమిస్తారని అంతా అనుకోవాలనుకునేవాడు.

అందుకే మేరీ చావర్త్ అనే అమ్మాయిని ప్రేమించాడు. 1803లో మొదలైన ఈ ప్రేమ, ఆమెకు వేరొకరితో పెళ్లయ్యేంత వరకూ సాగుతూనే ఉంది. బైరన్ ప్రణయ గేయాలన్నింటా మేరీ ఏదో ఓ రూపాన తొంగిచూస్తూనే ఉంటుంది. ది డ్రీమ్, లాస్ట్ వర్డ్స్ టు గ్రీస్ లాంటి కవితల్లోని భగ్న ప్రణయ వేదన ఇదే. 'డాన్ జువాన్'లోని లేడీ ఎడిలిన్ ఈమే! మాన్‌ఫ్రెడ్‌లోని నాయిక కూడా మేరీ చావర్తే!

అదే కాలేజీలో పదిహేడేళ్ల బైరన్‌కి పదిహేనేళ్ల జాన్ ఎడిల్‌స్టన్ అనే కుర్రాడితో పరిచయమైంది. ఇద్దరూ ఒకే పక్కలో పడుకునేవారు. చేతులు పట్టుకునేవారు. ముద్దులు పెట్టుకునేవారు. వెచ్చని కౌగిలిలో గిలిగింతలు పెట్టుకునేవారు. 1806లో ది ఫస్ట్ కిస్ ఆఫ్ లవ్, థైర్జా లాంటి కవితలు రాసింది ఈ ప్రణయ సఖుడిపైనే!

మొత్తమ్మీద నిగ్రహి, భయస్థుడు, జాగ్రత్తపరుడు అయిన బైరన్ క్రమంగా ఆడంబరంగా, అనైతికంగా, విచ్చలవిడిగా తన సుఖాలే ప్రధానంగా వరదొచ్చిన నదిలా అయ్యాడు. కాలేజీలో నేర్చుకున్నదిదే!

● ● ●

నాటి రాజకుమారుల సంప్రదాయం ప్రకారం 21వ ఏట (1809) బైరన్ దేశయాత్రకు బయలుదేరాడు. మొదట పోర్చుగల్ వెళ్లాడు. అక్కడి భాష నేర్చాడు. స్పెయిన్, అల్బేనియా పర్యటించి గ్రీస్ చేరాడు. రాజధాని ఏథెన్స్‌లో నికోలా గిరాండ్ అనే అమ్మాయితో పరిచయమైంది. ఆమె ఇతనికి ఇటాలియన్ భాష నేర్పింది. ఇతగాడు ఆమెకు శృంగార పాఠాలు నేర్పాడు.

1810 మే 3న అరడై ఐదు కిలోమీటర్ల హెలిస్పాంట్ జలసంధిని ఈదుకుంటూ టర్కీ వచ్చాడు. ఇలాంటి సాహసం చేసిన తొలి వ్యక్తి బైరన్. టర్కీలోని ఒట్టొమన్ రాజ్యపు నియంతృత్వ పోకడల్ని తెలుసుకున్నాడు. టర్కీ ప్రజల్ని చదివాడు. తన ఇంగ్లండ్ వాసులకు ప్యాషన్ల, తాగుడు, వ్యభిచారము చాలు; ఈ టర్కీవారికి పొగ తాగే పైప్, పురుషుడి మైథున వాంఛ తీర్చే బాలుర క్లైవ్ చాలు. ఏ రాద్ధాంతమేం అనుకున్నాడు.

యాత్ర ముగిసింది. 1811 జూలైలో

లండన్ చేరాడు. అప్పటికి రెణ్నెళ్లముందే తన ఇష్ట సఖుడు జాన్ ఎడ్లిస్టన్ చనిపోయాడని తెలిసి వెక్కివెక్కి ఏడ్చాడు. 1812లో తన యాత్రావిశేషాల్ని 'చైల్డ్ హెరాల్డ్స్ పిల్‌గ్రిమేజ్' పేరిట రాశాడు. బైరానిక్ హీరోగా ఇయా దేశాల్లో ఓనాటక యువకుడి బావోద్వేగ పరంపరల కథనాత్మక దీర్ఘకవిత ఇది. నాలుగు భాగాల ఈ కావ్యంతో బైరన్ రాత్రికి రాత్రి ప్రసిద్ధుడయ్యాడు.

అందరినీ ఆకర్షించాడు. ఆధునిక యుగంలో ఇలా సెలబ్రిటీ హోదాను పొంది, భిన్న కోణాల్లో జీవితాన్ని రుచి చూసిన మొదటివాడు బైరనే. అయిదడుగుల ఎనిమిదంగుళాల పొడవైన బైరన్ అన్నా, అతగాడి కవిత్వమన్నా, విశృంఖలత్వమన్నా, సంప్రదాయానికి లొంగని మగతనమన్నా... అంతా పడిచచ్చేవారు.

కెరోలిన్ లాంబ్ అనే వివాహితతో కూడా బైరన్‌కి సాన్నిహిత్యం ఏర్పడింది. ఆమె భర్త విలియం లాంబ్ ఆపై ఇద్దరై రెండేళ్లకు బ్రిటిష్ ప్రధాని కాబోతాడని అప్పటికా వివాహేతర ప్రేమజంటకు తెలీదు. ఆ రోజుల్లోనే ఆక్స్‌ఫర్డ్ ప్రాంత సామంతరాజ్ 'లేడీ ఆక్స్‌ఫర్డ్' జేన్ హేర్లేతో బైరన్ వడపగడి పంచుకున్నాడు. తన సవతి సోదరి అగస్టా లీతో సన్నిహిత సంబంధం పెట్టుకున్నాడు.

ఈ అగమ్య గమన ప్రవర్తన మొదలుకొని, బైరన్ వ్యవహారాలన్నీ తెలిసిన అందగత్తె అన్నా బెల్లామీన్ బాంకె, బైరన్‌ని ఇష్టపడింది. అతణ్ని మార్చేంత తెలివితేటలు తనకున్నాయనుకుంది. 1815లో ఇద్దరికీ పెళ్లయ్యింది. ఆ తర్వాత ఆమెకు నరకమేంటో అర్థమైంది. ఏడాదిరల్లా పెటాకులైంది. బైరన్‌పై క్రమంగా లైంగిక ఆరోపణలు వెల్లువెత్తాయి. స్వలింగ సంపర్కం, అగమ్య గమనం, మైనర్ బాలికపై అత్యాచారం... ఎన్నో అతనిపై! 1816 ఏప్రిల్ 25న ఇంగ్లండ్ విడిచిపెట్టక తప్పని పరిస్థితి అతనిది. ఇక తిరిగి రానేలేదు బైరన్.

● ● ●

బ్రిటన్ నుంచి బెల్జియం వచ్చాడు బైరన్. ఆపై స్విట్జర్లాండ్ వెళ్లాడు. రైన్ నదీతీరాన గడిపాడు. అక్కడే ప్రణయకవి పి.బి.షెల్లీతో పరిచయమైంది. ఎన్నెన్ని సాహిత్య కబుర్లో. షెల్లీ, లీ హంట్‌లతో కలిసి 'ది లిబరల్' పత్రిక స్థాపించాడు.

షెల్లీ భార్య మేరీ గాడ్విన్ సవతి సోదరి - క్లెయిర్ మాంట్‌తో బైరన్‌కి సాన్నిహిత్యమేర్పడింది. వారిరువురికీ అనధికార సంతతి కలిగినంత గాఢానుబంధమది!

ఆ కాలంలోనే బైరన్‌కి ఎంతో పేరు తెచ్చిపెట్టిన డాన్ జువాన్ అనే కావ్యం రాయడం మొదలెట్టాడు. అక్కడి నుండి ఐరోపా, ఆసియాల సరిహద్దు ప్రాంతమైన యురేషియాలో ఉన్న ఆర్మేనియా

**బైరన్‌కి జంతువులంటే ప్రాణం. బోట్స్వాయిన్ అనే కుక్క అంటే ప్రాణం. దాని సమాధి పక్కనే తననూ పూడ్చమంటూ విల్లు రాసినవాడు బైరన్! గుర్రాలు, నక్కలు, కోతులు, చిలుకలు, పిల్లులు, మొసళ్లు, డేగలు, నెమళ్లు, గినియా కోళ్లు, కాకులు, కొంగలు, నీటి కుక్కలు, ఆడ బాతులు, గొర్రెలు, క్రౌంచ పక్షులు... ఇలా బైరన్ పెంచుకున్న, చెలిమి చేసుకున్న పక్షులు, జంతువులెన్నో! 1809లో బ్రిటిష్ పార్లమెంట్‌లో సభ్యుడైన బైరన్ రాజకీయ ప్రేరేపిత కవితలూ రాశాడు.**


ఆర్మేనియా సైనిక దుస్తులలో బైరన్

చేరుకున్నాడు. అక్కడి స్థానిక భాషలపై పట్టు సాధించాడు. 'ఆర్మేనియన్ - ఇంగ్లిష్ వ్యాకరణం' రచించాడు. ఆంగ్లము - ఆర్మేనియన్ నిఘంటువు కూర్పరిగా పనిచేశాడు. ఆర్మేనియన్ కవులకు స్ఫూర్తిప్రదాతగా నిలిచాడు. అసలు ఆర్మేనాలజీ అనే ఓ విశాలమైన శాస్త్ర ఆవిర్భావానికి మూలపురుషుడయ్యాడు.

● ● ●

1822 నాటికి ఆర్మేనియా ప్రజలతో, అక్కడి ప్రాంతాలతో మమేకమైన బైరన్‌ను నాటి రాజకీయాలు ఆలోచింపజేశాయి. టర్కీలోని ఒట్టొమన్ సామ్రాజ్యం నుంచి స్వాతంత్ర్యం పొందేందుకు గ్రీసు దేశస్థులు పోరాడుతున్న రోజులవి. టర్కీ సరిహద్దు దేశమైన ఆర్మేనియాలో ఉంటున్న బైరన్‌కి 'ఏ దేశచరిత్ర చూసినా ఏమున్నది గర్వకారణం - నరజాతి చరిత్ర సమస్తం పర పీడన పరాయణత్వం' అనిపించింది. గ్రీసు జాతీయ విముక్తి పోరాటాలలో తానూ సమిధనవ్వాలనుకున్నాడు.

1823 జూలై 16న గ్రీసుకు చెందిన ఐయోనియన్ దీవులకు చేరాడు. టర్కీ ఆధీనంలోని లెపాంట్ కోటపై దాడి చేయాలని ప్రణాళిక వేశాడు. గ్రీసు స్వాతంత్ర్య సమరయోధులను సమాయత్తపరిచాడు. యుద్ధ ట్యాంకుల్ని, విధ్వంసక వాహనాన్ని సిద్ధపరచుకున్నాడు. అలాగని బైరన్‌కి సైనిక అనుభవమేమీ లేదు. ఏదో తెలీని ఆవేశం. అంతే!

1824 ఫిబ్రవరి 16న తిరుగుబాటుకు ముహూర్తం పెట్టారు. అంతా సిద్ధమైంది. కాని ఆ ముందురోజు బైరన్‌కి తీవ్రమైన జ్వరం. కొంతకాలం దాటిని వాయిదా వేశారు. విశ్రాంతి తీసుకున్నాడు. జ్వరం తగ్గినట్టే తగ్గి ఎక్కువవడం... అలా అలా చివరకు ఏప్రిల్ 19న మరణించాడు. తర్వాత అయిదేళ్లకు గ్రీసు స్వాతంత్ర్యం పొందింది. బైరన్ బతికుంటే టర్కీని ఓడించిన యోధుడిగా, గ్రీకు రాజుగా స్థిరపడి ఉండేవాడు. అయినా నేటికీ అతడు గ్రీసు ప్రజలకు జాతీయ నాయకుడే!

ఎక్కడో ఇంగ్లండ్‌లో పుట్టి గ్రీసు దేశం కోసం పోరాడడం! కవిగా ప్రారంభమై రాజకీయవేత్తగా, స్వాతంత్ర్య పోరాటశాలిగా ఎదగడం! సంకెళ్లు లేని శృంగార జీవిగా సాగి ఓ దేశపు బానిస సంకెళ్లు తెంపే తెగువ ప్రదర్శించడం! ఇదీ బైరన్ జీవితం!

● ఆకెళ్ల రాఘవేంద్ర

? ఎందుకు

## మంగళవారం నాడు భూమిని తవ్వకూడదని ఎందుకంటారు?



మంగళవారానికి కుజుడు అధిపతి. ఆయనను మంగళుడు, అంగారకుడు అని కూడా అంటారు. అతడు భూమిపుత్రుడు. భూమిని తవ్వడానికి ఉపయోగించే గునపాలు, పారలు వంటి వాటికి కూడా కుజుడే అధిపతి. ఆయన తన సంకేతాలైన గడ్డపారలు వంటి వాటితో తన తల్లి అయిన భూమిని గాయపరుస్తుంటే సహించలేడు. అందుకే మంగళవారం నాడు భూమిని తవ్వకూడదని పురాణాలు చెబుతున్నాయి. అలాగే కుజుడు అగ్నితత్వం కలవాడు కాబట్టి, అగ్ని ప్రమాదాలను నివారించేందుకు గాను, అతడు అధిపతిగా ఉన్న మంగళవారం నాడు భూమిని తవ్వకూడదని జ్యోతిష్యశాస్త్రం చెబుతోంది.

? ఏమిటి

## రెడ్డొచ్చె మొదలాడు...



ఎవరైనా ఏ విషయాన్నయినా మళ్లీ మొదట్నుంచి చెప్పమన్నా, చేయమన్నా 'రెడ్డొచ్చె మొదలు' అంటూ ఉంటారు. దీనికి ఓ సంఘటన కారణం.

అప్పట్లో వీధుల్లో నాట్య ప్రదర్శనలు జరుగుతూ ఉండేవి. వీటిని జనం ఆనందంగా తిలకించేవారు. ఓసారి ఓ నాట్యగత్తె వీధిలో నాట్యం చేస్తూ ఉందట. కాసేపటికి ఆ ఊరి రెడ్డిగారు వచ్చి... తాను ఆటని మొదట్నుంచీ చూడలేదు కాబట్టి, తిరిగి మొదలు పెట్టమన్నారట. ఆమె మళ్లీ మొదటి నుంచి ప్రారంభించిందట. కాసేపటికి మరో రెడ్డి వచ్చి, తాను మొదట్నుంచీ చూడాలి అన్నారట. ఆమె మళ్లీ మొదట్నుంచి చేయడం మొదలుపెట్టిందట. ఇంతాసేపటికి ఇంకో రెడ్డి వచ్చి కూడా అలాగే చేశాడట. ఇలా ఎవరో ఒక రెడ్డి వచ్చి ఇలాగే చేయడంతో తెల్లారేవరకూ ఆట ముగియనే లేదట. అప్పట్నుంచీ ఈ సామెత వాడుకలోనికి వచ్చింది.

? ఎవరు

| శ (అబ్బాయి) | శ (అమ్మాయి) |
|---|---|
| శమక్ - శాంతిని కలుగజేసేవాడు | శ్రవస్తి - ఓ పురాతన నగరం |
| శలంగ్ - చక్రవర్తి | శ్రేయసి - కీర్తి |
| శంకేర్ - శివుడు | శ్రినిత - సృష్టి |

? ఎలా

## నోటి దుర్వాసన పోవాలంటే..!

**చాలా చిన్నదిగా కనిపించినా నోటి దుర్వాసన అనేది చాలా ఇబ్బందికరమైన సమస్య. ఇది మనల్నే కాదు, మన చుట్టూ ఉండేవారిని కూడా చాలా ఇబ్బంది పెడుతుంది. అయితే ఇది వదిలించుకోలేనంత పెద్ద సమస్యేం కాదు. కొన్ని జాగ్రత్తలు తీసుకుంటే సమస్య ముదరకముందే దాని నుంచి బయటపడవచ్చు.**



- రోజుకు రెండుసార్లు ఫ్లోరైడ్ ఉన్న టూత్ పేస్టుతో పళ్లు తోముకోవాలి.
- వీలైనన్ని ఎక్కువ నీళ్లు తాగాలి. అలాగే నోటిని, ముఖ్యంగా నాలుకను ఎప్పుడూ తడిగా ఉంచుకోవాలి.
- చక్కెర ఎక్కువగా ఉండే పదార్థాలను, పిండి పదార్థాలు ఎక్కువగా ఉండే ఆహారాన్ని తీసుకోవడం తగ్గించాలి.
- నోటికి అతుక్కుపోయే ఆహార పదార్థాలు, స్నాక్స్‌కు దూరంగా ఉండాలి.
- సిగరెట్ తదితర పొగాకు ఉత్పత్తుల వాడకాన్ని వదిలిపెట్టాలి.
- నోటిలోని బ్యాక్టీరియాను చంపడానికి రోజుకోసారి మౌత్‌వాష్ లిక్విడ్‌ను పుక్కిలించాలి.
- చిగుళ్ల సమస్యలు ఉన్నా నోరు దుర్వాసన వేస్తుంది కాబట్టి, చిగుళ్లను కూడా ఎప్పటికప్పుడు శుభ్రపరచుకోవాలి.
- జీర్ణక్రియ సరిగ్గా లేకపోతే అన్నాశయంలో ఉండిపోయిన ఆహారం కుళ్లిపోయి, దుర్వాసన గల వాయువులను విడుదల చేస్తుంది. దానివల్ల నోరు దుర్వాసన వేస్తుంది. కాబట్టి జీర్ణక్రియ సరిగ్గా ఉండేలా చూసుకోవాలి.

అప్పటికీ సమస్య తీరకపోతే కచ్చితంగా ఏదో తీవ్రమైన సమస్య ఉన్నట్టు లెక్క. కాబట్టి వెంటనే వైద్యుల్ని సంప్రదించి చికిత్స తీసుకోవడం ఉత్తమం.

? ఎలా చేద్దాం

### హోమ్ టిప్

పాత్రలకు అంటిన కోడిగుడ్డు వాసన పోవాలంటే... టీ డికాషన్‌లో డిటర్జెంట్ పౌడర్ కలిపి తోమాలి.



### హెల్త్ టిప్



అప్పుడే తోడుకున్న తాజా పెరుగులో ఉల్లిపాయ ముక్కల్ని వేసుకుని తింటే ఎసిడిటీ నుంచి ఉపశమనం లభిస్తుంది.

### బ్యూటీ టిప్

బాదం నూనెలో సున్నిపిండి, నిమ్మరసం కలిపి ముఖానికి పట్టించి, గంట తర్వాత కడిగేసుకోవాలి. క్రమం తప్పకుండా ఇలా చేస్తూ ఉంటే మొటిమలు, మచ్చలు తగ్గిపోతాయి.



# సూర్యరశ్మితో మంచినీళ్లు!



గాబ్రియెల్ డియమంతి

టెక్నాలజీ సామాన్యుడికి చేరినప్పుడు దాని లక్ష్యం నెరవేరినట్లు లెక్క అన్నది నిపుణుల మాట. కానీ, కొన్ని కేవలం సామాన్యుల కోసమే పుడుతుంటాయి. అలాంటి ఉత్పత్తి ఒకటి రూపొందించారు ఇటాలియన్ స్టూడెంట్ గాబ్రియెల్ డియమంతి. పలు ఆసియన్ దేశాల్లో పర్యటించిన గాబ్రియెల్‌కు చాలాచోట్ల మంచినీటి కోసం ప్రజలు ఇబ్బందులు పడటం కనిపించింది. మంచినీరు అందుబాటులో లేకపోవడం ఏమిటి? మైళ్లకు మైళ్లు నడిచివెళ్లి ఎందుకు తెచ్చుకోవాల్సి వస్తుంది? దీనికి పరిష్కారం ఏమైనా దొరకుతుందా అని ఆయన చేసిన శోధన, పరిశోధన ఫలితాన్నిచ్చింది. ఎటువంటి ఖర్చు లేకుండా ఉప్పునీటి నుంచి మంచినీటిని తయారుచేసే ఓ పరికరాన్ని కనిపెట్టారు డియమంతి. 'సోలార్ ఓవెన్' అని పిలువబడే ఆ పరికరంలో వాడిన పదార్థాలన్నీ అన్నిచోట్లా దొరికేవే. ప్రస్తుతానికయితే ఇది అందుబాటులో లేదు కానీ, త్వరలో స్వచ్ఛంద సంస్థల ద్వారా మార్కెట్లోకి రావచ్చు. ఈ పరికరం పైన చిన్న మూత ఉంటుంది. దాన్ని తీసి గొట్టంలా ఉండే భాగంలోకి నీరు పోస్తే అది సోలార్ పవర్‌ను ఉపయోగించుకుని ఆవిరి రూపంలో ఆ నీటిని కిందున్న పాత్రలోకి చేరుస్తుంది. ఈ పద్ధతిలో లవణాలను నీటి నుంచి వేరు చేసి కింద ఉన్న పాత్రలోకి వెళ్లేలా చేస్తుంది. అది మట్టితో తయారుచేసిన పాత్ర. ఇది రోజుకు ఐదు లీటర్ల మంచినీటిని తయారుచేయగలదు. దాన్ని కూడా ఆసియా పేదలకు ఖర్చు లేకుండా ఉండే ఉద్దేశంతో, తలమీద పెట్టుకుని తీసుకెళ్లే పద్ధతిలోనే తయారుచేశారు గాబ్రియెల్. దీనికి పేటెంట్ చేయమని చాలామంది చెప్పారు. అయితే ''పేటెంట్ వల్ల అసలు లక్ష్యం నెరవేరదు. పేటెంట్ లేకుంటే దాన్ని ఇతరులెవరైనా మరింత అభివృద్ధి చేసి ఆయా ప్రాంతాలకు తగినట్లు అందుబాటులోకి తెస్తారు'' అంటూ గాబ్రియెల్ తన పెద్ద మనసును చాటుకున్నారు.

## ఏడు కాన్పులు... పదిమంది పిల్లలు...

# బ్రిటన్ తల్లి రికార్డు!



ఒకసారి బిడ్డను కనడమే తల్లికి చచ్చి బతకడం లాంటిదంటారు. మరలాంటిది ఆమె ఏకంగా ఏడుసార్లు తల్లయింది. పైగా మూడుసార్లు కవలలకు జన్మనిచ్చింది. పదిమంది పిల్లాపాపలతో పదిలంగా బతుకుతోంది. ఆమే... లండన్ ఆడపడుచు. పేరు సారా జోన్స్.

ఇంగ్లండ్‌లోని సౌత్‌పోర్ట్‌లో ఉండే 30 ఏళ్ల సారాకు ఇరవైఏళ్ల క్రితం క్రైయిగ్‌తో పెళ్లయింది. ఇప్పుడు వారికి పాలుతాగే పిల్లల నుంచి కాలేజీ కెళ్లే పిల్లల వరకు ఉన్నారు. మొదటి బిడ్డ బ్రోగేన్ ప్రస్తుత వయసు పదహారేళ్లు.

సారాకు పిల్లలను పెంచడం అంటే మహా సరదా. అందుకే పదిమంది పిల్లలకు సంతోషంగా జన్మనిచ్చింది. ఆమె మనసులోని కోరికను తథాస్తు దేవతలు దీవించినట్టు ఆమెకు మూడుసార్లు కవలలు కలిగారు.

సారాకు 2001 నవంబరులో మొదటిసారి కవలలు పుట్టారు. ఇటీవల కేవలం పది నెలలు తేడాతోనే రెండుసార్లు కవలలకు జన్మనిచ్చింది... జూన్ 2010లో ఒకసారి, ఏప్రిల్ 2011లో ఒకసారి. 'నాకు ప్రతి కాన్పూ ఓ షాకే. మొదటిసారి ఇద్దరు కవలలు పుట్టినప్పుడు చాలా ఆనందపడ్డాను. రెండోసారి కవలలు కలిగినప్పుడు ఆశ్చర్యపోయాను. మూడోసారి కూడా అలాగే జరిగేసరికి అస్సలు నమ్మలేక పోయాను. బ్రిటన్‌లో మూడుసార్లు కవలలకు జన్మనిచ్చిన మహిళను నేనే' అంటుంది సారా మురిసిపోతూ. అయితే, వీరికి పెద్దగా ఆదాయం లేకపోవడంతో కష్టపడి కుటుంబాన్ని నెట్టుకొస్తున్నారు. సారా మాత్రం దీని గురించి అంతగా బాధపడటం లేదు. 'పిల్లలకు మించిన సంపద ఏముంటుంది! ఇప్పుడు మేం వారికోసం కష్టపడుతున్నాం. మాకు వయసు మీద పడ్డాక మా పిల్లలే మమ్మల్ని సంతోషంగా చూసుకుంటారు' అంటూ నవ్వేస్తోంది.

నిజాలు దేవుడికెరుక : మిస్టరీ

**అతడిని ఇలా చంపాం... అని చెప్పింది అమెరికా.
ఇంకా చెబుతూనే ఉంది అమెరికా.
ఇదంతా పచ్చి అబద్ధం అని కొందరు వాదిస్తున్నారు.
నేవీ సీల్స్ చంపడానికి ముందే లాడెన్ చనిపోయి ఉన్నాడా?
బెనజీర్ భుట్టో బతికున్న కాలంలోనే లాడెన్ అనారోగ్యంతో చనిపోయాడా?... ఎన్నో ప్రశ్నలు ఉన్నాయి.
సమాధానాలు మాత్రం సంతృప్తికరంగా లేవు.**

# లాడెన్‌ను చంపింది అమెరికా కాదా?



నేవీ సీల్స్ అంటే మాటలు కాదు. ధైర్యానికే ధైర్యం చెప్పేవాళ్లు. సాహసానికి సాహసం నేర్పేవాళ్లు. భయం అనేదాన్ని శంకరగిరిమాన్యాలు పట్టించడానికి ఎప్పుడూ రెడీగా ఉండేవాళ్లు.

ఏ మాటకు ఆ మాటే చెప్పుకోవాలి.

ఈసారి మాత్రం వాళ్లకూ కాస్త భయంగానే ఉంది.

తమ టార్గెట్ మామూలు వ్యక్తి కాదు.

అతని పేరులోని అక్షరాల్లో అణ్వాయుధాలు ఉన్నాయి. అంతులేని విధ్వంసం ఉంది. అది సృష్టించిన భయోత్పాతం ఉంది.

బిన్ లాడెన్... పేరు వినాలంటేనే కష్టం.

చూడాలంటే... ఇంకా కష్టం.

మాట్లాడాలంటే... ఇంకా ఇంకా కష్టం.

అలాంటిది- చంపాలంటే?



లాడెన్ తలదాచుకున్న ఇల్లు

బా..................బోయ్!

• • •

మే 1, 2011

ఇస్లామాబాద్‌కు 120 కి.మీ. దూరంలో ఉన్న అబొట్టాబాద్‌లోని మూడు అంతస్థుల 'వజీరిస్తాన్ హవేలి' మీద 'సీల్స్' హెలికాప్టర్లు చక్కర్లు కొడుతున్నాయి.

హెలికాప్టర్ మీది నుంచి కొందరు తాళ్ల సహాయంతో చకచకా దిగారు.

చిమ్మచీకటి.

అయినప్పటికీ నైట్-విజన్ అద్దాల్లో వారికి అంతా కనిపిస్తోంది.

ఒక గదిలో నుంచి తల ఒకటి బయటికి కనిపిస్తోంది. నిద్రపోతున్నట్లుంది. బృందంలోని సభ్యుడు గురి చూసి కాల్చాడు. నిద్రలోనే చనిపోయాడు అబ్రార్ అల్-కువైటీ. అతని భార్య బుష్రా తన భర్తను రక్షించుకోవడానికి రకరకాల ప్రయత్నాలు చేసి 'సీల్స్' కాల్పుల్లో చనిపోయింది. మూలనున్న గదిలో లోడ్ చేసిన ఏకె-47 కనిపించింది.

ఇక్కడ ఆలస్యం 'అమృతం' కాదు... 'విషం'. తమను మింగేసే విషం. ఆలస్యం చేయవద్దు. పెద్దల ఆదేశాలు బాగా గుర్తున్నాయి.

రన్.

ధన్... ధన్... ధన్...

పుర్రెలో నుంచి రక్తం, మెదడు బయటికి వచ్చాయి.

ఛాతిలో కూడా కాల్పులు జరిపారు.

నెత్తుటి మడుగులో శవం.

లాడెన్‌లా కనిపిస్తున్నాడు. అతనే అంటావా?

బృందంలో ఎవరో అన్నారు: 'ఐ థింక్ దిస్ ఈజ్ అవర్ బాయ్'

అయినా సరే... ఎవరూ తొందర పడలేదు. తమ దగ్గరున్న ఫొటోలతో సరిచూసుకున్నారు. అతని గడ్డాన్ని కుడి నుంచి ఎడమకు, ఎడమ నుంచి కుడికి లాగి చూశారు. రకరకాల కోణాల్లో ఫొటోలు తీశారు. రెండు సెట్ల ఫొటోలు, డీఎన్ఏ నమూనాలను సిద్ధం చేసుకున్నారు. 30 నిమిషాల్లో పని పూర్తయింది.

బాల్కనీ పక్కన ఒక మూల బిక్కుబిక్కుమని కూర్చున్న పిల్లలను 'ఇతనెవరు?' అని అడిగారు. వాళ్లు అబద్ధం ఆడదల్చుకోలేదో, అబద్ధం ఆడినా లాభం లేదనుకున్నారో ఏమో గానీ...

'బిన్ లాడెన్' అని చెప్పేసారు. 'సీల్' బృందం ముఖంలో సంతోషం తొంగి చూసింది.

బిగ్గరగా రోదిస్తున్న ఒకామెను ''ఆ బెడ్‌రూమ్‌లో పడి ఉన్నది ఎవరు?'' అని అడిగారు.

ఏడుపు మిళితమైన గొంతుతో ''ఒసామా'' అని చెప్పింది ఆమె.

''ఒసామా అంటే?'' అని అడిగారు ఒకరు.

''ఒసామా బిన్ లాడెన్'' అని చెప్పింది ఆమె. రెండో నిర్ధారణతో నేవీ సీల్ సభ్యులకు మరింత నమ్మకం వచ్చింది.

● ● ●

మార్క్ ఓవెన్ రాసిన 'నో ఈజీ డే' పుస్తకం చదువుతుంటే పది హాలీవుడ్ యాక్షన్ సినిమాలను ఒకేసారి చూసినట్లుగా ఉంటుంది. ఇందులో ఉన్నది సెకెండ్ హ్యాండ్ సమాచారం కాదు. ప్రత్యక్షంగా చూసి రాసిన సమాచారం.

ఎవరీ మార్క్ ఓవెన్?

రిటైర్డ్ సీల్ అధికారి మాట్ బిసోనెట్ 'మార్క్ ఓవెన్' పేరుతో రాసిన పుస్తకం మరోసారి లాడెన్ హత్య గురించిన చర్చను లేవనెత్తింది. ముప్పై ఆరు సంవత్సరాల బిసోనెట్‌కు ఇస్లామిక్ అతివాదుల నుంచి ఇప్పటికే బెదిరింపులు మొదలయ్యాయి. భద్రతా కారణాల దృష్ట్యా బిన్ లాడెన్ ఆపరేషన్‌లో పాల్గొన్న సీల్ సభ్యుల పేర్లను గోప్యంగా ఉంచాడు బిసోనెట్.

ఇలా ఉండగా 'అసలు మేము చంపడానికి ముందే లాడెన్ చనిపోయి ఉన్నాడు' అని బిసోనెట్ 'నో ఈజీ డే'లో రాసినట్లుగా వచ్చిన ఒక వార్త సంచలనం కలిగించింది.

'బిన్ లాడెన్‌ను ఇలా చంపాం, అలా చంపాం' అని ప్రత్యక్ష, పరోక్ష సమాచారాలతో అమెరికా ప్రచారం చేసుకుంటుండగా తమ సైనికుడు 'మేము చంపడానికి ముందే చనిపోయాడు' అని చెప్పడం పెద్దన్న అమెరికాకు గాలి తీసేసినట్లుగా ఉంది. కొందరు ఒక అడుగు ముందుకు వేసి, 'అసలు బిన్ లాడెన్ చనిపోలేదు' అని గట్టిగా వాదిస్తున్నారు.

**సంచలనం రేపుతున్న పుస్తకం**



**సీల్స్ చెప్పే కథనాల కంటే భిన్నమైనవి మార్క్ ఓవెన్ రాసిన 'నో ఈజీ డే' పుస్తకంలో ఉన్నాయి. ప్రసిద్ధ ప్రచురణ సంస్థ పెంగ్విన్ ప్రచురించిన ఈ పుస్తకంలో కేవలం లాడెన్ హత్య చుట్టూ విషయాలు మాత్రమే కాకుండా 'సీల్' మనస్తత్వాన్ని ప్రతిఫలించే విషయాలు కూడా ఉంటాయి. జూనియర్ హైస్కూల్ రోజుల్లో సీల్స్ గురించి రాసిన 'మెన్ ఇన్ గ్రీన్ ఫేసెస్' పుస్తకం మార్క్ ఓవెన్‌ను ఎంతో ఆకట్టుకుంది. 'నేను ఏదో ఒకరోజు సీల్స్‌లో చేరాలి. ఇలాగే ఒక పుస్తకం రాయాలి' అనుకున్నాడు. 'నో ఈజీ డే' పుస్తకంతో అతని కోరిక నెరవేరింది. కానీ అమెరికా రక్షణ శాఖ ఈ పుస్తకం గురించి బోలెడు అభ్యంతరాలు తెలియజేసింది. నియమాలను ఉల్లంఘించారని కన్నెర్ర చేసింది.**




సమాధానాలు దొరకాల్సిన కొన్ని సందేహాలు:

- లాడెన్ చనిపోయాడు అని ప్రపంచం నమ్మడానికి ఒకే ఒక ఫొటో తప్ప మరే ఆధారం లేదు. 'అది నిజమైన ఫొటో' అని అమెరికా చెబుతోంది. నిజంగా అది నిజమైన ఫొటోనేనా?
- డీఎన్ఏ టెస్ట్ చేసినట్లు అమెరికా చెబుతోంది. కానీ దాని ఫలితం ఏమిటో ప్రజలకు తెలియదు. 'అవును. అతను బిన్ లాడెనే' అని ప్రకటించింది అమెరికా. నిజమే కావచ్చు అనుకుంది ప్రపంచం. నిజానిజాలేమిటో మాత్రం తెలియదు.
- 9/11 సంఘటనకు ముందే బిన్ లాడెన్ చనిపోయినట్లు రకరకాల సమాచారాల ఆధారంగా తెలుస్తోంది. బిన్ లాడెన్ చనిపోయినట్లు ఒకప్పుడు బేనజీర్ భుట్టో ప్రకటించారు కూడా.
- ఒక నిరాయుధుడిని చంపాల్సిన అవసరం ఎందుకొచ్చింది? లాడెన్‌ను అరెస్ట్ చేసి ఇంటరాగేట్ చేస్తే ఎంతో విలువైన సమాచారం లభించి ఉండేది కదా. ఆ అవకాశాన్ని అమెరికా ఎందుకు చేజేతులా వదులుకుంది?
- ఇంటిమీద హెలికాప్టర్లు తిరుగుతుంటే కూడా వినిపించనంత గాఢనిద్రలో లాడెన్ ఉన్నాడా? గదుల్లో అలికిడి వినిపిస్తుంటే లాడెన్ ఎందుకు తప్పించుకోవడానికి ప్రయత్నించలేదు?
- లాడెన్ శవాన్ని సముద్రంలో పడేయాల్సిన అవసరం ఏమొచ్చింది? కొన్నిరోజులు ఆ శవాన్ని భద్రపరిచి ఉంచినట్లయితే 'లాడెన్ చనిపోలేదు' అని వాదించేవాళ్లకు 'చనిపోయాడు' అని ఒక బలమైన ఆధారం చూపించే అవకాశం ఉండేది కదా!
- లాడెన్ హత్య గురించి అమెరికా అధికారిక సమాచారానికి, లాడెన్ చుట్టుపక్కలవాళ్లు చెబుతున్న విషయాలకు వైరుధ్యం ఉంది. **ఉదా: ఒక పాకిస్తాన్ టీవీకి బషీర్ అనే వ్యక్తి ఇచ్చిన ఇంటర్వ్యూ.**

ఇలాంటి ప్రశ్నలు ఎన్నో ఉన్నాయి. వాటికి సమాధానం దొరకడం లేదు. దొరికినా అది సంతృప్తిగా లేదు. అందుకే 'లాడెన్ మరణం' మిస్టరీగా మారింది.

● **యాకుబ్ పాషా**

కథనం

# క్రిటికల్

● ఆకెళ్ల శివప్రసాద్



'క్రిటికల్' అన్న ఒక్కమాట అనేసి లోపలికి వెళ్లిపోయాడు డాక్టర్. ఆ మాట అనడానికి ఒక్క సెకను పట్టిందేమో. కానీ ఆ ఒక్క సెకను మాట ఓ జీవితాన్ని తూకం వేసిన మాటగా ఉంది. ఆ జీవితంలో ఎన్నో ఏళ్లుగా పెనవేసుకుపోయిన బంధాలని, అనుబంధాలని, తరాలని వణికించేట్టు ఉంది. అంతకుముందు చాలాసార్లు ఆ మాట విన్నా. వెన్నులో చలి పుట్టలేదు. బహుశా అప్పుడంత దగ్గరివాళ్లు అయి ఉండరు.

నాకు గుర్తున్నంత వరకు దాదాపు పన్నెండేళ్ల క్రితం ఈ క్రిటికల్ అనేమాట నిద్ర లేకుండా చేసింది.

అమ్మ హాస్పిటల్లో ఉన్నప్పుడు!

వార్డులో భయంకరమైన నిశ్శబ్దం. ఫినాయిల్ వాసనకి చెమటలు పట్టేవి. స్ట్రెచర్ మీద అటు నుండి ఇటు, ఇటు నుండి అటు ఎవరు కదిలినా, డాక్టర్లు, నర్సులు ఎవరు అద్దం తలుపు తీసుకుని బైటికి వచ్చినా ఊపిరి ఆగినంత పనయిపోయేది. నా పరిస్థితే కాదు, అక్కడున్న వాళ్లందరి పరిస్థితీ అలాగే ఉండేది. రెండేళ్ల పాటు డాక్టర్లు, మందులు, ఐసీయూలు, స్పెషల్ వార్డులు, బిల్లులు కట్టడానికి అవస్థలు పడడాలు, ఇవన్నీ అమ్మకి తెలియకుండా జాగ్రత్త పడడాలు... రెండేళ్ల తాపత్రయమంతా ఓ ఉదయం నిశ్శబ్దంగా అమ్మ అస్తమించడంతో ముగిసింది.

అప్పుడే అర్థమైంది - కాలాన్ని ప్రశ్నించలేమని, తలవంచుకుని నదిలో మునక వేసి వెంటనే లేవాలి గానీ అలలతో పోటీపడే వెర్రి ప్రయత్నం చేయకూడదని.

అప్పుడు మమ్మల్ని చూడడానికి వచ్చిన వాళ్లతో మా అత్తయ్య "మేమంతా లేమా?..." అంది. ఆ రెండు మాటలు సంజీవనిలా పని చేసి బాధ నుండి క్రమంగా బైటపడ్డాం. నిజమే. కాలంలో ఇవన్నీ తప్పవు. రాకలు, పోకలు, ప్రయాణాలు, ఆగిపోవడాలు.

"మేమంతా లేమా?" అని అనడమే కాదు, అత్తయ్య ఓ పది రోజులు మాతోనే ఉంది. క్రమంగా మేము లోకంలో పడ్డాక తన ఇంటికి తను వెళ్లిపోయింది.

హైదరాబాద్ నగరంలో ఆ మూల తను ఉంటే, ఈ మూల నేను ఉంటున్నాను. కలుసుకోవాలంటే ఊరికి వెళ్లినంత హడావుడి తప్పదు.

మామయ్య కాలం చేశాక అత్తయ్య ఒక్కతే ఉంటోంది. జ్ఞాపకాలు ఆసరాగా చేసుకుని మామయ్య కట్టిన ఇంట్లోనే బతికేస్తోంది.

ఫోన్‌లో పలకరింతలు, వీలున్నప్పుడు రాకపోకలు జరుగుతూనే ఉన్నాయి.

చిత్రంగా -

అమ్మ దూరమైన ఏడాది లోపే మామయ్య పోయాడు.

అప్పుడు పలకరించడానికి, ఓదార్చడానికి అత్తయ్య దగ్గరికి వెళ్లినప్పుడు ఎలా మాట్లాడాలో తెలీక -

అత్తయ్య ఇంట్లోంచి బైటికి అడుగు పెడ్తున్నప్పుడు - వణుకుతున్న కంఠంతో, కంపిస్తున్న చేతులను అత్తయ్య మీద వేస్తూ- "మేమంతా లేమా?" అన్నాను. అప్పటి దాకా నిబ్బరంగా కనిపించిన అత్తయ్య ఒక్కసారిగా భోరుమంది. ఎలా ఓదార్చాలో అప్పుడు అర్థం కాలేదు.

అత్తయ్య నన్ను ఎలా ఓదార్చిందో గుర్తు రాలేదు. నాకు ఓదార్చడం రాదు. కొన్నింటికి వయసుతో సంబంధం, కొన్నింటికి మనసుతో సంబంధం ఉంటుంది. అప్పుడర్థమైన మరొక విషయం ఏంటంటే, ఓదార్చడమన్నది ప్రపంచంలో అతి కష్టమైన పని. కంటిలోంచి వచ్చే కన్నీటిని మాటలతో ఆపగలగడం అసాధ్యాల్లోకి అసాధ్యమైన పని!

కన్నీటికి మాట విన్పించి ఆగిపోవాలంటే మనసు తెర దగ్గరే ఆపగలగాలి!

ఆ క్షణంలో ఓదార్పు ఇవ్వలేని అశక్తతని వ్యక్తం చేయడం చేతకాక, నేను కన్నీటిని ఆపుకోలేకపోతుంటే - చిత్రంగా అత్తయ్యే ఏదో మంత్రం వేసినట్టు... "మీకు నేను, నాకు మీరూ ఎప్పటికీరా.." అంటూ బుగ్గమీద గిల్లింది. అంత బాధలోనూ నన్ను సముదాయించింది.

ఆ రాత్రి ఇంటికి వచ్చాక -

నిద్రపట్టక చాలా చాలా నిర్ణయాలు తీసేసుకున్నాను. అత్తయ్యని రోజూ కలవాలని, మాట్లాడాలని, వీలు దొరికినప్పుడు కుటుంబాన్ని అంతా తీసుకువెళ్లాలనీ - !

ఒకరోజు వెళ్లాను.

రెండోరోజు మాట్లాడాను, ఫోన్‌లో.

ఆ తర్వాత కారణాలు ఏమైతేనేమి, ఫోన్‌లో కూడా మాట్లాడలేదు. బద్ధకించాను. నా మాట నేనే తప్పాను. యంత్రంలా పరిగెడుతూ, నిత్య జీవన సంఘర్షణలో, ప్రాధాన్యతల గాలి ఎటు వీస్తే అటు సాగిపోతూ బతుకు ఈడుస్తున్నాను.

ఈ మధ్యకాలంలో అతికష్టమ్మీద ఓసారి అత్తయ్యని చూడ్డానికి వెళ్లాను. అదీ వాళ్ల ప్రాంతానికి ఓ బ్యాంకు పని మీద వెళ్లి.

అప్పుడే రమణ మహర్షి పుస్తకం ఒకటి చదువుతోంది అత్తయ్య. కాలంతో, పుస్తకాల సాయంతో మనసుకి చిత్రికలు పడ్తున్నానంది ఓసారి. మామయ్య ఉన్నంత వరకు అసలు పుస్తకం చదివేదా? ఏమో నాకు గుర్తున్నంత వరకు లేదు.

ఆ పుస్తకం కూడా ప్రశాంతంగా చదువుతూ, నాతో, "మహానుభావుడు ఎంత గొప్పగా చెప్పారో చూడు.. 'నీ వరకు నీవు దుఃఖం లేకుండా ఉండుంటే ఇంకెక్కడా దుఃఖం ఉండదు. వచ్చిన బాధ ఏమిటంటే, నీవు ప్రపంచాన్ని నీకు వెలుపల ఉన్నట్లు చూసి అక్కడ దుఃఖం ఉందని భావించడమే. అయితే, ప్రపంచమూ, దుఃఖమూ - ఆ రెండూ నీలోనే ఉన్నాయి. నీవు అంతర్ముఖుడవైనట్లయితే దుఃఖమనేదే ఉండదు' అని అంటున్నారు అంది!

అలా అత్తయ్య చాలాసేపు ట్రాన్స్‌లో పడిపోయినట్టుగా మాట్లాడింది. మనని మనం మల్చుకోవడంలో జీవితం రూపమే మారిపోతుంది. తనకి పిల్లలు లేని బాధ ఏనాడూ ఆమె వ్యక్తపర్చలేదు. తనకి దూరంగా మామయ్య వెళ్లిపోయాడన్న బాధా మాకు తెలీనివ్వలేదు. మగవాడి కన్నా ఆడవారికి నిభాయించుకునే శక్తి ఎక్కువ ఉందేమో!

ఆ రోజు చాలా విషయాలు మాట్లాడాక -

రాత్రి ఇంటికి బయలుదేరుతూ ఎప్పటిలాగే "... రోజూ ఫోన్ చేస్తానత్తా... వారానికి రెండుసార్లైనా వస్తానత్తా" అనే మాటలు చెప్పేసి వచ్చేశాను. నేను మాట తప్పినా, నా మాట నిలబెట్టడానికా అన్నట్టు తనే ఫోన్ చేసింది. చేస్తోంది. ఓరోజు నేను చెప్పాను.

"నేనే ముందు చేయాలి అత్తా..." అని -

ఫోన్‌లో నవ్వు వినిపించింది. ఆ తర్వాత మళ్లీ రొటీన్. ఆఫీస్ హడావుడి.

ఓసారి నేను ముంబై బ్యాంక్‌కి వెళ్లినప్పుడు ఇక్కడ మా ఆవిడ, పిల్లలు మా అత్తయ్య ఇంటికి వెళ్లారు.

ఎప్పటిలాగే మా ఆవిడ పాత వంటకాలని కొత్తగా ఎలా చేయాలో నేర్పుతుంది. మా పిల్లలయితే సరేసరి.

స్కూలు మానేసి అక్కడే ఉంటామని గొడవ చేశార్ట.

కావాలనుకున్నా ఆప్యాయంగా పలకరించేవారు, ఆదరించేవారు ఉండొద్దూ.

ఈ రోజు ఉదయమే నేను వాకింగ్ చేస్తున్నప్పుడు మా అబ్బాయి పరిగెత్తుకొచ్చి -

> **మనని మనం**
> **మల్చుకోవడంలో జీవితం**
> **రూపమే మారిపోతుంది.**
> **తనకి పిల్లలు లేని బాధ**
> **ఏనాడూ ఆమె వ్యక్తపర్చలేదు.**
> **తనకి దూరంగా మామయ్య**
> **వెళ్లిపోయాడన్న బాధా**
> **మాకు తెలీనివ్వలేదు.**

"అమ్మమ్మ హాస్పిటల్లో చేరిందట... వాళ్ల ఇంట్లో అద్దెకుండే అన్న ఫోన్ చేశాడు" అన్నాడు.

మరుక్షణం అటుగా వస్తున్న ఆటోను ఆపి, మా ఆవిడకి హాస్పిటల్‌కి వెళ్లానని చెప్పమని చెప్పి, బయల్దేరాను. నేను వెళ్లేసరికి

అత్తయ్య ఇంట్లో అద్దెకు ఉంటున్న అబ్బాయి -

"తెల్లారుఝామునే చెమటలు పట్టాయి సార్. మా వీధిలో ఉన్న డాక్టర్‌కి చూపెడ్తే మొదట గ్యాస్ ప్రాబ్లెమ్ అన్నాడు. ఆ తర్వాత హార్ట్ ప్రాబ్లెమ్ అంటే ఇక్కడికి తీసుకువచ్చాను" అన్నాడు.

పిలిస్తే పలుకుతాడని ఈ మధ్యే అతడికి అత్తయ్య అద్దెకిచ్చింది. ఆ అబ్బాయి ఇక్కడే ఏదో ప్రైవేట్ కంపెనీలో పనిచేస్తున్నాడు.

"మేమంతా లేమా?" అని నేను, అన్నయ్య, చెల్లెలు... సామూహికంగా ఇదివరకు చేసిన 'వాగ్దానం' గుర్తొచ్చింది.

కానీ -

జీవితంలో ప్రత్యేకత ఇదే. అందినట్లు ఉంటుంది. అందదు.

ఎవరెవరికి ఫోన్లు చేయాలో ఆలోచిస్తుంటే -

"దగ్గరి బంధువులు మీరేనా?" అంటూ నర్సు వచ్చింది.

కొన్ని కాగితాల మీద సంతకం పెట్టమంది. డబ్బులు కట్టాలంటే సాయంత్రం లోపు కడ్తానన్నాను.

సంతకం పెడుతున్నప్పుడు అడిగాను-

"సిస్టర్! మా అత్తయ్యకి..."

ఎప్పటిలాగే ధైర్యం ఇస్తున్నట్లు "డోంట్ వర్రీ" అని మాత్రం అన్లేదు.

"పరిస్థితి ఎలా ఉంది?"

"క్రిటికల్" - ఈసారి నిర్వికారంగా అనేసి వెళ్లిపోయింది.

కొన్ని మాటలకి ప్రత్యేకమైన నిఘంటువులు తయారు చేసినా తప్పులేదేమో.

క్రిటికల్ అనే మాట కూడా అలాంటిదే.

అప్పటిదాకా ఎలా ఉన్నా, ఆ క్షణంలో అనిపించింది, అత్తయ్య కూడా శాశ్వతంగా వెళ్లిపోతే -

ఆ ఊహే గుండెని పట్టేసింది.

వేదాంతం ఎంత అవగాహన చేసుకున్నా -

మనిషి ఉన్నప్పుడు ఆ మనిషికి ఇవ్వవలసిన గౌరవం, మర్యాద, ప్రేమ ఇవ్వకపోతే మనిషి బ్రతుక్కి అర్థమేమిటి?

భారంగా కళ్లు మూసుకుంటే కళ్లల్లో నీళ్లు కదిలాయి.

ఈ ఒక్కసారి అత్తయ్య ఆరోగ్యంతో బైటకొస్తే -

రోజూ కలుస్తాను.

రోజూ మాట్లాడతాను.

వీలైనప్పుడల్లా కుటుంబంతో వెళ్తాను.

అత్తయ్యే కాదు... ఇంక ఎవరినీ మిస్ చేసుకోను.

సహజమైన ఆత్మీయతల్ని ఇవి దూరం కాకుండా జాగ్రత్త పడతాను. సంబంధాలు 'క్రిటికల్' కాకుండా ప్రయత్నిస్తాను.

సరిగ్గా అప్పుడే ఆపరేషన్ థియేటర్లోంచి డాక్టర్ బైటికి వస్తున్నాడు.

తెలీని ఉద్వేగం గుండెల నిండా పరుచుకుని డాక్టర్ ఏం చెబుతాడోనని వేగంగా అటు కదిలాను.

# ఊపిరిపోసే కథలు

చదవడం పూర్తయినా మనసులోనే గింగిర్లు కొట్టే పన్నెండు కథలున్నాయీ పుస్తకంలో. చొప్పదండి సుధాకర్ 'వెన్నెల కుప్పలు' నిండా పల్లెదనం, పచ్చదనం, స్వేచ్ఛాయుతం కోసం పాకులాడే మనసులు కనిపిస్తాయి. నవ్వుతూ, నలుగుతూ ప్రశ్నలు గుప్పిస్తాయి.

'నువ్వే బొమ్మ ఏవ్వే బొమ్మ'లో వంద్రంగి బాదిశె మూలకు వెళ్లిన నైనం చూస్తే పల్లె గొంతు పిడచగట్టుకుపోయిన విధం స్ఫురణకు వస్తుంది. చాలి గజ్జెలు మూగబోయిన 'గంగిరెద్దుల' ఆటలు బోసిపోయిన పల్లెల సాక్ష్యం చూపిస్తుంటే మనసు వెక్కి వెక్కి దుఃఖ పడుతుంది.

పుట్టి పెరిగిన గడ్డపై పెంచుకున్న మమకారం కుయుక్తుల కాళ్ల కింద నలిగిన తీరు తెన్నులు 'గెంటేలమడి' చెబితే...'ఆశ లేని స్త్రీ జీవితంలో వెన్నెల సిరులు గుమ్మరించిన ఓ బిక్షని జ్ఞాపకం బుగ్గన కన్నీటి చుక్కగా జాలువారుతుంది.

ఇలా, ప్రతి కథా మనలో అంతర్లీనంగా ఓ సంవేదనను,



**వెన్నెల కుప్పలు (కథలు)**
**రచయిత: చొప్పదండి సుధాకర్**
**పేజీలు:** 112; **వెల:** ₹ 70
**ప్రతులకు:** ప్రముఖ పుస్తక కేంద్రాలు

సంఘర్షణను రేకెత్తిస్తాయి.

ఆధునికత పేరుతో పరుగులు తీస్తున్న మనిషి ఒక్కసారి 'మల్లవ్వ' మాటలు వింటే ఉన్న చోటనే ఆగిపోయి, ఆలోచనలో పడకుండా ఉండలేడు. పట్టణంలో ఉన్నవారిని పల్లెదాకా లాక్కెళ్లి మసాలాలోనో, వాగు ఇసుకలోనో, పొలం గట్టు మీదనో కుదురుగా నిలబెట్టి, 'వింటున్నావా!' అని మందలించే కథలివి.

అమ్మ కొంగుచాటున కళ్లు గా...ట్టిగా మూసుకుని వెన్నెలను తోడుతీసుకుని కలల సామ్రాజ్యంలోకి కదిలినట్టుగా కొన్ని కథలు ఉంటే, మరికొన్ని కథలు కలత నిద్రతో ఊపిరాడకుండా చేస్తాయి. పల్లెకు ఊపిరిపోయమని సూచనలు అందిస్తాయి.

● నిర్మల

## పర్యావరణ ప్రత్యేకం



**ఆవరణం (పర్యావరణ ప్రత్యేక సంచిక)**
**రచన, సంపాదకత్వం: ప్రభుచంద్ర**
**పేజీలు:** 112; **వెల:** ₹ 70
**ప్రతులకు:** హర్షం బుక్స్ పబ్లికేషన్స్ 8-3-633/66, తావాక్కల్ నగర్, ఎల్లా రెడ్డిగూడ, అమీర్‌పేట, హైదరాబాద్- 73

తల్లి ఆరోగ్యంగా ఉంటే బిడ్డ ఆరోగ్యం బాగున్నట్టే... ప్రకృతి పచ్చగా ఉంటేనే ఆమె బిడ్డలమైన మనం హాయిగా ఉండగలం. ఈ సత్యాన్ని గ్రహించడం వల్లనే ఇప్పుడిప్పుడే ప్రపంచమంతటా పర్యావరణంపై చైతన్యం కలుగుతోంది. ఈ నేపథ్యంలో దాని ప్రామాణిక అంశాలపై అవగాహన, ఆసక్తులు పెంపొందించేలా హర్షం బుక్స్ పబ్లికేషన్స్ ఒక ప్రత్యేక సంచికను తీసుకొచ్చింది. 'గ్లోబల్ వార్మింగ్', కాలుష్య నియంత్రణ, వ్యర్థాలు- పారిశుద్ధ్యం, ప్రకృతి వైపరీత్యాలు- పచ్చదనం తదితర శీర్షికలతో రూపుదిద్దుకున్న ఈ సంచిక పర్యావరణ ప్రేమికులే కాదు, ప్రతి ఒక్కరూ పఠించదగ్గది, పాటించదగ్గది.

● బాచి

## పాతాళభైరవి విశ్లేషణ



**దర్శక మహేంద్రుడు**
**రచన: డా॥ బాగం కొండారెడ్డి**
**పేజీలు:** 144; **వెల:** ₹ 150
**ప్రతులకు:** ప్రముఖ పుస్తక కేంద్రాలు

తెలుగు సినిమాకు దిశను, దశను చూపించిన కె.వి.రెడ్డి స్థానం అనితర సాధ్యం. కేవీ శతజయంతిని పురస్కరించుకుని ఆయన జీవిత విశేషాలతో పలు పుస్తకాలు వస్తున్నాయి. ఆ క్రమంలో బాగం కొండారెడ్డి 'దర్శక మహేంద్రుడు కె.వి.రెడ్డి'ని రూపొందించారు.

కేవీ రెడ్డి అభిమానులకు ఇందులో కొత్త విషయాలు కనిపించకపోయినా, ఈతరం వారిని ఆకట్టుకునే కొన్ని అంశాలు ఉన్నాయి. కేవీ స్వగ్రామం, ఆయన కుటుంబ సభ్యుల ఛాయాచిత్రాలతో పాటు ఆయన దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రాల పేపర్ కటింగ్స్ ఆకట్టుకుంటాయి. 'పాతాళ భైరవి: స్క్రీన్‌ప్లే, విశ్లేషణ' అలరిస్తుంది.

● ప్రమోద్

## ఎక్నాలెడ్జ్‌మెంట్

**అన్నమయ్య సంకీర్తన సుధాకరము**
**వ్యాఖ్యాత: గరికపాటి వెంకట్**
పేజీలు: 104; వెల: ₹ 100
ప్రతులకు: ప్రముఖ పుస్తక కేంద్రాలు

**జడి (కవిత్వం)**
**రచన: కె.ఎస్.రమణ**
పేజీలు: 168, వెల: ₹ 100
ప్రతులకు: విశాలాంధ్ర అన్ని బ్రాంచీలు

**జీవని (కవిత్వం)**
**రచన: ప్రసన్నలక్ష్మీరావ్**
పేజీలు: 75; వెల: ₹ 50
ప్రతులకు: రచయిత్రి, 10/334, కుప్పవీధి, మదనపల్లి- 517 325

**ముఖ్యమైన రోజులు మరియు తేదీలు**
**సంకలనం: కందుకూరి కృష్ణవేణి**
పేజీలు: 152; వెల: ₹ 120
ప్రతులకు: ఫోన్: 9700222892

**కొత్తపల్లి (పిల్లల కథల పుస్తకం-41)**
**సంపాదకులు: నారాయణ**
పేజీలు: 64; వెల: ₹ 20
ప్రతులకు: కొత్తపల్లి ప్రచురణలు, ఎంఆర్‌వో ఆఫీసు దగ్గర, చెన్నేకొత్తపల్లి, అనంతపురం-515101.

**రెండు ప్రపంచాలు (కవిత్వం)**
'మాకు/ బతకడమంటే/ రాళ్లను వాయిదా వేసుకోవడమే' (పుట్టుమచ్చ) అనే ఈ విమర్శకుడు 1993 నుంచి రాసిన 46 కవితల సంకలనం.
**కవి: రాచపాళెం చంద్రశేఖరరెడ్డి**
పేజీలు: 102; వెల: ₹ 50
ప్రతులకు: విశాలాంధ్ర

**మనసు మాట (కవిత్వం)**
**రచన: ఎస్.బషీరున్నీసా బేగం**
పేజీలు: 132; వెల: ₹ 100
ప్రతులకు: రచయిత్రి, లెక్చరర్, 5-66-81, ఫస్ట్ లేన్, గుంటూరు-2.

**గ్రంథాలయం తాతయ్య**
**రచన: ఎం.వి.ఆర్.చంద్రశేఖర్**
పేజీలు: 48; వెల: ₹ 100
ప్రతులకు: రచయిత, 41/554, కొత్తపేట, కర్నూలు

**కరీంనగర్ కవిత-2011**
**సంపాదకులు: అన్నవరం దేవేందర్, బూర్ల వెంకటేశ్వర్లు**
పేజీలు: 86; వెల: ₹ 60
ప్రతులకు: నగునూరి రాధాకృష్ణ, ఫ్లాట్ నం.24, సాయి జయంతి అపార్ట్‌మెంట్స్, పద్మశాలి స్ట్రీట్, కరీంనగర్-1

● ఆదర్శం

**అతనో ఫైవ్ స్టార్ హోటల్లో చెఫ్. అతని ప్రతిభకు పురస్కారాలూ దక్కాయి. ఇరవై ఏళ్లకే స్విట్జర్లాండ్‌లోని పెద్ద హోటల్లో చెఫ్‌గా పనిచేసే అవకాశం వచ్చింది. లక్షల రూపాయల జీతం. ఇక రెక్కలు కట్టుకుని ఎగిరిపోవడమే ఆలస్యం! ఆ సమయంలో ఓ సంఘటన అతని జీవితాన్నే మలుపు తిప్పింది. అంత పెద్ద అవకాశాన్ని వదులుకుని రోజూ వందలాది మంది అభాగ్యుల కడుపు నింపే దిశగా అతణ్ని నడిపించింది. అతడే నారాయణ్ కృష్ణన్.**



# అభాగ్యుల 'చెఫ్'

తమిళనాడులోని మదురై పట్టణానికి చెందిన కృష్ణన్ బెంగళూరులోని తాజ్ హోటల్‌లో చెఫ్‌గా పనిచేశాడు. సరిగ్గా 11 ఏళ్ల క్రితం అతణ్ని స్విట్జర్లాండ్ అవకాశం వరించింది. అక్కడికి వెళ్లే ప్రయత్నంలో ఉన్న సమయంలోనే ఓ రోజు రోడ్డు మీద వెళ్తున్న కృష్ణన్‌ను ఓ సంఘటన కలచివేసింది. ఓ బ్రిడ్జి కింద మానసిక వికలాంగుడైన వ్యక్తి మలం తింటూ కనిపించాడు. అతణ్ని ఆపిన కృష్ణన్.. గబగబా ఓ హోటల్‌కు పరుగెత్తి ఇడ్లీ తీసుకొచ్చాడు. అతడికి ఇచ్చాడు. ఆ వ్యక్తి ఆబగా తిన్నాడు. అప్పుడు మొదలైంది కృష్ణన్‌లో ఆలోచన. మన చుట్టూ ఇలా ఎంతమంది ఆకలితో అలమటిస్తున్నారు? వారిలో ఎంతమంది ఆకలని చెప్పగలుగుతున్నారు? అలా చెప్పలేని వారి పరిస్థితి ఏంటి?... ఇలాంటి ప్రశ్నలతో అతని బుర్ర నిండిపోయింది. వెంటనే నిర్ణయించుకున్నాడు తన గమ్యం వేరని. స్విట్జర్లాండ్ అవకాశం వదులుకుని.. ఇక్కడ కూడా ఉద్యోగాన్ని కాదనుకుని.. తన దగ్గరున్న డబ్బులతో 'అక్షయ' పేరుతో ఓ స్వచ్ఛంద సంస్థను ఆరంభించాడు. తన లాగే ఆలోచించే కొందరి తోడ్పాటు తీసుకున్నాడు. పొద్దున నాలుగింటికి లేవడం, వంట చేయడం, వ్యాన్‌లో ఆహార పదార్థాలు పెట్టుకుని రోడ్డు పైకి వెళ్లడం.. ఎక్కడ అనాథలు, మానసిక వికలాంగులు, పిచ్చివాళ్లు కనిపించినా వారికి దగ్గరుండి తిండి పెట్టడం. మళ్లీ మధ్యాహ్నం, రాత్రి కూడా ఇదే తంతు. ఇలా రోజూ మూడు పూటలా మదురై నగరంలోని నాలుగొందల మంది కడుపు నింపుతున్నాడు కృష్ణన్. అతని సేవ కేవలం తిండి పెట్టడం వరకే పరిమితం కావట్లేదు. అతనికి తోడ్పడటానికి ఎనిమిది మంది బార్బర్లు కూడా ముందుకొచ్చారు. వీరు తరచుగా కృష్ణన్ వెంట వెళ్తుంటారు. జుట్టు పెరిగి, గడ్డాలు మాసిన వారికి శుభ్రంగా కటింగ్, షేవింగ్ చేసి వారినీ మామూలు మనుషుల్లా తయారు చేస్తారు. ఒక్కోసారి కృష్ణనే ఈ పనికి పూనుకొంటాడు. వారికి దగ్గరుండి స్నానాలు చేయించి, బట్టలు కూడా తొడుగుతాడు.

కృష్ణన్ బృందం రోడ్ల వెంబడి వ్యాన్‌లో తిరుగుతూ.. ఆకలని కూడా చెప్పలేని స్థితిలో ఉన్న పిచ్చివాళ్లను, మానసిక వికలాంగుల్ని వెతికి మరీ వారికి తిండి పెడుతుంది. ఒకే రోజుకు నాలుగు వందలమందికి మూడు పూటలా తిండి పెట్టడమంటే మాటలా? ఒక్క రోజుకు దాదాపు రూ.20 వేల దాకా ఖర్చవుతుంది. అంటే నెలకు రూ.6 లక్షలు. విరాళాల ద్వారా వచ్చినదానికి చేతిలో ఉన్నది కలిపి అభాగ్యుల కడుపు నింపుతున్నాడు కృష్ణన్. తన తాత తనకిచ్చిన భవనానికి వచ్చే అద్దెను వీరి కోసం వినియోగిస్తున్నాడు. మొదట కృష్ణన్ చేస్తున్న పనిని వ్యతిరేకించిన తల్లిదండ్రులు కూడా తర్వాత అతనికి అండగా నిలిచారు.

''ఆనాడు ఆకలితో అలమటిస్తున్న ఆ వ్యక్తిని చూడగానే తీవ్రంగా కలత చెందాను. జీవిత పరమార్థమేంటని ఆలోచించాను. ఇక మిగిలిన జీవితమంతా వారికి తిండి పెట్టాలనుకున్నా. అభాగ్యుల ఆకలి, వారి బాధే నన్ను, నా అక్షయ బృందాన్ని నడిపిస్తోంది. నా తల్లిదండ్రులు నా చదువు కోసం చాలా ఖర్చుచేశారు. నన్ను చూసి చాలా బాధపడ్డారు. కానీ మా అమ్మను నాతో వచ్చి నేను చేసేదేంటో చూడమన్నాను. మొత్తం చూశాక ఒక మాట అంది. 'నువ్వు వారి కడుపు నింపుతున్నావు. నేను నీ కడుపు నింపుతాను' అని. నాటి నుంచి నేను అక్షయ కోసం బతుకుతున్నా. నా తల్లిదండ్రులు నా కోసం బతుకుతున్నారు'' అన్నాడు కృష్ణన్.

కృష్ణన్ స్టోరీ విన్నవాళ్లంతా ఆశ్చర్యపోతున్నారు. నలుగురికీ సాయపడేవాళ్లు చాలామందే ఉంటారు. కానీ ఇలా జీవితాన్నే అంకితం చేసినవాళ్లు అరుదు. మీడియా దృష్టిలో పడ్డాక ఎంతోమంది విరాళాలివ్వడానికి, మిగతా నగరాలు, పట్టణాల్లోనూ సేవలందించడానికి ముందుకొచ్చారు. వారి తోడ్పాటుతో మదురైలో అభాగ్యుల కోసం హోమ్ నిర్మించడంతో పాటు తక్కిన ప్రాంతాలకూ సేవల్ని విస్తరించే ప్రయత్నాల్లో ఉన్నారు కృష్ణన్. అతని ప్రయత్నం విజయవంతం కావాలని మనసారా ఆశిద్దాం. వీలైతే మనవంతు తోడ్పాటునందిద్దాం!

• చిమ్మల ప్రకాష్

# అబద్ధాలు ఆడతారా?



## నాగార్జున

చాలాసార్లు ఆడాల్సి వస్తుంది. వందల మందిని డీల్ చేస్తాను కాబట్టి తప్పదు. నిజం చెబితే అవతలివాళ్లు బాధపడతారనో, పని జరగదనో అనుకున్నప్పుడు అబద్ధాలాడతాను. డెరైక్టర్ తీసిన షాట్ బాలేకపోయినా, ప్రొడ్యూసర్ పెట్టిన ఫుడ్ బాలేకపోయినా, హీరోయిన్ వేసుకున్న డ్రెస్ బాలేకపోయినా బాగున్నాయి అనకపోతే పని జరగదు. ఇంట్లోవాళ్లతో ఆ అవసరం రాదు. అఖిల్ అయితే "మీకు అబద్ధం చెప్పటం కూడా రాదు డాడీ" అంటాడు.

## కోట శ్రీనివాసరావు



ఎందుకాడమండీ! ఇవా ఉన్న కాలపరిస్థితులను బట్టి అబద్ధాలాడాల్సి వస్తోంది. వాటిని అబద్ధాలనే ఎందుకనుకోవాలి! ఆపద్ధర్మాలు అనుకోండి... ఏ గొడవా ఉండదు.

## రాజేంద్రప్రసాద్

'నేను జీవితంలో ఎప్పుడూ అబద్ధం చెప్పలేదు' అనే అబద్ధం మాత్రమే చెప్తాను! లేకపోతే ఏంటండీ... ఎంతమంది హీరోయిన్స్‌ని పరిచయం చేశాను? ఎంతమంది హీరోయిన్స్‌తో పనిచేశాను? అబద్ధాలు చెప్పకపోతే ఎక్కడ కుదురుతుందండీ!





## బాబూమోహన్

నేను అబద్ధాలాడను. ఆడేవాళ్లంటే కూడా నాకు ఇష్టం ఉండదు. నాదంతా ముక్కుసూటి వ్యవహారం. దాని మూలంగా చాలా ప్రాబ్లెమ్స్ కూడా వస్తుంటాయి. అయినా అంతే.



## రామ్

ఆడను. ఆడినా నా ముఖం చూస్తే క్లియర్‌గా తెలిసిపోతుంది. 'దేవదాసు' షూటింగ్ టైమ్‌లో వై.వి.ఎస్. గారు... 'నువ్వు ఆన్‌స్క్రీన్‌లో మంచి యాక్టరే కానీ, ఆఫ్‌స్క్రీన్‌లో అస్సలు కాదు... ఇలా అయితే నువ్వు ఇండస్ట్రీలో మెలగడం చాలా కష్టం' అంటూ ఉండేవారు.

# స్వీట్ ట్వీట్స్

సేకరణ: జీవన్

## వినోద్ ఖోస్లా

ఫాలోవర్లు: 2,29,689

**భారతదేశంలో పుట్టి, అమెరికాలో తన వ్యాపార సామ్రాజ్యాన్ని విస్తరించిన వినోద్ ఖోస్లా మాట్లాడితే, గూగుల్‌ని సెర్చ్ చేసినట్టు ఉంటుంది. ఎందుకంటే అతడికి అన్ని విషయాలు తెలిసుంటాయి! ఆ విషయాల్లో కొన్నిటిని ట్వీట్స్ ద్వారా అందరికీ తెలుపుతుంటాడు ఖోస్లా.**



- నీకు అవసరమైన దాని గురించి వాడుకోవడమే తెలిసి, దాని గురించి ఆలోచించడం తెలియనప్పుడు... అందులోని గొప్పతనాన్ని నువ్వు అర్థం చేసుకోలేవు.
- పనిచేసే వారిని పర్యవేక్షించే స్థానంలో ఉండాలని కోరుకునేవారే అందరూ. పనిచేసే వారిలో ఒకడిగా ఉండాలనుకునే వారు మాత్రం ఎవరూ ఉండరు. ఇదే ఇప్పుడు ట్రెండ్.
- ఈమెయిల్ అనేది సామాజిక మీడియా రహస్య ఆయుధం. అదే మీ ఫోన్‌లో పరిచయాలను పెంచుతుంది. ఇంటర్నెట్ గ్రాఫ్ ఇంక్రీజ్ అవ్వడానికి ఈ కోణమే తోడ్పడుతోంది.
- స్టీఫెన్ హాకింగ్స్ గొప్ప వ్యక్తి. ఆయన తనకు ఏది మిస్టరీ అనిపించిందో దాని గురించే పరిశోధించాడు. అయితే ఫిజిక్స్, ఆడవాళ్లు ఆయన దృష్టిలో పడలేదు! నిజానికి ఈ రెండే ఎవరికీ అందని మిస్టరీలు!
- ప్రభుత్వ వ్యవస్థ, బ్యూరోక్రాట్లు... ఒక మంచి పరిపాలనా విధానాన్ని నడపడానికి మూలాధారం వీరే. అలాగే కొత్త విధానాలు అవలంబించేందుకు కూడా!
- వ్యాపార సామ్రాజ్యాల్లో అపజయం ఆధారంగానే సక్సెస్ నిర్మితమవుతుంది. పెట్టుబడుల విషయంలోనూ, ప్రణాళికల రూపకల్పనలోనూ మంచి చెడులను తేల్చడం అంత సులభం కాదు.
- రైల్వేస్టేషన్‌లో విచారించాల్సిన అవసరం లేకుండా, భారతీయ రైళ్ల నడకకు సంబంధించి ప్రతి నిమిషం అప్‌డేట్స్‌ను అందించే టూల్‌ను గూగుల్ మొదలెట్టింది. మన పనులను చాలా సులభతరం చేసింది.

ఇంటర్వ్యూ

కమెడియన్లు కోకొల్లలుగా పుట్టుకొస్తున్నప్పుడు ఇండస్ట్రీలో అడుగుపెట్టాడు వేణు. కానీ గుంపులో గోవిందలా ఉండిపోలేదు. తన స్టయిల్లో కామెడీని పండించాడు. తనకంటూ ఓ చోటు సంపాదించుకున్నాడు. పరిశ్రమలోనే కాదు, ప్రేక్షకుల గుండెల్లో కూడా. అతడీ స్థాయికి చేరుకోవడం వెనుక ఎంతో కష్టముంది. ఆ కష్టం గురించి, తర్వాత వచ్చిన విజయం గురించి వేణు మనసువిప్పి చెబుతున్న సంగతులు...



# ఆ లోటు తీర్చలేనిది!

**కెరీర్ ఎలా ఉంది వేణుగారూ?**
బాగానే ఉంది. సుకుమారుడు, దేవరాయ, షాడో, పోగ, నందీశ్వరెడ్డి, కృష్ణ వంశీగారి సినిమాలతో పాటు మరికొన్ని చేస్తున్నాను.

**అసలు నటుడు కాకముందు ఏం చేసేవారు?**
మార్షల్ ఆర్ట్స్ నేర్చుకున్నాను. 96-97 సంవత్సరాల్లో ఏపీ లెవెల్ ఛాంపియన్‌ని. తర్వాత నాకు తెలిసిన విద్యని అందరికీ నేర్పించడం మొదలుపెట్టాను. కానీ అదే జీతం, అదే జీవితం. ఎదుగుదల కనిపించ లేదు. అందుకే సినిమాల వైపు వచ్చాను.

**నటుడవ్వాలని ఎందుకనిపించింది?**
మాది కరీంనగర్ జిల్లా, సిరిసిల్ల. నాన్న, అమ్మ, ముగ్గురు అక్కలు, ముగ్గురన్నలు, నేను. నాన్న కూర గాయలు అమ్మేవారు. బడి లేనప్పుడు నేనూ అమ్మేవాణ్ని. నరుకు అమ్మాలంటే మాటలతో బుట్టలో వేయాలిగా. నేను బాగా మాట్లాడేవాడిని. దాంతో అందరూ నా చుట్టూ చేరేవారు. వాళ్లంతా నన్ను బాబూమోహన్ అనేవారు. అప్పుడనిపించేది, నేనెందుకు సినిమాల్లోకి వెళ్లకూడదని!

**ఆ తర్వాత...?**
నా కోరికను ఎవరితోనూ చెప్పలేదు. పేద కుటుంబాల్లో ఆ కోరికే పెద్ద నేరం కదా! కానీ ఇంటర్ అయ్యాక ఆగబుద్ధి కాలేదు. చదువుని, మార్షల్ ఆర్ట్స్ ట్యూటర్‌గా సంపాదించుకున్న పేరుని వదిలేసి హైదరాబాద్ పారిపోయి వచ్చేశాను.

**అవకాశాల కోసం బాగా కష్టపడ్డారా?**
మామూలుగా కాదు. ఓ సంవత్సరం పాటు వీధుల్లోనే బతికాను. అన్నపూర్ణ స్టూడియోలో సెట్లు వేయడానికి లేబర్ అవసరమయ్యేవారు. ఆ పని దొరుకుతుందన్న ఆశతో సాయంత్రం వరకూ గేటు దగ్గర పడిగాపులు పడేవాణ్ని. కానీ నాలాంటివాళ్లు చాలామంది ఉండే వారు. వాళ్లందర్నీ దాటుకుని ఆ పని నా వరకూ రావడమనేది ఎప్పుడో కానీ జరిగేది కాదు. దాంతో సినిమాలో ట్రై చేసేవారంతా కృష్ణానగర్‌లో ఉంటారని తెలిసి అక్కడికెళ్లా. ఓ బ్యాచిలర్స్ ఉన్న రూమ్ దగ్గరకు వెళ్లి, మీ ఇంట్లో పనంతా చేసి పెడతాను, కాస్త చోటిచ్చి భోజనం పెట్టండని అడిగాను. వాళ్లు సరే అనడంతో కూడు, గుడ్డ దొరికాయి.

**మరి సినిమా ప్రయత్నాలు?**
అప్పుడే ఆనందం సినిమా రిలీజయ్యింది. చిత్రం శ్రీను బాగా బిజీ అయిపోయాడు. అతడొక అసిస్టెంట్ కోసం చూస్తున్నాడని మా రూమ్‌లో ఉండే సురేష్‌కి అతని ఫ్రెండ్ చెప్పడంతో నన్ను పంపించాడు. శ్రీను నాకు పనిచ్చాడు. సొంత తమ్ముడిలా చూసేవాడు. నా హడావుడి చూసి, సెట్లో అంతా నా చుట్టూ చేరేవారు. అయితే చిన్న అపార్థం కారణంగా శ్రీను దగ్గర్నుంచి వచ్చేశాను. మళ్లీ పాత జీవితమే. కానీ ఇంతకు ముందులా హుషారుగా ఉండలేక పోయేవాడిని. పై పోర్షన్‌లో ఉండే రిపోర్టర్ కొత్తపల్లి శేషు అది గమనించారు. నాకు ధైర్యం చెప్పడమే కాక, తేజగారు 'జై' సినిమాకి కొత్తవాళ్లను తీసుకుంటున్నారు, ప్రయత్నించమని పంపించారు. నేను వెళ్లడం, సెలెక్టవడం జరిగాయి. నేనీ రోజిలా ఉండటానికి కారణం శేషుగారే. అలాగే దర్శకులు తేజ, వంశీ పైడిపల్లి, నన్ను తొలిసారి ఇంటర్వ్యూ చేసిన మణి గోపాల్‌ల ప్రోత్సాహాన్నీ మర్చిపోలేను.

**నటుడు అయ్యాకైనా ఇంటికెళ్లారా?**
నిజానికి నేను ఇంటి నుంచి వచ్చేసిన మూడు నాలుగు నెలలకే మా వాళ్లకి తెలిసిపోయింది, నేను హైదరాబాద్‌లో ఉన్నానని. మా అన్నయ్య వచ్చి ఇంటికి రమ్మని బతిమాలాడు. వస్తాను కానీ నన్ను అక్కడే ఉండిపొమ్మని బలవంతం చేయకూడదు, అలా అయితేనే వస్తాను అంటూ కండిషన్ పెట్టి మరీ వెళ్లాను.

**నటుడైనందుకు గర్వపడిన సందర్భం?**
ఓసారి విదేశాల్లో షో చేయడానికి వెళ్లాం. ఒకాయన నా దగ్గరకు వచ్చి, తన సెల్ ఓపెన్ చేసి చూడమన్నాడు. నేనెంత ఆశ్చర్యపోయానంటే... ఆయన సెల్ నిండా నా వీడియోలున్నాయి. ఎప్పుడు కాస్త రిలాక్సవ్వాలనిపించినా అవి చూస్తాడట. నా వల్ల కొందరికి ఆహ్లాదం కలుగుతోందని తెలిసిన ఆ క్షణం ఎంత సంతోషపడ్డానో!

**భవిష్యత్ ప్రణాళికలేమిటి?**
ప్రస్తుతానికి అంతా బాగానే ఉంది. రేపేం జరుగుతుందో తెలీదుగా. కానీ ఒక విషయం నన్ను చాలా బాధపెడుతోంది. నా సక్సెస్‌ని చూడకుండానే నాన్న వెళ్లి పోయారు. కూరగాయలమ్మి, కష్టపడి మమ్మల్ని పెంచిన నాన్నను సుఖపెట్టే అదృష్టానికి నేను నోచుకోలేదు. నాకివాళ అన్నీ ఉన్నాయి. కానీ వాటిని అనుభవించ డానికి నాన్న లేరు. ఎంత సంపాదించినా, ఏ స్థాయికి చేరుకున్నా ఈ లోటు తీరదు.

● సమీర నేలపూడి

# పశువుల అంగడి



ఈ పశువుల అంగడి కోసమే రాత్రి రామన్నపల్లెలో ఆగాను. ఇప్పుడు సిరిసిల్లా వెళ్లాలి. ఇక్కణ్నుంచి 8 కిలోమీటర్లు. ప్రస్తుతం వ్యవసాయం చేస్తూ తాతలైనవాళ్ల ముత్తాతలు కూడా సిరిసిల్ల అంగడి నుంచి ఎడ్లో, గేదో కొనుక్కొచ్చేవుంటారు. అంత పాత సంత! ప్రతి ఆదివారం సాగుతుంది.

పొద్దుటి చలి పూర్తిగా పోలేదు. ఒకతను కాళ్లు నిక్కించి వేపపుల్ల విరుస్తున్నాడు. సీతాఫలం చెట్టుమీద సీతాకోక వాలుతోంది. సైకిల్‌మీద కూరగాయల గంప వెళ్తోంది. రెండు కుక్కలు తాపంతో తంటాలు పడుతున్నాయి. పూసిన గుమ్మడిపూలు ఓ ఇంటికి కొత్త శోభనిస్తున్నాయి.

మెయిన్‌రోడ్డుకు చేరుతూనే, జతలుగా కట్టి కొట్టుకెళ్తున్న ఏడెనిమిది బర్రెలు కనబడ్డాయి. అంగడి జరగడం ఖాయమేననడానికి ఇది సూచిక. గుడిసె హోటల్లో టీ తాగి బయటకు వస్తున్నాయన అడిగాడు: "ఏ ఊరే?" వాటిని 'అయ్' అంటూనే జవాబొచ్చింది: "సారంపెల్లి."

• • •

బర్లు నడిచొస్తుంటే, మనిషిగా ఉన్న వాహన వెసులుబాటును వాడుకుంటూ, హైదరాబాద్ - 187 కిలోమీటర్ల రాయిని దాటుకుంటూ, సిరిసిల్ల వాగులో నీళ్లు లేక కనుచూపుమేరా కనబడుతున్న ఇసుక దిబ్బలు, పిచ్చిదుబ్బులు చూసుకుంటూ, ఎల్లమ్మ గుడిలోంచి 'జై రామరామ' కోరస్‌తో తెరలుగా వస్తున్న కార్తవీర్యార్జునుడి కథను వినుకుంటూ; అంగడి!

ఇప్పుడిప్పుడే మొదలవుతోంది. ఉన్న నాలుగు ఎడ్లు, రెండు ఆవులు, పదిగాల బర్లు... ఖనీలకో, పాతిన సీలలకో కట్టివున్నాయి. పది రూపాయల నోటు చేతిలో పెడుతూ గేదెను బేరం చేస్తున్నాడొకాయన. అమ్మే వ్యక్తి రైతు. కొనే వ్యక్తీ రైతే. ఈ సందర్భంలో కొనుగోలుదారు, అమ్మకందారుగా రూపాంతరం చెందారు. పదిహేడున్నర వేలు ఆయన చెబుతున్నాడు, పదిహేనున్నరకు ఈయన అడుగుతున్నాడు. "పదారుకడిగినా ఇయ్యనే బాపూ, పదడే."

"పొద్దుగాల బ్యారం ఇడిసివెట్టద్దు," అన్న ప్రేమైక గదమాయింపు తర్వాత పదహారున్నరకు ధర ఖాయమైంది.

పగ్గాలు చేతులు మారాయి. అంటే, అధికార మార్పిడి జరిగిందన్నమాట!

ఆయన అమ్మిన కారణం: "నాయిన ముసలితనానికచ్చిండు, పాలు పిండుడు కష్టమైతుంది... రెండు వారాలల్ల నేను 'దేశం' పోతున్నా."

ఈయన కొన్న కారణం: "పాలకు సాదుకోవాలె... రేటు గూడ మంచిగుంది గదా, పేనుకోవాలెగని బర్రెతోటి తుట్టి ఏముండది."

అమ్మకానికి గొడ్డుగేదెను తెచ్చిన ఇంకో యువరైతేమో, "నాలుగైదైనయ్, యాష్టకత్తుంది... సుడికచ్చినాకొద్ది ఒక్కొక్కదాన్ని తీసెయ్యాలె," అన్నాడు. వచ్చిన తొలి బేరం కుదర్లేదు. "ముప్పై నాలుగు అడిగిండుగనీ పైసలు వచ్చేవారమిత్తడట. వెయ్యి తక్కువైనా నగదుకే ఇయ్యాలె, లేకపోతే వానిదగ్గరికి నాలుగైదుసార్లు నడువాలె."

"పైసలు ముద్దుగ గావాలె, అప్పు తీసుకుంటే ఇది నయంగదా," అన్నాడు రుమాలు ముసలయ్య. అవసరానికి నగ అమ్ముకున్నట్లు!

• • •

దగ్గరి ఊర్లవి నడిచొచ్చినా, కొంచెం దూరమువాటిని ఇక్కడికి తరలించాలంటే వాహనాలే శరణ్యం. ఊరు దగ్గరేవున్నా వాటివెంట నడిచే ఓపిక మనుషులకు లేకపోయినా వాహనమే కావాలి. గూడ్స్ క్యారియర్! అమ్మకమయ్యే ప్రతిదీ గూడ్సే కదా! శ్రీ కొమురవెల్లి మల్లన్న, రేణుకామాత, శ్రీరామ, ఓం సాయిరాం, అయాన్, ఎస్.ఎం. అండ్ సన్స్, శ్రీ ఆంజనేయం, యెహోవా నా కాపరి, రాజరాజేశ్వరి, ముదిరాజ్, తల్లిదండ్రుల దీవెన; ఆదరాల పేర్లు, విశ్వాసాలు, అస్తిత్వాలను ప్రకటిస్తున్న ఆటోలు, 'వెక్క'లో పశువులు వస్తున్నాయి. ఒకదాంట్లో నాలుగు, ఒకదాంట్లో ఒకటే, ఒకదాంట్లో రెండు, ఒకదాంట్లో ఆవు, లేగ; ఇంకోదాంట్లో రెండు పెయ్యలు. కట్టెలతో అదిలిస్తూ, అవి వెనక్కి అడుగు వెయ్యలేక మొరాయిస్తూ, ముక్కు మీద దెబ్బకు భయపడి కాళ్లతో తన్నాడుతూ ("ఆ బర్రెను ముందు దించు పటేలా") ... ఒకటి దిగబోతూ కూలబడింది. కాలు విరిగిందనుకున్నాను. కాసేపు విలవిల్లాడి మళ్లీ నేరుగా నిలుచుంది.

మనుషులు పెరిగారు. బేరాలు ఊపందుకున్నాయి. పగ్గాలు, కొడవళ్లు అమ్ముతున్నారు. తాకట్టుపడిన సారంపెల్లి బర్లు కూడా మందలో కలిశాయి. మిర్చిబజ్జీలు వేగుతున్నాయి. చాయ్ గ్లాసులు నోళ్లు మారుతున్నాయి.

"ఎదుమాట్ల బయానిచ్చిన సూడు"

"రెండువేలు ఎక్కువచ్చినా అమ్మ, సరేనా?"

"దానికి సంక్లే లిక్వు, మిరపకాయలోలున్నయ్"

"ఏ పోరగాండ్లు మంచిగ్గుంజలేదు."

ఎడ్లు, ఆవులు కూడా అమ్మకానికి ఉన్నప్పటికీ ఈ సీజన్ గేదెలదే. సెప్టెంబరు, అక్టోబరు నెలల్లో బర్లు ఎక్కువగా ఈనుతాయి. పాలకోసం కొనాలన్నా ఇప్పుడే, అదే పాలకోసం కొంటారు కాబట్టి, మంచి ధర వస్తుందని

అమ్ముకునేదీ ఇప్పుడే.

కొమ్ములు తిరిగినవీ, కొమ్ములు ముందుకు వచ్చినవీ, నున్నగా వెనక్కి దువ్వినట్టున్నవీ, అదుపు లేకుండా పెరిగినవీ, పొట్టి కొమ్ములవీ; ఎరుపు మిళితమైనవీ, చిక్కటి నలుపువీ, నునుపైన చర్మమువీ; కొన్నింటి తోకలు, వాటి చెలులు... ఆడవాళ్ల జడల్లాగానే కొన్ని పొడ్డైవీ, కొన్ని పలుచటివీ, కొన్ని మోకాళ్లను తాకేవీ, కొన్ని నేలను అంటేవీ; ముక్కుతాళ్లు వేసినవీ, వేయనివీ; మెడలో పూసల దండలతో, కొమ్ములకు అల్లిన తాళ్లతో, నూనెరాసిన కొమ్ములతో, లెంకమేటలతో; బక్కగా, బలిష్ఠంగా; ఒకదాని ముందట గడ్డివుంది, ఒకదానిముందట లేదు;

గోపాల్రావుపల్లి, ఇల్లంతకుంట, అవునూరు, నంబెపెల్లి, వీర్లవంచలాంటి ఊళ్లనుంచి వచ్చిన ఇవన్నీ ఆ ఊళ్లల్లో ఉన్న మా బంధువుల క్షేమసమాచారమేదో మోసుకొచ్చాయనిపించింది.

పాలకేంద్రపు పసుపచ్చ బిళ్లని చెవితో ఆడిస్తున్న బర్రెను ఉద్దేశించి-

"ఎన్ని ఈతలీనిందే?"

"మలుర్వాదు"

అరచేతిలో పాలు పిండి చూపించాడు. "పిక్కగనే ఉన్నయ్". పక్కనే మూతికి బుట్టపెట్టివున్న పసిదూడై తల్లి కొమ్ములు అందుకోవడానికి విఫలయత్నం చేసి విరమించుకుంది. ఆ పసిది ఇవాళ్టినుంచీ వేరే ఊళ్లో, వేరే చేన్లో, వేరే వాకిట్లో కనబడుతుంది. తల్లయితే మరోదానికీ సర్దుబాటు కావాలి. తన పొదుగును రెండు కొత్త చేతులు తాకుతాయి.

కొంత పరాచికం, కొంత గడుసుదనం("పాలు తక్కొస్తుంది, ఎవనికో ఒగనికి అంటగట్టాలి"), కొంత వ్యవహారగుణం, కొంత మాటమీద నిలబడేతనం కలగలిసిన మనుషులు టీలు తాగుతూ, బీడీలు కాలుస్తూ, బయానాలు ఇస్తూ, నోట్లు లెక్కిస్తూ, ఇటువంటిదొకటి తీసుకుంటే బాగుండునని శరీరాన్ని పుణికిచూస్తూ; ధోవతులతో, తువ్వాళ్లతో, లుంగీలతో, ప్యాంట్లతో, హవాయి చెప్పులతో; రుమాలు, టోపీ ఒకచోట కదలాడుతూ, సిగరెట్ కాల్చే యువకుడూ, మోదుగాకు నారను పక్కతో తీసి చుట్టచుట్టుకునే తాతా కలిసికడుస్తూ;

"మొన్న సిద్దిపేటకు గొట్టుకపోతే ఆడ దర రాలేదు, మల్ల ఈడికెత్కచ్చుడైంది," తెల్లటి ఒంటిమీద నల్లమచ్చలున్న జెర్సీ ఆవుగురించి చెబుతున్నాడు.

సిద్దిపేటలో బుధవారం, ఎల్లారెడ్డిపేటలో సోమవారం, గంగాధరలో శని, బెజ్జంకిలో సోమ... ఈ చుట్టుపక్కల జరిగే ఇతర అంగళ్లు. "గంగాధరదైతే గొడ్ల మాకెలు గూడస్తయ్."

ఇంతలో ఒక ఆవు తుమ్మింది. "నురుసులు అంగి మీదపడే దీనియవ్వ."

ఒక బర్రె అక్కడే ఈనింది. అపురూప దృశ్యం అంగడి పాలు.

"పెయ్యనా పోతా?"

"పోతే గాలిపోయింది."

చిరుజీవికి దుస్వాగతం. గేదెమ్మలకు అల్లాయి పుడితే ద్వితీయ శ్రేణి పౌరుడే. పాలు మరిచేదాకానే దాని జీవితం. తర్వాత మాంసానికే("దున్నైతే రెండువేలు వస్తయ్, ఎందుకు ఇడ్చిపెడుతరు?"). పోతులు ఊళ్లల్లో లేకుండయ్యాక,

> ఒక బర్రె అక్కడే ఈనింది.
> అపురూప దృశ్యం అంగడి పాలు.
> "పెయ్యనా పోతా?"
> "పోతే గాలిపోయింది."
> చిరుజీవికి దుస్వాగతం.

గర్భధారణ కార్యం పశువైద్యులు చేస్తున్నారు, ఇంజెక్షన్లతో.

• • •

ఈగలు వాలితే విదుపుకుంటూ, తోకలు ఎత్తి పేడలు వేస్తూ, పెయ్యదానికి ఏమీలేక దవడలు ఆడిస్తూ, కొత్త ప్రదేశంలో ఆసరాకోసం శరీరాల్ని నాక్కుంటూ, ముందటిది మూత్రం పోస్తుంటే ముక్కుతో మురిక చూసుకుంటూ, ఒక్కోసారి కొమ్మూ కొమ్మూ కలిపి కొట్లాడుకుంటూ ("అయ్ అయ్ దీనితగ్గదలుగ"), మీద వాలిన కాకి ముక్కుతో పొడుస్తుంటే హాయ్‌మనిపించుకుంటూ; ఎడ్లు, ఆవులు.

సాధారణంగా వ్యవసాయ పనులు ఆరంభమయ్యే మే, జూన్ మాసాల్లో ఎడ్ల క్రయవిక్రయాలు ఎక్కువ. బోర, పుల్ల, వయ్య, కైలి రంగుల్లో ఉన్నవి ఇప్పుడు అమ్మకమవుతున్నాయంటే...

"నాగలి నడిచినప్పుడే ఎడ్లు, లేకపోతే కోతకు నడుసుడే."

"బర్రె కన్నా ఎద్దు మంచిగుంటది రుచి."

ఎక్కడ ఏ పశువు అమ్మకానికి వున్నా చేరగొట్టు మామూలే. వీళ్లు ఊళ్లు తిరుగుతూ, రైతుల దగ్గర కొనడమో, లేకపోతే 'నాలుగాపాయలు లాభం జేసుకొని' అమ్మిపెట్టడమో చేస్తారు.

ఆ రోజు కొన్నవాటి ధరల్ని ఒకాయన కాగితం మీద రాసుకుంటున్నాడు, 786తో మొదలుపెట్టి.

అంజయ్య అన్నాడు: "వీళ్లకంటే పెద్ద శేట్లుంటరు, బొంబాయిలున్నైనపైతే ఈ అంగళ్లున్నన్ని ఒక్కనికే ఉంటయట."

'బద్నాష్ భైంస్'ని అదిలిస్తున్న మరొకాయన తను కొన్నవాటిని హైదరాబాద్ తరలిస్తున్నాడు.

"ఆడ రెండు, ఈడ రెండు ఇడుసుకుంట పోవుడే, కిరాయా పావులెక్క."

"అగో అంతమంచిగున్నదా, అది గూడ కోతకే,' చూపిస్తూ చెప్పాడు నాంపెల్లి. "ఇల్లంటే ఆడోళ్ల మొగోళ్లుండదుగనీ... కోళ్ల మాకెలు గొడ్ల గోజ ఏముంచుకుంటలేరు. ఎవ్వడు సాదాలె? ఎవ్వడు జెయ్యాలె?... అయినా గడ్డి ఏడపొడాయింది? ఇంత జాగుంటె వత్తి పెట్టుడేనాయె."

మిట్టమధ్యాహ్నం అయింది. తమవన్న గుర్తుగా వాటికి పసుపచ్చ పెయింట్ పూస్తున్నాడు పిల్లాడు. ఈ అంగడిలో కొన్నట్టుగా సిరిసిల్లా మున్సిపాలిటీ రశీదులు చిరిగాయి. బేరాలు ముగిసేదాకా వాహనాల కింద కునుకు తీసిన పనివాళ్లు నిద్ర లేచారు. రెండంతస్తుల పెద్ద లారీ వాటిని ఎక్కించేందుకు అనువుగా నిలబడింది. ముక్కుతాళ్లు లాగి, అవసరమైతే రెండు దెబ్బలువేసి, పారిపోతే మళ్లీ పట్టుకొచ్చి, పొడవొస్తే కాచుకుని; దాన్లోకి ఎక్కించారు. పై అంతస్తు దుడ్డెల కోసం. మనుషుల మాటలు, పశువుల అరుపులు, వాహనాల శబ్దాలు మిళితమైపోయిన ఒక చిత్రమైన శబ్దమేదో రాజ్యమేలుతుండగా, నిశ్శబ్దంగా బయటికి వచ్చేశాను. కోడిని తినేవాడు కోడి మెడ గురించి చింతించడంలో అర్థముందా?

• • •

అక్కడే రంగినేని మోహనరావు వాళ్ల పెద్దమ్మాయి- 37 ఏళ్ల ఇల్లాలు ఉన్నట్టుండి కార్డియాక్ అరెస్ట్‌తో చనిపోయిందంటే ఆయన్ని పరామర్శించి... మళ్లీ ఇంటికొచ్చేసరికి, అల్లుడి మర్యాదలో భాగంగా మా అత్తగారోళ్లు రొట్టెలు చేసి, కోడికూర వండారు.

బర్రెను లారీలోకి ఎక్కిస్తున్న ఒకతని టీ షర్టు మీది రాతలాగే నేను కూడా 'బీయింగ్ హ్యూమన్'!

● పూడూరి రాజిరెడ్డి

## కింది నుంచి పైకి....




అబ్బాయ్: ఈరోజు కోసం నేను ఎన్నో రోజుల నుంచి ఎదురుచూస్తున్నాను.
అమ్మాయి: నన్ను వెళ్లమంటావా?
అబ్బాయ్: నో...నో
అమ్మాయి: డు యు లవ్ మీ?
అబ్బాయ్: నిన్న-అవును, ఇవ్వాళ-అవును, రేపు-అవును
అమ్మాయి: నన్ను మోసం చేస్తావా?
అబ్బాయ్: నో, అవసరమైతే చనిపోతాను.
అమ్మాయి: నన్ను ముద్దు పెట్టుకోవాలని ఉందా?
అబ్బాయ్: యస్. ఐ లైక్ ఇట్!
అమ్మాయి: నువ్వు నన్ను కొడతావా?
అబ్బాయ్: నేను అలాంటి మనిషిని కాదు.
అమ్మాయి: నేను నిన్ను నమ్మవచ్చా?
అబ్బాయ్: యస్. తప్పకుండా
అమ్మాయి: ఓహ్... డార్లింగ్!

పెళ్లి తరువాత....
కింది నుంచి పైకి చదువుకోండి!

## ఈ జోక్ మీ గాళ్‌ఫ్రెండ్‌కి చెప్పి నవ్వించండి!



చిన్ని: రింకీ ఆంటీ! మమ్మీ నిన్నడిగి పంచదార తెమ్మంది.
రింకీ ఆంటీ: అలాగే ఇస్తాను. ఇంకా మీ మమ్మీ ఏం చెప్పింది?
చిన్ని: ఆ రింకీ తన వెధవ తెలివితేటలు చూపి పంచదార లేదని చెప్పిందనుకో, వెంటనే పింకీ ఆంటీ ఇంటికి వెళ్లి అడుగు అని చెప్పింది.

## ఫినిషింగ్ టచ్!



కవి శ్రీను: ఈ పెదాలు నీ పెదాల గురించి
మాట్లాడడానికే పుట్టాయి.
ఈ చెవులు నీ తీయటి మాటలు
వినడానికే పుట్టాయి.
జేబులో ఉన్న ఈ కలం నీమీద
కవితలు రాయటానికే పుట్టింది.
రవి చెల్లి రాజీ: చాలా బాగుంది.
నేను చెప్పేది కూడా
విను-
'నా చెప్పులు
నీ కోసమే
పుట్టినవి'

## ప్రేమచరణం

ప్రతిక్షణం నా కళ్లలో నిలిచె నీ రూపం
బ్రతుకులో అడుగడుగునా నడిపె నీ స్నేహం
ఊపిరే నీవుగా ప్రాణమే నీదిగా
పది కాలాలు ఉంటాను నీ ప్రేమ సాక్షిగ

## ఒక లవ్వు....



ఒక సిగరెట్
నీ జీవితకాలంలో
రెండు నిమిషాలను
నొక్కేస్తుంది.
ఒక బీర్ బాటిల్
నీ జీవిత కాలంలో
నాలుగు నిమిషాలు నొక్కేస్తుంది.
ఒక లవ్వు...
నీ జీవితకాలాన్ని రెట్టింపు చేస్తుంది!
మరుజన్మలో ఫ్రెష్‌గా ఉండడానికి కావల్సిన ఎనర్జీని
కుండలకొద్దీ ఫ్రీగా ఇచ్చేస్తుంది!




## ట్యోంటోం

క్లాసురూమ్ నుంచి
ఆఫీసురూమ్ వరకు!
బుక్స్ నుంచి ఫైల్స్ వరకు
జీన్స్ నుంచి ఫార్మల్స్ వరకు
పాకెట్‌మనీ నుంచి సాలరీస్ వరకు
గర్ల్‌ఫ్రెండ్ నుంచి వైఫ్ వరకు
అన్నీ 'చేంజ్' అవుతాయి.
'చేంజ్' కానిది-
తలరాత మాత్రమే!

## ఫైనల్ మ్యాచ్!



ఒక అమ్మాయి పెళ్లికి ఆమె ఎక్స్-బాయ్‌ఫ్రెండ్ వచ్చాడు. కొందరు ఆ అబ్బాయిని అడిగారు-
''స్మార్ట్‌గా ఉన్నారు. మీరేనా పెళ్లికొడుకు?''
దానికి ఆ అబ్బాయి ఇలా జవాబు ఇచ్చాడు:
''కాదు. సెమీఫైనల్ వరకు వచ్చి ఓడిపోయాను. ఫైనల్ ఎలా ఉంటుందో చూద్దామని వచ్చాను!''



## యూ!

ఓపెన్ విత్ లవ్...
డిస్టర్బ్ చేస్తున్నానా?
అయామ్ సారీ!
కానీ... తప్పదు!
ఐ...
లవ్...
డిస్టర్బింగ్ యూ!

యాకుబ్ పాషా

₹ భద్రం బి కేర్‌ఫుల్

# మీ కోసం, మీ పిల్లల కోసం



పొదుపు ఎందుకు చేస్తాం? అవసరాలకు పనికొస్తుంది. మరి దాని లక్ష్యం నెరవేరకపోతే ఆ పొదుపే వృథా. చేతిలో డబ్బులుంటే ఇప్పుడు పొదుపు చేయడానికి ఎన్నో మార్గాలున్నాయి. అవి... ఫిక్స్‌డ్ డిపాజిట్, బంగారం, మంత్లీ పొదుపు పథకాలు, షేర్ మార్కెట్లు, మ్యూచువల్ ఫండ్లు, స్థలాలు-పొలాలు... ఇలా ఎన్నో రకాలు. అయితే పొదుపు మన డబ్బును వేగంగా పెంచడం ఎంత ముఖ్యమో అవసరానికి ఆదుకోవడం కూడా అంతే ముఖ్యం. అందుకే ఏదెలా ఉపయోగపడుతుందో తెలుసుకుని పొదుపు చేయడం ఉత్తమం.

**ఎ) అవసరాలకు రక్షిచ్చే పొదుపు మార్గాలు**

**ఫిక్స్‌డ్ డిపాజిట్:** నిర్ణీత కాలానికి పొదుపు చేస్తాం. కానీ, అవసరమైనప్పుడు వెనక్కు తీసేసుకోవచ్చు. అయితే, గడువు ముగిశాక ఇచ్చే వడ్డీకంటే కొంచెం తగ్గించి ఇస్తారు. కాబట్టి అత్యవసరాల్లో వాడుకునే అవకాశం ఉండాలంటే ఇందులో పెట్టాలి.

**బంగారం :** అందుబాటులోని వనరులు, అవసరాల్ని బట్టి చూస్తే భవిష్యత్తులో బంగారం పెరుగుతుందే కానీ భారీగా తగ్గే ప్రమాదం ఉండదు. కాబట్టి బంగారం కొని దాచుకుంటే అవసరమైనపుడు వెంటనే అమ్మి సొమ్ము చేసుకోవచ్చు.

**మంత్లీ సేవింగ్స్ :** బ్యాంకుల్లో నెలనెలా పొదుపు చేసే పథకాలన్నీ అవసరానికి అక్కరకు వచ్చేవే. పరిమిత కాల నిబంధన ఉన్నా కూడా అది వడ్డీపై కొంత ప్రభావం చూపుతుందంతే. నెలనెలా పొదుపు చేసిన డబ్బులు కూడా అత్యవసర పరిస్థితుల్లో వెనక్కు తీసేసుకోచ్చు.

**బి) సంపదను పెంచే మార్గాలు**

**షేర్లు, మ్యూచువల్ ఫండ్లు:** వీటిలో డబ్బు పెడితే వెంటనే తీసుకునే అవకాశం అయితే ఉంటుంది. కానీ, మీకవసరమైనప్పుడు తీసుకుందామనుకుంటే అన్నిసార్లూ కుదరదు. హెచ్చుతగ్గులు చాలా ఎక్కువ కాబట్టి మార్కెట్ బాగా లేనప్పుడు మీకు సొమ్ము అవసరమైతే నష్టపోతారు.

**స్థలాలు-పొలాలు :** జనం పెరుగుతారు కానీ భూమి పెరగదు. కాబట్టి మీరు నేలమీద పెట్టిన ప్రతి రూపాయీ తిరిగొస్తుంది. అయితే, అవసరానికి అర్జెంటుగా అమ్మాలంటే మాత్రం ఈజీ కాదు.

మీరు దాస్తున్నది మీకోసమైతే ఎ)లో, మీ పిల్లల కోసమైతే బి)లో దాచుకోండి.

అప్పుచేసి పప్పుకూడు — మనీమాన్యితం — పింగళి

దొంగతనము తప్పురా దోపిడీలు ముప్పురా
అందినంత అప్పు చేసి మీసం మెలి తిప్పురా
అప్పుచేసి పప్పుకూడు తినరా ఓ నరుడా
గొప్ప నీతి వాక్యమిది వినరా పామరుడా

₹ స్ఫూర్తి

# ఖరీదైన వ్యక్తిత్వం



దేశంలో అత్యధికులకు పరిచయమైన తెలుగు సినీప్రముఖుడు, తెలుగు రాజకీయ నేత టి.సుబ్బిరామిరెడ్డి తెలుగు సినిమా చరిత్రలోనే కాదు, భారతీయ సినిమా చరిత్రలోనే సంపన్నులైన అతికొద్ది మంది వ్యక్తుల్లో ఆయన ఒకరు. నెల్లూరు జిల్లాకు చెందిన సుబ్బిరామిరెడ్డి హైదరాబాద్ నిజాం కాలేజీలో చదువుకున్నారు. చురుకైన విద్యార్థిగా కాలేజీ రోజుల్లో మన్ననలు పొందిన ఆయన తర్వాత కాలంలోనూ అదే స్థాయిలో తనను తాను నిరూపించుకున్నారు. విభిన్నమైన రంగాల్లో అడుగుపెట్టి వ్యాపారవేత్తగా, కళాకారుడిగా, రాజకీయ నాయకుడిగా, సినిమా సెలబ్రిటీగా... ఇంతా పలు రకాలుగా తన సమర్థతను చాటుకున్నారు.

సినిమాలను ఆయన వ్యాపారంగా చూశారు, కళాదృష్టితోనూ చూశారు. హిందీ, తెలుగు, తమిళ భాషల్లో చిత్రాలు నిర్మించిన ఆయన హిందీలో స్వామి వివేకానంద, సంస్కృతంలో భగవద్గీత నిర్మించి ప్రత్యేకతను చాటుకున్నారు.

గాయత్రి హోల్డింగ్స్ పేరిట పలు కంపెనీలు నెలకొల్పారు. నిర్మాణ రంగంలో, ఉత్పత్తి రంగంలో, ఫార్మా రంగంలో పరిశ్రమలు స్థాపించారు. నాగార్జున సాగర్ డ్యామ్‌లోనూ ఆయన కృషి కొంత ఉంది.

రాజకీయాల్లోనూ తనదైన ముద్ర వేశారు రెడ్డి. కేంద్ర మంత్రి, టీటీడీ ఛైర్మన్ వంటి పలు పదవుల్లో ఆయన రాణించారు. సుబ్బిరామిరెడ్డి ఎందులో అయినా తన ప్రత్యేకతను చాటుకునే మనిషి. కొన్ని సినిమాలతోనే అవార్డులు పొందారు. పారిశ్రామికవేత్తగా అవార్డులు, విజయాలు సాధించిన ఆయన పేజ్ త్రీ వర్గాల్లో భారతదేశంలోనే ఖరీదైన పార్టీలిచ్చే వ్యక్తిగా గుర్తింపు పొందారు. సినిమాలు తీసినా, తీయకపోయినా ఆ రంగంతో తన సంబంధాల్ని కొనసాగిస్తూనే ఉన్నారు. బిలియనీర్ అయిన సుబ్బిరామిరెడ్డి ఇటీవలి ఎన్నికల్లో తన ఆస్తిని 320 కోట్లుగా ప్రకటించారు.

₹ టిప్స్

# చిరుద్యోగులకు చిట్కా!



ఎంత దాచాం అన్నదానికన్నా ఎంత పద్ధతిగా దాచాం అన్నది ముఖ్యం. ఇప్పటికీ నెలకు పదివేలు ఆదాయం దాటని ప్రజలు కోట్లమంది ఉన్నారు. నేటి ధరల్లో ఆ ఆదాయం కుటుంబానికే చాలదు. మనకెన్ని కష్టాలున్నా మనల్ని పెంచి పెద్దచేసిన తల్లిదండ్రులను వదిలేయ కూడదు. ఇటీవల జరిగిన ఒక సర్వేలో దేశంలో అత్యధిక వృద్ధులు, పిల్లలున్నా అనాథలుగా బతుకుతున్నారు. మీ తల్లిదండ్రులకు ఆ పరిస్థితి రాకుండా చూసుకోండి. కేవలం నెలకు వందో, రెండు వందలో ఏ ఖాయ్‌కో ఖర్చుపెడుతున్నామని ఓ ప్రత్యేక ఆర్డీ (రికరింగ్ డిపాజిట్) కట్టండి. దాన్ని మీ తల్లిదండ్రుల సంక్షేమానికే వాడండి. మీరు 200 కట్టినా గడువు నాటికి అది సుమారు 38 వేలు అవుతుంది. ఇంట్లో భాగస్వామితో సమస్యలున్నవారు ఈ మార్గంలో వివాదరహితంగా తగినంత సొమ్ము తల్లిదండ్రులకు అందచేయవచ్చు.

● ప్రకాష్ చిమ్మల

## పదశోధన - 221

నిర్వహణ : అద్దెప్రదీపక



**ఆధారాలు**

**అడ్డం**

1. నటునకు ప్రాణమైన ఉచ్చారణ (3)
3. కలంతో సమస్తం (3)
5. మగవారి మూతిమీద మొలిచేది (2)
6. రెండు నిలువు లాంటిదే (3)
7. యుద్ధం (3)
9. కొసరు కాదు - కొంచెం, స్వల్పం (3)
11. అలాగే (2)
13. సప్తస్వరాలు (7)
15. అన్వేషణ, శోధన (3)
16. ఒడి నుంచి వచ్చిన లేమ (2)
17. సంజీవని పర్వతం తెస్తున్న హనుమంతుడు వధించిన రాక్షసుడు (4)
19. శరీరం (2)
20. ఆంగ్లంలో అదృష్టవంతుడు (4)
22. పుల్లముక్క (3)
23. కెరటం (2)
24. ఇంగ్లీష్‌వారి బృందగానం (3)
26. అపరిచితుడు, భోజన సమయానికి వచ్చిన అతిథి (5)
27. చేతిరాత (3)

**నిలువు**

1. ఇక్కడ గణపతి ఎంతో ప్రసిద్ధుడు (3)
2. తొందర, ఆందోళన (3)
3. నేరుగా, నగటు (4)
4. రావణరాజ్యం (2)
5. సేవ (2)
8. సేనాధిపతి (4)
10. గుర్రపు కూత (4)
12. బంకమట్టి నేల (5)
14. పైకి ఎక్కడానికి పనికొచ్చే సాధనం (3)
15. గార్దభం (3)
17. బహుమతి (3)
18. వాల్ట్ డిస్నీ సృష్టించిన ఎలుక (4)
19. సాధం (2)
21. పిసినిగొట్టు (2)
22. పెసరపప్పు చేర్చి వండిన అన్నం (3)
23. ఆ, ఆలు రాయండి (2)
24. మందానికి ఆధారమైన స్తంభాలలో ఒకటి (2)
25. మార్గం (2)

**పదశోధన - 220 జవాబు**



### • దాగుడు మూతలు

ఇందులో దాగి ఉన్న బొమ్మలను గుర్తించండి?



### • పజిల్



పై రెండు జాడీలలో నీరు పోస్తే ఏందులో ఎక్కువ నీరు నిండుతుంది?

● మెదడుకు మేత

## Food Facts



- యాపిల్‌కు గొంతునొప్పి, దగ్గులను తగ్గించే శక్తి ఉంది!
- అరటిపళ్ళు తినేవారికి చర్మ సమస్యలు తక్కువగా వస్తాయట!
- ఆవుపాలలో కంటే మేకపాలలో ఎక్కువ కొవ్వు ఉంటుంది!
- లవంగాలు, వాటి నుంచి తీసిన నూనె పంటి సమస్యలు రాకుండా కాపాడతాయి!
- నిమ్మరసం ఎముకలను దృఢంగా చేస్తుంది!

## Interesting Facts



- జపాన్ వాసులు 4 అంకెను అశుభంగా భావిస్తారు. వాళ్ళు 4 ను షి అంటారు. అంటే మృత్యువు అని అర్థం.
- అబ్రహాం లింకన్, ఆండ్రూ జాక్సన్, జాషరీ టేలర్, జార్జ్ వాషింగ్టన్, మార్టిన్ వాన్ బ్యురెన్, మిలర్డ్ ఫిల్‌మోర్, గ్రోవర్ క్లీవ్‌లాండ్... ఈ అమెరికా మాజీ అధ్యక్షుల్లో ఏ ఒక్కరూ కాలేజీలో అడుగు పెట్టలేదు!
- 1600 ప్రాంతంలో టులిప్ పూలు బంగారం కంటే ఎక్కువ ధర పలికేవి!
- ఐర్లాండ్‌ని ల్యాండ్ ఆఫ్ రైటర్స్ అంటుంటారు. కారణం, జొనాథన్ స్విఫ్ట్, ఆలివర్ గోల్డ్‌స్మిత్, ఆస్కార్ వైల్డ్, జార్జ్ బెర్నార్డ్‌షా, ఈట్స్, జేమ్స్ జాయిస్ లాంటి మహా రచయితలు అక్కడే పుట్టారు!
- ఇంగ్లండ్‌లో మూడు వందల భాషలు మాట్లాడే ప్రజలున్నారు!

## Animal Facts




- సీ హార్స్‌కు పళ్ళు ఉండవు. కడుపు కూడా ఉండదు!
- హమ్మింగ్ బర్డ్స్‌కి వాసన చూసే శక్తి లేదు!
- ఈ ప్రపంచంలో గెంతలేని ఒకే ఒక్క జంతువు... ఏనుగు!
- గుర్రాలు, కుందేళ్ళు వాంతి చేసుకోవు!
- నీళ్ళు లేకపోయినా కొన్ని నెలల పాటు బతకగలిగే చేప ఒకటుంది. అదే ఆఫ్రికన్ లంగ్‌ఫిష్!

## Known Person Little known Facts




- జర్మనీలో జన్మించాడు. నాలుగో యేటే సంగీత సాధన మొదలెట్టాడు!
- 1796 నుంచి అతడి వినికిడి శక్తి మందగించడం మొదలయ్యింది. 1816 నాటికి పూర్తిగా చెవిటివాడై పోయాడు! అయినా పాటలు కట్టేవాడు, పాడేవాడు!
- అనారోగ్యం గురించి మథనపడుతూ ఉండేవాడు. అందువల్లే పెళ్లి చేసుకోడానికి కూడా ఇష్టపడలేదు!
- మహా కోపిష్టి. ఓసారి వెయిటర్ ప్రవర్తన నచ్చక తింటున్న ప్లేట్‌ని అతని ముఖాన విసిరికొట్టాడు!
- ఓ విచిత్రమైన సెంటిమెంట్ ఏమిటంటే... పొద్దున్న తాగే కాఫీలో కచ్చితంగా అరవై కాఫీ గింజలు ఉండేలా చూసుకునేవాడట!
- 1827, మార్చ్ 26న మరణించాడు. అతడి అంత్యక్రియలకు ఇరవై వేల మందికి పైగా హాజరయ్యారు!

● చిట్టి కథ

# తారుమారు



ఒక జమిందారుకు తోట కావలాకి, మొక్కలకు నీరు పోయడానికి ఉద్యోగులు అవసరమయ్యారు. దివాను సూచన మేర చెరో యాభై వరహాల జీతానికి ఇద్దర్ని నియమించాడు.

నీరుపోయడం కన్నా కావలా కాయడం అన్నివిధాలా కష్టమైనది కాబట్టి పది వరహాలు ఎక్కువ జీతం ఇవ్వాలని పట్టుబట్టాడు కావలాదారుడు. జమిందారు సరేనన్నాడు.

ఓసారి తోట చూడడానికి జమిందారు, దివాను బయలు దేరారు. మార్గమధ్యంలో హఠాత్తుగా వర్షం కురవడం మొదలైంది. అక్కడకు దగ్గరలో ఉన్న తాటాకుల గుడిసె దగ్గరికి ఇద్దరూ పరుగు తీశారు. అప్పటికే ఆ గుడిసెలో కావలాదారుడు ఉన్నాడు.

''నువ్వేమిటి ఇక్కడ?'' అడిగాడు దివాను.

''ఇది మా ఇల్లే. ఇంతలా వర్షం పడుతుంటే తోటలోకి ఎవరూ పోరనే ఉద్దేశంతో ఇప్పుడే వచ్చాను'' చెప్పాడు కావలాదారుడు.

''మరి నీరుపోసే ఉద్యోగి?''... అడిగాడు దివాను. ''అతను ఒట్టి చాదస్తపు మనిషిలా ఉన్నాడు. వర్షం పడుతుందని తెలిసినా గొడుగేసుకుని మరీ మొక్కలకు నీరు పోస్తుంటాడు''... హేళనగా సమాధానమిచ్చాడు కావలాదారుడు.

''అతనంత అమాయకుడా?'' అడిగాడు జమిందారు.

దివాను కలుగజేసుకుని, ''అతడు అమాయకుడు కాదు. పనే పరమావధిగా భావించే మనిషి. నిజానికి కావలాదారునికి కాలంతో నిమిత్తం ఉండకూడదు. అలాగే నీరుపోసే ఉద్యోగికి సమయాసమయాల విచక్షణాజ్ఞానం అవసరం. మీ ఇద్దరి చిత్తశుద్ధి తారుమారుగా ఉంది. అందుకే రేపట్నుంచి మీ ఉద్యోగాలు ఇట్నుంచి అటు మారుస్తున్నాను'' అన్నాడు దివాను.

సహోద్యోగిని అవహేళన చేయబోయి పది వరహాల అదనపు జీతాన్ని కోల్పోయినందుకు చింతించాడు కావలాదారుడు.

**నీతి: ఇతరులను హేళన చేస్తే మనమే నష్టపోతాం. అలాగే చేసే పని పట్ల నిబద్ధతతో ఉండటం ముఖ్యం.**

● బి.వి.పట్నాయక్

RNI Reg No.APTEL/2008/23482



సాక్షి
ఫన్‌డే
ఆదివారం ::: 21 అక్టోబర్ 2012





# త్రిశక్తి... స్త్రీశక్తి

## క్విక్ బైట్స్..!

## గద్ద నోట మొసలి!



గద్దలు కోడిపిల్లలను, కోళ్లను, చేపలను, పాములను తన్నుకు పోవడం సర్వసాధారణం. అటువంటిది నీటిలోనుంచి సరదాగా పైకి వచ్చిన ఒక పిల్ల మొసలినే తన్నుకుపోయిందీ ఆకలిగొన్న గద్ద. టాంజానియాకు చెందిన షెర్లీ మార్టిన్ అనే జంతు ప్రేమికుడు తన కుటుంబంతో కలిసి నది ఒడ్డుకు విహార యాత్రకు వెళ్లినప్పుడు అరుదైన ఈ దృశ్యం కంటపడింది. వెంటనే దానిని తన కెమెరాలో బంధించి మురిసిపోయాడు. మొసలి ఎంత చిన్నదైనా దాని బరువు ఎక్కువే ఉంటుంది. గద్దలకు బరువులను మోసే శక్తి ఉంటుంది కానీ మరీ ఇంత ఎక్కువగా కూడా ఉంటుందని ఈ ఉదంతంతో పక్షి శాస్త్రవేత్తలకు స్పష్టమైంది. మొసలిని నోటకరుచుకుని ఎగురుకుంటూ వెళ్లిన గద్ద దానిని తన పిల్లలతో కలిసి విందు చేసుకోవడానికో లేదా పిల్లలకు వేట నేర్పడానికో అలా చేసి ఉంటుందని మార్టిన్ అంటున్నాడు.

## నగ్న నిరసన



'రోడ్డు ప్రమాదాల నివారణకు సత్వర చర్యలు చేపట్టాలి', 'సైకిల్ లైన్లు విరివిగా ఏర్పాటు చేయాలి' అని డిమాండ్ చేస్తూ పెరు దేశానికి చెందిన మూడువేలమంది సైక్లిస్టులు తమ దేశ రాజధాని లిమాలో వినూత్నమైన నిరసన యాత్రను నిర్వహించారు. అయితే వారు ఆ డిమాండ్లను రాసుకున్నది ప్లకార్డుల మీదనో, బ్యానర్ల మీదనో కాదు, తమ నగ్నదేహాల మీద! పెరుదేశంలో 2011 సంవత్సరంలో 2,830 మంది యాక్సిడెంట్లలో మరణించినట్లు అధికారిక లెక్కలు చెబుతుండగా అంతకు దాదాపు రెండు రెట్లకు పైగా మృతులు ఉన్నట్లు అనధికారిక అంచనా. విచ్చలవిడిగా పెరిగిపోతున్న కార్లు, స్కూటర్లు తదితర మోటార్ వాహనాల ద్వారానే ఈ ప్రమాదాలు జరుగుతున్నాయని, వాయుకాలుష్యం పెచ్చరిల్లుతోందని, వీటి నివారణకు సైకిళ్ల వాడకాన్ని ప్రోత్సహించాలని సైక్లిస్టుల నాయకుడు ఒబ్బావో అంటున్నారు.

## ఓరి ఓరి గుమ్మడీ ఎంత బరువే!



కాలిఫోర్నియాలో ప్రతి ఏటా పంప్కిన్ ఫెస్టివల్ నిర్వహించి అత్యంత బరువైన గుమ్మడికాయను పండించిన రైతుకు నగదు బహుమతిని ఇవ్వడం పరిపాటి. అందులో భాగంగా ఈ సంవత్సరం ఉరుగ్వేకు చెందిన థడ్స్టర్ అనే 42 ఏళ్ల ఆసామి 1780 పౌండ్ల బరువున్న గుమ్మడికాయను పండించి, అక్షరాలా పదకొండువేల డాలర్ల బహుమతిని కైవసం చేసుకున్నాడు. థడ్ ఇలా బహుమతిని అందుకోవడం ఇది మొదటిసారి కాదు. గతంలో రెండుసార్లు బహుమతిని గెల్చుకున్నాడు. అయితే నిరుడు జరిగిన పోటీలో తన గుమ్మడి నెగ్గకపోవడంతో ఈసారి మరింత కష్టపడి ఈ భారీ గుమ్మడికాయను పండించాడు. ప్రైజ్ మనీని కొల్లగొట్టాడు. బహుమతిగా వచ్చిన డబ్బుతో కుటుంబ సమేతంగా డిస్నీల్యాండ్ వెళ్లాలనుకుంటున్నట్లు చెప్పాడు.

## అపురూప మాతృబంధం!



దక్షిణ చైనాలోని సిన్షు బీచ్‌లో విహరిస్తున్న ఒక టూరిస్ట్ బోట్ ఓ వింత దృశ్యాన్ని చూసింది. డాల్ఫిన్ ఒకటి తన బిడ్డను వీపు మీద కూచోబెట్టుకుని ఈత కొడుతోంది. డాల్ఫిన్లు నీటిలో ఈదడం వింతేమీ కాదు కాని, దాని వీపు మీద ఉన్న బిడ్డ మాత్రం జీవించి లేదన్నమాట. పిల్ల డాల్ఫిన్ ఉదర భాగంలో ఏదో పదునైన సాధనంతో చీరుకుపోయి ఉన్నట్లు కనిపించింది. కొందరు దాని వీపు మీది నుంచి మృత శరీరాన్ని దించేందుకు ప్రయత్నించబోగా అది సుతరామూ ఇష్టపడలేదు. అట్లా రెండు మూడు రోజులపాటు బిడ్డ మృతదేహాన్ని వీపు మీద మోస్తూనే ఉంది. చివరికి ఆ మృతదేహం దానంతట అది తల్లి నుంచి వేరుపడి, సముద్రగర్భంలో కలిసిపోయే దాకా అది తిండీ నీళ్లు తీసుకోకుండా అలాగే తిరుగుతూ ఉంది. ఆ దృశ్యం చూపరుల గుండెలను మెలిపెట్టింది.

## పాయింట్ ఆఫ్ ద వీక్

| 21 | 22 | 23 | 24 | 25 | 26 | 27 |
|---|---|---|---|---|---|---|
| ఫ్రాన్స్ మొదటిసారిగా మహిళలకు ఓటు హక్కును కల్పించింది (1945) | భారతదేశం తొలి మానవ రహిత అంతరిక్ష కేంద్రం చంద్రయాన్-1ను అంతరిక్షంలోకి పంపింది (2008) | హిందీలో రామాయణం రాసిన తులసీదాస్ అస్తమించారు (1623) | ప్రపంచ శాంతి పరిరక్షణ కోసం ఐక్యరాజ్య సమితిని నెలకొల్పారు. (1945) | క్యూబాలో ఫిడెల్ క్యాస్ట్రో అమెరికన్ డాలర్లతో జరిపే లావాదేవీలను నిషేధించారు (2004) | కాశ్మీర్‌ను భారత్‌లో కలపడానికి కాశ్మీర్ మహారాజా అంగీకరించారు (1947) | అమెరికా జైళ్లలో ఉన్నవారి సంఖ్య రికార్డు స్థాయిలో పది లక్షలకు చేరుకుంది (1994) |

# దీర్ఘకాల అనారోగ్యానికి ఇక స్వస్తి చెప్పండి!

మీ రోగనిరోధక శక్తిని పెంచి
ఆరోగ్యాన్ని మెరుగు పరచే..
పాజిటివ్ హోమియోపతి వారి పరిశోధన

## ఇమ్యూనోథెరపి

మీ కోసం..

- అతి తక్కువ ఖర్చుతో
- ప్రకృతి సిద్ధంగా
- ఎలాంటి దుష్ఫలితాలు లేకుండా దూరం చేయడం మా లక్ష్యం.




**మా ప్రత్యేక చికిత్సలు:**

- దయాబెటిస్
- సంతానలేమి
- థైరాయిడ్
- అలర్జీ & ఆస్తమా
- సోరియాసిస్
- కీళ్ళసమస్యలు
- వెన్నెముక సమస్యలు
- సెక్స్ సమస్యలు

ఉచిత సలహాలకై: టోల్ ఫ్రీ
**1800 425 0144**

అమీర్ పేట్ | S.R. నగర్ | కూకట్ పల్లి | విక్రమ్‌పురి
కాచిగూడ | దిల్‌సుఖ్‌నగర్ | మెహదీపట్నం

An ISO 9001 - 2000 Certified ®

## పాజిటివ్ హోమియోపతి

వైజాగ్ | రాజమండ్రి | విజయవాడ | గుంటూరు
తిరుపతి | కర్నూలు | నిజామాబాద్ | కర్ణాటక అంతటా..

www.positivehomeopathy.in    SMS "POSITIVE" TO 55352

అపాయింట్‌మెంట్ కొరకు: **9246 18 77 88**

**● సూక్తి**

నీ కలలు నడిపించిన దారిలో నమ్మకంగా సాగిపో. నువ్వు కోరుకున్న మార్గంలోనే నీ జీవితాన్ని తీసుకుపో. లేదంటే నీ బతుకు నువ్వు భరించలేనంత భారమైపోతుంది.

\- హెర్బ్ డేవిడ్, అమెరికన్ కవి

**● సూచిక**


6

టేక్ ఇట్ ఈజీ
తెలుగు కథ!

14

రాలిన మొగ్గలు
క్లియోపాత్రా

18

నిజాలు దేవుడికెరుక!
అక్కడితో ఆగలేదు!

20

కథనం
పాలమ్మ...!


**● వారఫలం** — **అక్టోబర్ 21 నుండి 27 వరకు** — నిర్వహణ: **సింహంభట్ల సుబ్బారావు**

**మేషం:** కొన్ని పనులు నెమ్మదిగా సాగుతాయి. ఆర్థిక ఇబ్బందులు కొంత తొలగే అవకాశం. చిన్ననాటి మిత్రులను కలుసుకుంటారు. కొత్త కాంట్రాక్టులు పొందుతారు. ఆస్తి వివాదాలు తీరి లబ్ధి పొందుతారు. ఒక ఆహ్వానం సంతోషం కలిగిస్తుంది. రాజకీయ, కళారంగాల వారికి సన్మానాలు.

**వృషభం:** ఆర్థిక విషయాలలో కొంత పురోగతి కనిపిస్తుంది. దీర్ఘకాలిక సమస్య నుంచి బయటపడతారు. ఆలోచనలు కార్యరూపం దాలుస్తాయి. సంఘంలో గౌరవం పెరుగుతుంది. ఆకస్మిక ప్రయాణాలు ఉంటాయి. పారిశ్రామిక, రాజకీయ వర్గాలకు విదేశీ పర్యటనలు.

**మిథునం:** ఆర్థిక లావాదేవీలు కొంత నిరాశ కలిగిస్తాయి. అనుకోని ప్రయాణాలు. బంధువులతో స్వల్ప వివాదాలు. ఆరోగ్యభంగం. దూరప్రాంతాల నుంచి అందిన సమాచారంతో ఊరట చెందుతారు. పనులు నెమ్మదిగా సాగుతాయి. రాజకీయ, పారిశ్రామికవర్గాలకు విదేశీ పర్యటనలు వాయిదా.

**కర్కాటకం:** కొత్త విషయాలు తెలుసుకుంటారు. ప్రయత్నాలు అనుకూలిస్తాయి. ఇంటాబయటా అనుకూల స్థితి. ఆలయాలు సందర్శిస్తారు. పలుకుబడి కలిగిన వారితో పరిచయాలు. పుణ్యక్షేత్రాలు సందర్శిస్తారు. రాబడి సంతృప్తికరంగా ఉంటుంది. రాజకీయ, కళారంగాల వారికి నిరుత్సాహం.

**సింహం:** పనులు సకాలంలో పూర్తి చేస్తారు. సంఘంలో గౌరవం. విలువైన సమాచారం అందుతుంది. భవిష్యత్తుపై కొత్త ఆశలు చిగురిస్తాయి. చిరకాల స్వప్నం నెరవేరుతుంది. కాంట్రాక్టులు పొందుతారు. రాజకీయ, పారిశ్రామికవర్గాలకు అరుదైన సత్కారాలు. ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో పాల్గొంటారు.

**కన్య:** కొత్త విషయాలు తెలుసుకుంటారు. ప్రతిభ వెలుగులోకి వస్తుంది. ఆశ్చర్యకరమైన సంఘటనలు. కీలక నిర్ణయాలు తీసుకుంటారు. ప్రముఖులతో పరిచయాలు. వాహనాలు, గృహం కొనుగోలు చేసే అవకాశం. ఆర్థిక పరిస్థితి మెరుగ్గా ఉంటుంది.

**తుల:** కొన్ని కార్యక్రమాలు వాయిదా వేస్తారు. రావలసిన సొమ్ము ఆలస్యంగా అందుతుంది. దూరప్రయాణాలు ఉంటాయి. సన్నిహితులు, మిత్రులతో స్వల్ప వివాదాలు. ఆరోగ్యభంగం. శ్రమాధిక్యం. దూరపు బంధువులను కలుసుకుంటారు. వ్యాపారాలు స్వల్పంగా లాభిస్తాయి.

**వృశ్చికం:** ఆర్థిక పరిస్థితి కొంత చికాకు పరుస్తుంది. వ్యవహారాలు ముందుకు సాగవు. దూరప్రయాణాలు. ధనవ్యయం. కుటుంబసభ్యులతో మాటపట్టింపులు. ఆలోచనలు నిలకడగా ఉండవు. బంధువులను కలుసుకుని మంచీచెడ్డా విచారిస్తారు. పారిశ్రామిక, రాజకీయవర్గాలకు అసంతృప్తి.

**ధనుస్సు:** పరిస్థితులు అనుకూలిస్తాయి. చిరకాల మిత్రులను కలుసుకుని ఉత్సాహంగా గడుపుతారు. సేవా కార్యక్రమాలలో పాల్గొంటారు. పాతబాకీలు వసూలవుతాయి. మీ ప్రతిభ వెలుగులోకి వస్తుంది. పలుకుబడి పెరుగుతుంది. ఆస్తి వివాదాలు తీరతాయి. రాజకీయ, కళారంగాల వారికి సన్మానాలు.

**మకరం:** పనుల్లో విజయం సాధిస్తారు. అందరిలోనూ గుర్తింపు. ప్రముఖులతో పరిచయాలు. ఆస్తి వివాదాలు తీరతాయి. వాహనాలు, భూములు కొంటారు. ఇంటర్వ్యూలు అందుతాయి. శత్రువులు సైతం మిత్రులుగా మారతారు. పారిశ్రామిక, కళారంగాల వారికి యోగదాయకంగా ఉంటుంది.

**కుంభం:** ఆర్థిక పరిస్థితి మెరుగ్గా ఉంటుంది. చిన్ననాటి సంఘటనలు గుర్తుకు వస్తాయి. ప్రయత్నాలు నెరవేరతాయి. ఆశ్చర్యకరమైన సంఘటనలు. కీలక నిర్ణయాలు తీసుకుంటారు. ఉద్యోగులకు సంతోషకరమైన వార్తలు. రాజకీయ, పారిశ్రామికవర్గాలకు విదేశీ పర్యటనలు.

**మీనం:** పట్టిందల్లా బంగారమే అన్నట్లుంటుంది. సన్నిహితులు, మిత్రులతో ఉత్సాహంగా గడుపుతారు. ఆర్థిక లావాదేవీలలో పురోగతి. అనుకున్న పనులు సకాలంలో పూర్తి చేస్తారు. సంఘంలో గౌరవమర్యాదలు పొందుతారు. వ్యాపారాలలో అడుగు ముందుకు వేస్తారు.

● లేఖ




**అభినందనీయం**

జగత్తులోని వివిధ జీవజీవాల వైరుధ్యాన్ని, వివిధత్వాన్ని చక్కగా చిత్రాలతో సహా ప్రచురించినందుకు ధన్యవాదాలు. జీవవైవిధ్య సదస్సు జరుగుతున్న సమయంలో ఈ సంచిక రావడం అభినందనీయం. 'పితృదేవతల ప్రతినిధి' మంచి వ్యాసానికి మచ్చుతునక. విషయ పరిజ్ఞానముంటే పామరుడు కూడా ప్రకృతి పరిరక్షణలో ముఖ్య భాగస్వామి కాగలడని 'మనిషంటే మల్లేశం' రుజువు చేసింది.

– డా॥ శివభూషణం, కర్నూలు

**దాచుకోదగ్గది!**

జీవవైవిధ్య ప్రత్యేక సంచిక ప్రతి ఒక్కరూ దాచుకోదగ్గది. జగత్తులోని వృక్ష, జంతు, పశుపక్ష్యాదులతో కూడిన పలు అంశాలను చిత్రాలతో పాటు అందించిన వైనం బాగుంది.

– నందం రెడ్డయ్య, భట్టిప్రోలు

**ఊరికొక మల్లేశం ఉండాలి!**

'ప్రకృతి ప్రపంచం' కవర్‌పేజీని చూడగానే లైబ్రరీలో దాచుకోవాలనిపించింది. ఎన్‌డేంజర్డ్, వల్నరబుల్, థ్రెటన్డ్ లాంటి పదాలను చదివితే భయమేస్తుంది. మనిషి మనుగడ కూడా 'పైకి కనిపిస్తూ లోపల లేకుండా పోవడం' లాగే అనిపిస్తోంది. 'మల్లేశం' లాంటివారు గ్రామానికి ఒక్కరైనా ఉంటే బాగుంటుంది.

– పబ్బులేటి వెంకటేశ్వర్లు, సిద్ధవరం

**ప్రతి పేజీ ఓ ముత్యమే!**

'ప్రకృతి ప్రపంచం' సంచికలోని ప్రతి పేజీ ఓ ముత్యం లాంటిది. 'ప్రకృతి' అనేది ఆ భగవంతుడు మనకందించిన గొప్ప వరం. మనకు జీవం పోసే ప్రకృతితోనే మనం ఆటలాడుకుంటున్నాం. ఇప్పటికైనా ప్రతి ఒక్కరూ ప్రకృతి పట్ల ప్రేమతో వ్యవహరించి, దాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ఎంతైనా ఉంది.

– పొట్టి పురుషోత్తమ్, అమ్మక్కపేట

**ఆలోచింపజేసిన వ్యాసం!**

'దేవుడి సృష్టిలో మానవ విధ్వంసం' వ్యాసం ఆద్యంతం చదివించింది. 'ఒక విషపూరితమైన ప్రపంచాన్ని కానుకగా ఇస్తున్న మనల్ని భావి తరాలు క్షమిస్తాయా' అన్న వాక్యం ఈ సమాజంలోని ప్రతి ఒక్కరినీ ఆలోచింపజేసే విధంగా ఉంది.

– డి.ఎస్.గిరి, హైదరాబాద్

మా చిరునామా
**ఫన్‌డే**
సాక్షి తెలుగు దినపత్రిక
6-3-249/1, రోడ్ నం.1, బంజారాహిల్స్,
హైదరాబాద్ - 34. funday.sakshi@gmail.com

Designing: Sampangi Mallesh



# తెలుగు కథ



ఖజానాని ఏదోరకంగా ఖాళీచేయాలనుకున్న ఒక రాజుగారికి తెలుగు భాషమీద ప్రేమ పుట్టింది. ఎవరికీ అర్థం కానటువంటి రీతిలో విశ్వ తెలుగు సభలు పెట్టాలని నిర్ణయించాడు. అప్పుడప్పుడు తెలుగు మాట్లాడే నలుగురితో కమిటీ వేశాడు. తాను కూడా కమిటీలో వుంటానని రాజుగారి బావమరిది ముందుకొచ్చాడు. ఆయనకి తెలుగు అక్షరాల్లో 'అ నుంచి న' వరకే వచ్చు. మిగతా అక్షరాలు నోరు తిరగవు. నైజీరియాలో తెలుగు మాట్లాడే 13 మందిపై అధ్యయనం చేస్తానని ఆయన పిల్లాజెల్లాతో విమానమెక్కాడు. కమిటీలో వున్న నలుగురూ సభలు జరిగే ప్రదేశాన్ని ఎంపిక చేసారు. వచ్చి పోయే అతిథులకు బస, భోజనం, రవాణా గురించి చర్చించారు. ఉత్తరాంచల్ నుంచి వచ్చే సంస్కృత పండితుడికి వంకాయ లేకపోతే ముద్ద దిగదు కాబట్టి, వంకాయల సేకరణకు ఒక అధ్యయన బృందాన్ని ఏర్పాటు చేశారు. మన దేశం నుంచి వచ్చే అరబ్బీ పండితుడికి ముక్కు మీద కోపమని తెలుసుకుని ఆగ్రహాన్ని తగ్గించడానికి ఆయన్ని ఏనుముక్కలపై నడిపించాలని నిర్ణయించారు. ఇందులోని సాధ్యాసాధ్యాలను పరిశీలించడానికి నలుగురు అధికారులు ఐస్‌లాండ్‌కి వెళ్లారు.

సభాస్థలానికి అందమైన రోడ్లు, వేదిక అలంకరణ, ఊరంతా ఫ్లెక్సీలు ఇలా ఐదు వందలా ముప్పై రెండు పనులను విభజించి తలా ఇంత ఇచ్చారు. తెలుగు అభివృద్ధికి ఏం చేయాలని చిట్టచివరగా యూనివర్సిటీ తెలుగు అధ్యయన శాఖలను సంప్రదించారు. తెలుగును తామెప్పుడో చావబాది చెవులు మూసామనీ, దాన్ని లేపి నిలబెట్టే ఊతకర్ర తమవద్ద లేదని వాళ్లు చేతులెత్తేశారు. ఇదిలా ఉండగా సభా వేదిక దుబ్బుమొక్కలున్న కాలనీ వాసులంతా తెలుగు వేదికపై స్థానికుల వాటా ఎంతో తేల్చాలని ధర్నా చేశారు. గ్రామాలు, మండలాలవారీగా తెలుగు నిపుణుల జాబితా తెప్పించారు. నాలుగు లారీల్లో వచ్చిన ఆ జాబితాను పరిశీలించడానికి పదివేల మంది వాలంటీర్లు రంగంలోకి దిగారు. అందులో వంద మందిని పిచ్చాసుపత్రిలో చేర్చాల్సి వచ్చింది. ఎన్నో వడపోతల తర్వాత వెయ్యి నూట పదహారు మందిని వేదికపైకి ఆహ్వానించారు. అప్పటికే నాయకులు, అనుచరులు, విలేకరులతో కిక్కిరిసి ఉన్న వేదిక వీరి రాకతో గడగడ వణికింది. ఏమీ జరగకుండానే ఏదో జరుగుతుందని నమ్మే విలేకరులు 'కుప్పకూలనున్న తెలుగు' అని స్క్రోలింగ్ ఇచ్చారు.

● జి.ఆర్.మహర్షి

● మహర్షిజం



### భూతంకథ

పాదయాత్రలో చంద్రబాబుకి ఒక సీసా దొరికింది. అందులో ఒక భూతం కనిపించి బిరడా తీసి తనని విడుదల చేస్తే కోరిన కోరిక తీరుస్తా అని చెప్పింది. బాబు వెంటనే బిరడా తీసాడు. భూతం బయటపడి కోరిక కోరుకోమంది. తనని ముఖ్యమంత్రిని చేయమన్నాడు బాబు. "అయ్యా నిన్ను ముఖ్యమంత్రిని చేస్తే లక్షలాదిమంది ఇబ్బంది పడతారు. సీసాలో వుంటే నేనొక్కదాన్నే ఇబ్బంది పడతాను" అంటూ సీసాలో దూరి బిరడా బిగించుకుంది.

### పాలు-నీళ్ళు

సముద్రతీరం వద్ద ఒక రాజకీయనాయకుడు మాట్లాడుతూ ప్రజల కోసం ఏమైనా చేస్తానన్నాడు.
"ఈ పాలను నీళ్ళుగా మార్చు" అని అడిగాడు ఒక వ్యక్తి
నాయకుడు పాలను నీళ్ళుగా మార్చాడు.
"అయితే నీళ్లను పాలుగా మార్చు" అని సీక్వెల్ ఇచ్చాడు ఇంకో వ్యక్తి
"ఆ విద్య తెలిసుంటే ఈ సముద్రాన్నే పాలుగా మార్చి అమ్ముకోనా" అని వెళ్లిపోయాడు నాయకుడు.



### సోనియాగాంధీ కొత్తసూక్తి

'ఇన్ లాస్ ఆర్ మోర్ డేంజరస్ ద్యాన్ 'అవుట్ లాస్'



### డ్రై వింగ్

డ్రైవర్ లేకపోవడంతో ఒకరోజు చంద్రబాబు స్వయంగా డ్రై వ్ చేయడానికి కారెక్కాడు. ఇది చూసి ఒక వ్యక్తి గబాలున చెట్టెక్కి కూచున్నాడు. అతన్ని ఆశ్చర్యంగా చూస్తూ ఎందుకు చెట్టెక్కావని అడిగాడు బాబు.



"అయ్యా తొమ్మిదేళ్ళు మీరు ప్రభుత్వాన్ని ఎలా నడిపారో చూసినవాళ్లే. కారుని మాత్రం సరిగా నడుపుతారని ఎలా నమ్మమంటారు? అందుకే సేఫ్‌సైడ్‌గా చెట్టెక్కాను" అన్నాడు.

## ఆనందో (రావణ) బ్రహ్మ










# మీ ఇంట్లోనే పవర్‌ఫుల్ స్పోకెన్ ఇంగ్లీష్ టీచర్

## ఇంగ్లీష్ కోర్స్ రూ.600*/- లకే

మూడు డివిజన్ల ఇంగ్లీష్ కోర్స్: డివిజన్-1, డివిజన్-2, డివిజన్-3 + అడిషనల్ బుక్స్, ఒక డైరీ మరియు ఒక ఆడియో సి.డి. = ఇవన్నీ రూ.600/-లు

**డివిజన్-1** Basic నుంచి ఇంగ్లీష్ చదవటం, రాయటం, నేర్పుతూ, ప్రతి ఒక్కరికీ కావలసిన స్థాయిలో స్టాండర్డ్ ఇంగ్లీష్ నేర్పబడుతుంది.

**డివిజన్-2** తప్పులు లేకుండా ఇంగ్లీషు రాయుటకు కావలసిన ఆంగ్ల వ్యాకరణం పరిపూర్ణంగా సులభ సూత్రాలతో చాలా ఈజీగా నేర్పబడుతుంది.

**డివిజన్-3** ఎంతో సులభంగా, ఏ సందర్భంలోనైనా తడబడకుండా, తప్పులు లేకుండా, మంచి నీళ్ళు త్రాగుతున్నట్లుగా మంచి ఇంగ్లీషు మాట్లాడటం నేర్పబడుతుంది.

**పూర్తి డబ్బు వాపస్**

ముందుస్తుగా మీకే కోర్సు నచ్చలేదని అనిపిస్తే కోర్సు పుస్తకాలు 15 రోజుల్లోపల మాకు తిప్పి పంపండి. మీ డబ్బుని (కేవలం పోస్టు ఖర్చులు మాత్రం మినహాయించి) మీకు ఎమ్.ఓ.చేస్తాం. కోర్సు మెటీరియల్ సైజు 18cm x 24cm లోనూ, డైరీ సైజు 12cm x 17.5cm లోనూ (ఆఫ్‌సెట్ మల్టీకలర్ కవర్‌తో) ఉంటాయి. విద్యార్థుల సౌకర్యాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రతి సంవత్సరానికి క్రొత్త డైరీగా ఉపయోగించుకునే విధంగా ప్రత్యేకంగా రూపొందించబడిన డైరీ.




SMS పంపండి (లేదా) కూపన్ పంపండి.

**Phone: 0-99405 70931**

పై సెల్‌ఫోన్ నెంబరుకు మీ పేరు, ఇంటి నెం. ఊరిపేరు, పిన్‌కోడ్, ఫోన్ నెం.లతో సహా వివరంగా మీ అడ్రసును SMS చేయండి. పై ఫోన్ నెంబరు 24 గంటలూ కంప్యూటర్‌కు కనెక్ట్ చేయబడి ఉంటుంది. మీరు పంపే ఎస్.ఎమ్.ఎస్. అడ్రసు ఫోన్ నుండి కంప్యూటర్‌కు వెళ్తుంది. మీ అడ్రసు ప్రకారం మేము కోర్సు మెటీరియల్ పంపుతాము. దయచేసి ఫోన్‌లో అడ్రసు చెప్పడానికి ప్రయత్నించవద్దు. SMS పంపడానికి అవకాశం లేనివారు ఈ ప్రకటనలో ఉన్న కూపన్‌ను పూర్తిచేసి పంపండి.

**STUDENTS' ENGLISH INSTITUTE**

No.17/A, Chari Street, T. Nagar, Chennai - 600 017.

నాకు కోర్సు మెటీరియల్ పంపండి. పోస్ట్‌మేన్‌కి రూ.600/- + 30/- (M.O.కమీషన్) మొత్తం రూ.630/-లు చెల్లించి ప్యాకెట్‌ని తీసుకుంటానని హామీ ఇస్తున్నాను.

Name: ....................

Address: .................... Pincode

# మా అమ్మాయి పెళ్లి! నాలుగురోజుల ముందే రావాలి!



ఎస్.అనంతలక్ష్మి
ఆధ్యాత్మికవేత్త, అధ్యాపకురాలు

"ఆదివారం ఉదయం అమ్మాయి పెళ్లి. అమ్మాయి నక్షత్రానికి సరిపోయిందని గురువారమే పెళ్లికూతురిని చేస్తున్నాం. బంధువులందరూ వారం రోజులు ముందుగానే వస్తున్నారు. భోజనాలు, ఫలహారాలు అన్నీ పెళ్లింట్లోనే. వారాల నియమాలున్నవాళ్లకి రాత్రి ఫలహారాల ఏర్పాట్లు కూడా ఉన్నాయి. తప్పకుండా రావాలి మరి" – శుభలేఖ ఇస్తూ కన్యాదాత ఊళ్లోవాళ్లని ఇలా ఆహ్వానిస్తుంటే, పక్కనే ఆయన భార్య పట్టుచీర సవరించుకుని, చంద్రహారం బిళ్ల బాగా కనపడే విధంగా సర్దుకుని, కుంకుమ భరిణె తెరిచి ఆ ఇంటి ఇల్లాలి ముఖాన బొట్టు పెట్టి, "వదినా! అమ్మాయి పెళ్లికి ఇంటిల్లిపాదీ రావాలి. ఈ నాలుగు రోజులూ ఇంట్లో పొయ్యి వెలిగించకూడదు సుమా. మంచి వంటవాళ్లని పిలిపించాం. భోజనాలు, ఫలహారాలు మడిగా చేయిస్తున్నాం. అసలు నువ్వక్కడే ఉండాలి. నువ్వు లేకపోతే సందడే ఉండదు. ఇదిగో మర్చిపోయాను. పిల్లల చద్దన్నాలు కూడా అక్కడే" అంటుంది. ఇటువంటి పెళ్లి పిలుపులు ఉంటాయా అని ఆశ్చర్యపోతారు ఈతరం వారు. అప్పటి మనుషులు, వారి మధ్య సంబంధాలు అలా ఉండేవి. చద్దన్నాలు అంటే నిజంగా చద్దన్నాలు అనుకునేరు. ఇళ్లల్లో అయితే రాత్రి మిగిలిన దానిని పిల్లలకు చద్దన్నాల పేరుతో పెడతారు. పెళ్లిళ్లలో అలా పెట్టటం మర్యాద కాదు కదా! మరేమిటంటే... అప్పట్లో టిఫిను, బ్రేక్‌ఫాస్ట్ అనేవి ఉండేవి కావు. నిద్ర లేచిన తర్వాత తినటం అంటే ఏకంగా భోజనమే! పిల్లలు అంతసేపు ఏమీ తినకుండా ఉండలేరు కనుక వాళ్లకి అన్నాలే పెట్టేవారు. చద్దన్నాలు అంటే కడుపు చల్లగా ఉండేట్టు పిల్లలకి పెట్టే అన్నాలు అనే అర్థం.

పిలిచేవాళ్ల పద్ధతి ఇలా ఉంటే ఊళ్లోవాళ్ల ప్రతిస్పందన ఎలా ఉండేదో గుర్తుచేసుకుంటే ఎంతో ఆనందం కలుగుతుంది. ఊళ్లో ఎవరింట్లైనా పెళ్లి కుదిరిందంటే అందరికీ సంబరమే! అటకల మీద దాచిపెట్టిన పెద్ద పెద్ద గిన్నెలు, గంగాళాలు, పళ్లాలు, గ్లాసులు, చెంబులు లాంటివన్నీ తీసి శుభ్రంగా తోమించి సిద్ధంగా ఉంచుతారు – పెళ్లివారింటికి అడగగానే పంపించటానికి. వంట సామాను అద్దెకు తెచ్చే అలవాటు



లేదు. నిజానికి ఇచ్చేవారు కూడా చాలా తక్కువ. పైగా భోజనాలకు వెళ్లేటప్పుడు ఎవరి గ్లాసులు వాళ్లు పట్టుకుని వెళ్లేవారు. పెళ్లివారు బంధువులకి, మగ పెళ్లివారికి కావలసినవి చూసుకుంటే సరిపోతుంది. ఎంతటి సౌకర్యం! పెళ్లి పనులు అందరూ కలిసి సరదాగా చేసుకునేవారు.

అంతేకాదు. తమ ఇళ్లకి కూడా సున్నాలు వేయించేసుకుని బంధువులకి, పెళ్లివారికి తమ ఇంట్లో వసతికి ఏర్పాటు చేసేవారు. ఈ సహకారం పరస్పరం ఉండేది. దీనికి తగిన ప్రతిఫలం కూడా ఉండేది. పెళ్లి అయిన తర్వాత వారి సామాను తిరిగి ఇచ్చేటప్పుడు పెళ్లి సారె (అరిసెలు, లడ్డూలు, చక్కిలాలు మొదలైనవి) అందులో నింపి ఇవ్వటం సంప్రదాయం. పసుపు, కుంకుమ మొదలైనవి ఎలాగూ ఊళ్లో మిగిలినవాళ్లతో పాటు ఉండనే ఉంటాయి.

ఎంతటి తేడా అప్పటికీ ఇప్పటికీ! పెళ్లి అంటే పల్లెటూళ్లలో కూడా ఈ రోజుల్లో కల్యాణ మండపాలు చూస్తున్నారు! లేకపోతే తమని గతిలేని వాళ్లనుకుంటారేమోననే భయం. క్యాటరింగ్‌కి ఇవ్వక వంటవాళ్లని పెట్టి వండిస్తే కక్కుర్తి అనుకుంటారేమోనని బెదురు. ఇంట్లో బంధువులున్నంత కాలం టెంట్ హౌస్ నుంచి సామాను తేవాల్సిందే. వీలైనంతవరకు డిస్పోజబుల్ వస్తువులు వాడి పర్యావరణాన్ని మరింత కలుషితం చేయటం తప్పటం లేదు. ఇదంతా తడిసి మోపెడు కన్యాదాతకి.

పోనీ, ఇంతా చేస్తే ఎవరికైనా సుఖం, సంతోషం ఉన్నాయా అంటే... అది అనుమానాస్పదమే! ఇంత ఖర్చు చేస్తే, ఫలితం ఏమిటి? పెళ్లికి వచ్చినవారు వధూవరులను చూడనైనా చూడరు. నేరుగా భోజనాల దగ్గరికే వెళ్లేది. ఎందుకంటే ఈ ఏర్పాట్లలో వచ్చినవారిని మర్యాద చేసి, భోజనానికి రమ్మని పిలిచి వడ్డించే అవకాశం, వీలు లేవు. ఎలాగూ ఎవరూ పిలవరు కనుక ముందు ఆ కార్యక్రమం పూర్తి చేసుకుంటే ఒక పని అయిపోతుంది అని వెడతారు. కానీ, అక్కడ పద్ధతి ఉండదు. ఒక వరుస ఉండదు. ఒక నియమం ఉండదు. కాల పరిమితి ఉండదు. చేతిలో పళ్లెం పట్టుకుని కబుర్లు చెబుతూ గంటలు గడిపేస్తారు. నిజానికి బఫేలో కావలసినంత మాత్రమే వడ్డించుకునే సౌకర్యం ఉంది! అయినా సరే, మళ్లీ దొరకదేమోనన్నట్టు పళ్లెం నిండా పెట్టుకుని తిన్నంత తిని పడేస్తూ ఉంటారు. ఒక పెళ్లి విందులో వృథా చేసే ఆహార పదార్థాలతో ఎంతోమంది హాయిగా బతకవచ్చు.

ఇప్పుడు హంగులు, ఆర్భాటాలు ఎక్కువయ్యాయి. ఏర్పాట్లలో ఒకరిని మరొకరు మించాలనే తాపత్రయం ఎక్కువగా కనపడుతోంది – శుభలేఖల దగ్గర నుండి. ఇవన్నీ చూస్తుంటే సీతారాముల కల్యాణం ఎంత నిరాడంబరంగా, శాస్త్రబద్ధంగా జరిగిందో మళ్లీ అంత నిరాడంబరమైన, మానవీయ విలువలున్న పద్ధతులు వస్తే ఎంత బాగుంటుందో అనిపిస్తుంది!

● సేకరణ: డి.వి.ఆర్.భాస్కర్

## శేఖర్ కపూర్

ఫాలోవర్లు: 2,31,814

**మాసూమ్, మిస్టర్ ఇండియా లాంటి చిత్రాలతో భారతీయుల మనసులు దోచుకున్న శేఖర్ కపూర్, బాండిట్‌క్వీన్‌తో అందలాలు అందుకున్నారు. ఎలిజబెత్ సినిమాతో ఆస్కార్‌ను అందుకున్న శేఖర్, ట్వీట్లతో అభిమానులకు దగ్గరగా ఉండటానికి ప్రయత్నిస్తారు. పలు అంశాలపై తన అభిప్రాయాలను నిష్కర్షగా వెలిబుచ్చుతూ ఉంటారు.**



- ఒక వ్యక్తి పదవిలో ఎక్కువ కాలం ఉంటే, 'నాకు పరిపాలించే హక్కు ఉంది' అని తనకు తనే అనుకోవడం మొదలుపెడతాడు. అది మానవ స్వభావం!
- మనం గాంధీజీని మహాత్ముడంటూ పూజిస్తాం. కాని ఆయన చెప్పిన మంచిని మన జీవితాల నుంచి వేరు చేస్తున్నాం. మనం ఆయనను నిలుపుకోవాల్సింది మన మనసుల్లో... గోడమన్న పటాల్లో కాదు!
- 'ఇంగ్లిష్ వింగ్లిష్' సినిమా చూశాను. ఇది ఇంగ్లిష్ నేర్చుకోవడానికి శ్రీదేవి పడే కష్టం గురించి మాత్రమే తీసిన సినిమా కాదు. తన కాళ్ల మీద తను నిలబడాలి, తన వ్యక్తిత్వాన్ని నిలుపుకోవాలి అని ఆరాటపడే ఓ మహిళ అంతరంగాన్ని ఆవిష్కరించిన చిత్రం!
- మన దేశంలో మేధావులు అనుకుంటున్న కొందరు మాట్లాడుతున్న మాటలు కేవలం మాటలు మాత్రమే. వాటి కంటే ఆకలేసినప్పుడు ఓ జంతువు అరిచే అరుపులకు ఎక్కువ అర్థం ఉంటుంది!
- ఏ కళ అయినా సమాజం యొక్క మనస్సాక్షిని ప్రతిబింబించాలి. సినిమా కూడా ఒక కళే. మరి నేటి సినిమాలు ఆ పని చేస్తున్నాయా?
- నేను మన్మోహన్‌సింగ్ విధానాలతో ఏకీభవించను. కానీ సంస్కరణల పట్ల ఆయనకున్న పట్టును మాత్రం గౌరవిస్తాను. నాయకుడన్న వాడు తను నమ్మినదానికి కట్టుబడి ఉండాలి!
- నిజానికి పార్లమెంటులో కంటే టీవీ చానళ్లలోనే చర్చలు సక్రమంగా, అర్థవంతంగా సాగుతున్నాయి. దీన్నిబట్టే శాసనసభ దాని ప్రయోజనాన్ని కోల్పోతున్నట్లే కదా!


# అన్ని వేళలా అందుబాటులో వార్తలు 24x7 సాక్షి ఇప్పుడు మీ మొబైల్‌లో



- ఇప్పుడు మీరు అభిమానించే సాక్షి వార్తా పత్రికను మీ మాతృభాషలో మీ మొబైల్ హ్యాండ్ సెట్‌పై చదువుకోగలరు.
- మీ మొబైల్‌లో సాక్షి మొబైల్ అప్లికేషన్ డౌన్‌లోడ్ చేసుకోవడానికి **sakshi** అని టైప్‌చేసి **57333**కు **sms** చేయండి లేదా **http://sakshi.newshunt.com** నుండి డౌన్‌లోడ్ చేసుకోండి. ఈ సదుపాయం ఉచితం.
- **WAP** సైట్ **http://m.sakshi.com** ను చూడండి.
- **GPRS** కలిగిన ఏ మొబైల్ హ్యాండ్‌సెట్ పైనైనా అంటే ఐడియా, ఎయిర్‌టెల్, వొడాఫోన్, రిలయన్స్, బిఎస్ఎన్ఎల్ మొ॥ వాటిపైనైనా సాక్షి మొబైల్ అప్లికేషన్ పనిచేస్తుంది.
- ఇతర దేశాలకు చెందినవారు కూడా **http://sakshi.newshunt.com** నుంచి సాక్షి అప్లికేషన్ డౌన్‌లోడ్ చేసుకోవచ్చును.
- మీ మొబైల్‌లో సాక్షి అందించే తాజా వార్తలు, వివిధ విభాగాలకు చెందిన వార్తలు అన్ని వేళల్లో పొందవచ్చును.
- **Ipad, Iphone & Android Applications**లో కూడా చూడవచ్చు.

మరిన్ని వివరాలకు ఇ-మెయిల్ :
**mobile@sakshi.com**

సాక్షి

Scan this QR Code with your smart phone for more Information

అక్టోబర్ 24 విజయదశమి సందర్భంగా...



అశ్వని నక్షత్రం పూర్ణిమ నాడుండే ఆశ్వయుజ మాసం సరస్వతి-లక్ష్మి-పార్వతి అనే ముగ్గురు దేవతలనీ ప్రసన్నం చేసుకోవడానికి అనుకూలం. ఈ నెలలో కూడా మొదటిరోజు నుండి ఆరో రోజున మూలానక్షత్రం ఉంటుంది కాలచక్రంలో. ఆ రోజున సరస్వతిని ఆరాధించడం అత్యుత్తమం. పార్వతీదేవిని ఆరాధించడానికి పదోరోజు అంటే 'విజయదశమి' అనుకూలమని చెప్తుంది కాలచక్రం. ఇక లక్ష్మీదేవిని ఆశ్వయుజ మాసం చివరి రోజైన అమావాస్యనాడు పూజించాలి. ఇలా ముగ్గురు దేవతలకీ మూడు విభిన్నమైన రోజుల్లో ముగ్గురి పేరా ఒకే నెలలో పూజని చేస్తూ ముగ్గురి అనుగ్రహాన్నీ ఒకేసారి పొందగల్గడం ఎంత అదృష్టం!

# స్త్రీశక్తి

## అనుగ్రహా ప్రాప్తిరస్తు!

బ్రహ్మ సృష్టిస్తాడని, విష్ణువు రక్షిస్తాడని, శివుడు లయం చేస్తాడని అనేస్తూ ఉంటాం. ఇక్కడే ఉంది చిత్రం! ఈ ముగ్గురూ ఆ మూడు పనులను చేస్తున్నా, ఇలా చేయవలసిందంటూ ఆయా పనుల్ని వాళ్లకి అప్పచెప్పింది ఆదిశక్తే. గడియారంలో చిన్న ముల్లు, పెద్ద ముల్లు, సెకన్ల ముల్లు ఉన్నా వీటిని నడిపే యంత్రం లేనిదే అవి కేవలం బొమ్మ ముల్లులు ఎలా అవుతాయో, అలా కాకుండా ఈ మూడింటికీ శక్తినిచ్చి నడిపిస్తూ కాలాన్ని గుర్తింపజేసేది అక్కడ ఎలా యంత్రమో, అదే తీరుగా ఈ త్రిమూర్తుల్నీ తమ తమ పనుల్ని నెరవేర్చేలా చేస్తూ యుగాలని నడిపిస్తున్న శక్తి 'ఆదిశక్తి' మాత్రమే. స్త్రీకి ఇంత గొప్పదనాన్నిచ్చింది భారతదేశం మాత్రమే.

ఈ బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులు మాత్రమే సృష్టి స్థితి లయాలని చేసేస్తున్నారా అంటే ఆ ముగ్గురికీ కూడా మళ్లీ విలువ (అస్తిత్వం ఆధిక్యమనేవి) తమ తమ భార్యల వల్లనే!

బ్రహ్మకి ఓ ఆకారం అంటూ లేకపోయినా ఆయన గుర్తింపు కేవలం ఆయన నోటదాగిన ఆ సరస్వతి కారణంగానే. ఆకారం ఎలా ఉన్నా, ఏ లౌకికమైన పట్టాలూ లేకున్నా చదువు ద్వారానే వ్యక్తికి విలువ కదా! (విద్వాన్ సర్వత్ర పూజ్యతే) పండితుడైనవానికి ఈ దేశం, ఆ దేశం, ఈ భాష, ఆ భాష అనే పరిమితి ఉందా?

అదే తీరుగా శ్రీహరికి గుర్తింపు, విలువ కూడ లక్ష్మీదేవి వల్లనే. శ్రీ వేంకటేశ్వరుడు కన్పించేది కూడా ఎనలేని విలువైన ఐశ్వర్యం వెనుకనే. ఆయన్ని భక్తజనం కొలిచేది కూడ ఐశ్వర్యం (అది చదువికి సంబంధించి, జీవితానికి సంబంధించి, ధనానికి సంబంధించి...) కోసమే.

ఇక శంకరునికున్న ఏమాత్రపు గుర్తింపు అయినా పార్వతి కారణంగానే. శక్తి లేని శివుడు నిర్వీర్యుడు. ఏ ప్రయోజనాన్నీ చేకూర్చలేడట. (శివశ్శక్త్యా యుక్తో యది శక్తః...) అందుకే అర్ధనారీశ్వర రూపంతో ఆయన ఉన్నాడు.

కేవలం ఈ త్రిమూర్తులకి తమ తమ భార్యల ద్వారా గుర్తింపు ఉండటమే కాదు - తమ తమ భర్తలకి కష్టం వచ్చినప్పుడు రక్షించి ఒడ్డెక్కించేది కూడా వారి భార్యలే.

శివలింగం మొదలునీ తుదినీ చూసి రావల్సిందని చెప్పినప్పుడు బ్రహ్మ అసత్యమాడితే, సరస్వతి వెళ్లి ప్రార్థించి బ్రహ్మకి పడబోయే పెద్ద శిక్షని 'పూజ లేకుండా ఉండుగాక!' అనేంతతో ముగిసేలా చేసి భర్తని గట్టెక్కించింది.

శ్రీహరి వక్షస్థలం లక్ష్మీదేవి ఉండే చోటు. అదిగో ఆ చోటుని, అంటే లక్ష్మిని భృగుమహర్షి కాలితో తంతే కోపించిన లక్ష్మి కరవీరపురానికి వెళ్లిపోయింది. లక్ష్మి లేని శ్రీహరి, శ్రీనివాసునిగా మారి పుట్టలో ఉంటూ కేవలం పాలనే తాగుతూ ఎండ, వానల కష్టాలకి గురౌతూ లక్ష్మి విలువని గ్రహించి బ్రహ్మ, శంకరుల్ని అక్కడకు పంపి ఆమెని రప్పించుకుని కష్టం నుండి గట్టెక్కాడు.

ఇక మన్మథుణ్ని మసి చేసిన శివుడు, పార్వతి చేసిన తపస్సుకు లొంగి, 'నీకు నేను దాసుణ్ని (తావన్మి దాసః)' అని పూర్తిగా, వాచ్యంగా చెప్పి లొంగిపోయాడు.

అంతేకాదు. విషాన్ని మింగిన వేళ ఆమె తన కంఠాన్ని గట్టిగా అదిమిపట్టిన కారణంగా జీవించగలిగి కష్టం నుండి ఒడ్డెక్కాడు.

నోటిలో నాలుకమీద ఉంటూ బ్రహ్మ నుండి ఎప్పుడూ ఎడబాయని సరస్వతి, వక్షస్థలాన్ని దిగకుండా తానున్న చోటుని ఆనవాలుగా అయ్యేలా చేసుకుని (శ్రీ-లక్ష్మి ఉంటుందనేందుకు, వత్సం - గుర్తుగా ఏర్పడిన ఓ మచ్చ/ఆనవాలు) లక్ష్మి, ఇక శరీరాన్నే సరిసగంగా చేసుకుని ఎడమభాగమైన పార్వతి... ఈ త్రి-శక్తి దేవతల సమష్టి పండుగే విజయదశమి!

కాబట్టి స్త్రీలో వాక్ శక్తి, ఐశ్వర్య శక్తి, సాహస శక్తి అనే మూడు ఉంటాయని, వీటిని అభివృద్ధి చేసుకోగలగడమే నిజమైన స్త్రీశక్తిని చాటడం అవుతుందని, స్త్రీ తన పాండిత్యాన్ని నేడు చూపగల్గుతోం దంటే ధర్మబద్ధంగా ధనాన్ని సంపాదించ గల్గుతోందంటే, తన పరాక్రమాన్ని కూడా అవసరమైన పక్షంలో ప్రదర్శించ గలుగుతోందంటే... అదంతా ఆ అమ్మ తనకి గూఢంగా నిక్షిప్తం చేసిన ఆ శక్తి కారణంగానే అని ప్రతి స్త్రీ గ్రహించాలి లేదా ఆమెని మార్గదర్శకురాలిగానైనా భావించాలి.

**బ్రహ్మకి గుర్తింపు కేవలం ఆయన నోటదాగిన ఆ సరస్వతి కారణంగానే. విద్వాన్ సర్వత్ర పూజ్యతే అన్నది అందుకే.**



### పండుగ ఇన్ని రోజులపాటా?

శ్రీరామనవమి, శ్రీకృష్ణ జయంతి, మహాశివరాత్రి... ఇలా అన్నీ కూడా ఒక్క రోజులో ముగిసిపోతోంటే స్త్రీ దేవతకి తొమ్మిది రోజుల పాటు పండుగా? అందునా వీటికి దేవీ-నవ-రాత్ర-ములనే పేరిట రాత్రిపూట పండుగలా? 'ఇదేమి'టనిపిస్తుంది పైదృష్టితో మాత్రమే చూస్తే!

స్త్రీకున్న గొప్పదనాన్ని లోకానికి చాటాలని భావించిన మహర్షులు అమ్మవారి పండుగ రోజుల్ని తొమ్మిది కాదు, ముప్పై తొమ్మిది రోజుల పాటు చేయాలని చెప్పారు.

అలా సంవత్సరం తలుపు తెరుచుకుందో లేదో ఆ రోజునే వచ్చే ఉగాది నుండి శ్రీరామనవమి వరకూ అమ్మవారి పేరిట ఆ వసంత ఋతువులో జరిగే తొమ్మిది రోజుల ఉత్సవాలనే వసంత నవరాత్రోత్సవాలంటారు. ఇవి తొమ్మిది.

ఇక శరత్కాలం ప్రారంభమయ్యే ఆశ్వయుజ మాసం మొత్తం ఆ త్రిశక్తి దేవతల పండుగ రోజులే. ఇవి ముప్పై. ఆ తొమ్మిదికి ఈ ముప్పైరోజుల్ని కలిపితే అమ్మవారికి జరిగే ఉత్సవాల (పండుగ) రోజులు 39 అన్నమాట. ఒక స్త్రీకి ఇంతటి గౌరవాన్ని, ఇన్ని రోజుల పాటు ఉత్సవాల్ని చేయాలని చెప్పిన దేశం - ప్రపంచ దేశాల్లో భారతదేశం మాత్రమే. అందుకే భారతదేశం స్త్రీని దేవత అంది. స్త్రీని దేవతగా చేసింది. ప్రతి ఒక్క స్త్రీని ఆ అమ్మ స్వరూపంగా భావిస్తూ సంబోధనలో కూడ 'అమ్మా!' అనవలసిందని చెప్పింది.

మన పిలుపుల్లో అమ్మా (జననీ - మాతః సమస్త జగతామ్), బంగారు తల్లీ (సుమేరు మధ్య శృంగస్థా మేరుపర్వతం బంగారు కొండ కదా!), బుజ్జీ (బాలా!), కన్నతల్లీ (ప్రసవిత్రీ ప్రచండాజ్ఞా), చిట్టితల్లీ (అంబికా), వరాల తల్లీ (వరదా) అనేవి ఇందుకే కన్పిస్తాయి.

### అశక్తుల విషయంలో గౌరవం చూపెడతా!

సహజంగా లోకంలో పెద్దవాళ్ల యెడ భక్తి, వినయ ప్రపత్తుల్ని చూపిస్తూంటాం. వారిపట్ల గౌరవంతో మెలుగుతాం. మాట కాదనం. ఎదురుచెప్పం. ఇలా అమ్మ విషయంలో కూడా మనం గౌరవాన్ని చూపించడం, ఆమెకి దైవత్వాన్ని కట్టబెట్టడమనేది, ఆమె అశక్తత కారణంగానేమో అనుకుంటే అది సరి కానే కాదు.

అమ్మ సామాన్యురాలు కాదు.

మొట్టమొదటగా తన స్త్రీ శక్తిని లోకానికి చాటదలచి స్త్రీలతో ఓ చతురంగ బల సైన్యాన్ని ఏర్పాటు చేసింది.

ఏనుగులతో (సింధుర వ్రజ సేవితా...), గుర్రాలతో (అశ్వారూఢా ధిష్ఠితాశ్వ...), రథాలతో (గేయచక్ర రథారూఢ...), పదాతులతో (శక్తి సేనా సమన్వితా...), ఇవి కాక కిరిచక్ర రథాలు, మహా పాశుపతాస్త్రాలు (కిరిచక్ర రథారూఢ... మహాపాశు పతాస్త్రాగ్ని...), కామేశ్వరాస్త్రం (కామేశ్వరాస్త్రం నిర్దగ్ధ...), ఈ మాత్రపు మందీ మారల బలం చాలదనే ఉద్దేశంతో గణేశ సృష్టి (కామేశ్వర ముఖాలోక...), నారాయణ దశావతారాల సహాయం (కరాంగుళి నఖోత్పన్న...)... ఇలా శస్త్రాలతో, అస్త్రాలతో కూడా సిద్ధమైంది అమ్మ.

ఏదో సైన్యాన్ని ఏర్పాటుచేసి సైనికుల్ని, చతురంగ బలాల్ని అలా మేపుతూ కూర్చోలేదు అమ్మ. భండాసురుణ్ని, విషంగుణ్ని, విశుక్రుణ్ని, మహిషాసురుణ్ని, రక్త బీజుణ్ని... ఇలా సంహరించింది - సంహరింపజేసింది కూడా.

లోకంలో ప్రతి జంటా తాము, తమ సంతానం సుఖంగా ఉంటే చాలు, 14 లోకాలూ ఆనందంగానే ఉన్నాయనుకుం టూంటారు. అది నిజమా? కాదు గదా! అందుకే అమ్మ అన్ని లోకాల ప్రజల్ని (ప్రాణుల్ని) రక్షించాలనే మహా దృఢసంకల్పంతో లోకరక్షణని ఓ వ్రతంగా చేపట్టింది (అనేక కోటి బ్రహ్మాండ జననీ...). ఇదీ స్త్రీ శక్తి అంటే.

లోకంలో కూడా వయసులో ఉండగా తన భర్త పోయిన పక్షంలో ఆ భార్య కొంతకాలం దుఃఖించి, పాపం ఆ మీదట తన మొత్తం జవసత్వాలన్నింటినీ కూడగట్టుకుని పిల్లల కోసం జీవితాన్ని త్యాగం చేసుకుంటూ పిల్లల్ని పెద్దచేసి, ఉద్యోగానికి ప్రయత్నించి, పెళ్లిళ్లు చేసి,- 'అమ్మా! నీ దయే ఇదంతా. నా బాధ్యత ఇక ముగిసిం'దంటూ అప్పుడు కన్నుమూస్తుంది.

అదే మరి వయసులో ఉండగా తన భార్యగాని పోయిన పక్షంలో ఆ భర్త, మధ్య స్తంభం కూలిన ఇల్లులా గుడారం మొత్తం నేలకూలి పోగా, పిల్లల్ని పట్టించుకోకుండా వాళ్లని గాలికీ ధూళికీ అప్పజెప్పి ఇంటిని కకావికలం, ఛిన్నాభిన్నం కావాలని చేయడు - అలా అయిపోతుందంతే! ఈ మనోవేదనతో

ఈయన కన్నుమూస్తాడు. బాధ్యతలు తీర్చి ఆమె, బాధ్యతలని తీర్చలేక ఈయన... ఎవరు గొప్ప? అర్థమౌతోందిగా! అదే స్త్రీ శక్తి అంటే!

**అయినా స్త్రీ ఏమిటి? మారణాయుధాలేమిటి?**

సున్నితత్వతనానికీ సహజ కోమలత్వానికీ ప్రతీకగా స్త్రీని లోకమంతా భావిస్తాంటే ఈమె ఈ మారణాయుధాల్ని ధరించడమేమిటి? పోనీ ధరించి ఉంటే మాత్రం ఈ రాక్షసులతో ఓ ఇల్లాలికి శత్రుత్వమేమిటి? ఈ దారుణ మారణకాండ ఏమిటి? అనే మాటలు మన చెవిన పడుతూంటాయి.

ఒక్క క్షణం ఆలోచిద్దాం! మన శరీరంలో ఉన్న గోళ్లు, పళ్లు మారణాయుధాలు కావూ? ఎవరైనా మన కంటే బలిష్ఠుడు మనమీద దాడి చేస్తున్న వేళ వీటిని రక్షక ఆయుధాలుగా వాడిన సందర్భాలుండవూ? అంతమాత్రాన ఇక ఎప్పుడూ వీటితో ఎవర్నీ గిల్లుదామా, కొరుకుదామా అని బయల్దేరుతున్నామా?

గోళ్లు అనేవే గాని లేకపోతే మన శరీరంలోని చివరి భాగాలైన వేళ్లకి ఏదైనా తగిలితే రక్తం మొత్తం ధారాపాతంగా పోవడమే కాక, పెద్ద గాయమై ప్రాణాపాయ స్థితికి వెళ్లిపోతాం. అదే తీరుగా పళ్లు అనేవే లేకపోతే నోటిలోని లాలాజలం అలా పడిపోతూ ఉండటమే కాక (పళ్లు రాని దశలో పిల్లల్లో జరిగేది ఇదే), తిన్న అన్నాన్ని నమలలేని కారణంగా జీర్ణక్రియ జరగకపోయుండేది.

అంటే ఏమన్నమాట? పైకి మారణాయుధాలుగా కన్పించినా అవి శరీరానికి సహాయపడేవేనని గదా అర్థమౌతోంది. ఇదే తీరుగా అమ్మ చేతిలో పాశం, అంకుశం, కోదండం (విల్లు), బాణాలు అనే నాలుగు ఆయుధాలు కూడ సహాయపడేవే తప్ప మారణాయుధాలు కావు.

పాశం అంటే తాడు. నిజానికిది తప్పు చేసిన వ్యక్తిని కట్టివేయడానికి ఉపయోగించే వస్తువే. అయితే దాన్ని అనురాగాన్ని తెలియజేసే పాశ బంధంగా కూడ భావించమంటుంది అమ్మ (రాగ స్వరూప పాశాఢ్యా). వేల వేల అడుగుల పొడుగున్న తాటితో కట్టబడని శ్రీకృష్ణుడు యశోదమ్మ కట్టిన మూరెడు తాటికి కదలలేకపోయాడని భాగవతం చెప్తోందంటే అదేమిటి మరి? అనురాగ పాశమే!

అలాగే మదించిన ఏనుగుని వశం చేసుకోవాలంటే ఉపయోగించాల్సింది అంకుశాన్నే. అయితే దాన్ని వ్యక్తిలోకి ప్రవేశించిన క్రోధమనేదాన్ని తొక్కివేసేందుకు ఉపయోగించాల్సిన రక్షక వస్తువుగా భావించమంటుంది అమ్మ. (క్రోధాకారాంకుశోజ్జ్వలా). ఒక్క కోపమే కదా వెంటనే తగ్గిపోతుంది-దీనికి అంకుశంతో పోలిక... ఇవన్నీ ఎందుకు అనుకోకూడదు. క్రోధం ద్వారా మోహం, దాని నుండి ఏం మాట్లాడుతున్నామో తెలియనితనం, దాని నుండి బుద్ధి పనిచేయకపోవడం, చివరికి మన జీవితాన్ని మనమే చేజేతులారా నాశనం చేసుకోవడం (క్రోధాద్భవతి సంమోహః -



శ్రీమహావిష్ణువుకు గుర్తింపు, విలువ కూడ లక్ష్మీదేవి వల్లనే. శ్రీ వేంకటేశ్వరుడు కన్పించేది కూడా ఎనలేని విలువైన ఐశ్వర్యం వెనుకనే.

సంమోహాత్ స్మృతి విభ్రమః... ప్రణశ్యతి) జరుగుతుంది. కాబట్టి అమ్మ చేతిలోని అంకుశాన్ని చూస్తూ కోపాన్ని అదుపులో ఉంచుకోవాలని అనుకోవాల్సిందే!

ఇదే తీరుగా చేతిలో చెరుకు విల్లు. ఇది మనసుకి సంబంధించిన అనవసర ఆలోచనలకి సంకేతం. అదే తీరుగా దీనిలో వాడబడే ఐదు బాణాలు కూడ సరిగా ఉపయోగించుకోని పక్షంలో తీవ్రహానిని కలుగజేసేవే. (మనో రూపేక్షు... సాయకా!)

ఇలా తన సంతానాన్ని కాచిపెట్టుకుని 'ఇది మంచి – ఇది చెడు జాగ్రత్త!' అని చెప్పేది అమ్మ కాక మరెవరు? పైగా ఈ చెప్పడం ఏ కొందరికో కాదు. 84 లక్షల జీవరాసులకీ వాళ్లవాళ్ల శైలిలో అర్థమయ్యేలా చెప్తుంది అమ్మ. కాబట్టి ఇవి మారణాయుధాలు కానే కావు. బళ్లలో వెనుకటితరంలో ఉపాధ్యాయుల చేతుల్లో బెత్తాలు ఉండేవి. వాటిని చూస్తూనే విద్యార్థులంతా భయభక్తులతో ఉండేవాళ్లు. అదిగో, అలా బెదిరించి తోవకి తెచ్చేందుకున్న ఆభరణాలన్నమాట.

**మరి రాక్షసుల్ని చంపిందిగా!**

'ఇవేవో ఆయుధాలు కాదు ఆభరణా'లని నమ్మింపజేస్తున్నారే? మరి రాక్షసుల్ని చంపిందానికి సమాధానమేమిటనే ప్రశ్నని అడగడం తప్పేమీ కాదు. అమ్మకున్నంత ఓర్పు మరెవరికీ లేదు.

ఓ చిన్న ఉదాహరణని చూసి సమాధానానికొద్దాం. రావణుడు సీతమ్మతో అవాకులు, చెవాకులు వాగుతూంటే అమ్మ అంది కదా! 'రాముని ఆజ్ఞలేదు కాబట్టి బతికిపోయావ్. లేని పక్షంలో నిన్ను బూడిద చేసుండేదాన్ని' అని. (అసందేశాత్తు రామస్య...) ఇంట్లో కూడ ఒక్కో పిల్లవాడు తన తలతిక్కనంతా మాటల్లో వలికేస్తుంటే సహించలేని అమ్మ 'ఉండు. నాన్న రాగానే నీ మాటలన్నీ చెప్పి, నీ పెళ్లి చేయిస్తా'ననదూ. అలాంటిదే సీతమ్మ మాట కూడ.

అయినా శ్రుతిమించి వ్యవహరిస్తున్న వేళ తానే సంహరిస్తుంది. వెనుకాడదు. ఇది తల్లులందరికీ ఓ సూచన. శిక్షించ వలసినంత నేరం సంతానంలో కన్పించినప్పుడు శిక్షించకపోవడమనేది తల్లిదండ్రుల నేరమౌతుంది. కాబట్టి నాన్నొచ్చే వేళ మరెవరో వచ్చేంతవరకూ ఆగనక్కర్లేదు. శిక్షించవల్సిందే అని.

ఇంతకీ అమ్మవారు ఇలాంటి ఎవరెవర్ని శిక్షించిందని ఆలోచిస్తే ఆశ్చర్యం వేస్తుంది.

మొదటగా విషంగుణ్ని. వీణ్ని రాక్షసునిగా పేర్కొంటుంది పురాణం. అయితే ఈ పేరు ప్రతీకాత్మక నామం. అంటే వ్యక్తి యొక్క ఒక లక్షణాన్ని చెప్తుందన్నమాట.

వి+సంగః – ఎవరితోనూ సంబంధం పెట్టుకోకుండా (బంధు-మిత్ర-సోదర-సోదరీ...) ఒంటరిగా ఉంటూ తన మాటే చెల్లుబాటు కావాలనుకునేవాడే వి-సంగుడు (సంగమంటే సంబంధం). విగత (ఎప్పుడూ పెట్టుకోని) సంగం

(సంబంధం) వీడిది. ఇలాంటివాళ్ళని వధించిందంటే ఆ లక్షణం మంచిది కాదని చెప్పి, ఎవరెవరు మన వద్దకొచ్చారో లేక మనం వాళ్ళ వద్దకి వెళ్లామో దానికి తగ్గట్టుగా వారికి నొప్పి కలక్కుండా మాట్లాడాలని మనకి పరోక్షంగా సూచించడం అనేదాన్నే సంకేత రూపంగా చెప్పింది పురాణం. ఇది హత్య అవుతుందా?

ఇక రెండవ రాక్షసుని పేరు వి-శుక్రుడు. శుక్రమంటే జారిపడేదని అర్థం. శుక్రుడు అంటే జారిపడేవాడని అర్థం. 'వి శుక్రుడు' అంటే విశేషంగా జారిపడేవాడు అంటే ఎప్పుడూ మాట తప్పుతూ ఉండేవాడని దీని భావం. ఈ పని చేస్తా, ఆ పని చేసేస్తా, ఈ సహాయమూ నాకో లెక్క కాదు... లాంటి ఉత్తర కుమార ప్రగల్భాలని పలికే ఎందర్నో చూస్తుంటాం మనం. అమ్మ అలాంటి విశుక్రుణ్ని వధించిందంటే ఇలా మాటని ముందుగా ఇచ్చెయ్యకూడదని, ఇచ్చినట్లయితే మాటని తప్పనేకూడదని మనకి చెప్పడమన్నమాట. మన ప్రవర్తనని సరిదిద్దే ఈ సూచన ఓ ఘాతుక కార్యమౌతుందా?

మూడవవాడి పేరు రక్తబీజుడు. వీడు మరీ తీవ్ర హానికారకుడు. ఒక వ్యక్తికి ఓ లక్షణం ఉందంటే ఆ లక్షణం వాడి రక్తంలోని అణువణువునా ఉంటుందన్నమాటే. ఆ దుర్లక్షణాలకి సంబంధించిన బీజాలు రక్తం నిండుగా ఎవడికుంటాయో వాడే 'రక్త బీజు'డంటే.

సహజంగా కార్యాలయాల్లో పై అధికారి మెప్పుకోసమని కింది వాళ్లమీద చాడీలని చెప్పే రక్తబీజులు కొందరు (వాడి రక్తంలోని అణువణువునా అదే లక్షణం) ఉంటుంటారు. ఆ వినేవాడికీ ఓ రక్తబీజ లక్షణం ఉంది (పని మానుకుని ఇలాంటి చెవి కొరుకుడుగాళ్ల మాటలని వినడం). అందుకని అమ్మ రక్తబీజుణ్ని చంపడం కోసం భూమి మొత్తం పరిమాణంలో తన నాలుకని పెద్దది చేసి మరీ చంపింది వాణ్ని. బీజమంటే విత్తనం కదా! మామూలుగానే వాణ్ని చంపేస్తే ఆ రక్తపు బొట్టు నేలన పడితే మళ్లీ వేలకొలది ఇలాంటి లక్షణాలున్న రక్తబీజులు పుడతారుట. పుడతారుట ఏమిటి? వాడు కోరి వరాన్ని తెచ్చుకున్నదే అది. తన రక్తం నేలన పడితే తనలాంటివాళ్ళు పుట్టాలని. ఇలాంటి వాణ్ని వధిస్తే అదేమైనా శిక్షార్హమైన నేరమా? వధా ఇది?

కాబట్టి చాడీలని వినొద్దు, చెప్పొద్దంటోంది అమ్మ.

ఇక మరో రాక్షసుడు భండాసురుడు. 'భండ' అనే శబ్దానికి బద్ధకం, ఎందుకని అడిగితే కోపం కలిగి ప్రతీకార బుద్ధితో ఉండటమని అర్థం.

లోకంలో ఇలాంటివారిని మనం చూస్తుంటాం. వాళ్ల పనిని సక్రమంగా చేయరు. అడిగితే కోపంతో విరుచుకుపడతారు. 'అలా తననే నిలదీస్తూ అడుగుతారా?' అనే ప్రతీకార బుద్ధితో ఎప్పుడు హాని చేద్దామా అని అవకాశం కోసం ఎదురుచూస్తుంటారు. అదిగో! అలాంటివాళ్లనే వధించింది. వధించమంటోంది (ఆ లక్షణాలని



శంకరునికున్న ఏమాత్రపు గుర్తింపు అయినా పార్వతి కారణంగానే. శక్తి లేని శివుడు నిరర్థకుడు. (శివశ్శక్త్యా యుక్తో యది శక్తః...) అందుకే అర్ధనారీశ్వరుడయ్యాడు.

మానుకోవలసిందని సూచిస్తోంది) అమ్మ. ఇది దోషమా?

ఇక విజయదశమి నాటి రాక్షసుడు మహిష అసురుడు. మహిషమంటే దున్నపోతు అని అర్థం. ఆవు గాని, దూడ గాని ఎక్కడ వర్షం పడుతుందోననే భయంతో చరచరా గోశాలని వెతుక్కుంటూ వెళ్లిపోతాయి చినుకు పడగానే. అదే దున్నపోతైనట్లయితే అక్కడే వర్షంలో తడిసి తడిసి మొత్తం వాన కురిసి వెలిశాక ఆకాశాన్ని చూస్తూ 'ఇంతకంటే గొప్ప వర్షాన్ని చూసిన నాకు ఇదో



లెఖ్ఖా?' అనుకుంటుంది.

లోకంలో కొందరుంటారు. అక్కడ ఓ పొరపాటు చేసి పారిపోయి ఇక్కడికొస్తారు. ఇక్కడా ఇదే వ్యవహారం కొద్దికాలం జరగ్గానే అక్కడ మోసం చేసినందుక్కూడా అవమానం పాలయ్యాం. ఇక ఈసారి అలా లేకుండా చూసుకుందామనే ధ్యాస వీరికుండదు. ఇలా జరిగిన వాటిని మర్చిపోవడం బతుకుని భారంగా లాక్కొస్తూ ఉండటమనేది దున్నపోతు (మహిష) లక్షణం. అలాంటివాళ్ళని అమ్మ వధించిందంటే బద్ధకాన్ని జరిగిపోయినదాన్ని మర్చిపోయే విధానాన్ని తొలగించమంటే 'విజయం నీదే' అని పరోక్షంగా ఉపదేశిస్తున్నట్లు అర్థమన్నమాట.

## నవ రాత్రుల పండుగ ఏమిటి?

విజయదశమిని స్త్రీలకి సంబంధించిన పండుగ అని అనుకున్నాం కదా! లోకంలో ప్రతి స్త్రీ కూడా తొమ్మిది నెలల పాటు రాత్రిలా గడిపి (తన గర్భంలో శిశువు ఉన్న కారణంగా వేటినో వేటినో తింటూ వ్యాధుల బారిన పడుతూ నిద్ర సుఖమనేది లేక అనుక్షణం మార్పులకి గురౌతున్న శరీరంతో మానసిక ఆందోళనతో 9 నెలల్నీ గడిపి) పదవ నెలలో పండంటి బిడ్డని కని, ఈ రాత్రితో పోల్చబడిన కష్టమంతటినీ ఆ బిడ్డణ్ని చూస్తూనే మర్చిపోతుంది (శ్లో: ఫలేన హి పున ర్నవతాం విధత్తే!)

దేవత అయిన అమ్మ కూడా పైన అనుకున్న రాక్షసులే కాక, ఇతరులు కూడా తన సంతానాన్ని చంపెయ్యబోతుంటే అనుక్షణం రెండు కళ్ళతోనూ పరిశీలిస్తూ మొత్తం రాక్షసుల్ని ఈ 9 రాత్రుల్లో వధించగలిగింది. రాక్షసులకి బలం నిలిచి ఉండేది రాత్రి వేళల్లోనే కాబట్టి అమ్మకి కూడా రాత్రిపూటే యుద్ధం అనివార్యమౌతూండేది. అలా వధించి వధించి 10వ నాటి ఉదయానికి సర్వ రాక్షస వధ ముగిసిపోయి ఆమె విజయాన్ని సాధించిన కారణంగా ఇది 'విజయదశమి' అవుతుంది.

● డా॥ మైలవరపు శ్రీనివాసరావు



ఎక్కడ చిక్కాలో, ఎక్కడ తొక్కాలో, ఎక్కడ మొక్కాలో... తెలిసిన అచ్చమైన అందమైన స్త్రీ - క్లియోపాత్రా. మృదువైన శరీరం, తీర్చిదిద్దిన అంగ సౌష్ఠవం. ఎవ్వరైనా దాసోహమనవ్వాల్సిందే ఆమెకు. లైర్ వాద్య ధ్వని లాంటి కంఠంతో ఆమె పలికితే, రాళ్లు సైతం జవరాళ్లకై వెంపర్లాడే ప్రియుళ్లు కావాల్సిందే! క్లియోపాత్రా అంటే పున్నమి నాటి నిండైన చందమామ. క్లియోపాత్రా అంటే పాడుబడ్డ బావిలో నీడలా తేలే పండైన చందమామ!

● క్లియోపాత్రా

# కుటిల సుందరి

**ఈ**జిప్టుని టాలెమిక్ రాజవంశం పాలిస్తున్న రోజులవి. అధికారం కోసం అయినవాళ్లనే చంపేసేవాళ్లున్న వంశమది. అందరిదీ అధికార దాహమే; నమ్మక ద్రోహమే. తరం నుంచి తరానికి రక్తాల వంతెన కట్టుకున్న రాచరికమది.

అలాంటి చోట పుట్టింది క్లియోపాత్రా క్రీ.పూ.69లో. తండ్రి 12వ టాలెమీ. ఇతని కాలంలో ఈజిప్టుని ఆక్రమించారు రోమన్లు. బందీ అయ్యాడు టాలెమీ. ఇదే అదనని టాలెమీ పెద్దకూతురు బెరెనైస్ చక్రం తిప్పింది. రోమన్ల కాళ్ల పట్టుకుంది నిస్సిగ్గుగా. సామంత రాణిని చేయమంది నిర్భయంగా. తండ్రిని అంతం చేసుకోమంది నిర్లజ్జగా!

అప్పుడు క్లియోపాత్రాకు 15 ఏళ్లు. ఎక్కడ చెల్లెలు పక్కలో బల్లెమవుతుందోనని భయపడింది బెరెనైస్. అందుకే సోదరిని అంతఃపురానికి కట్టిపడేసింది. చుట్టూ పరిచారికలు. వారే గూఢచారులు. ఆత్మ లోలోపలి పొరల్లో సైతం క్లియోపాత్రాకు రాణినవ్వాలన్న కాంక్ష కలిగిందా, అంతే! ఖతం. లేత యవ్వనపు క్లియోపాత్రాను పువ్వులా చూసుకునే వారు... అవసరమైతే నలిపేయడానికి!

అంతలో ఆదే రోమన్ల భిక్ష పొందాడు టాలెమీ. తిరిగి ఈజిప్టు రాజయ్యాడు. సింహాసనపు మెట్లు ఎక్కుతూనే పెద్ద కూతురు తల అడ్డంగా నరికించాడు. క్షణక్షణ గండంగా బతికిన క్లియోపాత్రా ఊపిరి పీల్చుకుంది. యువరాణి అయ్యింది. మహారాణి కావాలన్న ఆలోచన తనకు లేదన్నట్లు 'నటించింది' - తండ్రి ముందు! ఏమో... లేకుంటే అక్క వల్ల వచ్చిన చిక్కు తన వల్లా వస్తుందని నాన్న తన కుత్తుక కత్తిరిస్తే!

అప్పట్లో రోమన్ సైన్యం ఈజిప్టులో తిష్ట వేసేది. అలా అప్పుడు వచ్చిన రోమన్ యోధుడు, కండలు తిరిగిన వీరుడు, 28 ఏళ్ల యువకుడు, అందగాడు మార్క్ ఆంటోనీ. ఓసారి అనుకోకుండా అతగాడిని చూసింది క్లియోపాత్రా. అప్పటికి ఆమెకి 16 యేళ్లు. ఆంటోనీ బాహ్య సౌందర్యం నచ్చింది. తెలీకుండానే మనసిచ్చేసింది. కానీ అతనికా విషయం తెలీలేదు. రోమ్ వెళ్లిపోయాడు.

మౌనంగా రోదించింది క్లియోపాత్రా.

● ● ●

క్రీ.పూ.51లో తండ్రి మరణించడంతో క్లియోపాత్రా అధికార పీఠం అధిరోహించింది - అదీ రోమన్ల అనుమతితో! ఎటొచ్చీ తన తమ్ముడు 13వ టాలెమీకి కూడా అధికారంలో భాగముంటుంది. అది వంశ ఆచారం. అందుకై తమ్ముణ్నీ ఆమె వివాహమాడాలి. అది ఈజిప్షియన్ రాచ సంప్రదాయం. తమ రక్తం కలుషితం కాకూడదని వారు అక్కా తమ్ముళ్లకు, అన్నా చెల్లెళ్లకు పెళ్లిళ్లు చేసేవారు. ఈ అగమ్య గమనం వారికో కట్టుబాటు.

అలా తమ్ముణ్ని భర్తగా చేసుకుని 18 యేళ్ల క్లియోపాత్రా తాను రాణై, అతగాడు రాజై పాలన ప్రారంభించింది. జీవితాన్ని పంచుకోవడానికే ఇష్టం లేదు. ఇక రాచరికాన్నా! ప్రశ్నే లేదు. ఈ అధికారమంతా తనదే కావాలి. అదీ ఆమె అంతరంగం. అందుకే అధికార పత్రాల నుండి తమ్ముడి పేరు తొలగించింది. నాణాలపై తన బొమ్మ మాత్రమే ముద్రించేది. టాలెమిక్ వంశంలో ఒక స్త్రీ ఇంతలా పైచేయి సాధించడం అదే తొలిసారి.

ఓవైపు రోమన్లు ఈజిప్టుని దోపిడీ చేస్తున్న వైనాన్ని కళ్లారా చూసింది. తన నేలలో పండిన పంటలు, సుగంధ ద్రవ్యాలు, పట్టు, పత్తి; అపార ధన రాశులు, బంగారం, రత్న వైఢూర్యాలు రోమ్‌కు ఎలా తరలిపోతున్నాయో పసిగట్టింది. ఈ ఆక్రమాన్ని ఆపాలన్నా తాను నిరంకుశ అధికారిణే కావాలి. కానీ ఎలా?

బలమైన శత్రువుని ఎదుర్కోవాలంటే శత్రువుతో శత్రువు పుట్టేంతవరకు ఆగాలి. అందుకే రోమన్లలో అంతః కలహాలు రావాలని కోరుకుంది. ఆ సమయం ఆసన్నమైంది. రోమన్ అధినేత జూలియస్ సీజర్‌కి అల్లుడి వరసే అయిన పాంపే ఆగర్భ శత్రువుగా మారాడు. పాంపే పక్షాన నిలిచింది క్లియోపాత్రా. రోమన్ రాజ్యాన్ని కదిలించాలనుకుంది. కానీ తన పదవికే ఎసరొస్తుందని తర్వాత అర్థమైందామెకు!

రెండు వేల గుర్రపు దళాల రోమన్ సైనిక 'గాబినియా' దళాలు క్లియోపాత్రాను గద్దె దించాయి. దాంతో తమ్ముడు సకల అధికారాలూ పొందాడు. క్లియోపాత్రా ఇప్పుడు బానిసగా బతకాలి. అదామెకు ఇష్టం లేదు. ఒప్పుకోకపోతే అంతా తనను చంపేస్తారు. అయినా ప్రాణాల్ని గుప్పిట పట్టి ఈజిప్టు వదిలి పారిపోయింది. కొద్ది

బంగారంతో, తన మద్దతుదారులతో అటవీదారులెంట పరిగెత్తింది. రాజ్యాన్ని, భోగాల్ని వదిలి అనాథగా ఎర్రసముద్ర తీరంలో ఉప్పటి చలిగాలిలో తిరిగింది. ఎండ కన్నెరగని అందాల రాశి కొండల్లో, లోయల్లో, భీకర వాతావరణంలో తిండీ తిప్పలూ లేకుండా గడిపింది.

● ● ●

భర్త అయిన తమ్ముడు యవ్వనానికి వచ్చాడు. రాజు కాబట్టి గర్వం పెరిగింది. అక్క క్లియోపాత్రా అందచందాల్ని అందరూ చెబుతూంటే మత్తెక్కిన మన్మథుడయ్యాడు. అప్పుడు రాయబారం పంపాడు. రాజధానికి వస్తే అన్ని రకాల సుఖాలూ అనుభవించ వచ్చన్నాడు. ఛీ పొమ్మంది. అంతకన్నా ఎర్రసముద్ర తీరపు మంచులో కరిగిపోతా నంది; పశ్చిమ పవనాల్లో ఎగిరి విరిగి పోతానంది.

వజ్రాన్ని వజ్రంతోనే కోయాలను కుంది ఆమె. తన తమ్ముడికి మద్దతిస్తున్న అదే రోమన్లను తనవైపు తిప్పుకోవా లనుకుంది. అంటే జూలియస్ సీజర్ని ఆకర్షించాలి. గతంలో పాంపేకి తాను సహకరించడం సీజర్కి గుర్తుండే ఉంటుంది. అయినా తప్పదు. మొక్కాలి.

అప్పుడు సీజర్ మధ్యధరా సముద్ర తీరాన ఈజిప్టు నగరం 'అలెగ్జాండ్రియా'లో బస చేశాడు. అక్కడకు ఈజిప్షియన్ వీధుల గుండా వెళ్లాలి. తననెవరైనా చూస్తే తమ్ముడి నుండి ప్రమాదం తప్పదు. మరేం చెయ్యాలి?

సహచరులను ఓ అందమైన తివాచీ తెమ్మంది. అందులో ఆమె పడుకుంది. చాపలా తనను అందులో చుట్టమంది. నేరుగా జూలియస్ సీజర్ వద్దకు తీసుకెళ్ల మంది. వందల మైళ్లు ప్రయాణించి అలెగ్జాండ్రియా చేరుకున్నారు. జిగేల్ జిగేల్మంటూ మెరిసిపోతున్న రాజ ప్రాసాదంలో ఉన్నాడు సీజర్.

నేలపై తివాచీ ఉంచారు సహచరులు. అంతే... ఆమె ఒక్కో తివాచీ పొరను విప్పు కుంటూ నేలపై అలా పొర్లుకుంటూ పొర్లు కుంటూ సీజర్ కాళ్ల దగ్గర పడింది. మోకాళ్లపై మోకరిల్లింది. రాశిపోసిన వెన్నెలలా, బోర్లించిన మంచు భరిణిలా, అందాల కామినిలా ఉంది క్లియోపాత్రా.

ఏనుగు దంతంలా తెల్లగా, నున్నగా ఉన్న ఆజానుబాహుడైన సీజర్, చలితుడయ్యాడు. అసలే స్త్రీత్వమంటే వెర్రెత్తిపోయే సీజర్ని ఆ సౌందర్యరాశి పరవశుణ్ని చేసింది. జగదేక సుందరి పాదాల చెంతకు వచ్చేసరికి ఆమెకోసం ఏం చేయడానికైనా సిద్ధమవ్వాల్సిందే!

అదే జరిగింది. క్లియోపాత్రా తమ్ముడు, భర్త, శత్రువు అయిన 13వ టాలెమీపై సీజర్ యుద్ధం ప్రకటించాడు. నైలునదీ తీరాన పోరు జరిగింది. టాలెమీ నదిలో దూకి చనిపోవాల్సి వచ్చింది.

ఇప్పుడు 22 ఏళ్ల క్లియోపాత్రా ఈజిప్టుకి పట్టాభిషిక్తురాలైంది. సామంతరాణీ కాదిప్పుడు. రోమన్ సామ్రాజ్యాధినేత సీజర్కి సహచర రాణి, ప్రియురాలు. ఆపై పెళ్లి చేసుకుని భార్య అయింది. ఈజిప్షియన్ సంప్రదాయం ప్రకారం - 11 ఏళ్ల మరో తమ్ముడు 14వ



'క్లియోపాత్రా' చిత్రంలో ఎలిజబెత్ టేలర్

> **'భయపడుతున్నట్లు కనపడొద్దు. అతిగా మాట్లాడకు. నీ మనసు లోతులు ఎవ్వరికీ తెలీనీకు. ఎదుటివారిని శత్రువైనా వారే నీకు దాసోహమయ్యేలా చేసుకో' - ఇదీ గురువు ఇరాస్ నేర్పినది. క్లియోపాత్రా ఆచరించినది!**

టాలెమీని వివాహమాడింది. ఆ కుర్రాడు ఓ నాలుగేళ్లకు విషం తిని మరణించాడు. కాదు... క్లియోపాత్రా ఆ పథక రచన చేసిందంటారు!

51 ఏళ్ల సీజర్కు పొంగే యవ్వనంలో జ్వలించే విద్యుత్ కణాల వాడి చూపిం చింది. జూలు విదిల్చుకున్న దేహపు శృంగార దహనం ఎలాంటిదో రుచి చూపింది. ఈజిప్టును పాలిస్తూనే రోమ్లో సీజర్తో గడిపింది. సిజేరియన్ అనే కొడుక్కి జన్మనిచ్చింది. వీనస్ ఆలయంలో ఏకంగా క్లియోపాత్రా విగ్రహాన్నే ప్రతిష్ఠిం చాడు సీజర్. అప్పుడే తెలుసుకుంది... తన తొలి ప్రియుడు మార్క్ ఆంటోనీ తన భర్త సీజర్కి కుడి భుజం అని!

● ● ●

కక్షలతో క్రీ.పూ.44లో బ్రూటస్, కాసియస్ అనే ఇద్దరు కుట్రదారులు సీజర్ని చంపేశారు. అదీ సెనేట్లో 23 కత్తి పోట్లతో! విషాద విహ్వలిత అయ్యింది క్లియోపాత్రా.

ఆర్నెల్లు గడిచాయి. తూర్పు రోమన్ ప్రాంతానికి ఆంటోనీ రాజయ్యాడు. పర్షియాపై దాడి చేయాలనుకున్నాడు. ఈజిప్షియన్ సైనిక సాయం కావాలంటూ ఈజిప్టు రాణి క్లియోపాత్రాకు కబురం పాడు. 14 ఏళ్ల క్రితం తొలి చూపులో ప్రేమించిన ప్రియుడు తనంతట తానే రమ్మన్నాడు. సైన్యం కోసమే. అయినా ఆమె హృదయం తాదాత్మ్య మైంది. టార్సస్ పట్టణంలో ఉన్నాడు ఆంటోనీ. అలనాడు సీజర్ని ఆకర్షించ డానికి చాపలో వెళ్లింది. మరి నేడు... ఆంటోనీకి తను పెదవి విప్పకుండానే తన ఆరాధన ఏమిటో తెలియాలంటే ఎలా వెళ్లాలి?

ఖరీదైన, రంగురంగులుగా మెరిసి పోతున్న, వెండి రంగు తెడ్లతో, బంగారు తాపడాలతో, ధగధగలాడే అలంకరణ లతో, పిల్లనగ్రోవి వాద్యకారులతో, సంగీత మేళాలతో అంతులేని బహుమతు లతో కూడిన పెద్ద ఓడలో శృంగార దేవతలా కులుకుతూ, ఓడ దిగి రతీదేవిలా నడిచి ఆంటోనీ సరసన నిలిచింది.

ఆకర్షణంలో ఆమెకు వశమైపోయాడు ఆంటోనీ. జీవితాంతపు బానిసైపోయాడు. ఆపై వారి శృంగార జీవితం... ఉద్రేక పూరిత నాట్య ప్రదర్శనలతో, లాలిత్యపు స్పర్శలతో సాగింది.

● ● ●

రోజులన్నీ ఒకేలా ఉండవు. అంత రంగిక శత్రువులు ఆంటోనీపై కత్తికట్టారు. ఆక్టియం యుద్ధంలో ఓడిపోక తప్పని స్థితి వచ్చింది. శూరుడు కదా... తానే ఆత్మహత్య చేసుకోవాలనుకున్నాడు. కత్తితో పొడుచుకున్నాడు. రక్తపు మడుగులో ప్రియురాలి కడకు చేరాడు. కన్నీటి పర్యంతమై, శిథిల హృదయు రాలైన క్లియోపాత్రా ఒడిలో కన్ను మూశాడు.

ఆపై ఆమె కూడా ఈజిప్షియన్ తాచుపాముచే తన వక్షస్థలంపై కాటు వేయించుకుని కన్నుమూసింది - క్రీ.పూ.30లో 39 తన ఏట!

దటీజ్ క్లియోపాత్రా!

● ఆకెళ్ల రాఘవేంద్ర

కైనా ?

## ? ఎందుకు

### రావిచెట్టును ఇంట్లో ఎందుకు పెంచకూడదు?



శాస్త్రాల ప్రకారం రావిచెట్టు విష్ణుస్వరూపం. శనిదోషాలు పోగొడుతుంది. అందువల్లే ఆలయాల్లో రావిచెట్టు చుట్టూ ప్రదక్షిణలు చేస్తారు. అయితే రావిని ఇంట్లో పెంచకూడదని పెద్దలు, శనివారం తప్పించి మిగతా రోజుల్లో రావిచెట్టును తాకకూడదని శాస్త్రాలు అనాదిగా చెబుతున్నా, రావిని ఇంట్లో పెంచకూడదనడానికి ఆధ్యాత్మిక కారణాలేవీ లేవు. అయితే సామాజిక కారణాలు మాత్రం ఉన్నాయి.

రావిచెట్టు చాలాకాలం ఉంటుంది. పైగా అది పెరిగేకొద్దీ దాని వేళ్ల భూమిలోపల చాలా దూరం బలంగా పాకుతాయి. దానివల్ల పునాదులు దెబ్బతిని ఇల్లు కూలిపోయే ప్రమాదం ఉంది. అలాగే రావి చెట్టు భారీ వృక్షంగా పెరుగుతుంది కాబట్టి వాటిమీద పక్షులు గూళ్లు కట్టి, గుడ్లు పెడతాయి. వాటికోసం పాములు వచ్చే ప్రమాదం కూడా ఉంది. అందుకే రావిచెట్టును ఇంట్లో పెంచవద్దని చెబుతారు. నిజానికి రావిచెట్టే కాదు, ఏ పెద్ద చెట్టును పెంచినా ఈ సమస్య వస్తుంది.

## ? ఏమిటి

### పంచపాండవులెందరు అంటే మంచం కోళ్లలాగ ముగ్గురు అని రెండు వేళ్లు చూపినట్టు...



ఒక ఊరిలో ఒక వ్యక్తి ఉండేవాడు. అతడికి చదువు లేదు. జ్ఞానం అంతకంటే లేదు. కానీ తానో మేధావినన్నట్టు ఊరివాళ్లందరి దగ్గరా డంబాలు పోయేవాడు. దాంతో ఊళ్లో వాళ్లందరికీ అతడిమీద కచ్చగా ఉండేది. ఓసారి అతడి నెలాగైనా ఇబ్బంది పెట్టాలని అంతా నిర్ణయించుకున్నారు. మేమొక ప్రశ్న వేస్తాం. జవాబు చెప్తే మాంచి బహుమతి ఇస్తాం. చెప్పలేకపోతే నువ్వు తెలివితేనివాడివని ఒప్పుకోవాలి, ఇంకెప్పుడూ నోరు తెరవకూడదు అన్నారు. అతడు సరేనన్నాడు. అందరూ కలిసి 'పాండవులు ఎందరు' అని అడిగారు. అతడు ఆలోచనలో పడ్డాడు. ఎలాగూ చెప్పలేడని తెలిసి 'పంచపాండవులెందరు' అనడిగారు. సమాధానం తెలియదంటే అవమానపడాల్సి వస్తుందని భావించిన ఆ వ్యక్తి... పంచపాండవులెందరో ఆమాత్రం తెలీదా, మంచం కోళ్లలాగ ముగ్గురు అంటూ రెండు వేళ్లు చూపించాడు. అంతే! అందరూ ఒక్కసారిగా ఘొల్లున నవ్వారు.

సమాధానం ప్రశ్నలోనే ఉంది. అయినా గుర్తు పట్టలేదు. పైగా మంచం కోళ్లు నాలుగుంటాయని కూడా తెలీక దాన్ని ఉదాహరణగా చెప్పాడు. లెక్కలు కూడా తెలీక రెండు వేళ్లు చూపించాడు. అప్పట్నుంచీ ఇలా అతి తెలివి చూపించేవాళ్ల గురించి మాట్లాడేటప్పుడు, అతడు చెప్పిన సమాధానాన్ని సామెతగా వాడటం మొదలుపెట్టారు.




# వెంటవెంటనే 24 గంటల వంట


చెఫ్ దాము: వంటచేస్తూ, గిన్నిస్ అవార్డు అందుకుంటూ...




వంట అనేది శ్రద్ధతో, ఏకాగ్రతతో చేసేది కాబట్టే అది 64 కళల్లో ఒకటైంది. అందరికీ సులువుగా వచ్చే కళ కాదది. ఆ కళను అత్యంత నైపుణ్యంతో చేసి, దక్షిణ భారతంలోని ప్రముఖ చెఫ్‌లలో ఒకడిగా వెలుగొందుతున్న కలియుగ నలభీముడు దాము. తమిళనాడుకు చెందిన దాము అత్యంత వేగంగా, అత్యంత రుచికరంగా వండటంలో తనకు తనే సాటి. దేశంలో పలువురు తమ పార్టీలకు ఆయనను ప్రత్యేకంగా ఆహ్వానించి మరీ వండించుకునేంత చేయితిరిగిన వంటవాడు. అందుకే గిన్నిస్ రికార్డు సాధించగలిగారు.

24 గంటల పాటు అంటే ఒకరోజంతా నిరాటంకంగా వంటలు చేయాలి. అది కూడా ఇంతవరకూ ఎవరూ చేయనన్ని ఎక్కువ వంటలు చేయాలి. అదీ పోటీ. అందులో ఆయన చరిత్ర సృష్టించారు. కేవలం 24 గంటల్లో 617 రకాల వంటలు చేశారు. ఇందులో ఇంకో రూలుందండోయ్. ప్రతి వంటా తినడానికి బాగుండాలి. అయితే, దాము సామాన్యుడా... ప్రతి ఐటమ్‌నూ 'ఆహా... ఏమి రుచి' అనిపించేలా చేశాడు. ఆ వంట పేరు కూడా తెలియని విదేశీయులు కూడా తిని పసందైన విందు అని పొగిడారు. గంటకు కేవలం ఐదు నిమిషాల విశ్రాంతితో మైక్రోవేవ్ ఓవెన్‌లు వంటి యంత్రాలు వాడకుండా కేవలం గ్యాస్ పొయ్యి మీదనే ఈ వంటలన్నీ తయారుచేయడం ఆయన ప్రత్యేకత.

ఆయన వేగాన్ని, ఆయన వంటలను రుచిచూసిన గిన్నిస్ ప్రతినిధులు 'బాబోయ్ ఇంత స్పీడా' అని ఆశ్చర్యపోయారు. నిన్ను తలదన్నే వాడు లేడుపో అంటూ గిన్నిస్ రికార్డు చేతికిచ్చి పంపారు. ఈయనకు మరో ప్రత్యేకత కూడా ఉంది. దేశంలో హోటల్ మేనేజ్‌మెంట్‌లో డాక్టరేట్ పొందిన మొట్టమొదటి చెఫ్. వంటలపై పలు పుస్తకాలు రాశారు. ప్రపంచంలోని పలు దేశాలు తిరిగి ఎన్నో వంటల ప్రదర్శనలు ఇచ్చారు. ప్రస్తుతం పలు హోటల్ మేనేజ్‌మెంట్ కళాశాలల్లో గెస్ట్ లెక్చర్‌లు ఇస్తున్నారు.

...ుగులేని పరిష్కారం
మా సూపర్ స్పెషాలిటీ చికిత్సలు
...మేహం
...యిడ్
... సమస్యలు
...ము నొప్పి
...నలేమి
• కీళ్ళనొప్పులు
• అలర్జీ
• కిడ్నీ సమస్యలు
• హార్మోన్ సమస్యలు
• ఆస్తమా
HOMEOCARE
హోమియోకేర్ ఇంటర్‌నేషనల్ (ప్రై) లిమిటెడ్
www.homeocare.in
LEADERS IN WORLD-CLASS HOMEOPATHY
An ISO 9001-2008
Certified Clinic with German Accreditation
Toll-free 1800 102 2202
ఉచిత కన్సల్టేషన్ :
955 000 3399 / 955 000 1155
...న్మకొండ | బెంగళూరు | హుబ్లీ | మంగళూరు | చెన్నై | కోయంబత్తూర్ | మధురై

నిజాలు దేవుడికెరుక : క్రైమ్

స్త్రీ ప్రేమకు ప్రతీక. అనురాగానికి చిరునామా.
అలాంటి స్త్రీ అతి కిరాతంగా ప్రాణాలు తీయగలదా?
కర్కశంగా, క్రూరాతిక్రూరంగా ప్రవర్తించగలదా?
లియొనార్డా సియాన్సుయెల్లీ ఇవన్నీ చేసింది! అందుకే
స్త్రీ జాతికే మాయని మచ్చ అంటూ సమాజం ఆమెను ఛీకొట్టింది.
ఆమెను క్షమించనేకూడదు, ఉరి తీయమంది.
ఇంతకీ లియొనార్డా ఏం చేసింది?
కొన్ని దశాబ్దాల క్రితం ఇటలీ మొత్తాన్నీ హడలెత్తించిన
లియొనార్డా గురించి ఈవారం నిజాలు దేవుడికెరుకలో!




# అక్కడితో ఆగలేదు!

**1946,** ఇటలీ.

"చెప్పండి, ఏం జరిగింది"... టేబిల్‌లోని ఫైల్‌ని పక్కన పెడుతూ అడిగాడు సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్.

అతని ఎదురుగా ఓ స్త్రీ కూర్చుని ఉంది. మొదటిసారి పోలీస్ స్టేషన్‌కి వచ్చిన భయం, కంగారు కనిపిస్తున్నాయామెలో.

"మా వదిన కసియోపో కొన్నాళ్లుగా కనిపించడం లేదు సర్" అంది కాస్త తడబడుతూ.

"కొన్నాళ్లుగా అంటే ఎన్నాళ్లుగా?"

"ఆరేళ్లుగా..."

"వ్వా...ట్? ఆరేళ్లుగానా. మరి ఇంత కాలం ఎలా ఊరుకున్నారు?" కాస్త ఆశ్చర్యంగా, ఇంకాస్త కోపంగా అన్నాడు ఎస్పీ. ఆమె కంగారుపడింది.

"ఇన్నాళ్లూ వెతుకుతూనే ఉన్నాం సర్. కానీ ఏమీ తెలియలేదు. కానీ చాన్నాళ్లుగా ఓ అనుమానం పీడిస్తోంది. అది ఇప్పటికైనా తేల్చుకోవడం మంచిదని వచ్చాను."

"ఏమిటా అనుమానం?" - సూటిగా ప్రశ్నించాడు.

"మా ఇంటి దగ్గర్లో లియొనార్డా అని ఒకావిడ ఉంది. ఆ రోజు మా వదిన వాళ్లింటికి వెళ్లడం నేను చూశాను. ఆ తర్వాత తను ఇక మాకు కనిపించలేదు."

"మరి ఆమెను అడిగారా?"

"అడిగాం సర్. వదిన అక్కడ కాసేపు ఉండి వెళ్లిపోయిందట. ఎక్కడికి వెళ్లిందో ఆమెకు తెలియదట."

నిట్టూర్పు విడిచాడు ఎస్పీ. "ఆవిడ ఆ ఇంటికి వెళ్లిందని తెలుసు. ఆ తర్వాత కనిపించకుండా పోయిందనీ తెలుసు. అయినా తనేదో చెప్తే తలూపి వచ్చేశారు. ఏ ఆధారమూ లేకుండా ఆరేళ్లుగా మీ వదిన్ని వెతుకుతూ గడిపేస్తున్నారు. కనీసం పోలీసులకు ఇన్‌ఫామ్ చేయాలని కూడా తెలీదా మీకు?"

అతడి అరుపులకి అదిరిపడిందామె. భయంగా లేచి నిలబడింది. ఆమె ముఖంలో మారిన రంగుల్ని చూసి కాస్త తగ్గాడు ఎస్పీ. గొంతు తగ్గించి...
"పదండి... ఆమె ఇంటికెళ్దాం" అంటూ బయటికి దారితీశాడు.

• • •

"యెస్... ఎవరు కావాలి"... అంది తలుపు తెరచిన నలభై మూడేళ్ల స్త్రీ.

"ఈవిడే సర్ లియొనార్డా... లియొనార్డా సియాన్సుయెల్లీ"... ఎస్పీ వెనుక నిలబడిన స్త్రీ అంది.

"నువ్వు కసియోపో ఆడపడుచువి కదూ. ఏంటి పోలీసులతో వచ్చావ్?" అయోమయంగా అడిగింది లియొనార్డా.

"కసియోపో గురించి మాట్లాడాలి" అంటూనే కానిస్టేబుళ్లతో సహా లోపలికి దూసుకెళ్లాడు ఎస్పీ. ఇల్లంతా పరికించి చూశాడు. సంపన్న గృహం కాదు. అలాగని పేద గృహమూ కాదు.

"ఈవిడ వదిన కసియోపో ఆరేళ్ల క్రితం మీ ఇంటికి వచ్చిందట. ఆ తర్వాత కనిపించకుండా పోయిందట. అందుకే తన గురించి మీతో మాట్లాడదామని వచ్చాం."

అతని మాటలకు పెద్దగా కంగారు పడలేదు లియొనార్డా.

"చెప్పడానికి ఏముంది సర్! తను మా ఇంటికి వచ్చినంతవరకే నాకు తెలుసు. ఆ తర్వాత ఎక్కడికి వెళ్లిందో, ఏమైపోయిందో నాకెలా తెలుస్తుంది చెప్పండి! తెలుసుకోవాల్సిన అవసరం కూడా నాకు లేదు కదా!"

"నిజంగా మీకేమీ తెలియకపోతే ఓకే. కానీ తెలిసి కూడా తెలియనట్టు నటిస్తే మాత్రం విషయం వేరేలా ఉంటుంది" అని, వెళ్దాం పదమన్నట్టు కానిస్టేబుల్స్‌కి సైగ చేశాడు. వాళ్లు బయటికి నడిచారు.

జీపు ఎక్కబోతుండగా ఆ స్త్రీ అంది... "చెప్పాను కదా సార్. మాతోనూ ఇలాగే చెప్పింది."

"కంగారుపడకండి. మీ వదిన ఏమయ్యిందో తెలుసుకునే పూచీ నాది"... దృఢంగా పలికింది ఎస్పీ గొంతు.

• • •

"సర్ ఇటు చూడండి"

సబార్డినేట్ మాటతో అటువైపు చూశాడు ఎస్పీ. అతగాడి చేతిలో ఓ ఫైలుంది. దాన్ని ఎస్పీ ముందు పెట్టాడు. చూసిన ఎస్పీ నొసలు ముడిపడ్డాయి.

"మీ అనుమానమే నిజమయ్యింది సర్. ఆ రెండు మిస్సింగ్ కంప్లయింట్లూ ఈ ఏరియా నుంచి వచ్చినవే. వీళ్ల ముగ్గురి అదృశ్యం వెనుక ఏదో కథ ఉంది."

అవునన్నట్టు తలూపాడు ఎస్పీ. "చాలా కరెక్ట్‌గా చెప్పావు. కచ్చితంగా ఏదో కథ ఉంది. ఆ కథ ఏమిటో లియొనార్డాకి తెలిసేవుంటుందని నాకనిపిస్తోంది. అప్పట్లో ఎంత ప్రయత్నించినా వాళ్ల ఆచూకీ తెలుసుకోలేకపోయాం. ఇప్పుడు తీగ దొరికింది కదా. డొంకను కదిలిద్దాం."

"అయితే ఆమెను తీసుకు

రమ్మంటారా?''

''ఇంకెందుకాలస్యం? మామూలుగా అడిగి చూశాం. ఈసారి మన స్టైలిలో అడిగిచూద్దాం, తీసుకురండి.''

అతని ఆదేశాన్ని అందుకుని వెళ్లిపోయారు సబార్డినేట్. ఆ మూడు కేసులనూ ముడిపెడుతూ ఆలోచనల్లోకి జారుకున్నారు ఎస్పీ.

• • •

''అవును... వాళ్లని నేనే చంపాను''

గంటున్నరపాటు పోలీసుల్ని ముప్పు తిప్పలు పెట్టి ఎట్టకేలకు నోరు విప్పింది లియొనార్డా.

''అది నాకు తెలుసు మిసెస్ లియొనార్డా. ఆ రోజు నీ ఇంటి నుంచి మౌనంగా వచ్చేసింది నీ మాటలు నమ్మి కాదు. నీ ఇంట్లో వస్తువుల్ని సరికే తీరుని చూసినప్పుడే నాకు అనుమానం వచ్చింది. కానీ ఇంకొన్ని విషయాల్ని నిర్ధారించుకోవాలని ఆగాను. చెప్పు. ఎందుకు చంపావ్?''

''నా పిల్లల కోసం చంపాను. వాళ్లు చస్తేనే నా పిల్లలు నాకు దక్కుతారు. అందుకే చంపాను.''

''నీ పిల్లలకీ వాళ్ల హత్యలకీ ఏంటి సంబంధం?''– అర్థం కాక అడిగాడు ఎస్పీ. అతని ప్రశ్న చిన్నదే. కానీ దానికి లియొనార్డా చెప్పిన సమాధానం మాత్రం చిన్నది కాదు.

''నేను పదిహేడుసార్లు గర్భం దాల్చాను. పద్నాలుగు మంది పిల్లలకు జన్మనివ్వగలిగాను. కానీ, పదిమంది పిల్లలు చిన్న వయసులోనే చనిపోయారు. ఇక మిగిలింది నలుగురే. వాళ్లు కూడా దూరమైతే నేను బతకలేను. నా పిల్లలు నూరేళ్లు బతకాలంటే ఒక్కొక్కరికీ ఒక్కొక్కర్ని చొప్పున బలివ్వాలి.''

ఉలిక్కిపడ్డారు ఎస్పీ. ''ఏంటీ... బలిస్తావా? నీకేమైనా పిచ్చా?''

''మీకు తెలీదు. అలా చేస్తేనే నా పిల్లలు క్షేమంగా ఉంటారు. ఓ జ్యోతిష్యుడు నా పిల్లలందరూ చచ్చిపోతారని చెప్పాడు. నిజంగానే ఒక్కొక్కరూ చని పోతూ ఉన్నారు. నా అదృష్టంకొద్దీ నలుగురు మిగిలారు. అంతా బాగుందిలే అనుకుంటే నా పెద్ద కొడుకు ఆర్మీలో చేరతానంటున్నాడు. అంటే చావును వెతుక్కుంటూ వెళ్తున్నాడు. భయం పట్టుకుంది నాకు. మృత్యువు మరోసారి నా ఇంటిని, నా పిల్లల్ని వెతుక్కుంటూ వస్తుందేమో ననిపించింది. అందుకే ఇలా చేశాను.''

''వాళ్లని బలిస్తే నీ పిల్లలు క్షేమంగా ఉంటారని ఎవరు చెప్పారు, ఆ జ్యోతిష్యుడా?''

''లేదు. నాకే అనిపించింది. నాకూ కాస్త జోతిష్యం తెలుసు. వాళ్ల ఆయుష్షు తీసేస్తే, నా పిల్లల ఆయుష్షు పెరుగుతుందనిపించింది. ముగ్గురిని చంపేశాను. నా ముగ్గురు పిల్లలు సేఫ్. నాలుగో ఆమెను చంపుదామంటే మీరు అడ్డొచ్చారు. ఇప్పుడు నా చిన్న కొడుకు పరిస్థితేమిటి? వాడినెవరు కాపాడతారు?''

ఆమె మాటలకు నవ్వాలో ఏడవాలో అర్థం కాలేదు ఎస్పీకి. తల్లి పిల్లల కోసం ఏమైనా చేస్తుందని తెలుసు. కానీ ఇంత దారుణాలకు ఒడిగడుతుందా! అది కూడా అర్థం పర్థం లేని భయాలతో! ఓ పక్క కోపంగా ఉన్నా, మరోపక్క ఆమె మానసిక దౌర్బల్యానికి జాలి కూడా వేసిందతనికి.




**లియొనార్డాది మొదట్నుంచీ వింత మనస్తత్వం. ఇంట్లోవాళ్లు తన మాట కాదన్నందుకు చిన్న వయసులోనే రెండుసార్లు ఆత్మహత్యకు ప్రయత్నించింది. యవ్వనంలో ఒక గుమాస్తాను ప్రేమించి పెళ్లాడి, తల్లిదండ్రుల నిరాదరణకు గురై, భర్తతో సహా వేరే ప్రాంతానికి వెళ్లిపోయింది. అనారోగ్యంతో భర్త మరణించాక పిల్లల్ని పోషించుకోడానికి చిన్న దుకాణాన్ని నడుపుకుంటూ జీవించింది. మంచి మనిషి అని పేరు తెచ్చుకుంది. ఆమె గురించిన నిజాలు బయటపడినప్పుడు అందరూ షాక్ తిన్నారు. ఆమె అలా చేసిందంటే ఇప్పటికీ కొందరు నమ్మలేమంటారు.**

కానీ ఆ జాలి మరుక్షణంలోనే పటాపంచలయ్యింది. లియొనార్డా చెప్పిన విషయాలు అలాంటివి మరి.

ఎప్పుడైతే తన పిల్లలను కాపాడుకోవడానికి నలుగురిని బలివ్వాలనుకుందో, అప్పుడే తన ఆలోచనను అమలు చేయడానికి ప్రణాళికలు వేయడం మొదలెట్టింది లియొనార్డా. తన ఇంటికి దగ్గర్లో ఉన్న, తనకు ఎంతో సన్నిహితులైన నలుగురు స్త్రీలను ఎంచుకుంది. తనకు జోతిష్యం తెలుసని వాళ్లందరితో నమ్మబలికింది. దాంతో వాళ్లు ఆమెను ప్రత్యేకంగా చూడటం మొదలెట్టారు. ఒకామె వయసు నలభయ్యేళ్లు. కానీ పెళ్లి కాలేదు. ఆమెకు మంచి వరుణ్ని చూశానని, అతణ్ని కలవడానికి తీసుకెళ్తానని, విషయం ఎవరికైనా చెబితే పని జరగదని, రహస్యంగా ఉండమని చెప్పింది. ఇంట్లో వాళ్లెవరికీ చెప్పకుండా ఒకరోజు రమ్మంది. వచ్చాక వైన్‌లో మత్తుమందు కలిపి తాగించింది. స్పృహ కోల్పోయాక ఆమె దేహాన్ని కత్తితో తొమ్మిది ముక్కలుగా నరికింది. రక్తాన్ని బేసిన్‌లో పట్టింది. ముక్కలన్నిటినీ ఓ పెద్ద కుండలో వేసింది. తర్వాత అందులో సబ్బులు తయారు చేయడానికి తెచ్చిన ఏడు కిలోల కాస్టింగ్ సోడా వేసి ఉడికించింది. ఆ మిశ్రమంతో సబ్బులు తయారు చేసి అమ్మింది. చివరికి వాటిని ఆ మహిళ కుటుంబ సభ్యులు కూడా కొనుగోలు చేసి వాడారు.

అలాగే బేసిన్‌లో పట్టిన రక్తాన్ని గడ్డకట్టేలా చేసి, అందులో మైదా, చక్కెర, చాకొలెట్, పాలు, గుడ్లు వేసి కుకీస్ తయారు చేసింది. వాటిని తన షాపులో అమ్మడమే కాదు, ఇంటికి వచ్చిన అతిథులకి, తన పిల్లలకి కూడా తినిపించింది.

''ముగ్గురినీ ఇలాగే చేశాను. కానీ అందరిలోకీ కెసియోపో చాలా రుచిగా ఉంది'' అని లియొనార్డా చెబుతుంటే ఎస్పీ ఒళ్లు గగుర్పొడిచింది. కేసు ఫైల్ చేసి ఆ నరరూప రాక్షసిని కోర్టుకు పంపించారు. కోర్టు ఆమెకు ముప్ఫై మూడేళ్ల కఠిన కారాగారశిక్షను విధించింది.

కటకటాలు కూడా ఆ కర్కశురాలిని మార్చలేకపోయాయి. జైలు గోడలు ఆమెకు జీవితపు విలువను ఏ మాత్రం తెలియజేయలేకపోయాయి. తను చేసింది తప్పని లియొనార్డా ఏరోజూ ఒప్పుకోలేదు. మారిన మనసుతో ఏనాడూ కనిపించలేదు. ఇంకా తొమ్మిదేళ్ల శిక్ష మిగిలి వుండగా మెదడుకు సంబంధించిన సమస్యతో చనిపోయింది (1970లో). చివరి క్షణాల్లోనైనా ఆమె కళ్లలో పశ్చాత్తాపం కదలాడలేదు. అందుకే, జాలి అంటే ఏమిటో తెలియని లియొనార్డా చావు గురించి తెలిసి ఎవ్వరూ జాలి పడలేదు. ఏ పిల్లల కోసమైతే ఇవన్నీ చేసిందో... ఆ పిల్లలు కూడా!

● సమీర నేలపూడి

# పాలమ్మ..!

డా॥ చింతకింది శ్రీనివాసరావు



పాలమ్మ అసలు పేరు పైడితల్లి. తల్లిదండ్రులకి ఒక్కర్తే కూతురు. ఆ పిల్ల పురిట్లోనే చచ్చిపోయేలావుంటే వాళ్ల అమ్మ అప్పలనరస, అయ్య బలరాముడు విజీనారం పైడిమాంబకి మొక్కుకున్నారు. బిడ్డ బతికితే అమ్మవారి పేరు పెడతామన్నారు. అలా అది బతికేసింది. పైడితల్లయిపోయింది.

అప్పలనరసేమో మామిడికాయలు, రాచ ఉసిరికాయలు, సీమ చింతకాయలు వెదల్చాటి వెదురు బుంగల్లో వేసుకుని మా ఊరి పెద్దబజారు జంక్షన్లో అమ్మేది. బలరాముడు మాత్రం ఏ పనీ చేసేవాడు కాదు. ఎప్పుడూ పెళ్లాంతో తిట్లు కాయడమే. ఈ గొడవలన్నీ పైడితల్లి పుట్టేక వాళ్ల మధ్యాన బాగా తగ్గిపోయాయనే చెప్పాలి.

పైడితల్లి ఏం తినేదో ఏం తాగేదో గానీ రోజురోజుకీ నాజూగ్గా కనిపించేది. కొంత వయసొచ్చేసరికి మరీను. అదేం చిత్రమో గానీ అక్షరం ముక్కా చదూకోని పైడితల్లి గొప్ప సంస్కారి. లోకజ్ఞానం మెండు. పెద్దలంటే గౌరవం. పిల్లలంటే ప్రేమ. దేవుడంటే భక్తి. ఊరి చినూపాలెస్వామికి మొక్కకుండా ఏ పనీ చేసేది కాదు. అలాంటి పైడితల్లికి పెళ్లీడు వచ్చేసింది. సంబంధాలూ వచ్చేదం మొదలెట్టేయి.

'పొవ్వల్లో ఎందుకే. నా కొడుకు నరసింగడు లేడా. ఇద్దే అల్లుడిగా సేస్కోండి' అని అప్పలనరస ఆడబడుచు దుర్గాయమ్మ ఓసారి అడగొచ్చింది. 'మావోడయితే నీ బిడ్డని పువ్వుల్లో ఎట్టి సూసుకుంటాడో' అంటూ చెప్పొచ్చింది.

అప్పలనరసకి ఏం చెయ్యాలో తోచలేదు. మొగుడితో మాటాడదామంటే ఆడో తింగరి చచ్చినోడు. ఆలోచనలో పడిపోయింది. ఇలాంటివేళ పైడితల్లి స్వయంగా రంగంలోకి దిగింది.

'అత్తా ! నీ కొడుకు మంచోడేనే. కాదన్నేదు. కానీ నాను దుప్ప మా యమ్మకీ బావకీ పొత్తలున్నాదే. ఇల్లు నొగ్గిసి నాను రానేను. నీకంటే పర్నేదు. నలుగురు కొడుకులున్నారు. మాకలక్కాదే. సింగడు బావ మాతోనే ఉంటానంతే సెప్పు. మనువుకి నాకేటీ అభ్యంతరము నేదు. నీకిదే సెప్పు. గంపెడుమంది మనవల్ని కనేసిచ్చేత్తాను. నాది ఆమీ'... మూడు ముక్కల్లో తుని తగూ చేస్సింది. ఆ మాటలకి దుర్గాయమ్మ 'సర్లే. నా కొడుకెప్పుడికీ పోడంనేదు కదా. మా యన్నింటికే కదా పోయాడి. నువ్వు నాకోడలయితే అదే సేన' అనేసింది. ఆ మూడు నెల్లోనే లగ్గాలయిపోయేయి.

నరసింగడు నెమ్మదస్తుడు. తగువమనిషి. ఇమాంపసందు మామిడిపండులాంటి పైడితల్లికి పెనిమిటి అయ్యానని ఎగిరి గెంతేస్సేడు. మావగారింటికి తట్టాబుట్టా సర్దేసేడు.

అలా అమ్మానాన్నా పూరింటి పక్కంగానే పైడితల్లి మరో పాక వేసింది. సింగడితో కాపరం పెట్టింది. బజార్లో తల్లి బంగిడి పక్కనే మరో బంగిడీ తగిలించేసింది.

పైడితల్లి మాటమీద నిలబడే పిల్ల. పెళ్లికి ముందు అత్తకిచ్చిన మాట ప్రకారం పదిహేనేళ్లలో డజను మందిని కనేసింది. ఇద్దరు పోగా పదిమంది మిగిలేరు.

కొత్త కొత్తగా కడుపు పండటం వల్ల పైడితల్లికేం లాభం జరిగిందో గానీ, ఊళ్లో చాలామంది పసిపిల్లల కడుపు నిండింది. వాళ్ల ఉపిరి నిలిచింది.

అప్పట్లో మావూరి కరణంగారి కోడలు కామేశ్వరికి ప్రసవం జరిగి బాబు పుట్టేడు. ఎర్రగా బుర్రగా ఉన్నాడు. కానీ వాడికి తల్లిపాలు కరువైపోయేయి. పోతపాలు పడీవికావు.

సంగతంతా పైడితల్లి చెవినపడింది. తెగ బాధపడిపోయింది. చనుబాలు లేక పిల్లడు అల్లాడిపోతున్నాడని కళ్లనీళ్ల పెట్టుకుంది. మంచో చెడ్డో తన మనసులో మాట చెప్పేయాలని సరాసరి కరణం గారింటికెళ్లింది. కోడలు పిల్లతో మాటకలిపింది.

'అమ్మా ! మీకే అభ్యా నేపోతే, మీ బిడ్డకి నాను పాలిత్తాను. మీ కాడ పాల్లేవు. నాకాడ అయి జాస్తి. నా పిల్లలు తాగ్గా ఇంకా మిగిలిపోతన్నాయి. నా మాటినండి. బిడ్డ కడుపు మాడగొట్టకండి. దేవుడు పెటీ ఏటా నాకు సంతానం ఇస్తానే ఉన్నాడు. కొందర్ని బట్టుకుపోనాడు కూడాను. కడుపు కోతేటో నాకెరుకే. అది పగోల్లకీ రాకూడదు. ఇంక ఆలోసించకండి.' అని ఆప్యాయంగా చెప్పింది. ప్రేమతో చెప్పింది. దయతో చెప్పింది.

ఆదలా అంటుంటే కరణంగారూ ఆయన భార్యా నీరయిపోయేరు. పిల్లాడు బతికితే అంతే చాలనుకున్న కోడలమ్మ అత్తామామలవైపు దీనంగా చూసింది. వారు సరే అన్నట్టుగా తలూపేరు. పసికందు చేతులు మారేడు. పైడితల్లి బిడ్డనోటికి రొమ్ము అందించింది. అమ్మపాలకోసం తపించిపోతున్న బుజ్జిబాబు బుడుకూ బుడుకూమని పెద్ద పెద్ద శబ్దాలు చేస్తూ మరీ పాలు తాగేసేడు.

ఆ రోజు నుంచి కొన్ని నెలలపాటు

పైడితల్లికి ఇదే పని. జంగిడితో బజారుకెళ్లేముందూ, వచ్చేముందు కరణంగారింటికెళ్లేది. వారి మనవడికి పొట్టనిండా పాలిచ్చేది.

అలా కరణంగారి కోడలితో మొదలెట్టిన పైడితల్లి మా ఊళ్లో తల్లిపాలకు నోచని అమ్మలెందరికో ఆప్తురాలయింది. స్కూలు మేస్టారు బక్క కన్నారావుగారి కూతురు ప్రమీల పురిటికొచ్చి బంగారంలాంటి ఆడపిల్లను కన్నది. పాలు మాత్రం పైడితల్లే ఇవ్వాల్సొచ్చింది. కిరాణా వ్యాపారి చుక్కా సీతయ్య గారి మనవరాలు, కాంట్రాక్టరు పార్వతీశం గారి మేనల్లుడు, కర్రల డిపో గనర్రాజుగారి తమ్ముడి బిడ్డ... పైడితల్లి చనుబాల పుణ్యమానే బతికి బట్టకట్టేరు. నవ్వనోళ్లే దిష్టికొట్టేరు.

అదేం మహాత్యమో. ఆమె దగ్గర పాలు తాగిన పిల్లగాళ్లంతా గుండ్రాయిల్లా ఉండేవారు. మావూళ్లో ఒకానొక కాలంలో పిల్లలెవరికయినా పుట్టనియ్యండి. పాలు మాత్రం పైడితల్లివే అన్నట్టుగా వ్యవహారం సాగింది. ఇందువల్లే మా ఊరి జనం పైడితల్లిని ఆ పేరుపెట్టి పిలవడం మానేసేరు. పాలమ్మ అని పిలవడం మొదలెట్టేరు. ఆ పేరే ఆమెకి స్థిరపడిపోయింది.

• • •

కాలచక్రం గిర్రుగిర్రుమని తిరిగిపోయింది. ఆ దెబ్బకి పాలమ్మ డెబ్బయ్యో పడిలో పడిపోయింది. దాని పిల్లలు పెద్దోళ్లయ్యారు. ఎవరిదారి వాళ్లు చూసుకున్నారు. భర్త నరసింగడు కాలం చేస్సేడు. ఒకవైపు పెద్ద వయసు... మరోవైపు మాట వినని పిల్లలు... ఇలా అన్నీ కలిసి పాలమ్మ ఆరోగ్యాన్ని గుల్ల చేస్సేయి. చివరి రోజుల్లో క్షయవ్యాధితో మంచం పట్టేసింది. నేడో రేపో అన్నట్టుంది.

పాలమ్మ మంచితనం ఊళ్లో అందరికీ తెలుసు. అందుకే పెద్దలూ పిన్నలూ కడసారి చూపుల కోసం ఆడుండే పూరింటికొచ్చేరు. మంచం చుట్టూ చేరేరు. జబ్బుపడ్డాక పాలమ్మ పాలమ్మలా లేదు. ఏనుగులాంటి మనిషి ఎలకయింది. మాట కూడా హీనపడిపోయింది. ఇంతమందిని చూసేక కొంచెం బలం వచ్చినట్టుంది. మెల్లగా గొంతు విప్పింది.

'బాబూ! నానొక్కటే సెబుదామనుకుంతన్నాను. కోప్పడిపోకండేం' అంది.

'అయ్యో అదేం మాట. నువ్వేం చెప్పినా ఫరవాలేదు' అన్నాడు ఊరి ప్రెసిడెంటు బుల్లబ్బాయి.

'నానో కోరిక కోరతాను. తీరస్తారా' అనడిగింది.

'ఎప్పుడూ ఏటీ కోరనువ్వు ఈ టయంలో ఏటడిగినా మాకేటి నొప్పేటి. తప్పకుండా తీరిసెస్తాం. బేగి కోరి.' అన్నారు మునసబు కర్రి పార్వతీశం.

పాలమ్మ మొదలెట్టింది.

'పుట్టినకాణ్ణుంచి సచ్చేదాకా పాలు మడిసికి ఎంత అవుసరమో నాకు బాగా తెలుసు. అయి తల్లిపాలవనీండి. ఆవు పాలవనీండి. గేదపాలవనీండి. గొప్పయే. అందిడే మరి. అయి వనికిరాకండా పోతే నాకు మాసెడ్డ బాద. ఆ బాత్తోనే పొషులు బరితే ఆల్ల పిల్లలికే పాలిచ్చేసీదాన్ని. బాబయ్యల్లారా! నాను రమారమీ అరవయ్యేళ్లనించీ సూస్తన్నాను. మనూరి సివుడి కోవిల్లో పాలు పాడయి పోయాయంతగా ఎక్కడా పాడవ్వమో. అబిసేకమంటారు. శేర్లకి శేర్ల పాలు తెచ్చి లింగం మీద ఒంపేడవే. సివరాతిర్నాడు, సోంవారాలు అయితే మరీని. ఆ పాలన్నీ ఉన్నగలిపోయి గుడెనక కల్వగాతలో సేరిపోతన్నాయి. అలా పాలని పారబోసీకండా ఆట్నే నాలాంటి నాదారోల్లకి పంచిపెడితే ఎంత నాబమో.' ఆగకుండా మాట్లాడుతూ పోతున్న పాలమ్మను దగ్గుతెర కమ్మేసింది. ఉక్కిరిబిక్కిరైపోయింది. కాసేపు ఉస్సు ఉస్సు అనుకుంటూనే మళ్లీ చెప్పనారంభించింది.

**'బాబూ! నానొక్కటే సెబుదామనుకుంతన్నాను. కోప్పడిపోకండేం' అంది.**

**'అయ్యో అదేం మాట. నువ్వేం చెప్పినా ఫరవాలేదు' అన్నాడు ఊరి ప్రెసిడెంటు బుల్లబ్బాయి.**

'నాసూ బత్తురాల్నే. బత్తుంటే నీల్లోసి సివుడికి అబిసేకం సెయ్యండి. మారేడు పత్తిరెట్టి పూజ్జెయ్యండి. ఆ దరమపెబువు వొద్దంటాడేటి. పాలని మాతరం అనానసరంగా నాసినం సేసీకండి. నా మీద మీకు కనికారముంటే, నా పాలు తాగి బతికిన పిల్లాజెల్లామీద అబిమానముంటే నా మాటని నిజం సెయ్యండి. మనూరి దేవుడికి పాలతో అబిసేకం ఈ పొద్దునుంచీ మానీయండి. ఇంతకన్నా నాను సెప్పేదేటీ నేదు..' అంటూ పెద్ద ఊపిరొకటి తీసింది. కనుగుడ్లు తిరగేసింది. ప్రాణం వదిలేసింది.

మంచం పక్కనున్న పాలమ్మ పిల్లలు ఘొల్లుమన్నారు. ఊరిజనమంతా భోరుమన్నారు.

పాలమ్మని పద్ధతి ప్రకారం దహనం చేసేరు. అప్పుడే గ్రామ పెద్దలంతా ఓ మాటనుకున్నారు.

'పాలమ్మ మనూరి పిల్లలెందర్నో బతికించింది. మంచో చెడ్డో అది చెప్పినట్టే చేద్దాం. దాని ఆఖరి కోరిక తీర్చేద్దాం'... తీర్మానించారు.

పెద్దమనుసున్న కోవెల పూజారి వెంకటాచలం గారు కూడా ఇందుకు సరే అన్నారు. చిత్తశుద్ధి ఉంటే చాలన్నారు. శివపూజ ఎలాగయినా చెయ్యొచ్చన్నారు.

నాటి నుంచీ మా ఊరి శివలింగానికి క్షీరాభిషేకం లేదు. ఎత్తిగట్టేసేరు. విరూపాక్షస్వామికి ఎన్ని పూజలు చేసినా అవన్నీ నీళ్లతోనే. దేవుడికి పాలు ధారపోయాలనుకునే వాళ్లంతా ఊళ్లో ధర్మాసుపత్రికెళిపోతారు. అక్కడి రోగుల గ్లాసుల్లో పాలు పోసేసి వస్తారు. ఎంతో కాలం నుంచీ ఇదే పద్ధతి. ఇప్పటికీ ఎలాటి మార్పూ లేదు.

తనకి పాలస్నానం లేకుండా చేసిన పాలమ్మకి మా ఊరి దేవుడు స్వర్గాన్నిచ్చాడో నరకాన్నిచ్చాడో మాకైతే తెలీదు. కానీ ఒక్కటి మాత్రం మాకు తెలుసు. క్షీరాభిషేకాన్ని నిషేధించినందుకు మావూరి శివయ్య మా మీద ఏ మాత్రం కోప్పడలేదు. కసినం అలగనూ లేదు. ఎందుకంటే... ఎక్కడ ఎన్ని కాటకాలొచ్చినా మా పల్లెకు మాత్రం నాడూ నేడూ కూడా కరువన్నదే లేదు. వానలు పడుతూనే ఉన్నాయి. చెరుకులు ఇమ్ముగా పండుతూనే ఉన్నాయి. పాడి పెరుగుతూనే ఉంది. పాలు పొంగుతూనే ఉన్నాయి. ఊరి అమ్మల గుండెలు నిండుతూనే ఉన్నాయి. కావలసినన్ని చనుబాలు పసిపిల్లలకి అందుతూనే ఉన్నాయి. పాలమ్మ జ్ఞాపకాలు అందరి హృదయాల్లోనూ పదిలంగా మెదులుతూనే ఉన్నాయి. అంచేత, పాలమ్మే ఎప్పటికీ మావూరి పెద్దమ్మ.

# కాళోజీ సమగ్ర దర్శనం



ప్రజాకవి కాళోజీ
(సాహిత్య సమాలోచన)
సంపాదకులు:
డా॥ గంటా జలంధర్ రెడ్డి
పేజీలు: 632; వెల: ₹ 300
ప్రతులకు: ప్రముఖ పుస్తక దుకాణాలు

భిన్న భావాలు, ఆలోచనలు సంఘర్షించే... నిత్య చైతన్యంతో తొణికిసలాడే తెలంగాణ స్వభావానికి ప్రతీక ప్రజాకవి కాళోజీ.

గాంధేయవాదం, సామ్యవాదం, పౌరహక్కులు, నక్సలైట్ ఉద్యమం, ప్రత్యేక తెలంగాణ ఉద్యమం... ఇవన్నీ ఆయనపై ప్రభావం చూపాయి. మళ్లీ ఆ ఉద్యమాలు కాళోజీ ఆచరణతో, ఆయన స్ఫూర్తిదాయకమైన కవిత్వంతో పదునెక్కాయి. ఓరుగల్లు గడ్డపైనే పుట్టి ప్రభుధిక్కారాన్ని ప్రదర్శించిన పోతనను గుర్తుకు తెచ్చేలా నిజాం పాలనపై కలం దూసి ఎన్నిసార్లు ఆ ప్రభుత్వ ఆగ్రహానికి గురైనా చెక్కుచెదరని ధీరత్వాన్ని ప్రదర్శించాడు. ఎమర్జెన్సీ కాలంలో జరిగిన అకృత్యాలను ఆ చీకటిరోజుల్లోనే నిరసించాడు. ఉద్యమాల్లో ఉంటూనే కవిగా, అనువాద కవిగా, రచయితగా ఆయన సాహిత్య సృజన అపారమైనది. అలాంటి కాళోజీని 'ప్రజాకవి కాళోజీ సాహిత్య సమాలోచన' సంపూర్ణంగా ఆవిష్కరించింది. ఇందులో 32 మంది కవులు, రచయితలు, విద్యావేత్తలు చేసిన ప్రసంగాలు... శిఖర సమానుడైన కాళోజీని భిన్న పార్శ్వాల్లో ఆవిష్కరించగలిగాయి. కవిగా, కథకుడిగా, తాత్వికుడిగా కాళోజీ తన చుట్టూ ఉన్న సమాజాన్ని అవగాహన చేసుకున్న తీరును, ఆ అవగాహనలోని లోతుపాతులను చర్చించాయి.

ఆంధ్రప్రదేశ్‌గా ఏర్పడిన తొలినాళ్లలోనే సాహిత్య, సాంస్కృతిక, భాషా రంగాల్లో కనిపిస్తున్న అవాంఛనీయ ధోరణులను పసిగట్టి ఆదిలోనే వాటిని ప్రశ్నించాడు. ఆ హెచ్చరికలపై మనసుపెట్టి సరిదిద్దుకుని ఉంటే, వివక్షాపూరిత వైఖరులను విడనాడితే బహుశా చరిత్ర మరోవిధంగా ఉండేదేమో!

తన అస్తిత్వం కోసం తెలంగాణ మరోసారి పోరాడుతున్న దశలో కాళోజీ సమగ్ర దర్శనాన్ని అందజేసిన ఈ సాహిత్య సమాలోచన సంపాదకులు గంటా జలంధర్‌రెడ్డి అభినందనీయులు.

• సుచిత్రా వేణుగోపాల్

# సాదాసీదా పరిమళం



పరిమళం (కథలు)
రచన: కోపూరి పుష్పాదేవి
పేజీలు: 151, వెల: ₹ 80
ప్రతులకు: కె.రామచంద్రరావు, జయరామ్ స్ట్రీట్, వాగు సెంటర్ విజయవాడ - 520 009

కథ అనగానే కల్పితం అనుకొని నిజ జీవితంలో లేనివి రాస్తుంటారు కొందరు. రోజూ చూస్తున్న వ్యక్తుల్ని, వాళ్లను నడిపే శక్తుల్ని కథలుగా మలుస్తారు ఇంకొందరు. ఈ రెండో కోవకు చెందినవారే కోపూరి పుష్పాదేవి.

టైటిల్ స్టోరీ 'పరిమళం' మొదలు చివరి కథ 'డోపిడీ'వరకూ సాదాసీదాగా కనిపిస్తూనే వ్యవస్థలోని లొసుగుల్ని ఉతికేస్తాయి. ఆశకు, ఆశయానికి మధ్యగల విభజనరేఖను నలిగే మధ్యతరగతి జీవులు 'ఆశయం'లో కనిపిస్తే, వైకల్యం కన్నా పరాధీనతే ఘోరమైందని 'గడ్డకట్టిన మౌనం' చాటుతుంది. అయితే, తన ఆదర్శానికి తగినవాడి కోసం నిరీక్షిస్తున్న అమ్మాయికి అవే ఆలోచనలున్న అబ్బాయి తారసిల్లిన వైనం, సంభాషణలు అతకలేదు.

• వేగి రామచంద్రరావ్

# అమెరికా ఆర్థిక స్థితికి అద్దం



సమాధిలోకి
సామ్రాజ్యవాదం
రచన: డి.పాపారావు
పేజీలు: 316
వెల: ₹ 200
ప్రతులకు: ప్రముఖ పుస్తక కేంద్రాలు

అమెరికా ఆర్థిక సంక్షోభం నేపథ్యంలో డాలర్ పతనం ప్రభావమే బంగారం ధర పెరగడానికి కారణమనీ, పలు దేశాల్లో నెలకొన్న ప్రజోద్యమాల్నిర్వాణాం ముప్పును తట్టుకుని నిలబడేది కాబట్టే బంగారం ధరకు రెక్కలు వచ్చాయనీ వివరిస్తారు రచయిత.

2008 సెప్టెంబర్ ఆర్థిక సంక్షోభం తర్వాత నెలకొన్న/నెలకొనబోతున్న పరిణామాలపై ఆర్థిక శాస్త్రం అంటే తెలియని వారు కూడా అర్థం చేసుకునే రీతిలో కథనాలున్నాయి. అంతర్జాతీయ ఆర్థిక పరిస్థితులపై ఆసక్తి ఉన్న వారంతా చదవదగినది.

• పెమ్మరాజు

## ఎక్నాలెడ్జ్‌మెంట్

**తెలుగు కథ- దళిత, మైనారిటీ, గిరిజన, బహుజన జీవితం (వ్యాసాలు)**
**సంపాదకులు: డా॥ వి.ఆర్.రాసాని**
పేజీలు: 180; వెల: ₹ 70
ప్రతులకు: డా॥ కె.ఉమాదేవి, 16-2a/17, బాలాజీ రెసిడెన్సీ, మునిరెడ్డినగర్, తిరుపతి పడమర - 02

**భావ ప్రయోగ**
**రచన: పేరం జయశీలరావు**
పేజీలు: 232; వెల: ₹ 180
ప్రతులకు: రుత్విక్ ఫౌండేషన్, 39-8-39/2, సెక్టార్-8, మురళీనగర్, విశాఖపట్నం-530007

**జలగీతిక (పద్యాలు)**
**కవి: లంగర వరప్రసాదరావు**
పేజీలు: 72; వెల: ₹ 50
ప్రతులకు: కవి, రాఘవ పుటీవేర్, రామయ్యతోట, బందరు రోడ్డు, విజయవాడ-520007

**సుమధుర మాలికలు**
**రచన: అబ్బూర్ కరీం**
పేజీలు: 136; వెల: ₹ 20
ప్రతులకు: రచయిత, ఇం.నం.1-48/1, కల్వకుర్తి, మహబూబ్‌నగర్

**తెలంగాణ ఆణిముత్యాలు (సంక్షిప్త పరిచయం)**
**సంకలనం: డా॥ జి.దామోదరరావు**
పేజీలు: 108; వెల: ₹ 60
ప్రతులకు: ఆహ్లాదసుందర నిలయం, ఇం.నం.8-2-379, భరత్‌నగర్, శివాలయం దగ్గర, కరీంనగర్-505001

**తరేజ గీతం - చైతన్య దీపం**
**రచన: నెల్లిమర్ల లక్ష్మి**
పేజీలు: 72; వెల: ₹ 60
ప్రతులకు: శ్రీసెంట్ పబ్లికేషన్స్, 29-25-43ఎ, వేమూరివారి వీధి, సూర్యారావుపేట, విజయవాడ-2

**బాలల పల్లకిని (వ్యాసాలు)**
**రచన: ఆర్.వెంకటరెడ్డి**
పేజీలు: 88; వెల: ₹ 40
ప్రతులకు: మంచిపుస్తకం, 12-13-439, వీధి నం.1, తార్నాక, సికింద్రాబాద్-17

**ఒక స్థితప్రజ్ఞుని జీవిత చరిత్ర**
**రచన: మిట్టపల్లి విఠలాచార్య**
పేజీలు: 100; వెల: ₹ 40
ప్రతులకు: రచయిత, 4-482/5, ఫ్లాట్ నం.78/బి, న్యూ బాలాజీ నగర్, మీర్‌పేట గ్రా., సరూర్‌నగర్ మం., రంగారెడ్డి-97

**అమరం (కవిత్వం)**
**సంపాదకుడు: డా॥ తంపల్లి శ్రీకాంత్**
పేజీలు: 78; వెల: ₹ 30
ప్రతులకు: సంపాదకుడు, 8-5-38, టీచర్స్ కాలనీ, మహబూబ్‌నగర్- 1

● ఆదర్శం



# మీ ఇంటి వృథా... ఇంకొకరి అవసరం

**ఇతరులకు సాయపడటం మనిషి గొప్ప లక్షణం కాదు... మంచి లక్షణం. అది మనకు సహజంగా అలవడాల్సిన గుణం. కారణమేదైనా ఆ గుణం చాలామందిలో అంతరించిపోతోంది. కానీ కొందరిలో ఇంకా బతికేవుంది. తను సాయపడటమే కాకుండా వందలు, వేల మంది చేత ఆ పని చేయించ గలిగాడో వ్యక్తి. లక్షల మందికి ఉపయోగపడ్డాడు. పేద భారతీయుల గౌరవాన్ని పెంచాడు. ఆ చురుకైన యువకుడు... అన్షు గుప్తా.**

ప్రస్తుత కాలంలో ఎవరి పని వారు చూసుకోవడానికే సమయం సరిపోవట్లేదు. ఢిల్లీకి చెందిన అన్షు గుప్తా కూడా ఒకప్పుడు అలాంటి ఉద్యోగే. మాస్ కమ్యూనికేషన్స్ చదివి, పాత్రికేయుడిగా పనిచేస్తుండేవాడు. వృత్తిలో భాగంగా ఎందరినో కలిసేవాడు, రకరకాల జీవితాలను ప్రత్యక్షంగా చూసేవాడు. 1999లో ఓ రోజు శ్మశానం చుట్టూ తిరుగుతున్న ఓ వ్యక్తితో మాట్లాడాడు. దేనికోసం ఇక్కడ తిరుగుతున్నావు అంటే 'చలి కాలంలో కప్పుకోవడానికి బట్టలు లేవు. ఈ శవాల మీద ఉంటాయి కదా వాటిని తీసుకెళ్లడానికి వచ్చాను' అన్నాడతను. అన్షుకు ఆశ్చర్యమేసింది. ఇలాంటి జీవనాన్ని సాగిస్తున్నవారు కూడా ఉన్నారా అనిపించింది. వెంటనే కొన్ని గ్రామాలకు వెళ్లి అక్కడి పేదల పరిస్థితిని గమనించడం మొదలెట్టాడు అన్షు.

కూడు, గూడు, గుడ్డ మనిషికి కనీస అవసరాలు. చిన్న గుడిసె వేసుకుని గూడు అని సరిపెట్టేసుకుంటారు. రోజూ కూలీతో తిండి దొరుకుతుంది. కానీ, డబ్బులు పెట్టి బట్టలు కొనుక్కోవడం చిన్న విషయం కాదు వారికి. ఇంకా చెప్పాలంటే, మంచి బట్టలు వేసుకోవడమన్నది చాలామందికి కల. అన్షు ఆ విషయాన్ని గమనించాడు. అలాంటి వారి కలను నెరవేర్చడం కోసం 'గూంజ్'ను నెలకొల్పాడు.

మొదట తన ఇంట్లో ఉన్న పాత బట్టలన్నీ మూటగట్టాడు. మిత్రుల నుంచి చిరుగులు లేని పాత దుస్తులన్నీ సేకరించాడు. అలా సమకూరిన 67 జతల బట్టలు తీసుకెళ్లి పేదలకు పంచాడు. ఒక్క రోజు కాదు, తన సంస్థ తరఫున నిరంతరం ఇలా చేస్తూనే ఉన్నాడు. తన లక్ష్యం కోసం ఉద్యోగం కూడా మానేశాడు.

**అన్ని నగరాల్లో సేకరణ కేంద్రాలు**

గూంజ్ కార్యాలయం హైదరాబాద్ సహా దేశంలోని పలు నగరాల్లో సెంటర్లు ఏర్పాటుచేసింది. ఎవరైనా తాము వాడని పాత దుస్తులను ఆ కార్యాలయాల్లో అప్పగిస్తే వాటిని చక్కగా తయారుచేసి పేదలకు పంచుతారు. చాలామంది పాత బట్టలు ఇవ్వమంటే ఇంట్లో ఉన్న అన్ని రకాల బట్టలను తీసుకెళ్లి పడేస్తుంటారు. అలా చేయొద్దు అంటున్నారు అన్షు. 'మీ సాయం ఎవరికైనా ఉపయోగపడాలంటే చిరిగిన దుస్తులు ఇవ్వకండి. మరొకరు గౌరవంగా వేసుకునే స్థితిలో ఉన్నవాటినే ఇవ్వండి' అని కోరుతున్నారు.

**హైదరాబాద్‌లోని గచ్చిబౌలిలో గూంజ్ ఆఫీసు ఉంది. ఒకవేళ ఏ నగరం లోనైనా సేకరణ కేంద్రం లేకపోతే ఆసక్తి ఉన్న వారు ఈ సేవలో భాగస్వాములై ఒక కార్యాలయం తెరవొచ్చు. విరాళాలు, వస్తువులు ఇవ్వాలనుకున్నా, సమాచారం కావాలన్నా, 9550274637, 9640433473 నంబర్లను సంప్రదించొచ్చు. వెబ్‌సైట్: www.goonj.org**

ఏ ఇంట్లో అయినా ప్రతి సంవత్సరం మిగిలేది బట్టలే. సైజు పెరగడం, కొత్త ఫ్యాషన్లు రావడం, కొత్త దుస్తులు కొనుక్కోవడం వంటి వాటివల్ల పాత దుస్తులను పక్కన పడేస్తుంటారు. అయితే అవి, మరికొందరికి ఉపయోగపడవచ్చు. కేవలం దుస్తులే కాదు... పాత్రలు, పాత కంప్యూటర్లు, పాతపేపర్లు, ఫర్నిచర్ ఇలా ఏదైనా ఈ సంస్థకు ఇవ్వొచ్చు. అయితే అవి తప్పకుండా మంచి స్థితిలో ఉండాలి.

**వస్తువులే ఇవ్వాలా?**

దుస్తుల్ని సేకరించాక వాటిని నవీకరించాలి. ప్యాక్ చేయాలి, రవాణా చేయాలి. వీటన్నింటికీ కాస్త ఖర్చవుతుంది. కాబట్టి ఎవరైనా విరాళాలిస్తే గూంజ్ స్వీకరిస్తుంది.

ఎన్నో జాతీయ, అంతర్జాతీయ సంస్థలు 'గూంజ్' సేవల్ని కొనియాడాయి. ఇండియా ఎన్జీవో ఆఫ్ ది ఇయర్ (2008), జమ్నాలాల్ బజాజ్ అవార్డ్, ఫోర్బ్స్ నుంచి మోస్ట్ పవర్‌ఫుల్ రూరల్ సర్వీస్ గుర్తింపు, వరల్డ్ బ్యాంకు గ్లోబల్ డెవలప్‌మెంట్ మార్కెట్‌ప్లేస్ అవార్డ్, దుబాయ్ వస్త్ర సమ్మాన్ అవార్డ్ వంటి పురస్కారాలు ఈ సంస్థను వరించాయి. భారతీయులకు ప్రాణం కన్నా గౌరవం ముఖ్యం. ఆ గౌరవాన్ని అక్షరాలా నిలబెట్టిన వ్యక్తి 'క్లోత్ మ్యాన్' అన్షు గుప్తా!

● చిమ్మల ప్రకాష్

● ఈ నలుగురు

### Icon of the Week

**పేరు : పాకాల తిరుమలరెడ్డి (1915-1996)**
**ఊరు : అన్నారం, కరీంనగర్ జిల్లా**
**సందర్భం: వర్ధంతి (అక్టోబర్ 21)**

సృజన, ఊహల సమ్మేళనమైన చిత్రకళలో అంతర్జాతీయంగా రాణించడమంటే అంత తేలిక కాదు. కారణజన్ములకే అది సాధ్యం. దానిని సాధించిన తెలుగువాడు పాకాల తిరుమలరెడ్డి.

- ప్రఖ్యాత 'జె.జె.స్కూల్ ఆఫ్ ఆర్ట్'లో చిత్రకళలో డిప్లొమా పొందారు.
- మోడర్న్ ఆర్ట్‌ని ఇండియాకు పరిచయం చేసిన వారిలో ఒకరు. బాంబే కాంటెంపరరీ ఆర్టిస్ట్స్ గ్రూప్‌ను ప్రారంభించారు. వీరిని యంగ్ టర్క్స్ అని పిలిచేవారు.
- తెలంగాణ జీవన చిత్రాన్ని తన కళతో ప్రపంచానికి చూపించారు. కర్రతో, రాతితో ఆయన అద్భుతమైన శిల్పాలు సృజించారు.
- ఢిల్లీ, ముంబై, లండన్ తదితర నగరాలతో పాటు ప్రపంచంలోని పలు దేశాల్లో తన చిత్ర ప్రదర్శనలను నిర్వహించారు.



### Another Mahatma

**పేరు : అష్ఫాకుల్లా ఖాన్ (1900-1927)**
**ఊరు: షాజహాన్‌పూర్, ఉత్తరప్రదేశ్**
**ప్రత్యేకత: యువ స్వాతంత్ర్యోద్యమ వీరుడు**

స్వాతంత్ర్య సమరయోధుడు. బ్రిటిష్ పాలకుల చేతిలో చనిపోతూ... దేశం కోసం మరణిస్తున్న తొలి ముస్లిం తనే అయినందుకు ఎంతో గర్వించాడు.

- సహాయ నిరాకరణోద్యమం జరిగినప్పుడు పాఠశాలలో ఉన్నారు. ఉద్యమాన్ని గాంధీ అర్ధాంతరంగా ఆపినపుడు నిరాశ చెందారు. అందుకే అతివాదులతో చేతులు కలిపారు.
- కాకోరీ రైలు దోపిడీ చేసిన బృందంలో ఒకరు. కొన్నాళ్ల తర్వాత స్నేహితుడు రాంప్రసాద్ దొరికారు కానీ అష్ఫాకుల్లా తప్పించుకున్నారు. చివరకు ఓ స్నేహితుడు మిత్ర ద్రోహానికి పాల్పడి పాలకులకు పట్టించాడు.



- హజ్రత్ అనే కలం పేరుతో ఉర్దూలో కవితలు రాసేవారు.
- ఉరికంబం ఎక్కేటపుడు 'ఈ దేశం కోసం ఊపిరి వదులుతున్న మొదటి ముస్లింగా నేను గర్విస్తున్నాను' అన్నారు. అవే ఆయన చివరి మాటలు.

### Better half



**పేరు: నైనా మిట్టల్**
**w/o : సునీల్ మిట్టల్**
**ఊరు : ఢిల్లీ**

భారతీ ఎయిర్‌టెల్ అధినేత సునీల్ మిట్టల్ భార్య నైనా. దేశంలో టాప్-10 కోటీశ్వరుల్లో ఒకరైన సునీల్‌కు తగిన జోడీ అనిపించుకున్నారామె.

- ఉన్నత విద్యావంతురాలు. లండన్‌లో పీజీ చేశారు.
- పాతికేళ్ల తన వైవాహిక జీవితంలో నైనా మీడియాలో కనిపించింది చాలా తక్కువ. ముఖ్యమైన పార్టీల్లో తప్ప ఇంకెక్కడా ఆమె కనిపించరు.
- అచ్చమైన గృహిణిలా ఉండటానికి ఇష్టపడతారు. కుమార్తె ఈషా, కుమారులు కవిన్, షర్విన్ (కవలలు)లే ఆమె ప్రపంచం.
- తన వ్యాపారాలకు సంబంధించి తీసుకున్న కీలక నిర్ణయాల్లో ఎక్కువశాతం ఇంట్లో భోంచేసేటప్పుడు తీసుకున్నవేనంటారు సునీల్. వ్యాపార విషయాల్లో నైనా చాలా మంచి సలహాలు ఇస్తారని పలు ఇంటర్వ్యూల్లో చెప్పారాయన.
- పలువురు విదేశీ రాజకీయవేత్తలు మిట్టల్ ఇంటి ఆతిథ్యం గురించి గొప్పగా చెబుతుంటారు. వారి ప్రశంసలకు తన భార్యే అర్హురాలు అంటారు సునీల్.



### Our pride

**పేరు: మధుర్ జాఫ్రే**
**ఊరు: ఢిల్లీ**
**ప్రత్యేకత: ఇంటర్నేషనల్ కుకరీ రైటర్**

పలు భారతీయ వంటకాలను విదేశీయులకు పరిచయం చేసిన ఘనత మధుర్ జాఫ్రేది.

- 1933లో ఢిల్లీలో జన్మించారు. ఢిల్లీ యూనివర్సిటీలో చదువుకున్నారు.
- ఆల్ ఇండియా రేడియోలో కొంతకాలం పనిచేశారు. నటుడు సయీద్ జాఫ్రేను పెళ్లాడాక న్యూయార్క్‌లో స్థిరపడ్డారు.
- షేక్స్‌పియర్‌వాలా, ది గురు, ఆటోబయోగ్రఫీ ఆఫ్ ప్రిన్సెస్, ది పర్‌ఫెక్ట్ మర్డర్, సిక్స్ డిగ్రీస్ ఆఫ్ సెపరేషన్ వంటి సినిమాల్లో నటించారు. ఏబీసీడీ అనే సినిమాను నిర్మించారు.
- నటిగా కంటే వంటల పుస్తకాల రచయితగా మంచి గుర్తింపు సాధించారు. యాన్ ఇన్విటేషన్ టు ఇండియన్ కుకింగ్, టేస్ట్ ఆఫ్ ఇండియా, అల్టిమేట్ కర్రీ బైబిల్, 100 ఎసెన్షియల్ కర్రీస్ (ఇది లేటెస్ట్) వంటి పుస్తకాల ద్వారా వందల భారతీయ రుచులను ప్రపంచానికి పరిచయం చేశారు. కుకరీ బుక్స్‌తో పాటు ఇతర పుస్తకాలనూ రాశారు.
- నటిగా, రచయితగా ఆమెను పలు అంతర్జాతీయ అవార్డులు వరించాయి.

ఇంటర్వ్యూ

కలం అందరూ పట్టగలరు.
అయితే పట్టినవారందరూ కవులు కాలేదు.
కానీ దానయ్య అయ్యారు.
ఎక్కడో మారుమూల గ్రామంలో పుట్టి, పేదరికంలో
పెరిగి, కసితో కలం పట్టిన ఆయన కవితలు రాశారు.
రెండు వందలకు పైగా సినిమా పాటలు రాశారు. కానీ
ఇప్పటికీ తగిన గుర్తింపు కోసం తపన పడుతూనే
ఉన్నారు. తన ఒడిదుడుకుల ప్రస్థానం గురించి
బండారు దానయ్యకవి చెప్పిన మాటలు...



# పల్లవి నాది... చరణాలు వేటూరివి!

**పేరులోనే కవి అని పెట్టుకున్నారెందుకు?**
నేను రాసిన 'సిగ్గు-లజ్జ' కవితా సంకలనానికి మా గురువుగారు వేటూరి ముందు మాట రాశారు. అందులో ఆయన నన్ను 'కవి' అని సంబోధించారు. అందుకే నా పేరులో కవిని చేర్చుకున్నాను.

**మీరు వేటూరి శిష్యులా?**
ఏకలవ్య శిష్యుణ్ని. చిన్నప్పట్నుంచీ ఎన్ని పాటలు విన్నా, వేటూరిగారు రాసిన పాటలే నచ్చేవి. ఆయన సాహిత్యం వల్ల విపరీతంగా పెరిగిన ఇష్టమే నేను పాటల రచయితను కావడానికి కారణం.

**మీ బ్యాక్‌గ్రౌండ్ ఏమిటి? కలమెప్పుడు పట్టారు?**
మాది నల్లగొండ జిల్లా. మా అమ్మగారిది ఎల్లారెడ్డిగూడెం, నాన్నగారిది కీతవారి గూడెం. పెరిగిందంతా అమ్మ వాళ్ల ఊరిలోనే. బాగా అల్లరి చేసేవాణ్ని. నా ఆలోచనలు రాసి కవితలంటూ స్కూల్లో ఫ్రెండ్స్‌కి ఇచ్చేవాడిని. టీచర్లు తిట్టేవారు. కానీ మా తెలుగు మాస్టారు ఆచార్య నరసింహాచారి నన్ను ప్రోత్సహించి, వ్యాస రచన పోటీలకు పంపించేవారు. జిల్లా స్థాయిలో ప్రైజులు కూడా గెలుచుకున్నాను. పాటలు రాసి స్టేజీల మీద పాడేవాడిని. ఇంటర్ అయ్యాక నేను రాసిన 'గృహ హత్యలు' నాటకం రేడియోలో కూడా ప్రసారమయ్యింది.

**సినిమాలకు రాయాలని ఎందుకనుకున్నారు?**
మా నాన్న కూలిపని చేసేవారు. వచ్చిన కాస్తంత డబ్బుతోనే మమ్మల్ని పోషించేవారు. కానీ బంధువులు, స్నేహితులు మా పేదరికాన్ని అవహేళన చేసేవారు. పెళ్లిళ్లకు, ఫంక్షన్లకు వెళ్లినా అమ్మానాన్నలు ఓ మూల నిలబడటం నన్ను చాలా బాధించేది. ఆ బాధలోంచే డబ్బు సంపాదించాలన్న కసి పుట్టింది. ఏదో ఒకరోజు నా ఇంటికి ఇన్‌కమ్‌ట్యాక్స్ వాళ్లు, మీడియా రావాలి, ఆ స్థాయికి నేనెదగాలి అనుకున్నాను. దానికి సినిమాలు మంచి మార్గమని తోచడంతో డిగ్రీ అవ్వగానే హైదరాబాద్ వచ్చేశాను.

**అవకాశం త్వరగానే వచ్చిందా?**
లేదు. రెండేళ్లు పిచ్చిగా తిరిగాను. ఫలితం లేకపోవడంతో ఎమ్మే చేస్తూ ప్రయత్నాలు సాగించాను. ఓసారి రామానాయుడు స్టూడియోకి వెళ్తే, ఓ చెట్టుకింద కారులో వేటూరి కూర్చుని ఉన్నారు. పట్టలేని ఉద్వేగంతో వెళ్లి, ఆయన స్ఫూర్తితోనే రచయితను కావాలనుకుంటున్నానని చెప్పాను. తనను కలవడం వల్ల ఉపయోగం లేదని, ఓ దర్శకుడి దగ్గరకు పంపారు. అక్కడ అవకాశం దొరకలేదు కానీ, నా గురువు, దైవం వేటూరి ఇచ్చిన ప్రోత్సాహం నాలో ధైర్యాన్ని నింపింది.

**మరి తొలిపాట ఎప్పుడు రాశారు?**
ఓసారి ఒక ఆఫీసుకు వెళ్తే అక్కడ వెలిగొండ శ్రీనివాస్ ఉన్నారు. నా పాట విని వెంటనే ఒక నిర్మాతకు ఫోన్ చేసి చెప్పారు. దాంతో 'నువ్వంటే చాలు'కి రాసే చాన్స్ వచ్చింది. తర్వాత 'వియ్యాలవారి కయ్యాలు'కి రాశాను. అప్పుడో విచిత్రం జరిగింది. 'సూర్యుడే సరే అన్నాడే' పాటకు రెండు వెర్షన్స్ రాసిచ్చాను. నా పాట సెలెక్ట య్యింది. కానీ ఆ పాట పల్లవి మాత్రమే నాది, చరణాలు వేటూరి గారివి. ఆయన కూడా పాట రాశారట. కానీ నా పల్లవి బాగుందని అదే ఉంచమన్నారట. 'పాటకు తన పేరే వేయండి, పల్లవే కదా పాటకు మకుటం' అన్నారట. అంత గొప్పవారు! నాకైతే ఆనందంతో కన్నీళ్లు వచ్చేశాయి.

**ఇంతవరకూ ఎన్ని పాటలు రాశారు?**
రెండు వందలకు పైనే రాశాను. ఎవడిగోల వాడిదే, మహానంది, విక్రమార్కుడు, దొంగోడు, వీర, ఢమరుకం... ఇలా. ప్రస్తుతం కెవ్వు-కేక, దేవదాసు స్టైల్ మార్చాడు, ఇంద్రగంటి మోహనకృష్ణ సినిమాలకు పని చేస్తున్నాను.

**మీకు తగిన గుర్తింపు వచ్చిందంటారా?**
లేదనే చెప్పాలి. అవకాశాలు బాగున్నా గుర్తింపు అంతగా రాలేదు. మెల్లగా వస్తుందేమో మరి. బస్సు లోనో, రైల్లోనో ప్రయాణించేవారు త్వరగా గమ్యం చేరుకుంటారు. కాలినడకన వెళ్లేవారు కాస్త ఆలస్యంగా చేరుకుంటారు. నేను కాలి నడకన వెళ్తున్నాను. కాని ఆలస్యమైనా గమ్యం చేరుకునే తీరతాను.

**మీ తెలుగుతల్లి ఫౌండేషన్ గురించి చెప్పండి?**
తెలుగు భాషను కాపాడాలి, తెలుగువారి మధ్య సయోధ్యను కుదర్చాలి అన్న ఉద్దేశంతో ఈ ఫౌండేషన్‌ను స్థాపించాను. దీని ద్వారా సేవా కార్యక్రమాల్ని కూడా చేస్తున్నాను. నెలకు రెండుసార్లు అనాథాశ్రమాలకు వెళ్లి ఆహారం, దుస్తులు ఇస్తుంటాను. మా జిల్లాలో ఫ్లోరైడ్ సమస్యను పోగొట్టడానికి కూడా ప్రయత్నిస్తున్నాను.

**భవిష్యత్ ప్రణాళికలు?**
నా ఫౌండేషన్ సేవల్ని విస్తరించాలి. గొప్ప పాటలు రాయాలి. ప్రస్తుతం బతకాలి కాబట్టి రాస్తున్నాను కానీ తృప్తి లేదు. మంచి కాలం వస్తుంది. తెలుగు సినిమాలో సాహిత్యపు విలువ పెరుగుతుంది. ఆ రోజుకోసం ఎదురు చూస్తున్నాను.

● సమీర నేలపూడి

# గెలుచుకునే ఓటమి



ఇదంతా దసరా గురించిన ఆలోచనతో మొదలైంది. వేటిని చంపాలో, వేటితో సహజీవనం చేయాలో, వేటిని చంపినా, చంపకపోయినా ఫరవాలేదో!

అనేకానేక గతాల్ని... ఒకానొక వర్తమానంగా తర్జుమా చేస్తే-

• • •

అప్పటికి మాదిగ డప్పు మోగుతూవుంటుంది. 'పల్లె'మీంచి జనసందోహపు ధ్వని తెలుస్తూవుంటుంది. 'దసరా'ను చూడ్డానికి పొద్దు గూట్లో పడకముందే ఆవుల్ని గుట్టనుంచి కొట్టుకొస్తూవుంటాడు హన్మన్న.

"ఏ రాజా... ఇంట్లనేవి కదులవేమోయ్." ప్రేమతో కూడిన చిరుచిరుగు కేక.

ఊరికి వెళ్లినా ఊళ్లోకి వెళ్లని నన్ను ఊరిమధ్యవున్న మర్రిచెట్టు లాక్కెళ్తా నా బాల్యస్నేహితులు; బావయ్యా, ఎల్లెడ్డా, శ్రీనయ్యా!

దారివెంటా... 'మూడు బజార్ల' దగ్గరా... అరుగుల మీదా... లేత చిగుర్లలాంటి బాలికలు, నిండుగా పూసిన గుమ్మడిపువ్వంటి ముత్తయిదువలు, విధిగా పండక్కి పుట్టింటికి వచ్చే పరాయి ఊరి కోడళ్లు, దర్జీ పెట్టిన సబ్బుమార్కులు చెదరని కొత్తబట్టలు, కొత్తగా మీసం మొలుస్తున్న యువకులు... కుతూహలాలు, భయభక్తులు, కుశలప్రశ్నలు... అపురూపముల వెంకటేశంబావ జమ్మిచెట్టు పూజలు, 'బంగారం' సంపాదించినవాళ్ల చేతులు మార్చుకుంటూ ఇచ్చుకునే అలాయ్ బలాయ్‌లు, పెద్దవాళ్లకు పాదాభివందనాలు...

ఊరు ఊరంతా నెమ్మదిగా మర్రిచెట్టు దగ్గర గుమిగూడుతూ ఉంటుంది. బనీను తప్ప ఎన్నడూ అంగీ ధరించని 'పెదనాయిన' తెల్లకమీజు వేసుకునివుంటాడు. వీరభద్రాలు ధరించినవాళ్లు నిలువుబొట్లతో కుంకుమ ముఖాలైవుంటారు. 'నమ్మళ్ల సారక్క' ముందు చిరుమండిరి వేసి, కులపెద్దలందరికీ కంకణాలు కడుతూవుంటాడు కుమ్మరి లస్మయ్య. లాగు జేబులో దాచుకున్న అప్పాల ముక్కల్ని ఒకటొకటే నోట్లో వేసుకుంటూ కిట్రుమే కిట్రుమే అని పిల్లలు నములుతూ ఉంటారు.

పొలిమేరల్లో తమ జీవాలను మేపుకోనిస్తున్నందుకు పోలుగూరి గొల్లవాళ్లు సంతోషంగా ఊరికి పండగ కానుకగా పంపిన గొర్రెపిల్లను చాకలి మల్లయ్య సిద్ధంచేస్తూవుంటాడు. నీళ్లతో, కల్లుతో దాన్ని బలికి ఒప్పిస్తూవుంటాడు. తడిసిన దేహాన్ని 'జడిదిల్చి' అది ఎట్టకేలకు 'మే కొడుతుంది'.

బొప్పలో దాన్ని పడుకోబెట్టాక, తల తాడును లాగిపట్టాక, తెనుగోళ్ల దినదేవయ్య కత్తి ఎత్తుతాడు. అందరి ఊపిరి బిగిసిపోయివుంటుంది. కటుక్!

విజయోత్సాహం. ఎరుపెక్కిన కత్తి అంచును తాకుతూ పడుల చేతులు... కుంకుమ స్థానంలో నెత్తుటి తిలకాలు... దీన్ని ఒక గ్రామీణ వేడుకలో భాగంగా చూశానే తప్ప, ఇదొక అవాంఛనీయత అని ఎప్పుడూ అనుకోలేదు. ఒక్కసారికే తెగిందా, లేదా అన్నదే పాయింటు.

కానీ అలాంటిది-

• • •

మా చిన్నోడు పొద్దున్నే ఒక చీమను పాదాలతో మేటాడుతున్నాడు. నలిపేయబోతుండగా... 'ఏఏఏయ్‌య్‌య్'... కొట్టనూలేము, చూస్తూ ఊరుకోనూలేము.

సాధారణంగా పిల్లలకు దాన్ని హింసించొద్దని ఎవరమూ చెప్పివుండం. అయినా అలా చేస్తున్నారంటే అది మనిషి ప్రవృత్తిలోనే ఉందా? మనిషి సహజాతంగా అభిలషించేది దేన్ని మననివ్వకపోవడమేనా? అదే నిజమైతే జన ఎవరిని మాత్రం ఏమనగలం?

కానీ వయసో, విద్యలో తెచ్చిపెట్టిన 'కరుణ'(?) వల్ల, ఆ చిరుజీవి ప్రాణం పట్ల మన ప్రాణం కలుక్కుమంటుంది. దాని మీద ప్రేమ చూపే క్రమంలో పిల్లాడి మీద కోపాన్ని ప్రదర్శించాల్సి వస్తుంది. దానికి మళ్లీ మన మీద మనకే కోపం.

అసలు ఇలాంటి విషయంలో నేను నాకే ఒక దోషిగా నిలబడుతాను. ఎందుకంటే... నేనే ఈ చేతుల్తో కొన్ని పదుల సీతాకోకచిలుకల్ని చంపేశాను. ఏ సెలవుల్లోనో స్కూలునుంచి ఇంటికి వెళ్లినప్పుడు... ఎడ్లను మేపుతూ... కొన్ని వందల సీతలు పచ్చికలో కోరలు విడిచి, రెక్కలు చాచి, రంగురంగులుగా ఎగురుతుంటే... ములుగర్రను ఊపుతూ... ఉత్తినే! కుమిలి కుమిలి ఏడ్చి, ప్రాయశ్చిత్తం చేసుకోవాలనిపిస్తుంది. కానీ దుఃఖం రాదు.

మరి అలాంటప్పుడు-

• • •

'పశువుల అంగడి' ఐటెమ్ రాసిన తర్వాత... అందులో కొన్ని ఒక్కటిరెండు రోజుల్లో మాంసం కోసం కోయబడతాయని తెలిసీ నేను మామూలుగానే ఎలా ఉండగలిగాను? కనీసం ఆ పూట భోజనం కూడా మానలేదే! అదీ మాంసంతో తిన్నానే!

భోజనం వడ్డిస్తూ, "ఛీ... కప్పల్ని, పాముల్ని ఎలా తింటారో!" అన్న ఆశ్చర్యం ప్రకటించింది మా శాకాహార వదిన.

''కోళ్లనూ మేకల్నీ తిన్నట్టే!''

కొందరికి ఇష్యూ కోడి కావొచ్చు, కొందరికి కోడి కాకుండా ఆవు కావొచ్చు, ఆవు కానివాళ్లకు పుష్య కావొచ్చు... అంగీకారం అవడానికీ, కాకపోవడానికీ మధ్య ఉన్న పలుచటి అడ్డుతెర ఏమిటి? మనసు ట్యూన్ కావడమేనా?

అసలు మొక్కలకే ప్రాణం ఉందని తెలిసినప్పుడు... వాటినే నిర్దాక్షిణ్యంగా పీకో, వాటికి కాసిన పిల్లల్ని తరిగో... ఎలా తినేస్తున్నాం? అంటే... అంగీకార హింస, అనంగీకార హింస మాత్రమే ఉన్నాయితప్ప, హింస లేకపోవడమనేది లేనేలేదా? అలాంటప్పుడు నేను వాటికోసం ఏమీ ఫీల్ కాలేదే అన్న పశ్చాత్తాప భావనను ఎందుకు మోసుకు తిరగాలి?

సృష్టి యథాతథస్థితిని అంగీకరించేలా నన్ను పురిగొల్పుతున్న ప్రతిదీ... నన్ను దేన్నీ ప్రశ్నించలేని మౌనిగా నిలబెడుతోంది.

ఇంతసేపూ చంపడం గురించిన బాధ కదా... ఇప్పుడు చంపలేకపోయినందుకు.

• • •

వై.ఎస్.శర్మ ఇంటర్వ్యూకు వెళ్లొస్తూ... ఎర్రగడ్డ హోటల్లో భోజనానికి కూర్చున్నాను. ఎదురుగా ఒకతను. నా ఈడే.

నేను మీల్స్ చెప్పాను. తనూ మీల్సే అన్నాడు. ఇద్దరమూ పెరుగులో పంచదార వేయించుకున్నాం. ఇద్దరమూ పలకరించుకోవడానికి అనువైన ప్రతి కారణమూ ఉంది. భోంచేస్తున్నప్పుడు మా కళ్లు కలుసుకున్నాయి కూడా. కానీ ఏమీ మాట్లాడుకోలేదు. ఏదో ఒక అడ్డు. నిశ్శబ్దాన్ని ఛేదించే ఆయుధం లేనందువల్లో, మొదటి ఎత్తు ఎవరు వేయాలో తెలియకపోవడం వల్లో.

సూటిగా దృష్టి నిలపలేనప్పుడు... మధ్య మధ్య పక్కవాళ్ల ప్లేట్లని ఆరగించాం. చివరకు మాపీ తిని, బయటికి వచ్చేశాం. అపరిచితుల్లా ఎవరిదారిన వాళ్లం వెళ్లిపోయాం.

ఈ అనంతవిశ్వంలో ఆ ప్రత్యేక క్షణాన నాతో ఉన్న మనిషితో, ఒక మధ్యాహ్నపు ఆకలి భోజనంలో నాతో టేబుల్ పంచుకున్న ఆ వ్యక్తితో నాకు ఎందుకు సంబంధం ఏర్పడలేదు?

బేరర్ వచ్చి, ''బిల్... మీరు వేస్తారా?'' అన్నప్పుడు... ''వేస్తేరు కాదు,'' అనాలనిపించింది నవ్వొచ్చింది. కానీ వేస్తారే.

భోజనం తర్వాత అతడు ముట్టించిన సిగరెట్ వల్ల నా మనసూ చేదెక్కింది.

ఇదే పల్లెటూరి పాతకాలపు మనుషులైతే... చాలా సులువుగా ఒక సంబంధాన్ని నెలకొల్పుకుంటారు. కనీసం ఎదుటివారి అస్తిత్వాన్ని ఎరుక పరుచుకుంటారు.

''ఏ వూరయ్యా?'' అంటాడు కొత్త లింగయ్య తాత లాంటివాడైతే, కళ్లకు అడ్డంపడే ఎండపొడను చేత్తో అడ్డుకుంటూ.

ఆయనేదో చెప్తాడు. ఎప్పుడూ చూస్తేదంటాడీయన. ఫలానా జాగీరోళ్లు మాకు చుట్టాలేనంటాడాయన. నాయిన పేరేంది? పిల్లలెంతమంది? ఏం పండిస్తున్నారు? వర్షాలెలా ఉన్నాయి? ముచ్చటతో పాటుగా కష్టం, సుఖం... మార్చుకుంటారు. దాన్తో ఏం ఒరుగుతుంది, ఏం జరుగుతుంది,

ఈ అనంతవిశ్వంలో ఆ ప్రత్యేక క్షణాన నాతో ఉన్న మనిషితో, ఒక మధ్యాహ్నపు ఆకలి భోజనంలో నాతో టేబుల్ పంచుకున్న ఆ వ్యక్తితో నాకు ఎందుకు సంబంధం ఏర్పడలేదు?

దానికుండే అంతిమ ప్రయోజనమేమిటి... దేనికోసమూ నిమిత్తం ఉండదు. ఒక మనిషి వాళ్లను దాటుకుంటూ అపరిచితుడిగా వెళ్లడు. ఒక జీవన సౌందర్యం వాళ్ల చుట్టూరా... పొగమేఘంలా.

ఇది తెలిసీ, ఆ శూన్యపు వంతెనను నేను దాటలేకపోయానే! ఆ నిశ్శబ్ద రక్కసిని సంహరించలేకపోయానే! ఇందులో నాకేం పని అన్న ధోరణి ఉందా? నేనెందుకు తొలిగా పలకరించాలి అన్న అహం ఉందా? పేరు పెట్టలేని ఇంకో కొత్త భావనా? లేక, నగరజీవుల సహజ లక్షణమే ఇదా?

కొన్నింటిని ధ్వంసం చేసుకుంటూ వెనక్కి... వెనక్కి... వెనక్కి వెళ్తేగానీ, ఈ కాంప్లెక్సులు ఉండవేమో! అప్పుడుగానీ మనుషులం మామూలు మనుషుల్లా ఉండమేమో!

పారిశ్రామిక విప్లవానికి ముందు... రాజ్యాలు ఏర్పడటానికి ముందు... నాగరికత మొగ్గలేసిన తర్వాత... సమూహాలు గ్రామాలుగా స్థిరీకరణ జరిగిన తొలి దశలో... ఒక అద్భుత ప్రపంచం ఉండింది. అద్భుత మనుషులు అప్పుడు బతికారు. అద్భుతమైన మానవ సంబంధాలు అప్పుడుండేవి... ఆ కాలంలో ఆనందం... ఆనందం తప్ప మరొకటి లేదని నాకో ప్రగాఢ విశ్వాసం.

ఇది జరిగేంతవరకూ.

• • •

'ఎన్జీసీ'లో ఏదో ప్రోగ్రామ్ చూస్తున్నాను. మృగరాజు తన అధికారాన్ని ఎస్టాబ్లిష్ చేసుకునే తీరు గురించి. పోటీకి వచ్చిన సాటి సింహాన్ని తరిమికొట్టగలిగితే... ఒక నిర్దిష్ట పరిమితి మేరా ఆ అడవిలోనివన్నీ దాని సొంతం అవుతాయి. ఆడసింహాలతో సహా.

అప్పుడీ 'మృగరాజు' కొత్త రాణితో తన వారసుల్ని పెంపుచేయడానికి ఉపక్రమించే ముందు అది చేసే పని... ఆ ఆడసింహానికీ ఓడిపోయి పారిపోయిన మగసింహానికీ పుట్టిన పిల్లల్ని వెంటాడి వేటాడి చీల్చి చెండాడటం.

దీన్ని క్రూరత్వం అనాలా? ద్వేషమనాలా? అసూయనాలా? సహజాతం అనాలా? ప్రకృతి ధర్మం అనాలా?

సింహం ఏం నాగరికత సాధించిందని దానికి ఇలాంటి భావముంది? అంటే... అది దాని జన్యుల్లో ఉంది, దాని ప్రకృతిలో ఉంది, ఈ సృష్టిలోనే ఉంది. అలాంటప్పుడు ఈ ప్రకృతిలో భాగంగానే ఉద్భవించిన మనిషికి మాత్రం ఇవేవీ లేకుండా ఉండటం ఎలా సాధ్యం?

ఒక రంగంలో ఎంత గొప్పవాళ్లగానీ తనలోని అసూయనో, ద్వేషాన్నో ఎదుర్కోవడానికి తగినట్టి గాండీవం లేక విఫలమవుతారు. ఆ కారణంగా, సాధారణామోద తూకంరాళ్లు వేసినప్పుడు వాళ్ల ప్రతిభ తక్కువగా తూగుతుంది. కఠినాత్ములుగా ముద్రపడతారు. కానీ కొండంత మనిషి ఒక చిన్న ఫీలింగ్ వల్ల అల్లల్లాడాడంటే అతడు ఎంత సున్నితమైన మనిషై ఉండాలి!

తనను తాను పెంపుచేసుకుని, శిఖరసమానమై, అధిరోహించలేనంత ఎత్తున నిలబడే ఆయా ప్రతికూల భావనలతో, వాటిని జయించలేని మనిషి అశక్తతకూ, అలా నిర్దేశించిన సృష్టికర్త సృజనకూ... చేతులెత్తేస్తూ, చేతులెత్తి మొక్కేస్తూ...

● పూడూరి రాజిరెడ్డి

## ప్రేమచరణం

నీ ప్రణయభావం నా జీవరాగం
రాగాలు తెలిపే భావాలు నిజమైనవి
లోకాలు మురిసే స్నేహాలు రుజువైనవి
అనురాగ రాగాల స్వరలోకమే మనదైనది

## ముద్దు - ముచ్చట




గణితం:
రెండు పెదవుల మధ్య 'షార్టెస్ట్ డిస్టెన్స్'
ఎకనామిక్స్:
సప్లై కంటే డిమాండ్ అధికంగా ఉండేది.
ఫిజిక్స్:
రెండు మానవ శరీరాలను షార్ట్ టైమ్‌లో ఛార్జింగ్ చేసే పవర్‌ఫుల్ ప్రాసెస్.

## జానూ కాదు శ్రీను!

**అమ్మాయి:** హాయ్ జానూ!
**అబ్బాయి:** హాయ్
**అమ్మాయి:** నన్ను మరిచి పోయినట్టున్నావ్...దొస్తీగా కాల్ చేయడం లేదు.
**అబ్బాయి(షాక్):** అదేమిటి అయిదు నిమిషాల ముందే కదా మనం తెగ మాట్లాడుకున్నది!
**అమ్మాయి:** మై గాడ్.... నేను మాట్లాడింది నీతోనా? శ్రీనుతో అనుకున్నాను.



## తమ్ముడూ... జర చెక్ చేసుకో!



పడుకుందామంటే నిద్ర పట్టదు.
ఒళ్లంతా ఒకటే నొప్పులు.
కలవరింతలు.
ఆకలి కాదు.
**మైగాడ్...**
కొంపదీసి లవ్‌లో పడ్డానా ఏమిటి?
**రేపుటి రెస్పాన్స్:**
'వెధవ తెలివితేటలూ నువ్వూనూ!
డెంగ్యూ వచ్చినట్టుంది... వెళ్లి హాస్పిటల్‌లో బెడ్ వేయించుకో'

## ప్రేమలేక



నువ్వు లేనిది
నేను లేను
నా శ్వాసలో నీవే
నా రక్తంలో నీవే
నువ్వు లేనిది నిమిషం ఉండలేను
సారీ..
నేను మాట్లాడుతుంది నీ గురించి కాదు
ఆక్సిజన్ గురించి!

## ఆలీబాబా 40 దొంగలు

### ఎందుకో తెలుసా?

**అబ్బాయి:** ఒకప్పుడు ఆలీబాబా 40 దొంగలు. ఇప్పుడు ఆలీబాబా 30 దొంగలు అయ్యారు. ఎలా?
**అమ్మాయి:** ?! ?
**అబ్బాయి:** రిసెషన్ బాస్. కాస్ట్ కటింగ్‌లో భాగంగా 10 మంది దొంగలను తీసేశారు.

## సలక్షణమైన సెలెక్షన్!



ఒక అమ్మాయి నాకు ప్రపోజ్ చేసింది.
కానీ నేను తిరస్కరించాను.
దెబ్బడం మరిచాను.
'ఐ అప్రిషియేట్ యువర్ సెలెక్షన్' అని మాత్రం అన్నాను.
– కె.కోతలరాయ్, కొత్తగూడెం




''నాన్నా, నేనొకబ్బాయిని ప్రేమించాను'' అని అమ్మాయి వాళ్ల నాన్నకు చెబితే– ''ఎవడా ఇడియట్?'' అంటారు.
''నాన్నా నేనొక అమ్మాయిని ప్రేమించాను'' అని అబ్బాయి వాళ్ల నాన్నకు చెబితే– ''ఇడియట్, ఎవరా అమ్మాయి'' అంటారు.
**నీతి:** ఎవరు ఎవరిని లవ్ చేసినా నాన్న దృష్టిలో అబ్బాయి ఎప్పుడూ ఇడియటే!

## జస్ట్ రీ డయల్ యార్!



**ఫ్రెండ్ 1:** ఒకసారి నీ ఫోన్ ఇవ్వవా నా గర్ల్‌ఫ్రెండ్‌తో మాట్లాడతాను.



**ఫ్రెండ్ 2 :** యా ష్యూర్. జస్ట్ రీ డయల్.

## ఒక్కటే ఒక్కటే!



లవ్, ఎగ్జామ్ ఒక్కటే.
ఎలా అంటే...
- ఎన్నో ప్రశ్నలు ఉంటాయి. దేనికీ సరిగ్గా సమాధానం తెలియదు. సమాధానం తెలిసే లోపే టైమ్ అయిపోతుంది.
- ఏదో రాసేస్తాంగానీ రిజల్ట్ ఎప్పుడూ ఫెయిలే!

యాకుబ్ పాషా

₹ భద్రం బి కేర్‌ఫుల్

# వ్యాపారం సుఖమా, ఉద్యోగం సుఖమా?




చాలా రొటీన్‌గా కనిపించే క్లిష్టమైన ప్రశ్న ఇది. మనిషి మనిషికీ సమాధానం మారుతుంటుంది. కాబట్టి, ప్రశ్న అడుగుతున్నదెవరు అన్నదానిని బట్టి దీనికి సమాధానం చెప్పాల్సి ఉంటుంది.

ఉద్యోగం అంటే ఎవరో ఒకరి కింద పనిచేయాలి. అదే వ్యాపారం అయితే మనకు మనమే బాస్ అనుకుంటారు చాలా మంది. ఇది అపోహ. ఉద్యోగంలో బాస్ ఒక్కరి మాట వింటే చాలు. వ్యాపారంలో ప్రతి వినియోగదారుడూ బాసే. అంతేకాదు, అది ఒక గాడిలో పడేంతవరకు ఎదురయ్యే సమస్యలు, ఆటంకాలు ఉద్యోగంలోనైతే ఎన్నడూ రావు. కష్టానికీ, నష్టానికీ మీరే బాధ్యులు అవుతారు. ఎంత చిన్న వ్యాపారం అయినా ఈ సమస్యలు తప్పవు. పెద్దమొత్తంలో డబ్బు కళ్ల చూడాలన్నా, మీ సమర్థత పూర్తి స్థాయిలో వినియోగించుకోవాలన్నా, స్వతంత్ర గుర్తింపు రావాలన్నా వ్యాపారం చేయాలి. ఏ వ్యాపారం మొదలుపెట్టే ముందయినా ఈ టిప్స్ తెలుసుకోవడం మంచిది. కిందింది మేలు ఎంచాలి కదా!

- అప్పులు చేసి వ్యాపారం చేయొద్దు. పెట్టుబడి ఎంత పెడుతున్నారో అంతకు రెండు రెట్ల (కనీసం రెట్టింపు) సొమ్ము నిల్వ ఉండాలి. కొన్ని వ్యాపారాలకు బ్యాంకులోను మంచిది.
- వ్యాపారం విఫలమైతే మీ కుటుంబ పోషణకు ఏం చేయాలో, ఎలా చేయాలో ముందే ప్రణాళిక ఉండాలి.
- వ్యాపారం అర్ధాంతరంగా ముగించాల్సి వస్తే మౌలిక సదుపాయాలపై (కంప్యూటర్లు, అద్దె, ఫర్నిచర్) పెట్టిన ఖర్చు ఎంత తిరిగొస్తుందో అంచనావేయండి. పెట్టుబడిలో ఎంత తిరిగొస్తుంది? ఎలా బయటపడాలి అని ఆలోచిస్తే వీలైనంత తక్కువగా పెట్టుబడిని పెడతారు.
- బ్రేక్ ఈవెన్ (లాభాలు చూసేరోజు) పాయింట్ వచ్చేవరకు మీ మూలధనానికి హామీ ఇచ్చే పటిష్టమైన వనరులున్నాయా అనేది చూసుకుని, మీ కుటుంబం గడవడానికి ఏర్పాట్లు చేయండి.
- మీ సేవ/వస్తువు వినియోగదారుని చేరేంతవరకు ఎన్ని పనులు, ఆటంకాలుంటాయి వంటి వాటి గురించి ఒక సమగ్ర ప్రణాళిక ఉండాలి. ఎంత సమగ్రంగా ప్లాన్ వేసినా దీగాక ఇంకొన్ని కొత్త సమస్యలు వస్తాయి. వాటిని ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉండాలి.
- నమ్మకమైన మనుషులు దొరికితేనే మీ వ్యాపారం నిలబడుతుంది. లేకపోతే మంచి వ్యాపారం కూడా పాడవుతుంది.

అప్పుచేసి పప్పుకూడు | **మనీమాన్యితం** | పింగళి

వేలిముద్ర వేయరా సంతకాలు చేయరా
అంతగాను కోర్టుకెళితే ఐపీ బాంబుందిరా
అప్పుచేసి పప్పుకూడు తినరా ఓ నరుడా
గొప్ప నీతి వాక్యమిది వినరా పామరుడా

₹ స్ఫూర్తిదం

# ఏసీ టెక్నీషియన్ నుంచి నిర్మాత వరకు



ఒక లక్ష్యమంటూ ఉంటే ఎప్పటికైనా దాన్ని చేరుకుంటావు అన్నది సాజిద్ నడియాడ్వాల జీవితం నుంచి నేర్చుకోవాల్సిన అర్థిక పాఠం. ఆయన బాలీవుడ్ నిర్మాత. సులువుగా గుర్తుపట్టాలంటే దివ్యభారతి భర్త.

డాన్‌బాస్కో స్కూల్లో చదువుకున్నారు. తొలి నాళ్లలోనే వాళ్ల బంధువులు బాలీవుడ్‌లో పెద్ద నిర్మాతలు. కానీ, కొన్ని కారణాల వల్ల ఆయన ఏసీ టెక్నీషియన్‌గా తన జీవితాన్ని ప్రారంభించాల్సి వచ్చింది. కొంతకాలం తర్వాత సినిమాల్లో స్పాట్‌బాయ్‌గా చేరారు. ఒకవైపు తన అంకుల్ కోట్లు సంపాదిస్తుంటే సాజిద్ రోజు కూలీ తీసుకోవాల్సిన పరిస్థితి. అయితే, అతను జీవితంలో ఎదుగుదల కోరుకున్నారు. దానికోసం ఇతరుల మీద ఆధారపడదలుచుకోలేదు. అందుకే మళ్లీ వీలుచేసుకుని గ్రాడ్యుయేషన్ పూర్తిచేసుకున్నారు. ఆ అర్హతతో ప్రొడక్షన్ అసిస్టెంట్‌గా చేరారు.

సినిమా పరిశ్రమలో ఒక దారి దొరికే వరకే కష్టం. ఆధారమంటూ దొరికితే కష్టపడిన వారికి విజయం తథ్యం. నిజంగా అలాగే అయ్యింది సాజిద్ జీవితం. ప్రొడక్షన్ అసిస్టెంట్‌గా చేరిన ఆయన మంచి వ్యూహాలు రచించి కొంత సంపాదించారు. తర్వాత సొంతంగా ఓ సినిమా ప్రొడక్షన్ హౌస్ పెట్టారు. 1992 నుంచి ఆ బ్యానర్‌పై సినిమాలు తీయడం మొదలుపెట్టారు. కృషి ఫలించింది. ఆందోళన్, జీత్, జుడ్వా, హే బేబీ, హౌస్‌ఫుల్ వంటి పెద్ద హిట్లతో నేడు ప్రముఖ నిర్మాతల్లో ఒకరయ్యారు. కంబఖ్త్ ఇష్క్ సినిమాలో సిల్వస్టర్ స్టాలోన్, డెనిస్ రిచర్డ్స్, బ్రాండన్ రౌత్ వంటి హాలీవుడ్ స్టార్లను కూడా ప్రత్యేక పాత్రల్లో నటింపజేసి ప్రపంచవ్యాప్త గుర్తింపు పొందారు. 'హౌస్‌ఫుల్-2'తో బాలీవుడ్ సంపన్న నిర్మాతల్లో ఒకరయ్యారు.

₹ టిప్స్

## పర్సనల్ లోన్స్‌కు ప్రత్యామ్నాయం

మనకు డబ్బు అత్యవసరమైనప్పుడు వెంటనే కనిపించే ఆప్షన్లు రెండు... మిత్రులు, పర్సనల్ లోన్లు. పెద్ద మొత్తం అయితే వెంటనే మిత్రులు, బంధువులను అడగలేరు కాబట్టి పర్సనల్ లోన్లు తీసుకుంటారు. ఇది అటూ ఇటుగా 2 రూపాయల వడ్డీతో మన నడ్డి విరుస్తుందని చెప్పుకున్నాం కదా!. ఇవి కాకుండా అర్జెంట్‌గా డబ్బు దొరికే మార్గాలున్నాయి తెలుసా!

ఇవన్నీ పర్సనల్ లోన్ కంటే తక్కువ వడ్డీకి దొరుకుతాయి. వెంటనే దొరుకుతాయి.

1. మనం పనిచేస్తున్న కంపెనీ నుంచి వడ్డీలేని రుణం అడగొచ్చు.
2. బంగారం పెట్టి రుణం తీసుకోవచ్చు.
3. ఇన్సూరెన్స్, బీమా పాలసీలపై రుణం పొందొచ్చు.
4. ఫిక్స్‌డ్ డిపాజిట్ల తనఖాపై లోను దొరుకుతుంది
5. ఆస్తుల తనఖాపై రుణం పొందొచ్చు.
6. పొదుపు పత్రాలు, బాండ్లపై రుణం పొందొచ్చు.

● ప్రకాష్ చిమ్మల

## పదశోధన - 222

నిర్వహణ : అద్భుతప్రదీపక్

| | | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|---|
| 1 | 2 | | | 3 | | ■ | 4 | 5 | |
| 6 | | ■ | | | ■ | 7 | | | ■ |
| ■ | 8 | 9 | 10 | | ■ | 11 | | ■ | 12 |
| 13 | | | | ■ | 14 | | ■ | 15 | |
| | ■ | 16 | | 17 | ■ | ■ | 18 | | ■ |
| 19 | | ■ | 20 | | 21 | ■ | 22 | | |
| | ■ | 23 | | ■ | 24 | 25 | ■ | | ■ |
| ■ | 26 | | ■ | ■ | ■ | 27 | | | ■ |
| 28 | | | ■ | 29 | | | ■ | 30 | 31 |
| 32 | | | | | ■ | ■ | 33 | | |

**ఆధారాలు**

**అడ్డం**

1. దసరా పండుగ (6)
4. త్యాగానికి ప్రతీక అయిన ముస్లిముల పండుగ (3)
6. లక్ష్మీ (2)
7. నీళ్లు ఇంకిన కొబ్బరికాయ (3)
8. కబడ్డీ లాంటిదే మరో దేశవాళీ క్రీడ (4)
11. ఎద్దు అరుపు (2)
13. పంతం (4)
14. వృష్టి (2)
15. ముస్లింల పవిత్ర నగరం (2)
16. మృగం, జంతువు (3)
18. ఆలోచన (2)
19. స్వస్తి, మంగళం (2)
20. తడబడుతూ రావద్దు (3)
22. బరువు పనిచేసేవాడు (3)
23. నేత్రాలు (2)
24. ధనికుడే (2)
26. ఒక పద్యంలా వినిపించే దుంప (2)
27. రూటు మార్చిన ప్రళయం (3)
28. కోమలమైన స్త్రీ (3)
29. ఒక హీరోయిన్(3)
30. తారుమారైన దేవ (2)
32. బెజవాడ దేవత (5)
33. భుజించేవాళ్లు (3)

**నిలువు**

1. తిరగబడిన కవి (2)
2. శమీవృక్షం (4)
3. శివుడు (3)
4. ఆశ, చిత్తం (3)
5. అర్జునుడు (2)
7. జింక (3)
9. పైకి తేలిన మెదడు (3)
10. అంతగా విలువలేని సాధారణ శిలలు (5)
12. అక్కను పిలవండి (2)
13. గండ్రగొడ్డలి (4)
15. ఇస్లాం మత స్థాపకుడు (7)
17. చుంబనం (2)
18. ధాన్యం పొట్టు (2)
21. సంహారం (2)
23. చలనం (4)
25. నియంతృత్వ పాలకుడు (3)
26. శివపూజలో చమకంతోడి మంత్రం తిరగబడింది (3)
28. చీర (2)
29. అధ్యాయం, గ్రంథ భాగం (2)
31. పంటభూములు (2)

**పదశోధన - 221 జవాబు**

| | | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|---|
| వా | చి | కం | ■ | ప | క | లం | ■ | మీ | సం |
| తా | ■ | గా | థ | రా | ■ | క | ద | నం | ■ |
| వ | పే | రు | ■ | పే | కే | ■ | ళ | ■ | ■ |
| ■ | కే | ■ | పే | ఠ | గ | ఱు | వ | థ | పి |
| గా | లం | పు | ■ | ■ | టి | ■ | తి | ■ | చ్చి |
| డి | త | ■ | కా | ల | నే | మి | ■ | ■ | వ |
| ద | ■ | మే | ను | ■ | లం | క్కీ | ఫ | శా | ■ |
| ■ | శ్రీ | ద | క | ■ | ■ | మా | ■ | థ | ■ |
| అ | ల | ■ | ■ | కొ | ర | వి | ■ | ■ | రా |
| ఆ | గం | త | కు | డు | ■ | ■ | ద | స్తూ | రి |

**దాగుడు మూతలు**

ఇందులో దాగి ఉన్న బొమ్మలను గుర్తించండి?




**పజిల్**



ఈ షడ్భుజాలలో 1 నుండి 19 వరకు అంకెలను నింపండి. అయితే అడ్డంగా, నిలువుగా, ఏ మూలగా ఏ వరుసలో కూడినా 38 రావాలి. ప్రయత్నించగలరా?



● మెదడుకు మేత

## Food Facts

- సపోటా పళ్లు మలబద్ధకాన్ని వదిలిస్తాయి!
- కొత్తిమీర అజీర్ణిని తగ్గిస్తుంది!
- ఉల్లిపాయలు తింటే కడుపులో ఉన్న పుండ్లు మానతాయి!
- బచ్చలి కూర శరీరంలోని వేడిని తగ్గిస్తుంది!
- బెల్లం ఎముకలకు శక్తినిస్తుంది. వెన్నెముకను దృఢంగా చేస్తుంది!



## Interesting Facts



- ఫ్రెంచ్‌వాళ్లు మహా భోజనప్రియులు. ఆ దేశంలో రోజుకు కనీసం రెండు వంటల పుస్తకాలు ప్రచురితమవుతూ ఉంటాయి!
- పొగ తాగే అలవాటు కారణంగా యూకేలో యేటా దాదాపు లక్షమంది చనిపోతున్నారు!
- యునెస్కో రిపోర్టు ప్రకారం ఆఫ్రికాలో రెండువేల భాషలు మాట్లాడే ప్రజలున్నారు!
- ప్రాచీన ఈజిప్టులో మహిళలకు సమాజంలో తగిన స్థాయి లభించేది కాదు. కానీ ఆర్థిక అంశాల్లో మాత్రం వారికి పురుషులతో సమాన హక్కులు ఉండేవి!
- జార్జియాలోని గెయిన్స్‌విల్లేలో ఒకప్పుడు చికెన్‌ను ఫోర్క్‌తో తింటే నేరం!

## Animal Facts

- గాలి సోకని చోట కూడా బొద్దింక 45 నిమిషాల పాటు బతకగలదు!
- కకాపో అనే రామచిలుకలు ఎగరలేవు. ఇవి న్యూజిలాండ్‌లో తప్ప మరెక్కడా కనిపించవు!
- కప్పలకు పళ్లు ఉండవు. అందుకే అవి ఆహారాన్ని నమలలేవు. మింగేస్తాయి!
- డైనోసార్లలో ట్రూడాన్ జాతివి చాలా తెలివైనవి. మాటేసి వేటాడ్డంలో వీటికి తిరుగులేదు!
- చిరుతపులులకు దాహం తక్కువ. అవి మూడు నాలుగు రోజులకోసారి నీళ్లు తాగి బతికేయగలవు!


కకాపో

## Human Body Facts

- మన శరీరంలోని మిగతా చోట్లతో పోలిస్తే, పాదాల దగ్గర చర్మమే ఎక్కువ మందంగా ఉంటుంది!
- మన మూత్రపిండాలు రోజుకి 400 గ్యాలన్ల రక్తాన్ని శుద్ధి చేస్తాయి!
- నూటికో కోటికో ఒక్కరు తప్ప, ఎవరైనా వరుసగా పదిరోజులు నిద్రపోకుండా ఉంటే చనిపోయే ప్రమాదం ఉంది!
- మనం నిమిషానికి 9 నుంచి 20 సార్లు శ్వాస తీసుకుంటాం. ప్రతిసారీ అరలీటరు గాలిని పీల్చుకుంటాం!
- మగవాళ్లకి 70 శాతం కలల్లో మగవాళ్లే కనిపిస్తారట. కానీ ఆడవాళ్లకి ఆడా మగా ఇద్దరూ సమానంగానే కనిపిస్తారట!



● చిట్టి కథ

# ఒకే యుక్తి



ఒక అడవిలో ఒక పిల్లి ఉంది. ఒకరోజు దానికి నక్కబావ తారసపడ్డాడు. కాసేపు రెండూ మంచి చెడ్డలు మాట్లాడుకున్నాయి. మాటల సందర్భంలో నక్క గొప్పలకు పోయి,

"పిల్లిబావా! నాకే చింతలూ లేవోయ్. భయం అంటే నాకసలే తెలీదనుకో. నాకెన్నో యుక్తులూ జిత్తులూ తెలుసు. అందుకని నన్ను ఎంతటి పెద్ద జంతువైనా ఏమీ చెయ్యలేదు" అంది.

నిజమేనన్నట్టు తలూపింది పిల్లి.

"నీవు జంతువులలోకెల్లా గొప్ప జిత్తులమారివని పేరుగాంచావు నక్కబావా. కానీ నేను అల్పుడిని. నాకు తెలిసింది ఒకే ఒక యుక్తి. దాన్ని ఉపయోగించే శత్రువుల బారి నుండి రక్షణ కల్పించుకుంటూ ఉంటాను. అంతకుమించి నాకే ఇతర యుక్తులూ తెలీవు. ఏం చేస్తాం చెప్పు" అంది అమాయకంగా.

ఈ రెండూ ఇలా మాట్లాడుకుంటూ ఉండగానే పెద్దగా అరుస్తూ కొన్ని వేటకుక్కలు అటుగా వచ్చాయి. అడవిపిల్లి తనకు తెలిసిన ఒకే ఒక యుక్తిని ఉపయోగించి చటుక్కున చెట్టెక్కి కూర్చుంది. బోలెడన్ని జిత్తులు తెలిసిన నక్క 'ఇలా చేసేదా? అలా చేసేదా?' అని ఆలోచించసాగింది. అది ఏదో ఒకటి తేల్చుకుని పారిపోబోయేంతలో వేటకుక్కలు దాన్ని చుట్టుముట్టాయి. క్షణంలో చీల్చి చెండాడాయి.

**నీతి: ఆపదలో అక్కరకు రాని యుక్తులు, జిత్తులు ఎన్ని ఉన్నా, ఉపయోగపడవు.**

● శ్రీపాద సత్యనారాయణ

RNI Reg No.APTEL/2008/23482



సాక్షి
ఫన్‌డే
ఆదివారం ::: 28 అక్టోబర్ 2012



# 50 ఏళ్ల బ్రాండ్ 007

క్విక్ బైట్స్..!

## రాత్రికి రాత్రే కోటీశ్వరులు!



మన్‌హట్టన్‌కు చెందిన విల్లీ మెక్ ఫెర్సన్, క్రిస్టఫర్ మాంజేలు గత పాతికేళ్లుగా లాటరీ టికెట్లను కొంటూనే ఉన్నారు. ఒక్కసారీ పైసా తగలకపోయినా నిరాశ చెందలేదు. ఎప్పుడో ఒకప్పుడు లాటరీ తగలకపోతుందా, లక్షాధికారులం కాకపోతామా అన్న ఆశతో కొంటూనే ఉన్నారు. ఆ నమ్మకమే వారినిప్పుడు లక్షాధికారులను కాదు... ఏకంగా కోటీశ్వరులను చేసింది. టికెట్ కొనడానికి సరిపడా డబ్బుల్లేకపోతే అప్పు చేసి మరీ కొన్నారు. చివరికి ఆ టికెట్‌కే జాక్‌పాట్ తగిలింది. ప్రైజ్‌మనీగా 14 మిలియన్ డాలర్లు గెలుచుకుని రాత్రికి రాత్రే శత కోటీశ్వరులయ్యారా స్నేహితులు. వారిలో ఒకరు రిటైరయ్యి, మరొకరు ఉద్యోగం లేక సతమతమవుతున్న తరుణంలో ఇలా అదృష్టం వరించింది. అన్నట్టు వారికి ఆ టికెట్ విక్రయించిన లాటరీ షాప్ ఓనర్ కూడా మిలియనీర్‌గా మారిపోయాడు!

## మీనసుందరి!



అందమైన కళ్లుంటే మీనాల్లాంటి కళ్లంటాం. చురుగ్గా ఉంటే చేపలా చురుకైనదంటాం. చంచలంగా ఉన్నవారినీ చేపలతో పోలుస్తాం. చేపల గురించి ఇన్ని రకాల వర్ణనలున్నప్పుడు మరి చేపలు ఇంకెంత అందంగా ఉండాలి? ఇదే ఆలోచన వచ్చింది చైనీయులకు. దాంతో అంతర్జాతీయ చేపల అందాల పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో పద్నాలుగు దేశాలకు చెందిన మూడువేల చేపలు పాల్గొన్నాయి. యజమానులు తాము పెంచుతున్న చేపలతో వచ్చారు. తమ చేపల అందాలను ప్రదర్శించారు. క్విచాంగ్ ఈ అనే ఓ చైనీయుడి చేప అన్నింటినీ తోసిరాజని సిసలైన మీన సుందరిగా న్యాయనిర్ణేతల మనసులను దోచుకుంది. దాని యజమానికి లక్షల రూపాయలు తెచ్చిపెట్టింది. ఆకారం, బరువు, చురుకుదనం, ఈతకొట్టే వేగం, జాతి (బ్రీడ్), రంగులను బట్టి ఈ సుందరిని ఎంపిక చేసినట్టు న్యాయనిర్ణేతలు తెలిపారు.

## అరుదైన జీవి ఆఫ్ఘనిస్థాన్‌లో...



మంచు ఎలుగుబంట్లను చూశాం. మంచు మనుషుల గురించి విన్నాం. అలాగే మంచు చిరుతపులుల గురించి చదివాం కానీ వాటిని చూసే అదృష్టానికి నోచుకో లేదు. ఎందుకంటే అంతరించిపోయిన ప్రాణుల జాబితాలో అవి చేరి చాలా కాలమైపోయింది కాబట్టి! అయితే జీవ వైవిధ్య సదస్సులు విరివిగా జరుగుతున్న ఈ తరుణంలో ఆఫ్ఘనిస్థాన్ అడవులలో కనిపించిన ఈ శ్వేత చిరుత పర్యావరణ ప్రేమికులకు కనువిందు చేసింది. ప్రపంచం మొత్తం మీద డజనుకు లోపు ఉన్న ఈ మంచు చిరుతలను చూసేసరికి శాస్త్రవేత్తల బృందం ఎంతో సంతోషపడింది. కొత్త ఊపిరి పోసుకున్న తర్వాత వాటి సంతతిని వృద్ధి చేసేందుకు నడుం కట్టింది. వారి ప్రయత్నాలు ఫలించాలని కోరుకుందాం! వైట్ చీతాకు హాయ్ చెబుదాం!

## 15 లక్షల ఖరీదైన పనిమనిషి!



లక్కపిడత లాంటి నోరు, పట్టుకుచ్చు లాంటి జుట్టు, నునుపైన బుగ్గలతో చూడ్డానికెంతో అందంగా ఉంటుంది. ప్రతిరోజూ ఇల్లూడుస్తుంది. తుడుస్తుంది. శుభ్రంగా అంట్లు తోముతుంది. ఇంగ్లిష్, జపనీస్ చక్కగా మాట్లాడుతుంది. కాని మనం ఏదయినా అడిగితే బదులు చెప్పదు. చెప్పలేదు కూడా! ఎందుకంటే ఆమె అచ్చం మనిషిలా... ఇంకా చెప్పాలంటే అందమైన ఆడపిల్లలా కనిపించే మరబొమ్మ! జపాన్‌కు చెందిన లీ ట్రంగ్ అనే ముప్పై మూడేళ్ల సాఫ్ట్‌వేర్ ప్రోగ్రామర్ మస్తిష్కంలో పుట్టిన ఆలోచనకు ప్రతిరూపమే అయికో అనే ఈ అమ్మడు. కానీ ఈ పనిమనిషిని పెట్టుకోవాలంటే దాదాపు ముప్పైవేల అమెరికన్ డాలర్లు చెల్లించాల్సి మరి!

### పాయింట్ ఆఫ్ ద వీక్

| 28 | 29 | 30 | 31 | 1 | 2 | 3 |
|---|---|---|---|---|---|---|
| డీడీటీని కనుగొన్న స్విస్ కెమిస్ట్ పాల్ ముల్లర్‌ను వైద్యంలో నోబెల్ బహుమతి వరించింది (1948) | రెడ్ క్రాస్ సంస్థ ఏర్పాటుకు ఆమోదిస్తూ జరిపిన సమావేశం విజయవంతమైంది (1863) | ప్రముఖ అణు శాస్త్రవేత్త హోమీ జె బాబా జననం (1909) | భారత మాజీ ప్రధాని ఇందిరాగాంధీ హత్యకు గురయ్యారు (1984) | మొదటి ఎస్సార్సీ ప్రకారం ఆంధ్రప్రదేశ్, కేరళ, కర్ణాటక రాష్ట్రాలు ఏర్పడ్డాయి (1956) | త్రిపుర కమ్యూనిస్టు పార్టీలు రెండూ ఒకటై యునైటెడ్ ఫ్రంట్‌గా ఏర్పడ్డాయి (1973) | ఆంగ్ల దినపత్రిక టైమ్స్ ఆఫ్ ఇండియా 'ది బాంబే టైమ్స్ అండ్ జర్నల్ ఆఫ్ కామర్స్' పేరుతో ప్రారంభమైంది (1838) |


సకాలంలో సరైన చికిత్స ! సదా మీ ఆరోగ్య రక్ష !!
అతి తక్కువ ఖర్చుతో
అనుభవజ్ఞులైన డాక్టర్లు
ప్రకృతి సిద్ధంగా
ఎలాంటి దుష్ఫలితాలు లేకుండా దూరం చేయడం మా లక్ష్యం
డయాబెటిస్ | థైరాయిడ్ | సోరియాసిస్ | కిడ్నీ సమస్యలు | గ్యాస్టిక్ అల్సర్
అన్నిరకాల వ్యాధులకు ప్రపంచస్థాయి హోమియో వైద్యం
అంతర్జాతీయ ప్రమాణాలు
వారమంతా వైద్యసేవలు
An ISO 9001 - 2000 Certified ®
పాజిటివ్ హోమియోపతి
మీ ఆరోగ్యాన్ని ఆస్వాదించండి!
Toll free No : 1800 425 0144
SMS 'POSITIVE' to 55352
www.positivehomeopathy.com
అమీర్‌పేట • S.R. నగర్ • కూకట్‌పల్లి • విక్రమ్‌పురి • కాచిగూడ • దిల్‌షుక్‌నగర్ • మెహిదీపట్నం
•నిజామాబాద్ •కర్నూల్ •గుంటూరు • వైజాగ్
•విజయవాడ •తిరుపతి •రాజమండ్రి •బెంగుళూరు
ఇతర వివరములకు సంప్రదించండి :
9246187788

● సూక్తి

నిన్ను, నీ జీవితాన్ని నిర్వచించే అవకాశం ఎవరికీ ఇవ్వకు.
ఇతర వాళ్లు కలుగజేసే బాధకు గురికాకు.
- హార్వే ఫీయర్‌స్టీన్, అమెరికన్ నటుడు

● సూచిక



6 టేక్ ఇట్ ఈజీ
ముగిసిన జాతర



14 రాలిన మొగ్గలు
జాక్ లాండన్

## పశ్చాత్తాపమే ప్రక్షాళన!

అనుకోకుండా మీతో యాక్సిడెంట్ చేశారు. ఒక ప్రాణం బలైపోయింది. ఆ బాధ ఇప్పటికీ మిమ్మల్ని వెంటాడుతోంది.

తెలియక మీరు చేసిన పొరపాటు ఒక కుటుంబంలో కల్లోలం సృష్టించింది. ఆ ఆవేదన ఇప్పటికీ మిమ్మల్ని కుమిలిపోయేలా చేస్తోంది!

మీ నిర్లక్ష్యం, మీ మౌనం, మీ అసహాయత, మీ అపార్థం, మీ అనుమానం లేదా మీరు తీసుకోలేకపోయిన నిర్ణయం... తిరిగి పూడ్చుకోలేనంత అగాధాన్ని ఏ అనుబంధాల మధ్యనో సృష్టించింది. ఆ 'పాపం' మిమ్మల్ని ఇప్పటికీ వేధిస్తోంది.

పశ్చాత్తాపానికి మించిన ప్రక్షాళన లేదు. మీరు అనుభవిస్తున్న ఆ బాధను, ఆవేదనను మాతో షేర్ చేసుకోండి. మనసును తేలికపరచుకోండి. మీ వివరాలను గోప్యంగా ఉంచుతాం. నిశ్చింతగా రాసి పంపండి. లేదా మెయిల్ చెయ్యండి.

చిరునామా: పశ్చాత్తాపం, ఫన్‌డే సెక్షన్, సాక్షి టవర్స్, 6-3-249/1, రోడ్ నెం.1, బంజారాహిల్స్- 34. mail: funday.sakshi@gmail.com

● వారఫలం

అక్టోబర్ 28 నుండి నవంబర్ 3 వరకు

నిర్వహణ: సింహంభట్ల సుబ్బారావు

**మేషం:** కొత్త వ్యూహాలతో ముందుకు సాగుతారు. ఆర్థిక ఇబ్బందులు తొలగుతాయి. ఆశ్చర్యకరమైన సంఘటనలు. తోబుట్టువులతో వ్యక్తిగత విషయాలు చర్చిస్తారు. సంఘంలో గౌరవం. ఆలయాలు సందర్శిస్తారు. వ్యాపారాలు ఉత్సాహంగా సాగుతాయి. రాజకీయ, కళారంగాల వారికి సన్మానాలు.

**వృషభం:** ఆర్థిక పరిస్థితి గతం కంటే మెరుగ్గా ఉంటుంది. ఆస్తి విషయాలలో అగ్రిమెంట్లు. వాహనాలు, భూములు కొనుగోలు చేస్తారు. ఉద్యోగయత్నాలు అనుకూలిస్తాయి. ఆత్మీయుల నుంచి ముఖ్య సందేశం అందుతుంది. రాజకీయ, పారిశ్రామికవర్గాలకు విదేశీ పర్యటనలు.

**మిథునం:** ప్రత్యర్థులను సైతం మెప్పించి వ్యవహారాలు చక్కదిద్దుతారు. ఆస్తి వివాదాలు తీరతాయి. వాహనయోగం. ఇతరులకు ఆదర్శవంతంగా నిలుస్తారు. సొమ్ము సకాలంలో అంది అవసరాలు తీరతాయి. వ్యాపారాలు పుంజుకుంటాయి. రాజకీయ, కళారంగాల వారికి సన్మానాలు.

**కర్కాటకం:** రావలసిన బకాయిలు అందుతాయి. శ్రమకు తగ్గ ఫలితం దక్కుతుంది. మీ సత్తా చాటుకుని ముందుకు సాగుతారు. భూములు, వాహనాలు సమకూర్చుకుంటారు. వ్యాపార లావాదేవీలు ఆశాజనకం. ఉద్యోగులకు కొత్త బాధ్యతలు. రాజకీయ, పారిశ్రామికవర్గాలకు విదేశీ పర్యటనలు.

**సింహం:** పరిస్థితులు అనుకూలిస్తాయి. చిన్ననాటి మిత్రులను కలుసుకుంటారు. భూవివాదాలు తీరతాయి. వ్యాపారాలు లాభసాటిగా ఉంటాయి. ఉద్యోగులకు ఇంక్రిమెంట్లు. మీ నైపుణ్యాన్ని చాటుకుంటారు. రాజకీయ, కళారంగాల వారికి పురస్కారాలు, సన్మానాలు.

**కన్య:** ఆర్థిక పరిస్థితి కొంత మెరుగ్గా ఉంటుంది. చేపట్టిన కార్యక్రమాలు నెమ్మదిగా సాగుతాయి. ఒక ఆహ్వానం సంతోషం కలిగిస్తుంది. దూరపు బంధువులను కలుసుకుని కష్టసుఖాలు విచారిస్తారు. వ్యాపారాలు లాభిస్తాయి. ఉద్యోగవర్గాలకు విధి నిర్వహణలో ఒత్తిడులు తొలగుతాయి.

**తుల:** కొత్త పనులు చేపడతారు. ఆలయాలు సందర్శిస్తారు. కుటుంబంలో శుభకార్యాల నిర్వహణ. చిన్ననాటి మిత్రులను కలుసుకుని ఉత్సాహంగా గడుపుతారు. వ్యూహాల అమలులో ముందుకు సాగుతారు. వ్యాపార లావాదేవీలు ఆశాజనకం. ఉద్యోగవర్గాలకు కొత్త బాధ్యతలు.

**వృశ్చికం:** చేపట్టిన కార్యక్రమాలు సకాలంలో పూర్తి కాగలవు. ఆర్థిక పరిస్థితి మెరుగుపడుతుంది. దీర్ఘకాలిక సమస్యల నుంచి బయటపడతారు. స్థిరాస్తి వివాదాలు పరిష్కారం. వాహన, గృహయోగాలు. వ్యాపారాలలో అనుకున్న లక్ష్యాలు సాధిస్తారు. రాజకీయ, కళారంగాల వారికి సన్మానాలు.

**ధనుస్సు:** కొత్త పనులు చేపడతారు. మీ ప్రతిభను చాటుకుంటారు. ఆర్థిక వ్యవహారాలు సంతృప్తినిస్తాయి. సంఘంలో గౌరవమర్యాదలు పొందుతారు. వివాహ, ఉద్యోగయత్నాలు సానుకూలమవుతాయి. వ్యాపారాలలో అనుకున్న లాభాలు తథ్యం. రాజకీయ, కళారంగాల వారికి విదేశీ పర్యటనలు.

**మకరం:** పనులు నెమ్మదిగా సాగుతాయి. ఆకస్మిక ప్రయాణాలు. ఆర్థిక లావాదేవీలు కొంత మెరుగుపడతాయి. ఆలోచనలు కలిసివస్తాయి. సభలు, సమావేశాలలో పాల్గొంటారు. ఆలయాలు సందర్శిస్తారు. వ్యాపారాలలో కొద్దిపాటి లాభాలు. రాజకీయ, పారిశ్రామికవర్గాలకు అరుదైన పురస్కారాలు.

**కుంభం:** ముఖ్యమైన కార్యక్రమాలు వాయిదా. శ్రమాధిక్యం. ఆకస్మిక ప్రయాణాలు. రుణాలు చేస్తారు. బంధువులతో మాటపట్టింపులు. ఆరోగ్యభంగం. దూరప్రాంతాల నుంచి అందిన సమాచారం కొంత ఊరట కలిగించవచ్చు. రాజకీయ, కళారంగాల వారికి విదేశీ పర్యటనలు వాయిదా.

**మీనం:** కొత్త పనులు చేపడతారు. ఆలోచనలు కలిసివస్తాయి. సభలు, సమావేశాలలో పాల్గొంటారు. పాత బాకీలు వసూలవుతాయి. ఉద్యోగయత్నాలు అనుకూలిస్తాయి. స్థిరాస్తి వివాదాల పరిష్కారం. శుభకార్యాలకు డబ్బు ఖర్చు చేస్తారు. వ్యాపారాలు పుంజుకుంటాయి.

● లేఖ



**ఇన్నర్‌వ్యూ బాగుంది!**

గాదె ఇన్నయ్య ఇన్నర్‌వ్యూ బాగుంది. క్రైమ్‌స్టోరీ 'కిరాతకుడు' ఇంటరెస్టింగ్‌గా ఉంది. గోపిక చేసిన సినిమాలన్నీ సూపర్‌హిట్ అయ్యాయి కాబట్టి, భవిష్యత్తులో ఆమె మళ్లీ నటిస్తే బాగుంటుందేమో!

– కాడిపిగరి తిరుమలేశ్, మెయిల్

**లవ్‌పేజీ బాగుంటోంది!**

గాదె ఇన్నయ్య ఇన్నర్‌వ్యూ చదువుతుంటే ఆయనలో ఒక సమరయోధుడు ఉన్నాడని తెలిసింది. పిల్లల పట్ల ఆయన తీసుకుంటున్న శ్రద్ధ ప్రశంసనీయం. గోపిక అజ్ఞాతవాసం ఆకట్టుకుంది. లవ్‌పేజీ బాగుంటోంది.

– పైడిశెట్టి హరీష్, నరసన్నపేట

**ఉత్కంఠభరితం!**

'ఆ రోజుల్లో'లో పెద్దిభొట్ల సుబ్బరామయ్య అనుభవాలు సినీ రాగరంజితంగా ఉన్నాయి. మొండితనం కొన్నిసార్లు ఇబ్బందిని, మరికొన్నిసార్లు పట్టుదలను పెంచి కొన్ని అనుకున్న, అనుకోని ఫలితాలనిస్తాయనడానికి గాదె ఇన్నయ్య ఒక ఉదాహరణ. ఉదాత్త, అనుదాత్త అనుభవాల స్వరజ్ఞాని మొజార్ట్‌ను కూర్చిన కథనం బాగుంది. క్రైమ్‌స్టోరీ ఉత్కంఠభరితంగా ఉంది. 'గతం గతః' కథను సత్యప్రసాద్ ఆకట్టుకునేలా చెప్పారు.

– శివభూషణం, కర్నూలు

**కథ చదివించింది!**

'టేక్ ఇట్ ఈజీ'లో 'అందరూ కుశలమే' బాగుంది. కార్టూన్లు నవ్వించాయి. పెద్దిభొట్ల చెప్పినట్లు శ్రీరంజనిలాంటి అక్కయ్య అందరికీ ఆత్మీయురాలే! 'గతం గతః' కథనం చదివించింది. పజిల్స్, చిట్టికథ బాగున్నాయి.

– ఆదూరి పద్మావతి, హైదరాబాద్

**తట్టి లేపింది!**

మొజార్ట్ సంగీత ప్రయాణం ఆసక్తి కలిగించింది. ఎన్ని కష్టాలు వచ్చినా సంగీతమే జీవితమనుకున్న గొప్ప వ్యక్తి జీవితంలోని ఒడిదుడుకులు చదువుతుంటే బాధ కలిగింది. గోపిక స్వీట్ మెమొరీస్‌ని అజ్ఞాతవాసం తట్టి లేపింది.

– మహమ్మద్ ఫరు, మెయిల్

**ఆసక్తికరం!**

'గతం గతః' కథనం ఆలోచింపజేసింది. గోపిక విశేషాలు అలరించాయి. 'బందులో ప్రయాణం' రియాలిటీ చెక్‌ను ఆసక్తికరంగా మలిచారు.

– తపుటు రామచంద్రం, జగిత్యాల


మా చిరునామా

**ఫన్‌డే**

సాక్షి తెలుగు దినపత్రిక

6-3-249/1, రోడ్ నం.1, బంజారాహిల్స్,

హైదరాబాద్ - 34. funday.sakshi@gmail.com



Designing: Sampangi Mallesh



డయల్ a డెంటిస్ట్




డా. సృజనారెడ్డి గారు

పాజిటివ్ డెంటల్

92480 41003

S.R.నగర్ • మాదాపూర్ • కెపిహెచ్‌బి • కర్నూల్ • నిజాంపేట

◆ **ఇంప్లాంట్స్ అనగా ఏమిటి?**

కృత్రిమ దంతాలు అమర్చే విధానాలలో మనకు అందుబాటులో ఉన్న ఉత్తమమైన మరియు ఆధునికమైన పద్ధతి. ఈ పద్ధతిలో దంతాలు అమర్చడంతో పాటు సంబంధిత ఎముకను కూడా కాపాడుకోవచ్చు.

◆ **ఇంప్లాంట్స్ యొక్క అమరిక ఎలా జరుగుతుంది?**

దంతం లేని స్థానంలో ఉన్న ఎముకను ఆధారంగా తీసుకుని ఇంప్లాంట్స్‌ని అమర్చి, దానిపైన దంతం అమర్చడం జరుగుతుంది. తద్వారా ఈ పద్ధతిలో పన్ను, వేరు భాగంతో సహా అమర్చబడుతుంది (Complete tooth replacement)

◆ **ఇంప్లాంట్స్ మన్నిక ఎలా ఉంటుంది? దుష్ఫలితాలు ఏమైనా ఉంటాయా?**

సరియైన చికిత్స విధానము, నాణ్యమైన ఇంప్లాంట్స్‌ని ఎన్నుకున్నట్లైతే ఫలితాలు శాశ్వతంగా ఉంటాయి. దంత వైద్యుల సూచనలు పాటించాల్సి ఉంటుంది. ఎటువంటి దుష్ఫలితాలు ఉండవు.

◆ **ఇంప్లాంట్స్ అమర్చడానికి ఎంత కాలం పడుతుంది?**

ఇందులో రెండు పద్ధతులు ఉంటాయి. 1) ఇమిడియేట్ ఇంప్లాంట్స్ : ఇందులో దంతం తీసిన వెంటనే ఇంప్లాంట్స్‌ని, దంతాన్ని అమర్చుతారు. 2) ఈ పద్ధతిలో ఇంప్లాంట్ అమర్చిన తరువాత ఎముక యొక్క పటుత్వం పెరగడానికి కొంత వ్యవధి తీసుకోవాల్సి ఉంటుంది (2-3 నెలల వ్యవధి) తరువాత దంతాన్ని అమర్చుతారు.

◆ **ఇంప్లాంట్స్ ఏ వయస్సు వారికైనా అమర్చవచ్చా?**

ఇంప్లాంట్స్ అనేది ఎముక పరిమాణం బట్టి వయస్సు నిమిత్తం లేకుండా ఎవరికైనా అమర్చవచ్చు పూర్తిగా పళ్ళులేని వాళ్ళకి కూడా ఎముక పరిమాణాన్ని బట్టి ఇంప్లాంట్స్ సంఖ్యని నిర్ణయించి తద్వారా ఇంప్లాంట్స్ అమర్చుతారు.

*Implant system is the best and the only method to replace the complete tooth and to preserve bone*

Art of Dentistry

పాజిటివ్ డెంటల్

www.positivedental.com

S.R.Nagar : 9391116660 : 22/A, Leela Nilayam, Behind RTC Bus Stop.
Madhapur : 9248041001 : Opp: SBI, Kavuri Hills, Hyderabad-83.
Nizampet : 9246211006 : Livingston Estates, Near Sangamithra School.
KPHB : 9290901003 : 203, HIG, MRO Lane, Dharmareddy Colony.
Kurnool : 9290909003 : Opp. More Super Market, Allampur Bus Stop, NR Pet.

# ముగిసిన జాతర



జీవ వైవిధ్య సదస్సు ముగిసింది. హైదరాబాద్‌లో రోడ్లు బాగుపడ్డాయి. కాంట్రాక్టర్ల జేబులు నిండాయి. విదేశాల నుంచి జనం వచ్చారు. వాళ్లకు తెలిసింది వాళ్లు మాట్లాడారు. పులి కనబడ్డం లేదన్నారు. రాజకీయ నాయకులొచ్చి అభయమిచ్చారు. 'అంతా మీ భ్రమ, కళ్లు తెరచి చూడండి. పులులు రూపం మార్చుకున్నాయి అంతే' అన్నారు.

ఏనుగు మాయమైందన్నారు. గవర్నమెంట్ అధికారులు స్టాళ్లు పెట్టి 'తెల్ల ఏనుగులు ఇక్కడున్నాయి' అని అరిచారు.

రాబందులు అంతర్ధానం అని సదస్సులో వాపోయారు. ''మాదీంద రోజూ వాలుతూనే ఉన్నాయి'' అని పేద ప్రజలు మొత్తుకున్నారు.

కొండ చిలువలెక్కడ అని జీవ అండ్ కంపెనీ కేకలు పెట్టింది. కాంట్రాక్టర్లు ప్రత్యక్షమై ''రోడ్లు, ప్రాజెక్టులు, బ్రిడ్జిలు అన్నీ మింగేస్తున్నాం, మమ్మల్ని మించిన చిలువలు కావాలా? అని ఆవేదన వ్యక్తం చేశారు.

వేరేట్ మొసలి అని సదస్సులో వెతికారు. ''మొసలి లేదు కానీ మొసలి కన్నీళ్లు మిగిలాయి'' అని బాబు పాదయాత్రలో కన్నీళ్లలో జారిపడి కాళ్లు విరగ్గొట్టుకున్న వాళ్లు చెప్పారు. నక్కలు, తోడేళ్లు ఏమయ్యాయి బాబోయ్ అని వైవిధ్య వాళ్లు అరిచారు. కార్పొరేట్ కంపెనీ వాళ్లు వచ్చి ''మేం మార్ట్‌లు, మాల్స్ పెట్టి దొరికినవన్నీ దొరికినట్టు పీక్కు తింటున్నాం. ట్వంటీ ఫస్ట్ సెంచరీ ఫాక్స్‌లు ఇలాగే ఉంటాయి' అన్నారు. గొర్రెలు, మేకల సంగతి తేల్చండి అని అడిగితే ''మా దేశంలో గొర్రెలు, మేకలకు కొదువే లేదు. ఐదేళ్లకొకసారి ఓటు కూడా వేస్తాయి'' అని నాయకులు హామీ ఇచ్చారు.

ఎవరికి అర్థమైన మేరకు వాళ్లు రాసి పత్రికల్లో అచ్చేశారు. జనం చదువుకున్నారు. టీఏ, డీఏలు తీసుకుని జీవులు వెళ్లిపోయాయి. ఎన్ని వందల కోట్లయినా ఇష్టమని మొహంలో ఏ భావం లేకుండా ప్రధాని చెప్పారు. విమానాలు ఎగిరిపోయాయి.

ఇదంతా చూసి, విన్న ఒక గిరిజనుడు ''మీరు కోట్లు ఖర్చుపెట్టి కాపాడే జీవ వైవిధ్యాన్ని మేము పైసా ఖర్చు లేకుండా కాపాడుతాం. మమ్మల్ని ఊళ్ల నుంచి, అడవుల నుంచి తరమకుండా ఉంటే చాలు'' అన్నాడు.

● జి.ఆర్.మహర్షి

● మహర్షిజం



**తెలుగు తమ్ముడి కామెంట్**
మా చంద్రబాబు కంప్యూటర్ పాస్‌వర్డ్ మరిచిపోయి, చివరికి రైతుల్ని కీవర్డ్‌గా గుర్తించారు.

**సామాన్యుడి సణుగుడు**
రాష్ట్రంలో ఏం జరిగినా ప్రజలు షాక్ తినడం మానేశారు. (కరెంట్ ఉంటేగా!)



**పర్యావరణ పరిరక్షణ అంటే?**
చెట్లు నరికి, మొక్కలు పెంచడం





**కాంగ్రెస్ నాయకుడి ఆవేదన**
ఢిల్లీ నాయకులకు చత్వారం ఎక్కువ. పులి వేషగాళ్లను చూసి కూడా నిజం పులులేనని భయపడుతుంటారు.



**తెలుగుదేశం నాయకుడి స్టేట్‌మెంట్**
మా చంద్రబాబు సన్యాసం తీసుకున్న పులిలా మాట్లాడుతున్నా, కోరల్ని మాత్రం జనం గుర్తు పడుతున్నారు.










# మీ ఇంట్లోనే పవర్‌ఫుల్ స్పోకెన్ ఇంగ్లీష్ టీచర్

## ఇంగ్లీష్ కోర్స్ రూ.600*/- లకే

| మూడు డివిజన్ల ఇంగ్లీష్ కోర్స్ | డివిజన్-1<br>డివిజన్-2<br>డివిజన్-3 | + | అడిషనల్ బుక్స్, ఒక డైరీ మరియు ఒక ఆడియో సి.డి. | = | ఇవన్నీ రూ.600/-లు |
|---|---|---|---|---|---|

**డివిజన్-1** Basic నుంచి ఇంగ్లీష్ చదవటం, రాయటం, నేర్పుతూ, ప్రతి ఒక్కరికీ కావలసిన స్థాయిలో స్టాండర్డ్ ఇంగ్లీష్ నేర్పబడుతుంది.

**డివిజన్-2** తప్పులు లేకుండా ఇంగ్లీషు రాయుటకు కావలసిన ఆంగ్ల వ్యాకరణం పరిపూర్ణంగా సులభ సూత్రాలతో చాలా ఈజీగా నేర్పబడుతుంది.

**డివిజన్-3** ఎంతో సులభంగా, ఏ సందర్భంలోనైనా తడబడకుండా, తప్పులు లేకుండా, మంచి నీళ్ళు త్రాగుతున్నట్లుగా మంచి ఇంగ్లీషు మాట్లాడటం నేర్పబడుతుంది.

**పూర్తి డబ్బు వాపస్**

మునుపెన్నడూ మీకీ కోర్సు నచ్చలేదని అనిపిస్తే, కోర్సు పుస్తకాలు 15 రోజులలోపల మాకు తిప్పి పంపండి. మీ డబ్బుని (కేవలం పోస్టు ఖర్చులు మాత్రం మినహాయించి) మీకు ఎమ్.ఓ. చేస్తాం. కోర్స్ మెటీరియల్ సైజు 18cm x 24cm లోనూ, డైరీ సైజు 12cm x 17.5cm లోనూ (ఆఫ్ సెట్ మల్టీ కలర్ కవర్‌తో) ఉంటాయి. విద్యార్థుల సౌకర్యాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రతి సంవత్సరానికి క్రొత్త డైరీగా ఉపయోగించుకునే విధంగా ప్రత్యేకంగా రూపొందించబడిన డైరీ.




**SMS పంపండి (లేదా) కూపన్ పంపండి.**

**Phone: 0-99405 70931**

పై సెల్‌ఫోన్ నెంబరుకు మీ పేరు, ఇంటి నెం. ఊరిపేరు, పిన్‌కోడ్, ఫోన్ నెం.లతో సహా వివరంగా మీ అడ్రసును SMS చేయండి. పై ఫోన్ నెంబరు 24 గంటలూ కంప్యూటర్‌కు కనెక్ట్ చేయబడి ఉంటుంది. మీరు పంపే ఎస్.ఎమ్.ఎస్. అడ్రసు ఫోన్ నుండి కంప్యూటర్‌కు వెళ్తుంది. మీ అడ్రసు ప్రకారం మేము కోర్సు మెటీరియల్ పంపుతాము. దయచేసి ఫోన్‌లో అడ్రసు చెప్పడానికి ప్రయత్నించవద్దు. SMS పంపడానికి అవకాశం లేనివారు ఈ ప్రకటనలో ఉన్న కూపన్‌ను పూర్తిచేసి పంపండి.

**STUDENTS' ENGLISH INSTITUTE**

No.17/A, Chari Street, T. Nagar, Chennai - 600 017.

నాకు కోర్సు మెటీరియల్ పంపండి. పోస్ట్‌మేన్‌కి రూ.600/- + 30/- (M.O.కమీషన్) మొత్తం రూ.630/-లు చెల్లించి ప్యాకెట్‌ని తీసుకుంటానని హామీ ఇస్తున్నాను.

Name: ...........................................................

Address: ........................................ Pincode

# రాత్రి అట్ల తద్ది! తెల్లవారితే తిట్ల తద్ది!!



అట్లతద్ది ఎప్పుడా అని ఎదురు చూడని కుర్రాడు ఉండేవాడు కాదు మా ఊళ్లో. ఆశ్వయుజంలో... శరదృతువు మొదట్లో వచ్చే ఆ పండుగ ఓ అందమైన పండుగ. అంతా కలిసి చేసుకునే వేడుక. వెన్నెల రాత్రుల్లో వస్తుంది తద్ది. ఆడపిల్లలు తెల్లవారకట్టే లేచి 'అట్లతద్దోయ్ ఆరట్లోయ్' అని పాడుతూ, ఆడుతూ పండుగ జరుపుకుంటారు.

కానీ కుర్రాళ్ల సందడి వైవిధ్యంగా ఉండేది. ఊళ్లో ఉన్న పదిహేను, పదహారేళ్ల కుర్రాళ్లు ఆ రోజు జేమ్స్‌బాండ్లు అయిపోయేవారు. వాళ్ల కంటె కొంచెం చిన్నవాళ్లు లేదా మొదటిసారి ఈ వీరోచిత కార్యక్రమంలో పాల్గొంటున్నవారు, కూడబలుక్కొని రెండు రోజుల ముందు గ్రామం అంతా సర్వే చేసేవారు. ప్రతి పెరట్లోను అన్నో ఇన్నో ఆకుకూరలు, కాయగూరలు పండించుకున్న కాలం అది. ఇక కొబ్బరి తోటల చుట్టూ, పరిదేల చుట్టూ అరటిచెట్లు ఉండేవి. ఎవరి పెరట్లో ఏ కూర విస్తారంగా పండి కోతగా సిద్ధంగా ఉంది? ఎవరి తోటలో, ఎవరి చేను గట్టున అరటి గెలలు పక్వానికి వచ్చి ఉన్నాయి? ఇదీ ఆ సర్వే ధ్యేయం.

పల్లెటూళ్లు పదింటికే నిద్రపోతాయి. కుర్రాళ్లు అప్పటిదాకా రామాలయం మండపంలోనో, పంచాయితీ ఆఫీసు అరుగు మీదో గుసగుసలాడుకుంటూ గడుపుతారు. ఊరు సద్దుమణుగుతుంది. అప్పుడు బయలుదేరతారు, ముసుగులు కప్పుకుని.

అసలే కోనసీమ. వెన్నెల్లో చూసిన ఆ దృశ్యాలు అందుకే ఇప్పటికీ స్మృతిపథం నుంచి చెరిగిపోలేదు. కాలువ గట్ల మీద కొబ్బరాకుల మధ్య నుంచి జారుతున్న వెన్నెల కిరణాల మధ్య నుంచి చడీచప్పుడూ కాకుండా నడిచేవాళ్లం. కాలువ మీద కొబ్బరి పట్టె మీద నడక ఇంకా అద్భుతం. ఓ ఇంటి దగ్గర ఆగేది బృందం. పెద్ద బ్యాంకు దోపిడీ జరుగుతున్న స్థాయిలో సైగలు జరిగేవి. దాని సారాంశం- వీళ్ల పెరట్లో, కడిపక్కన తోటకూర కాడలు గజం ఎత్తున ఉన్నాయి. అంతే. ఇద్దరు నిపుణులు- అంటే అంతకు ముందు సంవత్సరం తద్దిని దిగ్విజయం చేసినవాళ్లు- లాఘవంగా గోడ ఎక్కి, నిశ్శబ్దంగా లోపలికి దిగేవారు. మూడు నాలుగు నిమిషాల తరువాత తాజా తోటకూర కాడలు రెండు మూడు మోపులు ఇవతలకి వచ్చి పడేవి. వాటిని అందుకుని జూనియర్లు పరుగు పరుగున రామాలయం మండపం దగ్గరికి వచ్చి వెనకాల దాచేసేవారు. ఒకసారి ఒక అరటి తోటలోకి ప్రవేశించాం. లోపలికి నడుస్తున్నాం. తద్ది కోసం గుర్తించిన ఆ గెల బాగా లోపలికి ఉంది. అక్కడికి వెళ్లిపోయాం. అప్పుడు వినిపించింది కేక, "ఎవర్రా అదు?". తోట అదిరిపోయింది. ఇదంతా వ్యూహం. మమ్మల్ని బెదరగొట్టడానికి అక్కడిదాకా పోనిచ్చి అప్పుడు కాపలావాడు కర్ర పుచ్చుకుని వెంటపడేవాడు. కానీ దగ్గరికి వచ్చేసినా కొట్టేవాడు మాత్రం కాదు. టామ్ అండ్ జెర్రీ వ్యవహారం.

ఇక్కడ ఇంకో సంగతి చెప్పాలి. ఈ మహాత్కార్యంలో మొహమాటాలూ, తన పర భేదాలూ, బంధుప్రీతులూ ఉండవు సుమా! మా పెరట్లో ఓ అరటి గెల బాగా తయారై ఉన్న సంగతి వాళ్లు కనుగొన్నారు. అలాగే ఇంకొకరి పెరట్లో గోంగూర విరగపూస్తోన్న సంగతీ ఆచూకీ తెలుస్తుంది. నన్ను గోంగూర చెట్లు తప్పించి రావడానికి పురమాయిస్తాడు నాయకుడు. గోంగూర పెరడు వాడిని మా పెరట్లో అరటిగెల కొట్టుకొచ్చేయమని పురమాయిస్తాడు. ఆ సంగతి నాకు, ఈ సంగతి వాడికి తెలియదు- ఉదయం వరకు. అసలు, తమ పెరళ్లలో సంపదని కాపాడుకొనే ఉద్దేశంతో వచ్చేవాళ్లూ ఉండేవాళ్లు. అది కనిపెట్టేసి, వాళ్లని బోల్తా కొట్టించేవాళ్లు అనుభవజ్ఞులు.

గోడలు దూకి, చేలల్లో జారిపోయి, వెనకాల ఎవరో కర్ర పుచ్చుకు తరుముతుంటే కాలికి బుద్ధి చెప్పిన ఫలితంగా అర్ధరాత్రి మూడు గంటల వేళ అలసటతో శాకాల సేకరణకు స్వస్తి పలికేవాళ్లం. అప్పటికి మండపం పై భాగం మొత్తం హోల్‌సేల్ కూరల గోదామును మరిపించేది. ఊళ్లో ఉన్న గడపలు ఎన్నో తెలుసు కాబట్టి, అన్ని సమ భాగాలు చేసేవారు సీనియర్లు. సొరకాయ ముక్కలు, అరటికాయలు, గుమ్మడి బద్దలు, తోటకూర, గోంగూర, వంకాయలు, బెండకాయలు అన్నీ... తీసుకువెళ్లి ప్రతి గడప ముందు అంతంత పెట్టేసి గుట్టుచప్పుడుగా ఇళ్లకి వెళ్లేవాళ్లం. అదేమిటో, ఆ రోజుకు కావలసిన శాకాలు గడప ముందు ఉచితంగా వచ్చి పడినా, పొద్దున్నే అంతా తిట్లు లంఘించు కునేవారు.

రాత్రి అట్లతద్ది, తెల్లారితే తిట్ల తద్ది. ఏటా ఇదే సంబరం. ఇప్పుడు చూద్దామన్నా ఆ సరదా, సంబరాలూ లేవు, ఆ తిట్లూ దీవెనలూ లేవు.

● డా॥ గోపరాజు నారాయణరావు

ఆమెకు కట్టుకున్నవాడంటే ఇష్టం ఉండదు. అంతకు ముందే తన మనసును ఆకట్టుకున్నవాడు వేరొకడున్నాడు మరి. ఆ విషయం తెలిసి తాళికట్టినవాడే తండ్రిలా మారతాడు. భార్యని ఆమె ప్రియుడికే 'కన్యాదానం' చేయడానికి సిద్ధపడతాడు. మగడి గొప్ప మనసు చూసి ఆమె గుప్పెడంత మనసు కరిగి నీరవుతుంది. కన్నెమనసును కట్టిపడేసిన కలల రాకుమారుడికి, కన్నీళ్లు పెట్టించేంత మంచితనం ఉన్న మగ మహారాజుకి మధ్య తానెవరో, తనకెవరో తెలియక సతమతమైపోతుంది. అంతటి 'సతమతాన్ని' ప్రేక్షక జన సమ్మతంగా అభినయించి మెప్పించిన ఆ 'అభినేత్రి' ఏరీ? కుటుంబ కథానాయికగా రాణిస్తూనే, కుర్రకారుని చిలిపినవ్వుల్తో మెప్పించిన చిన్నది ఎక్కడ?



# పిల్ల నచ్చింది... ఇంతకీ ఎక్కడుంది?

పిల్ల నచ్చింది, కన్యాదానం, బావగారూ బాగున్నారా, సుల్తాన్, మావిడాకులు, నేను ప్రేమిస్తున్నాను... తదితర సినిమాల్లో తళుక్కుమన్న కథానాయిక రచనా బెనర్జీ. చిలిపి భామ రచన కోల్‌కతా వాసి. మోడల్‌గా కెరీర్ ప్రారంభించి, ప్రకటనకర్తల అభిమాన అందాల సుందరిగా అవతరించింది. ఆ తర్వాత సినిమాల్లోకి వచ్చి మాతృభాష బెంగాలీతో పాటు ఒరియా, తమిళ, తెలుగు చిత్రాల్లోనూ నటించింది. 'సూర్యవంశ్' హిందీ చిత్రంలో అమితాబ్ సరసనా మెరిసింది. అటు ముచ్చటైన ఇల్లాలిగానూ ఇటు సరదా సరదా కాలేజీ గాళ్‌గానూ నటించి మెప్పించిన ఈ బెంగాలీ బ్యూటీ ఏమైపోయింది?

**'స్టార్‌డమ్'కు గుడ్‌బై...**

అన్యభాషా కథానాయికలకు అతి తక్కువ అవకాశాలిచ్చే ఒరియా చిత్ర సీమలో కూడా స్టార్‌డమ్‌ను చవిచూసిన హీరోయిన్ రచన. అవకాశాలకు అనుగుణంగా పలు భాషా చిత్రాల్లో నటిస్తున్నప్పటికీ ఒరియాలో స్టార్ స్టేటస్ రావడంతో అక్కడే సెటిలైపోదామని అనుకుంది. అంతలోనే అత్యధిక ఒరియా చిత్రాల్లో తనకు సహనటుడిగా చేసిన సిద్ధాంత మహాపాత్రను ప్రేమించి పెళ్లాడింది. అయితే పెళ్లి ఆమె కెరీర్‌తో పాటు వ్యక్తిగత జీవితాన్ని కూడా పణంగా కోరింది. ఫలితంగా భర్తనుంచి విడాకులు తీసుకోవాల్సి వచ్చింది. ఒరియా చిత్రసీమకు కూడా గుడ్‌బై చెప్పేసింది.

ఒడిశాను వదిలేశాక తన జన్మ స్థలమైన కోల్‌కతాకు వచ్చేసింది రచన. టీవీ రియాలిటీ షోలు, గేమ్‌షోలు చేసింది. సౌరవ్‌గంగూలీతో కలిసి చేసిన 'దాదాగిరి అన్‌లిమిటెడ్' బాగా పేరు తెచ్చింది. అయితే కొంత కాలంగా సినిమా, చిన్నితెర రెండింటికీ దూరంగా ఉంటోంది. దీనికి కారణం మళ్లీ పెళ్లి. తొలి వైవాహిక బంధం పెటాకులైనంత మాత్రాన కృంగిపోయి జీవితాన్ని బలితీసుకోవడమో, జీవితాంతం అలాగే ఉండిపోవడమో చేయకుండా... తిరిగి తన మనసుకు నచ్చిన ప్రబల్ బసును పెళ్లి చేసుకుంది. ప్రస్తుతం భర్త, కొడుకుతో హాయిగా కుటుంబజీవనం కొనసాగిస్తోంది.

**మళ్లీ నటన వైపు...**

దాదాపు ఆర్నెళ్ల విరామం తర్వాత బెంగాలి నాటకరంగానికి సంబంధించిన సుప్రసిద్ధ కళావేదిక జత్రా ద్వారా మళ్లీ నటనను ప్రారంభించాలనుకుంటున్నట్లు చెప్పారు రచన. ''ఇది నాకో ఉత్తేజకరమైన అనుభవం కానుంది. ఎందరో అద్భుత కళాకారులు అధిరోహించిన వేదికను నేను పంచుకోబోతున్నాను'' అంటున్నారామె ఆనందోద్వేగాలతో. తన కెరీర్‌కు టర్నింగ్‌పాయింట్ ఇచ్చింది ఒరియా చిత్రపరిశ్రమే అని, తనకు డబ్బు, పేరు, గొప్ప పాత్రలు అన్నీ ఇచ్చింది ఒరియా చిత్రాలేనని అంటారు రచన. ప్రస్తుతం సినిమాలు కొత్త పుంతలు తొక్కుతున్నాయంటూనే మన సినిమా ఇంకా అందుకోవాల్సిన శిఖరాలు ఎన్నో మిగిలే ఉన్నాయన్నారు. తన జీవితంలో మరచిపోలేని అనుభవం అంటే అమితాబ్‌తో కలిసి నటించడమే అని స్పష్టం చేస్తారు. కానీ మళ్లీ సినిమా ప్రవేశం గురించి మాత్రం ఏమీ కచ్చితంగా చెప్పడం లేదు.

ఖాళీ సమయాల్లో ఏం చేస్తారంటే... ఒకప్పుడు సినిమాలు, ఇప్పుడు నాలుగేళ్ల కొడుకు తనను ఖాళీగా ఉంచడానికి ఇష్టపడడం లేదంటూ నవ్వేస్తారు. అత్యంత ఇష్టమైన వ్యాపకం తన కొడుకుతో గడపడమే అంటున్న రచన... ఫ్రెండ్స్‌ను కలవడం తనకు నచ్చే మరో హాబీ అన్నారు. ఎన్ని ఊర్లు తిరిగినా, ఎంత కాలం దూరంగా ఉన్నా తాను పుట్టి పెరిగిన కోల్‌కతాకు సాటిరాదని, అందుకే దక్షిణాదిని, ఒడిశాని అక్కడి అవకాశాలనూ వదులుకుని తిరిగి తన జన్మస్థలానికి చేరానని అంటున్నారు.

పడుతూ లేస్తూ సాగే పయనం ఆశించినంత ఆనందాన్నివ్వకపోవచ్చు కానీ ఊహించనంత ఆత్మవిశ్వాసాన్ని అందిస్తుంది. రచన జీవనయానం అందుకో ఉదాహరణ.

● ఎస్.సత్యబాబు

● ఇన్నర్‌వ్యూ

జేమ్స్‌బాండ్ గురించిన ఉపోద్ఘాతంలో 'ధర్మ సంస్థాపనార్థాయ...'ని ఉదహరించడం ఔచిత్యం అవదేమో! కాకపోతే, ప్రపంచంలో ఏ చెడు ఎక్కడ తలెత్తినా దాన్ని అంతుచూడనిదే నిద్రపోడు బాండ్. దానికోసం అతడు ఎంత రిస్కయినా తీసుకుంటాడు. ఎంతదూరమైనా ప్రయాణిస్తాడు. అలాగని చొక్కాలేమీ చింపుకోడు. స్టైలుగా, నీటుగా, అచ్చు మన కృష్ణుడికి మల్లేనే సొగసుగా పనిచేసుకువెళ్తాడు. ఆ గోపాలుడిలాగానే ప్రేయసులు అతడి వెంటపడతారు. అరవై ఏళ్లుగా వన్నె తగ్గని, వయసు తగ్గని, ప్రజాదరణ ఎంతమాత్రమూ తగ్గని ఆ 'ప్రపంచ గూఢచారి' జేమ్స్‌బాండ్ పుట్టుపూర్వోత్తరాలే ఈవారం కథనం...

# 007 @ 50



తొట్టతొలి సినిమా బాండ్: షాన్ కానరీ (ముఖచిత్రం: ప్రస్తుత బాండ్ డేనియల్ క్రెయిగ్)

### ఇప్పుడు బాండ్ గురించి ఎందుకు?

ఎందుకంటే... ప్రపంచ సాహిత్య చరిత్రలో ఒక పాత్ర ఇంత జనరంజకం అవడం అత్యంత అరుదైన విషయం కనుక. ప్రపంచ సినిమా చరిత్రలో కూడా ఇది అత్యంత అరుదైన విషయమే కనుక. జేమ్స్‌బాండ్ సిరీస్‌లో తొలిగా వచ్చిన 'డాక్టర్ నో' చిత్రం విడుదలై 50 ఏళ్లు పూర్తయ్యింది కనుక. ఈ సిరీస్‌లో 23వదైన 'స్కై ఫాల్' 26 అక్టోబర్‌న విడుదలవుతోంది (ఇది రాసేనాటికి) కనుక. ఈ సందర్భంగా సృష్టికర్త ఇయాన్ ఫ్లెమింగ్‌నీ, బాండ్ పుట్టుకనీ, బాండ్‌ని పరిపూర్ణం చేసినవాళ్లను తలుచుకునే అవకాశం ఉంది కనుక.

### ఎవరీ ఫ్లెమింగ్?

జేమ్స్‌బాండ్ సృష్టికర్తగా విశ్వవిఖ్యాతమైన ఇయాన్ ఫ్లెమింగ్(1908-1964) ఇంగ్లండ్‌లోని సంపన్న కుటుంబంలో జన్మించాడు. వాళ్ల నాన్న వాలెంటైన్ ఫ్లెమింగ్ బ్రిటన్ పార్లమెంట్ సభ్యుడు.

ఫ్లెమింగ్ తొలుత నావల్ ఇంటెలిజెన్స్ ఆఫీసర్‌గా పనిచేశాడు. రెండో ప్రపంచ యుద్ధ సమయంలో గూఢచారుల రహస్య ఆపరేషన్లను దగ్గరినుంచి చూశాడు, వాటిలో పాల్గొన్నాడు. ఆ కెరీర్ ఆయనకు ఒక బ్యాక్‌గ్రౌండర్‌లా పనిచేసింది. కొంతకాలం జర్నలిస్టుగానూ ఫ్లెమింగ్ సేవలందించాడు.

ఇంటెలిజెన్స్ డివిజన్లో పనిచేస్తున్నప్పుడే, రచయితగా మారాలనుకున్నాడు ఫ్లెమింగ్. తన వృత్తి ఆధారంగానే ఒక గూఢచారి పాత్రతో నవల ఆరంభించే యోచన చేశాడు. ఆ భావావేశంలోనే, 'ఆయామ్ గోయింగ్ టు రైట్ ద స్పై స్టోరీ టు ఎండ్ ఆల్ స్పై స్టోరీస్,' అని ఒక మిత్రుడితో వ్యాఖ్యానించాడట కూడా.

అయితే, అన్నీ కుదిరి, కాలం కలిసి, కథ వక్కానికి వచ్చేనాటికి ఫ్లెమింగ్ 45 ఏళ్లవాడు. అప్పటికి యాన్ చార్టెరిస్‌తో నిండా ప్రేమాయణంలో ఉన్నాడు. ఆమె డైవోర్స్, వివాహ తేదీ నిశ్చయమైంది.

తలమునకలుగా ఉన్న పెళ్లి పనుల నుంచి కాస్త తెరిపిన పడటానికి రచన ఒక మార్గం అనుకున్నాడు ఫ్లెమింగ్. అలా, 1952లో జమైకాలోని తమ 'గోల్డెన్‌ఐ' ఎస్టేట్‌లో నవల రాయడానికి ఉపక్రమించాడు.

### ఏం పేరు పెట్టాలి?

ఫ్లెమింగ్ తన తొలి బాండ్ నవలకు అంకురార్పణ చేస్తూనే, హీరో పాత్రకు ఏ పేరు పెట్టాలా అని తీవ్రంగా ఆలోచించాడు. పేరు అంత గొప్పగా ఉండకూడదు, అంటే అతడంత గొప్పవాడిలా అనిపించకూడదు, కానీ ఎన్నో గొప్పపనులు చాలా సులభంగా జరిగిపోతాయనిపించాలి... ఉత్తినే అన్నీ వచ్చి ఒళ్లో వాలే తరహాగా ఉండాలి... ఈ లక్షణాలుండాలంటే అది ఏం పేరయ్యుండాలి?

దానికోసం ఒక మనిషెక్కడో సిద్ధంగా ఉన్నాడు... అమెరికా పక్షిశాస్త్రజ్ఞుడి రూపంలో.

ఆర్నిథాలజిస్ట్ జేమ్స్‌బాండ్



జేమ్స్‌బాండ్ సృష్టికర్త ఇయాన్ ఫ్లెమింగ్



పేరుకు ప్రేరణ పక్షి శాస్త్రజ్ఞుడు జేమ్స్‌బాండ్

(1900-89) తన రంగంలో సుప్రసిద్ధుడు. 'బర్డ్స్ ఆఫ్ ద వెస్టిండీస్' పుస్తకం రాశాడు. స్వయంగా పక్షుల మీద ఫ్లెమింగ్‌కు కూడా ఆసక్తి ఉండటం, ఈ పుస్తకాన్ని ఆయన చదివివుండటం, ఆయన పేరు పెడితే ఎలా ఉంటుందన్న ఆలోచన తళుక్కుమనడం; ఒక నిశ్చయానికి వచ్చేశాడు ఫ్లెమింగ్.

జేమ్స్‌బాండ్ అన్న పేరు అంత రొమాంటిక్‌గా లేకపోయినా, మామూలుతనం ఉంటూనే, ఒక మగటిమి అందులో ధ్వనించిందట. ఇక ఇదే బెస్ట్ అనుకున్నాడు. పక్షుల రెక్కల్ని ప్రేమగా నిమిరే ఆ జేమ్స్‌బాండ్‌ను శత్రువుల రెక్కలు విరిచే కార్యంలోకి దించాడు. ఆఫ్‌కోర్స్... ఈ బాండ్ కూడా స్త్రీబాలల రెక్కల్ని అంతకంటే సుతారంగా నిమురుతాడనుకోండి!

పేరైతే సిద్ధంగా ఉంది. మరి దాన్ని వాడుకోవద్దా? అది జెంటిల్‌మన్ లక్షణం కాదే! అందుకని మర్యాద కోసం అసలైన జేమ్స్‌బాండ్‌ను కాంటాక్ట్ చేసి, అనుమతి అడిగాడట. ఆయన అంతకంటే జెంటిల్‌మన్. 'ఫైన్ విత్ ఇట్.' అన్నారట.

## బాండ్ రూపురేఖలు

పేరు ఖాయమే. మరి అతడి స్వరూపం ఎలా ఉండాలి? అతడిని అక్షరాల్లోకి అనువదించేప్పుడు, ఒక ఊహాచిత్రపు నమూనా లేకుండా రాయడం సాధ్యం కాదే!

దానికోసం అప్పటికెవరో పియానో మెట్ల మీద చేతివేళ్లతో నృత్యం చేస్తున్నాడు. హోగీ కార్మిచేల్ (1899-1981)!

మ్యూజిక్ కంపోజర్, సింగర్‌గా ఉర్రూతలూగించిన హోగీ... అమెరికాలోని జార్జియా రాష్ట్రగేయం 'జార్జియా ఆన్ మై మైండ్'కు స్వరరచన చేసినవాడిగా చరిత్రకెక్కాడు. అయితే, హోగీకి అంత అందగాడన్న పేరేమీ లేదు. అయినా బాండ్ అందంగా ఉండాలన్న నియమం ఉందా?

అయితే, ఇందులో హోగీతో పాటు తన రూపురేఖలు కూడా కలగలిసిన ఒక కొత్త మానవరూపాన్ని ఆవిష్కరించబూనుకున్నాడు ఫ్లెమింగ్.



ఇలా ఉండాలి: హోగీ కార్మిచేల్



బాండ్ నమూనా చిత్రం

## బాండ్ సాహస స్వభావాలు

స్టైలిష్. మ్యాన్లీ. చురుకైన చూపు. కరుకైన మాట. అమ్మాయిల దగ్గర ఎత్తు వేయడంలో, శత్రువుల్ని ఎత్తేయడంలో దిట్ట. అన్నింటికీ మించి భోగి. దానికి మించిన సాహసి. తనతోపాటు నావల్ ఇంటెలిజెన్స్‌లో పనిచేసిన కొందరు చురుకైన ఏజెంట్లను కలగలిపిన పాత్రను ఫ్లెమింగ్ సిద్ధం చేశాడు.

ఇంకో ముఖ్య విషయం... ఈ పాత్రకు ప్రేరణగా నిలిచిన గూఢచారుల్లో స్వయానా ఫ్లెమింగ్ అన్న పీటర్ కూడా ఉన్నాడు. పీటర్ ఫ్లెమింగ్ (1907-71) కూడా ఇంటెలిజెన్స్‌లో ఉన్నవాడే. ప్రపంచ యుద్ధ సమయంలో నార్వే, గ్రీస్ దేశాల్లో పనిచేశాడు. ఆయన సాహసికుడు, విస్తృతమైన యాత్రికుడు. ఎన్నో ట్రావెల్ బుక్స్ రాశాడు.

అలాగే, ఇయాన్ ఫ్లెమింగ్ విపరీతంగా స్మోక్ చేస్తాడు. మద్యం అంటే ప్రాణం పెడతాడు. ఇవీ బాండ్‌కు ఆపాదించాడు. గోల్ఫ్ ఆడటం, గ్యాంబ్లింగ్ మిర్రరింగ్ ఫ్లెమింగ్ ఇష్టాలు. అలాగే స్క్రాంబుల్డ్ ఎగ్స్ అంటే లొట్టలేసుకుంటాడు. ఇవన్నీ బాండ్ లక్షణాలుగా స్వీకరించాడు ఫ్లెమింగ్.

(అలాగే, తనకు నచ్చనివాటిని విలన్లకు ఆపాదించాడు. స్కూల్లో తనతో పోట్లాడిన ఒక విద్యార్థి పేరు స్కేరమాంగా. 'ద మ్యాన్ విత్ ద గోల్డెన్ గన్'లో ప్రతినాయకుడి పేరూ అదే.)

## బాండ్... బ్రాండ్

తనచుట్టూవున్న వాటిని, తనలోంచి తీసినవాటితో రంగరించి... తర్వాత్తర్వాత చరిత్ర కాబోతున్న తొలి నవలను సిద్ధం చేశాడు ఫ్లెమింగ్ (క్యాసినో రాయల్-1953). అయితే, ఒక స్నేహితురాలు అది చదివి ప్రచురించకపోవడమే మేలందట. లేదంటే కనీసం కలంపేరు పెట్టుకొమ్మందట. మరో మిత్రుడు, (తర్వాత సంపాదకుడైన) విలియమ్ ప్లోమర్‌కిస్తే ఆయనకు సస్పెన్స్ ఎలిమెంట్ లేనట్టనిపించినా... నచ్చింది. దాంతో తనే స్వయంగా మరో పబ్లిషర్ జొనాథన్ కేప్‌కు పంపించాడు.

చిత్రం! కేప్ దాన్ని అంతగా ఇష్టపడలేదు. అయితే పీటర్ రికమెండేషన్ వల్ల ప్రచురణకు ఒప్పుకున్నాడు. మళ్లీ చిత్రం! కేప్ ఊహించనంతగా పాఠకులు ఎగబడ్డారు. వరుసగా రీప్రింటుకు వెళ్లాల్సి వచ్చింది. పాఠకుల అంచనాకు తగ్గట్టుగానే ఫ్లెమింగ్ కూడా కొత్త ఊహలు, కొత్త ప్రాంతాలు, కొత్త సాహసాలతో కొత్త నవలలను కొత్త పుంతలు తొక్కించాడు. కేప్ కూడా అంతే నూతనోత్సాహంతో అచ్చొత్తుకుంటూ పోయాడు.

లివ్ అండ్ లెట్ డై (1954)
మూన్ రేకర్ (1955)
డైమండ్స్ ఆర్ ఫరెవర్ (1956)
ఫ్రమ్ రష్యా విత్ లవ్ (1957)
డాక్టర్ నో (1958)
గోల్డ్ ఫింగర్ (1959)
ఫర్ యువర్ ఐస్ ఓన్లీ (1960-కథలు)
థండర్ బాల్ (1961)
ద స్పై హూ లవ్డ్ మి (1962)
ఆన్ హర్ మెజెస్టీస్ సీక్రెట్ సర్వీస్ (1963)
యు ఓన్లీ లివ్ ట్వైస్ (1964)
ద మ్యాన్ విత్ ద గోల్డెన్ గన్ (1965)
ఆక్టోపసీ అండ్ ద లివింగ్ డేలైట్స్ (1966-కథలు)

## ప్రొఫైల్

| | | |
|---|---|---|
| పేరు | : | జేమ్స్‌బాండ్ |
| కోడ్ నేమ్ | : | 007 |
| వృత్తి | : | రాయల్ నేవీ కమాండర్ |
| ఇష్టం | : | గన్స్, గాళ్స్, గాజెట్స్, కార్స్ |
| జాతీయత | : | బ్రిటన్ |
| ప్రత్యేకత | : | ప్రపంచానికి ఏ కష్టం వచ్చినా ఒంటిచేత్తో రక్షించగలడు. |
| 'సంపద' | : | పుస్తకాలుగా పది కోట్ల కాపీలు, సినిమాలుగా 5 బిలియన్ డాలర్లు (ద్రవ్యోల్బణంతో లెక్కిస్తే 12 బిలియన్ డాలర్లు) |
| ప్రాణం పోసుకుంది: | | 1953లో |
| సృష్టికర్త | : | ఇయాన్ ఫ్లెమింగ్ |



ఏడు చిత్రాల బాండ్
రోజర్ మూర్

ఏడాదికొకటి చొప్పున పద్ధతిగా రాశాడు ఫ్లెమింగ్. అది కూడా జనవరి, ఫిబ్రవరి నెలల్లోనే రాసేవాడట. అది కూడా తొలి రచన చేసిన గోల్డెన్‌ఐ ఎస్టేట్‌లోనే. మొత్తంగా 12 నవలలు, రెండు కథా సంకలనాలు... బాండ్‌ను ప్రపంచ హీరో చేశాయి. ప్రపంచవ్యాప్తంగా సుమారు పది కోట్ల కాపీలు అమ్ముడైనాయి.

## సినిమా బాండ్

బాండ్ పాత్ర పుట్టిన ఏడాదికే ఈ పాత్రకున్న వ్యాపార సత్తా ఏమిటో తెలిసిపోయింది. టెలివిజన్‌లో రూపకం చేశారు. తర్వాత రేడియోలో, కామిక్ స్ట్రిప్స్‌గా, వీడియో గేమ్స్‌గా బాండ్ వివిధ మాధ్యమాల్లో ప్రత్యక్షమవుతూ, తన ఇమేజ్‌నూ, వాటి లాభాలనూ పెంపుచేస్తూ వచ్చాడు.

సినిమా వాళ్లతో కరచాలనం చేశాక, బాండ్ ప్రాభవం మరింత పెరిగింది. కెనడాకు చెందిన హారీ సాల్ట్జ్‌మన్, అమెరికన్ అయిన ఆల్బర్ట్ బ్రొకోలి భాగస్వామ్యంలోని ఇయాన్ ప్రొడక్షన్స్ కంపెనీ తొలి ప్రయత్నంగా టెరెన్స్ యంగ్ దర్శకత్వంలో 1962లో 'డాక్టర్ నో' నిర్మించింది. శక్తిమంతమైన సినిమా మాధ్యమంలో ఆ పాత్రను పోషించే శక్తివున్న నటుడెవరు? ముందు కొన్ని పేర్లు అనుకున్న తర్వాత, షాన్ కానరీ తెర మీదకు వచ్చాడు. ఆ పాత్రతో అటు బాండ్ ఇమేజ్ పెరిగిందా, ఇటు కానరీ ఇమేజ్ పెరిగిందా అన్నది చెప్పడం కష్టం. అంతగా అందులో ఒదిగిపోయాడు కానరీ. ఊహలకూ, గీతలకూ మాత్రమే పరిమితమైన బాండ్‌కు రక్తమాంసాల రూపునిచ్చాడు. బాండ్ చిత్రాల పరంపరను విజయవంతంగా ప్రారంభించాడు.

మాంటీ నార్మన్ స్వరపరిచిన జేమ్స్‌బాండ్ థీమ్ మ్యూజిక్ చిత్రానికి ఎసెట్ అయింది. వివిధ దర్శకులు బాండ్‌ను మరింత ప్రతిభావంతంగా ఆవిష్కరించడంలో పోటీపడ్డారు.

స్కాట్లాండ్‌కు చెందిన షాన్ కానరీ 'ఆరు+ఒకటి' చిత్రాల్లో జేమ్స్‌బాండ్‌గా నటించాడు. తర్వాత కానరీకి దీటుగా, అంతకంటే మేటిగా ఇంగ్లండ్‌కు చెందిన రోజర్ మూర్ ఏడు సినిమాల్లో ఆ పాత్రకు ప్రాణం పోశాడు. వీళ్లిద్దరికంటే మరింత మ్యాన్లీగా కనిపించే ఐర్లండ్ నటుడు పియర్స్ బ్రాస్నన్ నాలుగింటిలో నటించాడు. ఇక, జార్జ్ లాజెంబీ



బాండ్ గాళ్స్: ఉర్సులా ఆండ్రెస్, హాలీ బెర్రీ

ఒక్కదాంట్లో, తిమోతీ డాల్టన్ రెండింట్లో నటించి విఫలమైన... జేమ్స్‌బాండ్స్.

ప్రస్తుత అల్ట్రా మోడర్న్ ఇంగ్లిష్ యాక్టర్ డేనియల్ క్రెయిగ్ తాజాగా మూడో చిత్రం(స్కై ఫాల్)తో వస్తున్నాడు. ఈయనే హీరోగా 2014లో విడుదల చేయ సంకల్పించిన 24వ చిత్రం 'బాండ్ 24', 2016లో రాబోయేది 'బాండ్ 25'.

ఒకట్రెండు బాండేతర సినిమాలు నిర్మించినప్పటికీ, ఇయాన్ కంపెనీ బాండ్ సినిమాలకే సుప్రసిద్ధం. సినిమా సిరీస్‌గా అత్యధిక ఆదాయాన్ని గణించిన వాటిల్లో 5 బిలియన్ డాలర్లతో బాండ్ చిత్రాలు రెండోస్థానంలో ఉంటాయి. మొదటిది హ్యారీపాటర్ సిరీస్. ద్రవ్యోల్బణంతో గణిస్తే గనక, బాండే విజయవంతమైనట్టుగా అంచనా.

ఇయాన్ కంపెనీవి కానివి కూడా బాండ్ సినిమాలు వచ్చాయి. ఒకదాన్లో (నెవర్ సే నెవర్ ఎగైన్) షాన్ కానరీ నటించాడు. ఇదే చిత్రాన్ని మూలపేరుతో (థండర్ బాల్) ఇయాన్ కంపెనీ కూడా నిర్మించింది. దానిలోనూ కానరీయే హీరో.

ఇక అందమైన రత్నములుగా పేరొందిన బాండ్ గాల్స్ అనబడే జేమ్స్‌బాండ్ ప్రేయసులు, బాండ్ తన



మ్యాన్లీ బాండ్: పియర్స్ బ్రాస్నన్

### చిట్టీ చిట్టీ బ్యాంగ్ బ్యాంగ్

ఇయాన్ ఫ్లెమింగ్ తన పన్నెండేళ్ల కుమారుడు క్యాస్పర్ కోసం 'చిట్టీ చిట్టీ బ్యాంగ్ బ్యాంగ్' పిల్లల పుస్తకం కూడా రాశాడు. అదే పేరుతో అది సినిమాగానూ వచ్చింది. అయితే ఈ పుస్తకం ముద్రణకు రాకముందే ఫ్లెమింగ్ 1964లో తన 56వ ఏట గుండెపోటుతో మరణించాడు. క్యాస్పర్ తన 23వ ఏట 1975లో డ్రగ్ ఓవర్‌డోస్‌తో ఆత్మహత్య చేసుకున్నాడు.

ప్రయాణంలో కలుసుకునే అమ్మాయిల పాత్రలకూ సినిమాల్లో ఎంతో పేరుంది. ఉర్సులా ఆండ్రెస్, యూనిస్ గేసన్, జీనా మార్లో, హాలీ బెర్రీ, ఎవా గ్రీన్ మొదలైన నటీమణులెందరో బాండ్‌కు చెమటలు పట్టించారు.

## బాండ్ జన్మదినం ఏది?

ఒక పాత్రకు పుట్టినరోజు ఉంటుందా? ఫ్లెమింగ్... బాండ్ పాత్రను సృజించింది 1953లో. కానీ అది పుట్టినరోజు కాలేదు. ఎందుకంటే అప్పటికే బాండ్ మంచి యౌవనంలో ఉన్న సాహసవంతుడు. అంటే పాతిక ముప్పై ఏళ్ల ఉద్యోగి కదా! కాబట్టి ఈ తర్కంతో జేమ్స్‌బాండ్ జన్మదినాన్ని 11 నవంబర్ 1920గా 'నిర్ధారించాడు' జాన్ పియర్సన్... తన 'జేమ్స్‌బాండ్: ది ఆథరైజ్డ్ బయోగ్రఫీ ఆఫ్ 007' పుస్తకంలో.

## బాండ్‌కు మరణం లేదా?

ఫ్లెమింగ్ మరణించివుండొచ్చుగానీ, ఆయన సృష్టించిన బాండ్ మాత్రం నిత్యయౌవనుడు. మార్కెట్ ఉన్నంతకాలం అతడికి మరణం ఉండదు. అందుకే కాబోలు... ఫ్లెమింగ్ తర్వాత కూడా జేమ్స్‌బాండ్‌ను పాత్రగా పెట్టి ఎందరో గూఢచార రచనలు సాగించారు, సాగిస్తున్నారు, ఆ పాత్రను సజీవంగా ఉంచుతున్నారు. ఇలా పదుల కొలదీ పుస్తకాలు వచ్చినప్పటికీ, ఇందులో మరింత విలక్షణమైనది... బాండ్ కౌమారప్పు బాలుడిగా ఉంటే ఎలా ఉంటుందన్న ఊహతో చార్లీ హిగ్సన్ రాసిన 'యంగ్ బాండ్' సిరీస్. ఒక గ్రాఫిక్ నవలతో కలిపి మొత్తం ఆరు నవలలు.

తన పాత్రను అనుసరించడానికి మించిన ఆనందం ఏ రచయితకైనా ఇంకేముంటుంది! ఫ్లెమింగ్‌కు ఇంతకన్నా గౌరవం ఉండదేమో!

● ఆర్.ఆర్.

## Icon of the Week

**పేరు : గోవిందరాజుల సుబ్బారావు (1895-1959)**
**ఊరు : తెనాలి, గుంటూరు**
**సందర్భం : వర్ధంతి (అక్టోబర్ 29)**

నటుడిగా బాగా పరిచయం కానీ, వైద్య విద్యను అభ్యసించి డాక్టరుగా కూడా ప్రాక్టీసు చేశారు. సాహితీప్రియుడు, రచయిత కూడా.

- తెనాలిలో పాఠశాల విద్యను అభ్యసించారు. అప్పటి వైద్య విద్య ఎల్.ఎం.పి.లో పట్టా పొందారు. అనంతరం హోమియోపతిలోనూ ప్రావీణ్యం సంపాదించారు.
- అణువిజ్ఞానంపై అవగాహన పెంచుకుని ఐన్‌స్టీన్‌తో ఉత్తర ప్రత్యుత్తరాలు నెరిపేవారు. ఇనార్గానిక్ రెవల్యూషన్ అనే పుస్తకం కూడా రాశారు.
- నక్కాలు వయసులోనే మర్చంట్ ఆఫ్ వెనిస్ నాటకం వేసి ఆశ్చర్యపరిచారు.
- మాలపిల్ల, బాలనాగమ్మ, పల్నాటి యుద్ధం, గుణసుందరి కథ, షావుకారు, కన్యాశుల్కం, భాగ్యరేఖ వంటి పలు సినిమాల్లో నటించారు.



## Another Mahatma

**పేరు: సర్దార్ వల్లభాయ్ పటేల్ (1875-1950)**
**ఊరు : నాడియాడ్, గుజరాత్**
**ప్రత్యేకత: తొలి ఉప ప్రధాని, స్వాతంత్ర్య సమరయోధుడు**

సాహసోపేత నిర్ణయాలతో భారతదేశాన్ని ఎన్నో సమస్యల నుంచి విముక్తి చేసిన దేశభక్తుడు. కార్యశీలి. దృఢ మనస్కుడు.

- ఇంగ్లండులో బారిష్టరు విద్యను పూర్తి చేసుకున్నారు. అహ్మదాబాద్‌లో న్యాయవాదిగా మంచి పేరు సంపాదించారు.
- సహాయ నిరాకరణ ఉద్యమంలో పాల్గొన్నారు. రూ.15 లక్షల విరాళాలను సేకరించారు. కిసాన్ ఉద్యమాన్ని విజయవంతంగా నడిపి జాతీయ నాయకుల దృష్టిలో పడ్డారు.
- 1931లో జాతీయ కాంగ్రెస్ అధ్యక్షుడిగా చేశారు. ఉప్పు సత్యాగ్రహం, క్విట్ ఇండియా ఉద్యమాల్లో కీలకంగా వ్యవహరించారు.
- ప్రాథమిక హక్కుల కమిటీకి చైర్మన్. కేంద్రమంత్రిగా భారత దేశంలో కలవని రాజ్యాలను సైనిక చర్యతో కలిపేసి భారత దేశంలో శాంతికి కారకుడయ్యారు.



## Better half



**పేరు : ప్రభ**
**w/o : కె.జె.ఏసుదాసు**
**ఊరు : చెన్నై**

దాంపత్యం ఎలా ఉండాలో ఏసుదాసు-ప్రభలను చూడమంటారు అందరూ. ఆ ప్రశంసలో ఎక్కువ భాగం ప్రభకు దక్కాల్సిందే!

- యేసుదాసు పాటలకు ప్రభ చిన్నప్పటి నుంచి పెద్ద ఫ్యాన్.
- యేసుదాసుకు ప్రభ రెండవ భార్య. వారిది ప్రేమ వివాహం. ఇద్దరూ క్రైస్తవులే కానీ వేర్వేరు వర్గాలకు చెందినవారు.
- యేసుదాసు క్రమశిక్షణకు ప్రాధాన్యమిస్తారు. ప్రభ కూడా అలాంటి వాతావరణంలో పెరగడంతో భర్త ఇల్లు ఆమెకు కొత్తగా అనిపించలేదు.
- భర్తకు కోపం ఎక్కువే. కాకపోతే అది గడ్డిమంట. తొలినాళ్లలో ఇది తెలియక భయంతో బిగుసుకుపోయేవారట ప్రభ!
- నాకు ప్రభ భార్య మాత్రమే కాదు, అమ్మ, స్నేహితురాలు, సలహాదారు కూడా అని తన షష్టిపూర్తి ఉత్సవంలో యేసుదాసు వ్యాఖ్యానించారు.
- ఆఫీసుకు బాసు ఎలాంటివాడో, ఇంటికి భర్త కూడా అంతే. అతనికి గౌరవం ఇవ్వడం ద్వారా భార్య సౌకర్యవంతమైన జీవితం గడుపుతుందని ఆమె నవదంపతులకు చెబుతారు.

## Our pride



**పేరు : కమలాదాస్**
**ఊరు : పున్నయుర్కుళమ్, కేరళ**
**ప్రత్యేకత : ప్రఖ్యాత రచయిత్రి**

ప్రఖ్యాతి పొందడం అంటే ఆ రచనలో ఆకట్టుకునే అంశాని కన్నా మిన్నగా ఆలోచింపజేసే స్థాయి ఉందని అర్థం. కమలాదాస్ ఖ్యాతి వెనుక అర్థమదే.

- కేరళలోని త్రిసూర్‌లో జన్మించారు. తండ్రి మలయాళీ దినపత్రిక 'మాతృభూమి'కి మేనేజింగ్ ఎడిటర్. తల్లి ప్రముఖ మలయాళీ కవయిత్రి బాలామణి అమ్మ. మామ నారాయణ్ మీనన్ కవి. వీరి నుంచి రచన వారసత్వంగా అబ్బింది. తొమ్మిదేళ్లకే చిన్నపిల్లల కథను రాశారు.
- పదిహేనేళ్లకే పెళ్లయింది. బ్యాంకు అధికారి అయిన భర్త ఆమె రచనా వ్యాసంగాన్ని ప్రోత్సహించారు.
- మలయాళంతో పాటు ఇంగ్లీషులో కూడా రచనలు చేయడం వల్ల ఆమె విస్తృతి పెరిగింది. షార్ట్ స్టోరీస్, కవిత్వాలలో ఆమె కలం హద్దులు చెరిపేసుకుంది. అందుకే ఆమె రచనల్లో సహజత్వం, నిర్మలత్వం, ధైర్యం పాళ్లు ఎక్కువ. 42 ఏళ్లకే ఆమె రాసిన ఆటోబయోగ్రఫీ 'మై స్టోరీ' ఓ సంచలనం.
- ఎన్నో జాతీయ అంతర్జాతీయ అవార్డులు సాధించారు. 1984లో నోబెల్‌కు కూడా నామినేట్ అయ్యారు.

రాలిన మొగ్గలు

"నేనెప్పుడూ ఇంక చాల్లే అనుకోలేదు. నా లోపల్లోపల అట్టడుగున దాక్కుని ఉండిపోయిన శక్తినంతా తవ్వి తవ్వి తీశాను. అదే నా సాహిత్యం" అంటాడు అమెరికన్ రచయిత జాక్ లండన్. అందుకే పదిహేనేళ్ల కాలంలో ఇరవైకి పైగా నవలలు, నలభై వరకు నాటకాలు, వందకు పైగా కథలు రాయగలిగాడు. పత్రికలలో కాల్పనిక సాహిత్యమంటూ ప్రారంభమైందంటే జాక్ లాంటి వారి వల్లే. కీర్తితో ధనం వస్తే సరే. అలా కాకుంటే డబ్బొస్తే చాలు అని పలికేలా చేసిన దారిద్ర్యం అతనిది. పుట్టకుండానే చనిపోవాల్సిన జాక్... పుట్టి జీవితాన్ని పరమార్థం చేసుకున్నాడు.



# సాహితీజ్వాల

## ● జాక్ లండన్

ఆమె పేరు ఫ్లోరా వెల్‌మాన్. అమెరికాలో శాన్‌ఫ్రాన్సిస్కోలో ఉండేది. విలియం ఛానీని ప్రేమించింది. పెళ్లి చేసుకోలేదు. కానీ కలిసే ఉండేవారు. ఆమె నెల తప్పింది. అతనికి ఇష్టం లేదు. అబార్షన్ అన్నాడు. ససేమిరా అంది. తుపాకీతో కాల్చి చంపబోయాడు. కొద్దిపాటి గాయాలతో బయటపడింది. ఇంట్లోంచి గెంటేశాడామెను. నెలల మనిషిగా పడరాని పాట్లు పడింది. చనిపోదామని ప్రయత్నించింది రెండుసార్లు. కానీ కడుపులోని శిశువు గుర్తొచ్చాడు. వంటి చిగుప్పన కన్నీటిని ఆపుకుంది. 1876, జనవరి 12న మగబిడ్డకు జన్మనిచ్చింది. అతడే జాక్ లండన్.

తుచ్ఛమైన, మలినమైన బాల్యం జాక్‌ది. వీధులే ఆ కుర్రాడికి అన్నీనూ. రోడ్ల పక్కనే స్నానం, పానం. న్యూస్‌పేపర్లు అమ్మాడు. మిల్లుల్లో పనిచేశాడు. రోడ్లు ఊడ్చాడు. ఉత్సాహం ఉండేది. ఆశయాలుండేవి. ఆదర్శాలు ఉండేవి. కానీ అన్నమే ఉండేది కాదు. పొట్ట చేత పట్టుకుని తిరగని ఊరు లేదు. చివరకు పశ్చిమ తీరప్రాంత నగరమైన ఓక్‌ల్యాండ్ చేరుకున్నాడు. ఒడ కళాసీగా పనిచేసేవాడు. దగ్గర్లోని పబ్లిక్ లైబ్రరీ వెళ్తుండేవాడు. ఎందుకంటే అక్కడి లైబ్రేరియన్ ఇనా కూల్‌బ్రిత్‌కి పిల్లలంటే ఇష్టం. ఆమె అందరికీ టీ ఇచ్చేది.

అలా అందుకోసం ఆ లైబ్రరీ ఛాయలకు వెళ్లేవాడు జాక్. పత్రికలు తిరగేసేవాడు. ఏదో అప్పటికి విని చూసి నేర్చుకున్న ఇంగ్లిష్ చదివేవాడు. అతని ఆసక్తి అర్థమైంది - ఇనాకి. ఆమె కవయిత్రి కూడా. నెమ్మదిగా చదవడం, రాయడం నేర్పింది. పుస్తకాలిచ్చి చదవమంది. అలా జాక్ తొలిసారి 1885లో 9 ఏళ్ల వయసులో చదివిన నవల - 'సిగ్నా'. బ్రిటిష్ రచయిత్రి వ్యూడా రాసిన గ్రంథమది.

అది చదివాక, జాక్‌కే తెలీకుండా ఏదో తెలీని విప్లవం, విస్ఫోటనం వచ్చాయి - అతని ఆలోచనల్లో!

• • •

అప్పట్లో ఓక్‌ల్యాండ్ తీరంలో నత్తల్ని వేటాడటం ఓ ఆదాయ మార్గం. అల్లరి కుర్రాళ్లందరికీ ఇదే వ్యాపకం. నాలుగు డబ్బులు సంపాదించడం కోసం ఈ బాటపట్టాడు జాక్. త్వరలోనే ఓ చిన్నపాటి ఒంటి స్తంభపు పడవ కొనుక్కోగలిగాడు. 16 ఏళ్లొచ్చాయి. కొత్త చేపల వేటపై పట్టొచ్చింది. ప్రభుత్వ అనుమతి లేని నీటి ప్రాంతాల్లోకి సైతం చొచ్చుకుపోయేవాడు.

పడవేసుకుని సైబీరియా, జపాన్ సాగర తీరాల్లోకి సర్ సర్‌మని వెళ్లిపోయేవాడు. పక్కనే మామీ అనే 15 ఏళ్ల అమ్మాయి ఉండేది. సీల్ చేపల్ని పట్టేవాడు. ఆమెను ఒడిసి పట్టుకునేవాడు. ఆ కుర్ర గ్యాంగంతా జాక్‌ని 'నత్తగుల్లల దొంగలకే దొంగ' అనేవారు. ఆ అనుభవాలన్నీ 17వ ఏట ఓ కథగా అల్లాడు జాక్ - 'టైఫూన్ ఆఫ్ ది కోస్ట్ ఆఫ్ జపాన్' అంటూ!

ఇంత చిల్లరమల్లరగా తిరిగినా, జాక్ మనసు మాత్రం ఆనందంగా ఉండేది కాదు. ఇప్పుడు కొత్త దద్దొచ్చింది. ఎన్నాళ్లిలా ఆడుతూ పాడుతూ తిరుగుతూ చేపలు పడుతూ నాటకాలాడుతూ అనిపించేది. శరీర శ్రమపై ఆధారపడే జీవితం కన్నా మేధోపరమైన ఆలోచనలపై సాగే జీవనం బాగుంటుందనిపించేది. అందుకే అన్నీ కట్టిపెట్టేసి ఓక్‌ల్యాండ్ స్కూల్లో చేరాడు. రాత్రిళ్లు ఓ బార్‌లో పనిచేసేవాడు. హైస్కూలు చదువయ్యాక, బార్ యజమానే స్వయంగా ఫీజు డబ్బులు ఇవ్వడంతో కాలిఫోర్నియా యూనివర్సిటీలో చేరాడు.

20 ఏళ్ల జాక్... అప్పటికే చూడాల్సినంత జీవితాన్ని చూసేసిన జాక్... సంపాదించగలిగే చదువు కోసం అన్నీ వదిలేసిన జాక్... క్యాంపస్‌లోకి అడుగుపెట్టాడు. అందమైన కొత్త ప్రపంచం. ఓ ఏడాది బానే గడిచింది. ఆపై మళ్లీ డబ్బులకు కటకట. దాంతో పనిచేయక తప్పని పరిస్థితి. అంతలో అమ్మ ఆత్మహత్య చేసుకుందన్న వార్త.

వెరసి - చదువుకు స్వస్తి. అదే పాత బార్ యజమాని సెలూన్‌లో చేరాడు. రోజూ సందడే. నావికులు, సాహస యాత్రికులతో పరిచయాలు, కబుర్లు, ఒకరికొకరు అనుభవాలు పంచుకోడాలు, ఓడ కళాసీల, ఆకలి కేకల ఆర్తనాదాల,

శ్రమజీవుల బాధలు... అన్నీ అర్థమయ్యాయి జాక్‌కి.

• • •

1896లో సోషలిస్టు లేబర్ పార్టీలో చేరాడు. ధనస్వామ్యానికి వ్యతిరేకంగా ఉపన్యాసాలిచ్చాడు - ఊరూరా తిరిగి. ప్రజల్ని రెచ్చగొడుతున్నాడంటూ పోలీసులు అరెస్టు చేశారు. ఏడాదిపాటు జైల్లో గడిపాడు. విడుదలయ్యాక, మళ్లీ దారిద్ర్యం, ఆకలి కేకలు. ఆ రోజుల్లో ఎక్కడెక్కడో బంగారం దొరుకుతోందంటూ యువకులంతా గనుల వెంట తిరిగేవారు. వారి వెంట తానూ వెళ్లాడు. బంగారం దొరకలేదు. సరైన తిండిలేక 'సి' విటమిన్ లోపించి, స్కర్వీ వ్యాధి మాత్రం లభించింది. ఒళ్లంతా దద్దుర్లు, పంటి చిగుళ్ల నుంచి రక్తం. నరకం చూశాడు. ఈ నేపథ్యాన్నే 'టు బిల్డ్ ఎ ఫైర్' కథలో నిబంధించాడు.

అప్పుడే పరిచయమైంది అన్నా స్ట్రన్స్కీ అనే అమ్మాయి. ఆమె జీవితాంతపు సన్నిహితురాలైంది. ఇద్దరూ కలిసి ఉండేవారు. కలిసి ఓ పుస్తకమూ రచించారు. కాని పెళ్లి మాత్రం ఎలిజబెత్ బెస్ మాడన్‌తో అయ్యింది - 1900లో. 'పుష్టికరమైన పిల్లల కోసం ఈ పెళ్లి' అన్నాడు. అదే ఏడాది జాక్ తొలి గ్రంథం 'ది సన్ ఆఫ్ వోల్ఫ్' ప్రచురితమైంది. పెళ్లయినా అన్నాతో సహజీవనం మామూలే!

పాతికేళ్ల వయసులో పాత పార్టీని వదిలేసి సోషలిస్టు పార్టీ ఆఫ్ అమెరికాలో చేరాడు. ఓక్‌ల్యాండ్ మేయర్ పదవికి పోటీ చేసి ఓడిపోయాడు. అంతలో ఇద్దరు పిల్లలు పుట్టారు. భార్యతో గొడవలు పెరిగాయి. 1904లో విడాకులతో ఊపిరి పీల్చుకున్నాడు.

• • •

జాక్ కలం పట్టిన కాలం... సాహిత్యానికి బంగారం. కొత్త ప్రింటింగ్ టెక్నాలజీలు వస్తున్న తరుణం అది. దీనివల్ల తక్కువ ఖర్చుతోనే పత్రికల్ని నడపగల వాతావరణం వచ్చింది. తామరతంపరగా పత్రికలు పుట్టుకొచ్చాయి. మ్యాగజీన్ సంస్కృతి వరిడవిల్లింది. కాస్త బాగున్నా, రచనల్ని ప్రచురించే స్థితి. అలాంటిది... జీవితాన్ని కాచి వడబోసిన జాక్ అక్షరాల్ని నెత్తిన పెట్టుకోకుండా ఉంటారా! అందుకే మొదటి కథకు 40 డాలర్లు కూడా దక్కని జాక్ అనతికాలంలో 2500 డాలర్లు అందుకునే స్థాయికి ఎదిగాడు. అతను ఏం రాసినా కళ్లకద్దుకునే పాఠకులు, భుజాల మీద మోసే పత్రికాధిపతులు, కాసుల వర్షం కురిపించే ప్రచురణ కర్తలు!

1904లో రష్యా - జపాన్ యుద్ధంలో ఎగ్జామినర్ పత్రికకు విలేకరిగా పనిచేశాడు. యుద్ధ వార్తల్ని ఒళ్లు గగుర్పొడిచేలా కళ్లకు కట్టాడు. ఆపై రెండేళ్లకు శాన్‌ఫ్రాన్సిస్కోలో భూకంపం వస్తే, కొలియర్ పత్రికకు రిపోర్టరయ్యాడు.

**జాక్ లండన్ రచనలు ప్రపంచవ్యాప్తంగా 70 భాషల్లోకి అనువాదమయ్యాయి. ఒక వ్యక్తి ఎదగడానికి ఏ ప్రత్యేక అర్హతలూ అక్కర్లేదు - తన ప్రతిభను నిప్పుతో కడుక్కుంటే చాలు అనిపిస్తుంది జాక్ కథ వింటే! సైన్స్ ఫిక్షన్ అనే సాహిత్య శాఖకు ఆద్యుడు జాక్. అమెరికా ప్రభుత్వం ఇతని గౌరవార్థం పోస్టల్ స్టాంపుని ముద్రించినా, ఓక్‌ల్యాండ్‌లో అతని స్మరణార్థం శిలాఫలకాలు వెలిసినా... సాహితీయోధుడిగా జాక్ చేసిన ప్రయాణమే కారణం.**

శిథిలాలను, శవాలను, ఆర్తనాదాలను... కన్నీటి వాక్యాలుగా మలిచాడు. అదే కాలంలో దేశమంతా తిరుగుతూ సోషలిజం ఉపన్యాసాలిచ్చాడు. వాటిని ప్రచురించాడు కూడా!

అంతలో చార్మియన్ కిట్రెడ్జ్‌తో పరిచయమైంది. ఆమెకూ సాహిత్యమంటే ప్రాణం. ఇద్దరికీ పెళ్లయ్యింది. ఆమెతో హాయిగా హనీమూన్‌కి బయలుదేరాడు. లక్షలు పెట్టి కళ్లు చెదిరిపోయేలా 'స్నార్క్' అనే ఓ అద్భుత ఓడను తయారు చేయించాడు. దక్షిణ పసిఫిక్ సముద్రంలోకి భార్యతో కలిసి విహారానికి వెళ్లాడు. హవాయ్, మార్కసస్‌దీవులు, సమోవా, ఫిజి, ఆస్ట్రేలియా... ఇంకా ఎన్నెన్ని తిరిగాడో. 27 నెలలపాటు కేవలం నీటి కెరటాలపైనే కాపురం... లోకం కాని లోకంలో శృంగారయానం!

• • •

తిరిగొచ్చాక, కాలిఫోర్నియాలో ఎకరాలకు ఎకరాల వ్యవసాయ క్షేత్రాల్ని కొన్నాడు. అక్కడే అందమైన ప్రకృతి ఒడిలో కాపురం పెట్టాడు. ఎక్కడ చూసినా మొక్కలు, పువ్వులు, చెట్లు, గాలులు, పచ్చిక మైదానాలు, దూరంగా కొండలు, జలపాతంలా జాలువారే వెన్నెలలు. 1910 నుంచి మరణించేంత వరకూ అక్కడే గడిపాడు. దాదాపు వెయ్యి ఎకరాల భూమిని కొన్నాడు. మళ్లీ రేణువుల్ని కౌగిలించుకుని పరవశించాడు. 15,000 చదరపు అడుగుల ఎత్తయిన భవంతి నిర్మాణం మొదలుపెట్టాడు.

జాక్‌లోని అసలైన సాహిత్యం ఎగదన్నుకొచ్చింది ఈ కాలంలోనే! అయితే అంతకుముందు రచించిన రచనల్లో శ్రామిక జీవన నేపథ్యం ఉంటే, ఇప్పుడు జీవితపు అన్ని పార్శ్వాలూ ఉన్నాయి.

ఆ అర్ధేళ్ల కాలంలో 50కి పైగా గ్రంథాలు రాశాడు. ఏడాదికి పది వేలకు పైగా ఉత్తరాలు అందుకునేవాడు. రోజుకి నాలుగైదు గంటలే నిద్ర. 15 వేల పుస్తకాలతో ఆర్ట్స్‌ను అప్పుతంతో నింపేసే పుస్తకాలతో ఓ గ్రంథాలయం ఏర్పాటు చేసుకున్నాడు. రోజూ ఈతకొట్టేవాడు. బాక్సింగ్ నేర్చుకున్నాడు. 1914లో మెక్సికో వెళ్లి అక్కడి విప్లవ పోరాటాల్ని పత్రికా కథనాలుగా ప్రచురించాడు.

అయితే, గ్రంథ చౌర్యం ఆరోపణలు ఎదుర్కొన్నాడు. 'ది కాల్ ఆఫ్ వైల్డ్' అనే జాక్ నవల తాను రాసిన 'మై డాగ్స్ ఇన్ ది నార్త్'కి కాపీ అన్నాడు ఇగార్టన్ యంగ్ అనే రచయిత. ''ది ఐరన్ హీల్' అనే జాక్ నవలలో కొన్ని భాగాలు నా వ్యాసంలోనివే' అన్నాడు ఫ్రాంక్ హ్యారీ! అయితే ఇవన్నీ కొట్టిపారేసి, 'వార్తాపత్రికల కథనాలు, నా జీవిత అనుభవాలు నా అక్షరాలు' అన్నాడు జాక్. అయితే సింక్లయిర్ లూయిస్ అనే యువకుడి నుంచి మాత్రం కథల్ని కొనుక్కునేవాడు జాక్.

చివరకు తాను ఎన్నో కలలు కని ఆశలు పెట్టుకుని నిర్మించిన భవంతి - ఇంకో రెండు వారాల్లో అందులోకి ప్రవేశించబోతూండగా అగ్నికి ఆహుతైపోయింది. ఇంకా ఎంతో సాహిత్యం సృజించాల్సిన జాక్ లండన్ 1916 నవంబర్ 22న మూత్రపిండాల వ్యాధితో మరణించాడు. జాక్‌ని పేదరికం సానపెట్టింది; అపార ధనం నిలబెట్టింది. కానీ మేధస్సులోంచి ఆలోచనగా ఆకృతినొందిన అక్షరం మాత్రం చనిపోయాక కూడా బతికించింది.

● ఆకెళ్ల రాఘవేంద్ర

**? ఎందుకు**

## దేవుడికి కర్పూర హారతి ఎందుకిస్తారు?



దీనికి కారణం కర్పూరానికి ఉన్న విశిష్ట లక్షణాలే. కర్పూరం కృత్రిమంగా తయారవుతుంది అనుకుంటారు చాలామంది. కానీ కాదు. అది చెట్టు నుంచి వస్తుంది. కర్పూరం నుంచి వెలువడే పొగ, వాసన మానసిక ఆలజడులను, ఆందోళనల్ని తగ్గిస్తుంది. అందుకే దేవుడికి దానితో హారతి ఇస్తారు. ఎందుకంటే దేవుడిని ధ్యానించుకునేటప్పుడు మనసులో ఏ విధమైన ఇతర ఆలోచనలూ లేకుండా, ప్రశాంతంగా పవిత్రంగా ఉండాలని. అలాగే కర్పూరంలో ఎన్నో ఔషధ గుణాలు ఉన్నాయి. జలుబును తగ్గిస్తుంది. కంటిచూపును మెరుగుపరుస్తుంది. దాహాన్ని తగ్గిస్తుంది. అంటువ్యాధుల్ని ప్రబలకుండా చేస్తుంది. ఇంకా ఇలాంటి ఉపయోగాలెన్నో ఉండటం వల్ల కర్పూరాన్ని వాడటం ఎంతో మంచిదని శాస్త్రాలు చెబుతున్నాయి.

**? ఏమిటి**

## అదిగో పులి అంటే ఇదిగో తోక అన్నట్టు...



ఓసారి ఒక వ్యక్తి తన స్నేహితుడితో కలిసి వేటకెళ్లాడు. అడవంతా వెతికినా ఒక్క జంతువూ కనబడక నీరసపడ్డాడు. ఇంతలో ఒక పొద కదులుతూ కనిపించింది. చూస్తే పులి ఉన్నట్టు అనిపించింది. వెంటనే స్నేహితుడితో... 'ఒరేయ్, అదిగో పులి, కనిపించిందా' అన్నాడు హుషారుగా. రెండోవాడు అటు చూశాడు కానీ ఏమీ కనిపించలేదు. అలా చెబితే బాగోదని... 'అవునవును నిజమే. అదిగో తోక' అన్నాడు. దాంతో మొదటి వ్యక్తి పులిని వేటాడాలని బాణాలు సంధించాడు. తర్వాత వెళ్లి చూస్తే అక్కడ పులి కాదు కదా, చిన్న జంతువు కూడా లేదు. తోక కనిపించిందన్నావుగా అని అడిగితే, నీకు పులి కనిపించినప్పుడు నాకు కోసం తోకైనా కనిపించిందని చెప్పకపోతే బాగోదుకదా అని పకపకలాడాడు స్నేహితుడు. దాంతో నవ్వలేక ఏడ్వాలేక వ్యక్తి. అప్పట్నుంచీ ఈ సామెత వాడుకలోకి వచ్చింది. లేనిదాన్ని ఉన్నట్టు ఎవరైనా ఊహించుకున్నా, దానికి ఇంతో రెండు మాటలు కలిపి ఇంకెవరైనా చెప్పినా ఈ సామెత వాడతారు.

**? ఎవరు**

| స (అబ్బాయి) | స (అమ్మాయి) |
|---|---|
| సోమిల్ - మృదు స్వభావి | సాహిల - మార్గదర్శి |
| సహస్య - ధైర్యవంతుడు | సమాలి - పూలగుచ్ఛం |
| సుయాష్ - ఖ్యాతినొందువాడు | సురీనా - తెలివైనది |

**? ఎలా**

## కండరాలు పట్టేస్తుంటే...



**కొందరికి కండరాలు అకస్మాత్తుగా లాగేసుకుపోయినట్టుగా పట్టేసి విపరీతమైన బాధగా ఉంటుంది. కొందరికి ఇది నిద్రలో జరిగి బాధతో మెలకువ వస్తుంది. వీటిని మజిల్ క్రాంప్స్ అంటారు.**

- నిద్రలో కాలు లేదా తొడ లేదా పిక్క కండరాలు పట్టేస్తే కాలు నేలకు ఆన్చలేనంతగా బాధగా ఉంటుంది. అలాంటప్పుడు పాదాన్ని నేలకు ఆన్చి కాసేపు తిరగాలి. కొద్దిసేపట్లో బాధ తగ్గుతుంది.
- శరీరంలో ద్రవాలు, ఖనిజ లవణాలు తగ్గడంతో ఈ పరిణామం సంభవిస్తుంది. కాబట్టి దీన్ని నివారించేందుకు లేదా వచ్చినప్పుడు మళ్లీ పునరావృతం కాకుండా ఉండేందుకు ఎక్కువ నీళ్లను, ద్రవాహారాన్ని తీసుకోవాలి.
- ఖనిజ లవణాలు ఎక్కువగా అందడానికి గాను కొబ్బరినీళ్లు తాగడం మంచిది. దీనివల్ల శరీరానికి అవసరమైన నీళ్లు (హైడ్రేషన్), లవణాలు... రెండూ సమకూరుతాయి.
- ఇలా తరచూ కండరాలు పట్టేసేవారు అరటిపండ్లు, నట్స్ ఎక్కువగా తీసుకోవాలి.

**? ఎలా చేద్దాం**

### ■ హోమ్ టిప్



సాధారణంగా ఉడికించే టప్పుడు పుట్టగొడుగులు రంగు మారడమే కాక, పిరిగిపోతుంటాయి. అలా కాకుండా ఉండాలంటే ఉడికించేటప్పుడు ఆ నీటిలో కాస్త నిమ్మరసం, వెన్న వేయాలి.

### ■ హెల్త్ టిప్

నేరేడు ఆకులను మెత్తగా రుబ్బి, ఆ పేస్టులో కాస్త వంట సోడాను కలిపి చెమట పొక్కుల మీద రాయాలి. రోజుకోసారి ఇలా చేస్తే దురద, పొక్కులు పోతాయి.



### ■ బ్యూటీ టిప్



జుట్టు బాగా రాలిపోతుంటే... అరకప్పు కొబ్బరిపాలలో రెండు మూడు చెంచాల నిమ్మరసాన్ని కలిపి కుదుళ్లకు పట్టించి, అరగంట తర్వాత తలస్నానం చేయాలి. వారానికోసారి ఇలా చేస్తే సమస్య తీరిపోతుంది.



# పాప్... పాయి!

ఏ మనిషికైనా కళాకారుడు కావడానికి ఎంత సమయం పడుతుంది! చేసే సాధనను బట్టి ఉంటుంది కదూ! కానీ ఆ చిన్నారి సాధన చేయలేదు. పుట్టడమే కళాకారిణిగా పుట్టింది.

క్లియోపాత్రా స్ట్రాటన్... మాల్డోవా దేశంలో, 2002 అక్టోబర్ 6న పుట్టింది. అందరు పిల్లలకూ వచ్చినట్టే ఒక వయసు వచ్చాక ఈ పాపకు మాటలొచ్చాయి. కానీ ఆ వయసులో ఏ పిల్లలకీ రానంత బాగా పాటలు పాడటం కూడా వచ్చిందామెకి. సంగీతకారుడైన తండ్రి పావెల్‌తో కలిసి ఓసారి రికార్డింగ్ థియేటర్‌కి వెళ్లింది క్లియో. తండ్రి పాడుతూ రికార్డు చేస్తున్నాడు. ఉన్నట్టుండి మూడేళ్ల క్లియో మైక్రోఫోన్ అందుకుంది. తండ్రితో కలిసి పాడటం మొదలుపెట్టింది. ఆయన ఆశ్చర్యపోయాడు. కూతురికి ఆ పాట అంత బాగా ఎలా వచ్చిందో అతనికి అర్థం కాలేదు. అదే అడిగితే, 'నువ్వు రిహార్సల్స్ చేసినప్పుడు విన్నాను' అంది. తన కూతురి టాలెంట్‌ని ఆ క్షణమే గుర్తించాడు పావెల్. ఆమెను ఆ దిశగా ప్రోత్సహించాడు. ఫలితంగా మూడేళ్లకే పాప్ సింగర్ అయ్యింది క్లియో.

2006లో తన మొదటి ఆల్బమ్‌ను విడుదల చేసింది క్లియోపాత్రా. అందులో పన్నెండు పాటలున్నాయి. అన్నీ సూపర్‌హిట్. 2008లో రెండో ఆల్బమ్‌ను బయటికి తెచ్చింది. అందులో ఉన్న పది పాటలూ శ్రోతలను ఊపేశాయి. యూట్యూబ్ నిండా ఆమె వీడియోలే. పలు దేశాల్లో ఆమెకు ఫ్యాన్స్ ఏర్పడ్డారు. ఆ హుషారుతో తర్వాత మరో రెండు ఆల్బమ్‌లు తెచ్చింది. అవీ సూపర్ డూపర్ హిట్స్. ఓవక్క మ్యూజిక్ ఆల్బమ్స్, మరోపక్క కాన్సర్ట్స్... బిజీ స్టార్ అయిపోయింది క్లియోపాత్రా. యంగెస్ట్ సింగర్‌గా ఎంటీవీ అవార్డునూ అందుకుంది. గిన్నిస్ రికార్డు కోసం పోటీ పడుతోంది. మనకు క్లియో తెలియదని అనుకోకండి. ఆమె తెలియకపోయినా, ఆమె పాట మనకు తెలుసు. సల్మాన్‌ఖాన్ నటించిన బాడీగార్డ్ సినిమాలో 'తేరీ మేరీ మేరీ తేరీ' అనే పాట ట్యూన్, క్లియోపాత్రా పాడిన పాటకు కాపీయే!



# నవ్వినవారి నోళ్లు మూయించింది!



యూకేకు చెందిన కరోలిన్ చురుకైన అమ్మాయి. పోలీస్ కావాలన్నది ఆమె కల. తన కలను నిజం చేసుకుంది. పోలీస్ ఉద్యోగాన్ని సంపాదించింది. అంతవరకూ బానేవుంది. కానీ ఉద్యోగంలో చేరిన కొన్నాళ్ల తర్వాత, విధుల ఒత్తిడిని తట్టుకోలేక కరోలిన్ ఈటింగ్ డిజార్డర్ బారిన పడింది. విపరీతంగా తినసాగింది. ముఖ్యంగా చాక్లెట్లు తినకుండా ఉండలేని పరిస్థితికి చేరుకుంది. దాంతో బరువు ఎంతగా పెరిగిపోయిందంటే, కదలికలు కూడా కష్టమయ్యేంత. తన తల్లిదండ్రులిద్దరూ స్థూలకాయులే కాబట్టి తనకూ వచ్చివుంటుంది అనుకుందామె. కానీ అలా సరిపెట్టుకున్నంత మాత్రాన ఆమె సమస్య తీరిపోలేదు.

లావు కారణంగా విపరీతమైన అవమానాలు ఎదురవసాగాయి కరోలిన్‌కి. ఆమెను చూసి అందరూ నవ్వసాగారు. కొందరైతే 'ఫ్యాట్ పిగ్' అంటూ ముఖం మీదే కామెంట్లు చేసేవారు. పోతే పోనీ అనుకుంది. కానీ ఓ చానల్ వారు ఏకంగా ఆమెను యూనిఫామ్‌లో ఉండగా షూట్ చేసి, ఫన్నీ కామెంట్లతో టీవీలో ప్రసారం చేశారు. తట్టుకోలేకపోయింది కరోలిన్. ఇక తనను కామెంట్ చేయడానికి ఒక్క నోరు కూడా తెరవకూడదనుకుంది. వెంటనే ఓ వైద్యురాలిని సంప్రదించింది. ఆమె సలహాతో లావు తగ్గే ప్రయత్నాలు మొదలుపెట్టింది. రోజూకు ఇరవై మైళ్లు నడిచేది. రకరకాల వ్యాయామాలు చేసేది. తిండి తగ్గించేసింది. చివరికి అనుకున్నది సాధించింది. ఆమె విజయం ఈ ఫొటోల్లో కనిపిస్తూనే ఉంది కదా!



సన్నబడిన తరువాత కరోలిన్

నాజూకుగా తయారయ్యాక ఆమె ఇలా అంది... 'ఒకరి సమస్య మరొకరికి వినోదం కాకూడదు. ఒకరి బాధ మరొకరికి నవ్వు తెప్పించకూడదు. ఎవరిని చూసి నవ్వారో రేపు వారి స్థానంలో మీరు ఉంటారేమో చూసుకోండి'. ఆమె మాటలు విన్న తర్వాత, ఆ రోజు ఆమెను అవమానించిన చానెల్ వారే ఆమెను ప్రశంసిస్తూ ప్రోగ్రామ్ చేశారు. అదీ కరోలిన్!

నిజాలు దేవుడికెరుక : మిస్టరీ



# ఆయన చెప్పిందే నిజమైతే...

## ఈ నెలలోనే...

**ఇప్పుడే...**
**శ్రీనాథుడిని కలిసి సీసపద్యం పాడుకోవచ్చు!**
**రాహుల్‌గాంధీ ముని మనవడి కొడుకు పెళ్లి చూసి రావచ్చు!!!**

ఆరోజుల్లో టాలీవుడ్ హీరో నందమూరి బాలకృష్ణ 'ఆదిత్య 369' సినిమాలో టైమ్‌మెషీన్ ఎక్కి రాజుల కాలానికి వెళ్లిపోయాడు. ఈరోజుల్లో హాలీవుడ్ హీరో బ్రూస్ విల్స్ 'లూపర్' సినిమాలో టైమ్ మెషీన్ ఎక్కి సరాసరి 2074లోకి వెళ్లిపోయాడు. ఇలా గతంలోకి, భవిష్యత్తులోకి దూసుకెళ్లే 'టైమ్ ట్రావెల్' కాల్పనిక సాహిత్యానికి, వెండితెరకే పరిమితం అనుకునే మనకు, వాషింగ్టన్ లాయర్ ఆండ్రూ బసియాగో చెబుతున్న మాటలు వింతగా అనిపిస్తాయి. నమ్మకానికి, నమ్మకరాహిత్యానికి మధ్య మన మెదడు ఊగిసలాడుతుంటుంది.

ఇంతకీ బసియాగో ఏం చెబుతున్నాడు?

అమెరికా ప్రభుత్వ ప్రతినిధిగా గతంలో తాను ఎన్నోసార్లు 'టైమ్ ట్రావెల్' చేశాడట!

"టైమ్ ట్రావెల్ చేయాలని మీకు ఎందుకు అనిపించింది?" అని అడిగితే-

"నాకు చేయాలనిపించలేదు. అమెరికా ప్రభుత్వానికి అనిపించింది" అని చెబుతాడు.

"కాస్త వివరంగా చెబుతారా?" అని బుజ్జగింపుగా అడిగితే -

"నలభై సంవత్సరాల నాటి ముచ్చట ఇది. అప్పుడు నా వయసు ఏడు సంవత్సరాలు. అమెరికా రక్షణశాఖ అధికారిక కార్యక్రమంలో భాగంగా నాన్నతో కలిసి టైమ్‌ట్రావెల్ చేశాను. నాతోపాటు 140 మంది పిల్లలు ఉన్నారు. 60 మంది పెద్దవాళ్లు కూడా ఉన్నారు. పెద్దలతోపాటు మాలాంటి పిల్లలకు కూడా టైమ్ ట్రావెల్ కోసం శిక్షణ ఇచ్చారు. శారీరక, మానసిక ఇబ్బందులు తలెత్తకుండా పరీక్షలు నిర్వహించారు. వర్తమానం నుంచి గతంలోకి భవిష్యత్తులోకి ప్రయాణించే క్రమంలో పెద్దల కంటే పిల్లలపై చాలా తక్కువగా ప్రతికూల ప్రభావం ఉంటుంది" అన్నాడు.

"నాన్న నా చేయి పట్టుకొని టైమ్ మెషీన్‌లోకి తీసుకువెళ్లాడు. కొద్దిసేపటి తరువాత భూకంపం వచ్చినట్లు అనిపించింది. ఆ వాహనం అత్యంత వేగంగా కదిలిపోయింది. మేము ఎక్కడికి వెళుతున్నామో మాత్రం తెలియదు" ఇలా గతాన్ని గుర్తు తెచ్చుకుంటాడు.

" ఇంకాస్త వివరంగా చెబుతారా?" అని ఆసక్తిగా అడిగితే-

"చెప్పడానికి చాలా పెద్ద కథ ఉంది.

### ఎవరీ ఆండ్రూ?



**ఆండ్రూ బసియాగో వృత్తిరీత్యా వాషింగ్టన్‌లో లాయర్, ప్రవృత్తిరీత్యా రచయిత. 'మార్స్ రీసెర్చర్'గా ఆయనకు మంచి పేరుంది. చరిత్ర, తత్వశాస్త్రాలతో పాటు కేంబ్రిడ్జి విశ్వవిద్యాలయం నుంచి ఐదు డిగ్రీలు తీసుకున్నాడు. 'ట్రూత్ మూమెంట్'లో ఆయన పేరు నలుగురు నోళ్లలో నానింది. అంగారకుడి గురించి తనకు తెలిసిన రహస్యాలను అమెరికా బహిర్గతపరచాలని ఉద్యమం లేవదీశాడు. తన రచనల ద్వారా ఆధునిక కాల అంగారక గ్రహ పరిశోధనలలో ఆండ్రూ అగ్రభాగాన నిలిచాడు. అంగారకగ్రహం మానవ నివాస యోగ్యమేనని నిరూపిస్తూ ఆండ్రూ 2008లో 'ద డిస్కవరీ లైఫ్ ఆన్ మార్స్' పేరుతో పుస్తకం రాశాడు. అమెరికా టైమ్-ట్రావెల్ మార్గదర్శకుల్లో ఒకడిగా ప్రసిద్ధి పొందాడు.**

ఎప్పుడు వెళ్లానో, ఎలా వెళ్లానో, ఎక్కడికి వెళ్లానో చెప్పడానికి వందలాది నిజాలు ఉన్నాయి'' అని దీరిస్తాడు.

టైమ్ ట్రావెల్ ద్వారా గతంలోకి వెళ్లి ఒక ప్రముఖ కార్యక్రమంలో పాల్గొన్న ఆనాటి అమెరికా అధ్యక్షుడు అబ్రహాం లింకన్‌ను చూశాడట. దీనికి సంబంధించి తన దగ్గర విజువల్ ఎవిడెన్స్ కూడా ఉందట. లింకన్‌పై జరిగిన కాల్పుల దృశ్యాన్ని దగ్గరి నుంచి చూశాడట. అంతేకాదు, ఈనాటి అమెరికా అధ్యక్షుడు ఒబామాను ఎప్పుడెప్పుడో బాలుడిగా ఉన్నప్పుడే చూశాడట.

ఎంతమంది నమ్ముతున్నారో తెలియదుగానీ 'డిఫెన్స్ అడ్వాన్స్‌డ్ రిసెర్చ్ ప్రాజెక్ట్ ఏజెన్సీ' ఆధ్వర్యంలో తాను 'టైమ్ ట్రావెల్' చేసినట్లు ఆండ్రూ 2004 నుంచి చెబుతూనే ఉన్నాడు.

ఎవరైనా-

'' కాంతి కంటే వేగంగా ప్రయాణించేది లేదని, టైమ్‌ట్రావెల్ అనేది అసాధ్యం అని గత సంవత్సరం హాంకాంగ్ శాస్త్రవేత్త షెంగ్‌వాంగ్ దు ప్రయోగాత్మకంగా నిరూపించారు కదా?'' అని సందేహపడితే ఆండ్రూ సుతిమెత్తగా నవ్వుతాడు.

నవ్వడానికి మాత్రమే పరిమితమైపోతాడా?

## టైమ్ ట్రావెలర్?



చార్లీ చాప్లిన్ 'ద సర్కస్' (1928)లో సన్నివేశం

**టైమ్-ట్రావెలర్ అవునో కాదో తెలియదుగానీ 1928 నాటి చార్లీ చాప్లిన్ 'ద సర్కస్' సినిమాలోని ఒక దృశ్యంలో కోటు, హ్యాటుతో కనిపించే ఒక ముసలావిడ సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ వెళుతుంటుంది. ఆమె మాట్లాడే పద్ధతి, ప్రస్తుత రోజుల్లో సెల్‌ఫోన్లలో మాట్లాడుతూ వెళ్లే వాళ్లను పోలి ఉంటుంది. కొందరు మాత్రం అది పోర్టబుల్ రేడియో అన్నారు. నిజంగా అది పోర్టబుల్ రేడియో అయితే వినుకుంటూ వెళ్లాలి గానీ, మాట్లాడుతూ వెళ్లాల్సిన అవసరం ఏమిటనీ, పైగా ఆమె పక్కన ఎవరూ లేరని మరికొందరు వాదిస్తున్నారు. చిత్రమేమిటంటే ఈ దృశ్యాన్ని గురించి ఇప్పటి వరకు ఎవరూ సంతృప్తికరమైన వివరణ ఇవ్వలేకపోయారు. ఆమె టైమ్ ట్రావెలరేనా?**

అదేమీ లేదు.

ఆల్ఫ్రెడ్ వెబ్రె గొంతును అరువుగా తెచ్చుకుంటాడు. శాస్త్ర విషయాల్లో నిష్ణాతుడైన ఆల్ఫ్రెడ్, టెలిపోర్టేషన్, టైమ్ ట్రావెల్‌ల గురించి సాధికారికంగా మాట్లాడగలడు. చాలా ఏళ్ల క్రితమే టైమ్ ట్రావెల్, టెలిపోర్టేషన్ ఉనికిలో ఉందని గట్టిగా చెప్పగలడు.

''టైమ్ ట్రావెల్ అనేది ఖర్చుతో కూడుకున్న వ్యవహారమే కావచ్చు గానీ దీనివల్ల పర్యావరణానికి ఎలాంటి ముప్పూ వాటిల్లదు'' అని ఒక ఇంటర్వ్యూలో చెప్పాడు ఆల్ఫ్రెడ్.

ఒక కార్యక్రమంలో ప్రసంగించిన బసియాగో, తాను ఎనిమిది రకాలైన టైమ్ ట్రావెల్ సాంకేతిక పద్ధతుల గురించి తెలుసుకున్నట్లు చెప్పాడు.

''ఒక టన్నెల్‌లాంటి దాంట్లోకి ప్రవేశిస్తాం. ద్వారాలన్నీ మూతపడతాయి. గమ్యం కోసం ఎదురుచూడడం తప్ప మరో ఆలోచన అంటూ ఉండదు. ప్రతి కాలప్రయాణ అనుభవం కొత్తగా ఉంటుంది. హోలోగ్రామ్‌లో పదిహేను నిమిషాలు లేదా అంతకంటే తక్కువ సమయంలో ఉండేవాళ్లం. అందులోని పరికరాలు సూపర్-చార్జింగ్ అయ్యాక తిరుగు ప్రయాణం మొదలయ్యేది. కొంత సమయం తరువాత వర్తమానంలోకి వచ్చేవాళ్లం. ప్రతి ముఖ్య నగరంలోనూ టెలిపోర్ట్‌లు ఏర్పాటు చేయాలి. ఒక కాలం నుంచి మరో కాలానికి వస్తుమార్పిడి చేయాలి''... ఇలా తన టైమ్ ట్రావెల్ గురించి పత్రికలు, పుస్తకాలు, చానళ్లలో నిరంతరాయంగా చెబుతూనే ఉన్నాడు ఆండ్రూ.

తన టైమ్ ట్రావెల్‌కు సంబంధించి ఒళ్లు జలదరించే సంచలనాత్మక అనుభవాలను త్వరలో పుస్తకరూపంలో తీసుకురానున్నట్లు ఆండ్రూ బసియాగో ప్రకటించాడు.

''ఆయనవన్నీ అబద్ధాలు'' అనేవాళ్లు ఉన్నారు.

''ఆయనవన్నీ సంచలన నిజాలు'' అని వాదించేవాళ్లూ ఉన్నారు.

ఓ హిస్టరీ... ఏమిటీ మిస్టరీ?!

● యాకుబ్ పాషా

## టైమ్ ట్రావెల్ ఫిక్షన్




- **మెమొరీస్ ఆఫ్ ది ట్వంటీయత్ సెంచరీ**
  **కాలం: 1733**
  **రచయిత: సామ్యూల్ మాడెన్**
  **కథాంశం: 1733 నుంచి 1728లోకి, 1997లోకి టైమ్ ట్రావెల్**
- **ది క్లాక్ దట్ వెంట్ బ్యాక్‌వర్డ్**
  **కాలం: 1881**
  **రచయిత: ఎడ్వర్డ్ మిషెల్**
  **కథాంశం: ఒక గడియారానికి ప్రజలను గత కాలానికి తీసుకువెళ్లే శక్తి ఉంటుంది. ఆ గడియారం చుట్టూ అల్లుకున్న కథ.**
- **ఎ డ్రీమ్ ఆఫ్ జాన్ బాల్**
  **కాలం: 1888**
  **రచయిత: విలియం మారిస్**
  **కథాంశం: మధ్య యుగాలు, ఆధునిక యుగాల మధ్య తిరిగే కథాంశం**
- **ది ఎండ్ ఆఫ్ ఎటర్నిటీ**
  **కాలం: 1955**
  **రచయిత: ఐసాక్ ఎసిమోవ్**
  **కథాంశం: టైమ్ మెషీన్‌ను ఉపయోగించి ఒక శతాబ్దపు వస్తుసామగ్రిని, మరో శతాబ్దానికి రవాణా చేయడం.**
- **ద డోర్ ఇన్‌టు సమ్మర్**
  **కాలం: 1957**
  **రచయిత: రాబర్ట్**
  **కథాంశం: ఒకడు టైమ్ మెషీన్ ద్వారా గతంలోకి వెళ్లి తనను మోసం చేసిన వారిపై ప్రతీకారం తీర్చుకుంటాడు.**



# షాపింగ్ మాల్

ఎం.సుభాకర్

'డాడీ ఈ రోజు నాకు వైట్ బోర్డ్ కావాలి' అన్న మాటలు నాకు మెలకువ తెప్పించాయి. కళ్లు తెరచి చూస్తే ఎదురుగా మా చిన్నమ్మాయి. దాని వాలకం చూస్తుంటే చాలాసేపట్నుంచి నేను ఎప్పుడు లేస్తానా అని నా ముఖం మీద ముఖం పెట్టి చూస్తున్నట్టుంది. ఈ రోజు ఎలాగైనా ఆ వైట్ బోర్డ్ కొనకపోతే ఈ ఆదివారాన్ని కాస్తా ఆవిరి చేసేలా అనిపించింది.

అది అడుగుతున్న ఆ వైట్ బోర్డ్ ఏదో నాకు అర్థం కాలేదు. బోర్డ్ స్కూల్లో బ్లాక్ బోర్డ్ చదువు నాది. ఇంతకీ ఆ వైట్ బోర్డ్ అంటే దానికైనా తెలుసా అన్న అనుమానంతో,

''ఇంతకీ ఆ వైట్ బోర్డ్ అంటే ఏమిటే?'' అని అడిగాను. నా కుతూహలం చూసి నేను కొనడానికి రెడీ అయ్యాను అని అర్థం చేసుకున్న మా అమ్మాయి చెప్పడం మొదలుపెట్టింది.

''అదా! డాడీ మా ఫ్రెండ్ సంధ్యకి వాళ్ల డాడీ కొనిచ్చారు. అది ఉంటే మనం లెక్కలు, ఎక్కాలు అన్నీ దానిమీదే రాసుకోవచ్చు. అయిపోగానే చెరిపేయొచ్చు. ఇంచక్కా మనకి రఫ్ బుక్కులు, పెన్నులు అయిపోవు. మీరు అదొక్కటి కొనిస్తే మనకి బోల్డు డబ్బులు ఆదా అవుతాయిట. మా ఫ్రెండ్ చెప్పింది'' అంటూ పెద్ద లెక్చరిచ్చింది. ఈ మాటలు చెబుతున్నప్పుడు మా అమ్మాయి ధ్యాసంతా నామీదే పెట్టింది, నన్ను ఇంప్రెస్ చెయ్యడానికి.

మా అమ్మాయి చెప్పిన మాటలు విన్న నాకు ఆ బోర్డ్ ఏదో కావాలనిపించింది. ఎందుకంటే పిల్లలకి డబ్బులు ఆదా చెయ్యాలన్న ఆలోచన నేర్పినందుకు.

కానీ నేటి సమాజపు మార్కెటింగ్ టెక్నిక్‌లపై ఒకింత సందేహం కూడా వచ్చింది.

''సర్లే! ఈ రోజు కొంటాను గానీ ఇంతకీ మీ ఫ్రెండ్‌వాళ్ల డాడీ ఎక్కడ కొన్నారో కనుక్కున్నావా?'' అని అడిగాను తప్పించుకోవడానికి ఏదైనా చిన్న అవకాశం దొరుకుతుందేమో అన్న ఆశతో.

''అదా... మెయిన్ రోడ్డులో షాపింగ్ మాల్‌లో ఉన్నాయిట డాడీ. ఈ రోజు మా ఫ్రెండ్స్ అందరూ కొనుక్కుంటున్నారు. మనం తొందరగా వెళ్లకపోతే అయిపోతాయిట. తొందరగా లే డాడీ'' అంటూ బలవంతంగా నన్ను బాత్‌రూమ్‌లోకి తోసేసింది. ఈ ముచ్చట ఏదో తొందరగా తేలిస్తే మిగతా రోజంతా మిగులుతుందనే ఆశతో నేను కూడా రెడీ అయిపోయాను.

''బావుంది. మీరిద్దరూ బజారుకి వెళ్లిపోతే నేను ఒక్కర్తినీ ఇంట్లో ఏం చేస్తాను. నేను కూడా వస్తాను. బయట ఎక్కడైనా టిఫిన్ చేసి వద్దాం'' అంటూ నా శ్రీమతి కూడా రెడీ అయిపోయింది.

''డాడీ! ఆ షాపింగ్ మాల్‌లో టిఫిన్లు, కాఫీలు, డ్రింకులు, కేకులు కూడా ఉంటాయిట. ఇంచక్కా డ్రింకులు తింటూ షాపింగే చెయ్యొచ్చుట, మా ఫ్రెండు చెప్పింది'' అంటూ మా అమ్మాయి సంతోషంగా చెబుతోంది.

ఈ రోజు ఎలాగైనా ఆ వైట్ బోర్డ్ కొంటానని అది డిసైడ్ అయిపోయింది. అయితే మరీ మంచిది టిఫిన్ కోసం హోటల్లో టైమ్ వేస్ట్ చెయ్యక్కర్లేదు అనుకుంటూ కారు తీసుకుని బయలుదేరాం.

నేను చిన్నప్పట్నుంచీ పుట్టి పెరిగిన ఊరే అయినా, ఈ రోజు మాత్రం మా చిన్నమ్మాయే షాపింగ్ మాల్‌కి దారి చూపించింది. మొత్తానికి ట్రాఫిక్ పద్మవ్యూహం దాటుకుని అరగంటకి ఆ షాపింగ్ మాల్‌కి చేరుకున్నాం. 'ఇదేనా ఆ షాపింగ్‌మాల్' అని అడిగాను, మా అమ్మాయి ఏమంటుందో అని. మా అమ్మాయి నా మాట వినిపించుకోకుండానే రయ్యని లోపలికి దూసుకుపోయింది.

నేను రోజూ చూసే షాపింగ్ మాలే కానీ, ఎప్పుడూ లోపలికి వెళ్లలేదు. నేను గనుక ఆ షాపింగ్ మాల్‌లో తీసుకునే బండిలో సరుకులు కొంటే, మా కిరాణాకొట్టు షావుకారు మళ్లీ తోపుడు బండిమీద ప్లాస్టిక్ సామాన్లు అమ్ముకునే స్థితికి వచ్చేస్తాడేమో అన్న జాలి. కానీ ఈ రోజు మా అమ్మాయి మూలంగా షావుకారుకి అన్యాయం చెయ్యక తప్పింది కాదు. ఏదో చిన్న బోర్డే కదా అని నాకు నేను సర్ది చెప్పుకుని లోపలికి నడిచాను.

అది షాపింగ్ మాల్‌లా లేదు, మరో ప్రపంచం అన్నట్టుంది. అక్కడ కొనేవాళ్లంతా కొనడం కోసమే పుట్టామా అన్నట్టు కొనేస్తున్నారు. ధర చూసి కొనడం నామోషీగా ఫీలవుతున్నారు. అక్కడ పనిచేసేవాళ్లంతా చాలా మర్యాదగా సార్, మేడమ్ అని పిలుస్తుంటే కొత్తగా

భుజకీర్తులు మొలుస్తున్నాయి.

'ఏమండీ! ఇటు చూడండి' అన్న నా శ్రీమతి అరుపుతో ఈ లోకంలోకి వచ్చిన నేను, నా శ్రీమతి చూపించిన వైపు చూశాను. అక్కడొక చెప్పుల స్టాండ్ కనిపించింది.

''ఇంతేముందే చెప్పుల స్టాండే కదా?'' అన్నాను నిరాసక్తంగా.

''దీనిని అసలు సరిగ్గా చూశారా? దీని డిజైన్ చూశారా? రోజ్‌వుడ్‌ది. పైగా మన సోఫాసెట్‌కి మ్యాచింగ్ కూడాను. సోఫాసెట్ కొన్నప్పుడు ఇలాంటి చెప్పుల స్టాండ్ కోసం ఎంత వెతికానో, ఇప్పటికి దొరికింది'' అంటూ ఆ స్టాండ్‌ని సేల్స్‌బాయ్‌కి అందించింది బిల్లు చెయ్యమన్నట్టు.

''అది కాదు. మొట్టమొదలే చెప్పుల స్టాండ్‌కొనడం ఏమిటి'' అన్నాన్నేను, అక్కడికి నాకేదో సెంటిమెంట్ ఏడ్చినట్టు. నేను అలా అనడం ఎంత తప్పో అప్పుడే అర్థమయ్యింది.

''అలాగాండీ, అయితే ముందు పంచదార కొంటాను'' అంటూ పంచదార కోసం వెతకడం మొదలుపెట్టింది నా శ్రీమతి.

అక్కడే ఉండి మా మాటలు వింటున్న సేల్స్‌బాయ్, ''మేడమ్! ఈ రోజు మీరు పంచదార కొనక్కర్లేదు. ఈ రోజు పంచదార ఫ్రీ మేడమ్. కావాలంటే ఐదు కేజీల పామాయిల్, మూడు కేజీల ఆటా కొంటే రెండు కేజీల పంచదార ఫ్రీ. ఈ ఆఫర్ నిన్న లేదు రేపు ఉండదు'' అంటూ ఒక బిస్కెట్ వదిలాడు. ఆ మాటలు వింటూనే మా ఆవిడ ఆ సేల్స్‌బాయ్ వెనకే ఆ ఆఫర్ అందుకోవడానికి వెళ్లిపోయింది.

ఇంతలో మైక్‌లో సన్నని గొంతుతో ఒక అమ్మాయి, 'కస్టమర్స్‌కి స్వాగతం. ఈ రోజు షాపింగ్ మాల్ యానివర్సరీని పురస్కరించుకుని లేడీస్ గాగుల్స్‌పై యాభై శాతం డిస్కౌంట్ ఆఫర్ చేస్తున్నాం' అంటున్న మాటలు వినిపించాయి. చత్వారం కళ్లజోడుతో కనిపించే నా శ్రీమతిని గాగుల్స్‌లో చూడాలనిపించింది. మనిలో పనిగా ఆ అనౌన్స్‌మెంట్ చేసిన అమ్మాయిని కూడా చూడొచ్చు కదా అని గాగుల్స్ కౌంటర్‌వైపు నడిచాను.

రెండు రూపాయల సోడా కొనడానికి ఆరుసార్లు ఆలోచించే నేను, తొమ్మిది వందలు పెట్టి మా ఆవిడకి కళ్లజోడు కొనేశాను.

సంపాదించేది ఖర్చు చెయ్యడానికే కదా అన్న ఫిలాసఫీ. ఈ ఫిలాసఫీ నాకు ముందెప్పుడూ లేదు, ఇప్పుడు ఎందుకు వచ్చిందో అర్థం కాలేదు. అక్కడ అన్ని వస్తువులూ అవసరమైనవే అనిపిస్తున్నాయి. ఏ వస్తువు కొనకపోయినా ఈ ప్రపంచం ఆగిపోతుందేమో అనిపించేలా ఉన్నాయి.

నేను పక్కకి తిరిగి చూసేసరికి మా ఆవిడ, మా అమ్మాయి చాలా బిజీగా షాపింగ్ చేస్తున్నారు. చేసేది ఏమీలేక నేను కూడా అక్కడి వస్తువుల్ని పరిశీలించసాగాను. యథాలాపంగా గెడ్డం నిమురుకుంటుంటే గుర్తొచ్చింది నా షేవింగ్ కిట్ పాతది అయిపోయిందని. వెంటనే ఒక షేవింగ్ కిట్ తీసుకున్నాను ధర చూడకుండానే. ఇంతకీ డబ్బులు తెచ్చానా అనుకుంటూ పర్స్ తీశాను. ఎందుకో పర్స్ కూడా

**రెండు రూపాయల సోడా కొనడానికి ఆరుసార్లు ఆలోచించే నేను, తొమ్మిది వందలు పెట్టి మా ఆవిడకి కళ్లజోడు కొనేశాను. సంపాదించేది ఖర్చు చెయ్యడానికే కదా అన్న ఫిలాసఫీ. ఈ ఫిలాసఫీ నాకు ముందెప్పుడూ లేదు, ఇప్పుడు ఎందుకు వచ్చిందో అర్థం కాలేదు.**

వెలిసిపోయినట్టు అనిపించింది. వెంటనే ఇంపోర్టెడ్ లెదర్ పర్స్ తీసుకున్నాను మళ్లీ ధర చూడకుండానే. మొత్తానికి ఆ ప్రపంచంలో మా అమ్మాయిని, మా ఆవిడని వెతుక్కోవడానికి మధ్యాహ్నం పన్నెండయింది.

వాళ్లిద్దరి ముందున్న తోపుడుబళ్లు చూస్తే నాకు నోట మాట రాలేదు. ఎప్పుడూ ఎక్కడా చూడని వస్తువులు ఆ బళ్లనిండా కనిపిస్తున్నాయి. ఎలాగా భోజనం టైమ్ అయింది కదాని ముగ్గురం అక్కడే పిజ్జాలు తిని, కూల్‌డ్రింక్స్ తాగాం. యథాలాపంగా మా అమ్మాయిని చూస్తే దాని ముఖం వాడిపోయి ఉంది. విషయం ఆరాతీస్తే నాకు మతిపోయింది. ఏ వైట్‌బోర్డ్ కోసమైతే ఈ షాపింగ్‌కి వచ్చామో ఆ బోర్డ్ మావాళ్లకి కనిపించలేదట. బండి నిండా ఎన్ని వస్తువులు ఉన్నా ఆ వైట్ బోర్డ్ లేని లోటు మా అమ్మాయి ముఖంలో కనిపిస్తోంది.

వెంటనే నేను కూడా ఆ బోర్డ్ కోసం వెతకడం మొదలుపెట్టాను. అక్కడి సేల్స్‌బాయ్స్‌ని ఎవరిని అడిగినా ఉపయోగం లేకపోయింది. ఇక చేసేది ఏమీలేక బిల్లింగ్ కౌంటర్ వైపు నడిచాను. కొన్న వస్తువులు బిల్లు చేయించి, ఆఖరిగా ఆ అబ్బాయిని అడగ్గా, ''బాబూ! ఏదో వైట్ బోర్డట. చిన్న పిల్లలు రాసుకునేది. మీ షాపులో ఉందంటే వచ్చాం. ఎక్కడా కనపడలేదు. కొంపదీసి స్టాకు అయిపోలేదు కదా?''

''అదా సార్! అది అమ్మడానికి కాదు. ఇక్కడ ఐదువేలు షాపింగ్ చేసినవారికి బహుమతిగా ఇస్తున్నాం. మీ బిల్లు నాలుగువేల ఎనిమిది వందలే అయ్యింది. మీరు ఇంకా రెండు వందలు బిల్లు చేస్తే మీకు కూడా ఇస్తాం'' అన్నాడు తాపీగా.

ఆ మాటలు విన్న నాకు నెత్తిన పాలు పోసినట్టనిపించింది. వెంటనే వెనక్కి పరిగెత్తి అవసరం లేకున్నా నాలుగు ప్లాస్టిక్ డబ్బాలు కొని బిల్లు ఐదువేలు అయ్యిందనిపించాను.

ఆ షాపువాడు ఇచ్చిన వైట్ బోర్డ్ చూసి మా అమ్మాయి ముఖం వెలిగిపోయింది. దాని ముఖంలో వెలుగు చూడటానికి నేను ఐదువేలు ఖర్చవలసి వచ్చింది. అదేమి విచిత్రమో ఆ షాపింగ్ మాల్‌లో ప్రవేశించగానే ఏదో గాలి సోకినట్టు నానా చెత్తా కొని పడేశాము. మేము కొన్నవాటిలో కొన్ని ఉపయోగపడేవి, కొన్ని అంతగా ఉపయోగపడనివి, మరికొన్ని ఎలా ఉపయోగించాలో కూడా తెలియనివీను.

మొత్తమ్మీద మేం ఇంటికి వచ్చేసరికి, మా సిటవుట్లో మా పక్కింటి గురునాథంగారు కూర్చొని ఉన్నారు. ఆయన చేతిలో ఏదో వస్తువు ఉంది. మమ్మల్ని చూస్తూనే ఆయన లేచి నిలబడి,

''ఏమీ లేదోయ్, నిన్న షాపింగ్‌కి వెళ్లాం. అక్కడ ఐదువేలు బిల్లు చేసినవాళ్లకి ఏదో వైట్‌బోర్డ్ ఇస్తున్నారు. మాక్కూడా ఇచ్చారు. మా ఇంట్లో చదువుకునే చిన్నపిల్లలు ఎవరూ లేరు కదా, మీ అమ్మాయి గుర్తొచ్చింది. దానికి ఇద్దామని తీసుకువచ్చాను'' అంటూ ఆ వైట్ బోర్డ్ నా చేతిలో పెట్టారాయన.

ఆ బోర్డ్ చూస్తూనే నా కళ్లముందు ఐదువేలు గిర్రున తిరిగాయి.

కొత్త మార్కెటింగ్ టెక్నిక్కు అర్థమయ్యింది.

# మాయాబజార్ దర్శకుడికి తగిన గౌరవం



మార్గదర్శకుడు కె.వి.రెడ్డి
సంకలనం:
హెచ్.రమేష్‌బాబు,
తన్నీరు శ్రీనివాస్
పేజీలు: 224
వెల: ₹ 600
ప్రతులకు: ప్రముఖ పుస్తక కేంద్రాలు

నిస్సందేహంగా తెలుగువారి మేటి దర్శకుడు కె.వి.రెడ్డి. ఆయన శతజయంతి సందర్భంగా వెలువడిన మరో అరుదైన సంకలనం 'మార్గదర్శకుడు కె.వి.రెడ్డి'.

ఏఎన్నార్, దుక్కిపాటి, ఆరుద్ర, డి.వి.నరసరాజు, శ్రీశ్రీ లాంటి ఎందరో ప్రముఖులు కేవీ రెడ్డిపైనా, ఆయన చిత్రాలపైనా రాసిన వ్యాసాలున్నాయి ఇందులో. అన్నీ తుతరం వారికి ఆసక్తి కలిగిస్తాయి. కేవీ వ్యక్తిత్వం, సినిమా కళ పట్ల ఆయన శ్రద్ధను పట్టిస్తాయి.

కేవీ రెడ్డి హిందీలో 'పాతాళ భైరవి' చిత్రాన్ని రూపొందించారని ఎంతోమంది చెబుతున్నా, కొంతమంది చరిత్రకారులు దాన్ని డబ్బింగ్ కింద జమ కడుతున్నారు. అలాంటి వారికి 1955 'కినిమా' పత్రిక ఏప్రిల్ సంచికలో 'పాఠకుల సందేహాలకు కె.వి.రెడ్డి సమాధానాలు' శీర్షికలో తగిన జవాబు లభిస్తుంది.

అయితే కొన్నిచోట్ల మూలాల్లోనే పొరపాట్లు దొర్లాయి. ఉదాహరణకు ఎన్టీఆర్ శ్రీకృష్ణునిగా కనిపించిన తొలిచిత్రం 'ఇద్దరు పెళ్లాలు' (1954). ఏ ముహూర్తాన ఎవరు రాశారో కానీ ఎన్టీఆర్ శ్రీకృష్ణునిగా నటించిన మొదటి సినిమా 'సొంతవూరు'(1956) అనేది ప్రచారంలోకి వచ్చింది. అదే లక్ష్మీపార్వతి వ్యాసంలోనూ దర్శనమిస్తుంది. ఇలాంటి వాటిని సంకలనకర్తలు సరిచేసి ఉంటే బాగుండేది.

ఈ పుస్తకాన్ని రూపొందించిన తీరు మాత్రం అభినందనీయం. ఖరీదైన కాగితాన్ని ఉపయోగించడం వల్ల ఛాయాచిత్రాలు మరింత అందంగా కనిపిస్తున్నాయి. కేవీ అభిమానులకు ఆనందం పంచే రీతిలోనే ఈ సంకలనాన్ని 'తన్నీరు వెంకట సరోజిని ఫౌండేషన్' ప్రచురించింది.

● గోపీకృష్ణ

# పేదోళ్ల లాయరమ్మ



'వన' జనపథం
(పాక్కుల న్యాయవాది
ఎం.ఎ. వనజ స్మృతిలో)
ప్రచురణ: లీగల్ సెంటర్
ఫర్ సోషల్ జస్టిస్
పేజీలు: 128
వెల: ₹ 100
ప్రతులకు: ప్రముఖ పుస్తక కేంద్రాలు

ఎక్కడ చూసినా 'నా' అనే పరిధి సంకుచితత్వమై భయపెడుతున్న వేళ 'మన' అనే విస్తృత భావజాలంతో ఆలోచించి, ఆచరణాత్మక కార్యకర్తగా అందరి బంధువయ్యారు 'వన'.

గృహహింస కేసులు, బాల్య వివాహాలు, బాలకార్మికులు, ఆదివాసుల ఆరోగ్యం.... ఇలా ఎన్నో అంశాలపై వనజ పనిచేశారు. లాయరుగా పేదోళ్ల కన్నీళ్లు తుడిచారు. ఆమె మరణం 'సింగిల్ కాలమ్ న్యూస్' కాదు.

'వన జనపథం'లో వనజ అన్నయ్య వాసు, అమ్మ వసుంధరతో పాటు ఆత్మీయులు రాసిన వ్యాసాలున్నాయి. అవి వనజ వ్యక్తిత్వాన్ని ప్రతిబింబిస్తాయి. 'ఇంక సెలవ్' పేరుతో వనజ రాసిన ఉత్తరం కదిలిస్తుంది.

● యం.డి.

# రాజకీయాల్లో మహిళలెక్కడ?



రాజకీయాలలో మహిళలు
రచన: షేక్ హసీన
పేజీలు: 168
వెల: ₹ 100
ప్రతులకు: ప్రజాశక్తి, విశాలాంధ్ర

ఎన్నో రంగాలలో తనదైన ప్రతిభ చూపిస్తున్న మహిళ రాజకీయాల్లో ఏ మాత్రం వాటా దక్కించుకుంది? చట్ట సభల్లో ఆమె ప్రాధాన్యత ఏ మేరకు? ఇప్పటికే చట్టసభల్లో ఉన్న మహిళలు ఏ మాత్రం వాణిని వినిపిస్తున్నారు? ఇలాంటి ఎన్నో ప్రశ్నలకు సమాధానాలు 'రాజకీయాలలో మహిళలు' పుస్తకంలో లభిస్తాయి.

సమాజ వికాసం మహిళల ఉన్నతిపైనే ఆధారపడి ఉందని చెప్పిన రాజకీయ, సాహిత్య, జర్నలిస్టు ప్రముఖుల అభిప్రాయాలనూ ఇందులో చూడొచ్చు.

● నిర్మలారెడ్డి

## ఎక్నాలెడ్జ్‌మెంట్

**మోహనరాగం (నవల)**
**రచన: అంగులూరి అంజనీదేవి**
పేజీలు: 206; వెల: ₹ 70
ప్రతులకు: మధుప్రియ పబ్లికేషన్స్, మాచవరం, విజయవాడ-4.

**మహారాజశ్రీ అవతారంగారు (నవల)**
**రచన: సింహప్రసాద్**
పేజీలు: 204; వెల: ₹ 100
ప్రతులకు: ప్రధాన పుస్తక కేంద్రాలు

**చీకటి గీతలు (కథలు)**
**రచన: గవర ఈశ్వరరావు**
పేజీలు: 156; వెల: ₹ 100
ప్రతులకు: ప్రధాన పుస్తక కేంద్రాలు.

**నిప్పుల తుఫాన్ (కథలు)**
**రచన: ఎస్.గణపతిరావు**
పేజీలు: 176; వెల: ₹ 100
ప్రతులకు: విశాలాంధ్ర.

**తేనె చినుకులు (పిల్లల కథలు)**
**రచన: డా॥ అమరవాది నీరజ**
పేజీలు: 50; వెల: ₹ 40
ప్రతులకు: ప్రధాన పుస్తక కేంద్రాలు.

**భైరవవాక (నవల)**
**రచన: ఇందూ రమణ**
పేజీలు: 228; వెల: ₹ 150
ప్రతులకు: విశాలాంధ్ర

**అలుగు (కవిత్వం)**
**రచన: పిట్టల శ్రీనివాస్**
పేజీలు: 56; వెల: ₹ 30
ప్రతులకు: ప్రధాన పుస్తక కేంద్రాలు.

**అణుమహర్షి (డా॥ ఎ.ఎస్.రావు జీవితచరిత్ర)**
**సంకలనం: దుర్గమహంతి మోహనరావు**
పేజీలు: 100; వెల: ₹ 50
ప్రతులకు: విశాలాంధ్ర

**నిషాని (దళిత తిరుగుబాటు కవిత్వం)**
**సంపా॥ : వేముల ఎల్లయ్య, కొమ్ము సుధాకర్**
పేజీలు: 40; వెల: ₹ 20
ప్రతులకు: ప్రధాన పుస్తక కేంద్రాలు

**కాలుష్యం కోరల్లో పర్యావరణం**
**రచన: ఆచార్య గొల్ల సూర్యనారాయణ**
పేజీలు: 72; వెల: ₹ 55
ప్రతులకు: విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌజ్

**మన విజయవాడ (కవిత్వం)**
**సంపాదకుడు: చలపాక ప్రకాష్**
పేజీలు: 122; వెల: ₹ 50
ప్రతులకు: రమ్యభారతి సాహిత్య త్రైమాస పత్రిక, 1-4/3-36, సంజయ్‌గాంధీ కాలనీ, విద్యాధరపురం, విజయవాడ-12


సహచరులతో దీపేష్


దీపేష్

రోడ్డు మీద వెళ్తుంటాం.. ఓ ముసలాయన చింపిరి జుట్టుతో, మాసిన బట్టలతో, పిచ్చి చూపులతో కనిపిస్తాడు.. అతని వైపు కొంచెం జాలిగా చూసి వెళ్లిపోతాం! ఎవరికో రక్తం కావాలంటూ ఓ మెసేజ్ వస్తుంది.. కుదిరితే ఫార్వర్డ్ చేస్తాం.. లేదంటే దాని గురించి పట్టించుకోకుండా వదిలేస్తాం! అలాగని మనలో సేవా దృక్పథం లేదని కాదు.. సాయం చేసే మనసుంటుంది.. కానీ చేసే మార్గమే కనిపించదు.. కారణం 'మనం సామాన్యులం' అన్న భావన. మనమేం చేయగలంలే అన్న ఉదాసీనత ! ముంబయికి చెందిన దీపేష్ టాంక్ కూడా మనలా సామాన్యుడే. ఓ చిన్న బీపీఓ ఉద్యోగి. కానీ అతని సంకల్పం అసామాన్యమైంది.

# బీపీఓ కుర్రాడు... వందలమందిని కదిలించాడు

2006 జూలై 11. ముంబయిలోని లోకల్ ట్రైన్‌లో బాంబు పేలుళ్లు జరిగాయి. టీవీలో ఆ దృశ్యాలు చూశాడు 22 ఏళ్ల దీపేష్. వెంటనే తన స్నేహితుణ్ని తీసుకుని ఓ ఆసుపత్రికి వెళ్లాడు. అక్కడ భయానక వాతావరణం. తలలు పగిలి.. అవయవాలు పోగొట్టుకుని ఎందరో అభాగ్యులు కొన ఊపిరితో కొట్టుమిట్టాడుతున్నారు. అందాల్సిన సాయం అందడం లేదు. తగినంత సిబ్బంది లేరు, ఎక్కించడానికి సరిపడా రక్తం లేదు. దీపేష్ చాలా ఆవేదన చెందాడు. ఆ ఆవేదన నుంచి పుట్టిందే 'యూత్ ఫర్ పీపుల్' (వైఎఫ్‌పీ). ఇది మిగతా స్వచ్ఛంద సంస్థలాంటిది కాదు. దీనికి పరిమితులూ నియమాలూ లేవ్వు. సాయం కావాల్సిన ఎవరినైనా ఆదుకుంటుంది. ఎవరైనా సాయం చేయొచ్చు. కేవలం సాయం చేయాలన్న కోరిక ఉంటే చాలు. ప్రత్యేకంటూ ఓ ఆఫీస్ కూడా లేదు. ఎన్జీవోల్లా వీరు విరాళాలు పోగు చేసి సంస్థ ఖాతాల్లో పెట్టరు.

మొబైల్ మెసేజులు... సోషల్ నెట్‌వర్కింగ్ సైట్లలో పోస్టుల ద్వారా మొత్తం జరిగిపోతుంది. ఒక చోట యాక్సిడెంట్ జరుగుతుంది. వెంటనే సభ్యులందరికీ మెసేజ్ వెళ్తుంది. లేదా ఫేస్‌బుక్‌లో పోస్టు చూసి రెస్పాండ్ అవుతారు. వెంటనే ఖాళీగా ఉన్నవాళ్లు యాక్సిడెంట్ జరిగిన చోటికి వెళ్లిపోతారు. రక్తం అవసరమైతే సంస్థ సభ్యుల్లోనే ఎవరైనా దానం చేస్తారు లేదా దొరికే చోటొకటి సంపాదిస్తారు.

ఓసారి ముంబై లోకల్ ట్రైన్‌లో వెళ్తుండగా దీపేష్ ఓ రోగపీడిత వృద్ధుణ్ని చూశాడు. వెంటనే అతణ్ని ఆసుపత్రికి తీసుకెళ్దామని చూశాడు. కానీ ఆ ముసలాయన అవతారం చూసి. ఏ ఆటోవాడూ ముందుకు రాలేదు. దీంతో ఓ తోపుడు బండిలో అతణ్ని ఆసుపత్రికి తీసుకెళ్లాడు. వైద్యం చేయించాడు. కొన్నాళ్లకు ఆ వ్యక్తి చనిపోతే.. దగ్గరుండి దహన సంస్కారాలు కూడా చేశాడు.

ఓసారి వారణాసికి చెందిన ఓ కుర్రాడు దీపేష్ బృందాన్ని కలిశాడు. అతనికి ప్రాణాంతకమైన వ్యాధి. బోన్ మారో ట్రాన్స్‌ప్లాంట్ చేయించకపోతే ప్రాణాలు నిలవవు. రూ.10 లక్షల దాకా ఖర్చవుతుంది. వైఎఫ్‌పీ వెంటనే న్యూస్‌పేపర్‌లో ఆ కుర్రాడికి సాయం చేయాలంటూ అప్పీల్ ఇచ్చింది. ఓ వ్యక్తి స్పందించి, అతనికి నిధులు సమకూర్చడానికి ముందుకొచ్చాడు. ఆపరేషన్ తర్వాత కుర్రాడు పూర్తిగా కోలుకుని ఇంటికెళ్లాడు.

దేశంలో రక్తం కొరత ప్రధాన సమస్య. అందుకే దీపేష్ 'రష్ ఆఫ్ బ్లడ్' పేరుతో మరో స్వచ్ఛంద సంస్థతో కలిసి మ్యూజికల్ బ్లడ్ క్యాంప్స్ నిర్వహిస్తున్నాడు. సంస్థ సభ్యులు వందల యూనిట్ల రక్తం సేకరించి... బ్లడ్ బ్యాంకులో నిల్వ చేస్తారు. అవసరమైన వారికి రక్తం సరఫరా చేస్తారు. చిన్నారులకు చదువు చెప్పించేందుకూ దీపేష్ బృందం కృషి చేస్తోంది. ముంబై మురికివాడల్లోని నరేష్‌వాడి స్కూల్‌ను వైఎఫ్‌పీ దత్తత తీసుకుంది. హెచ్‌ఐవీ బాధితులు, అండ లేని వృద్ధులు, బాల కార్మికులు... ఇలా అన్ని రకాల వ్యక్తుల్నీ ఆదుకుంటోంది.

ప్రస్తుతం దేశవ్యాప్తంగా యూఎఫ్‌పీకి 500 మందికి పైగా సభ్యులున్నారు. ఇందులో బాగా సంపాదించేవాళ్లు, చిరుద్యోగులు.. విద్యార్థులు అన్ని రకాల వారూ ఉన్నారు. వీరందరిదీ ఒకటే బాట. సాయం చేయడం..! దీపేష్ ఇప్పటికీ అదే బీపీఓ సంస్థలో చిరుద్యోగిగానే ఉన్నాడు. కానీ అతని సంకల్పం మాత్రం ఎందరినో కదిలిస్తోంది. మరెందరికో అండనిస్తోంది.

వైఎఫ్‌పీకి మీరూ చేయూతని వ్వాలంటే www.youthforpeople.com క్లిక్ చేయండి. అందులో దీపేష్ ఫోన్ నంబరు ఉంది. ఫేస్‌బుక్‌లో పేజ్ కూడా ఉంది.

● చిమ్మల ప్రకాష్

పాంచ్ పటాకా

# ఇప్పుడున్న ఫీల్డ్‌లోకి రాకపోయింటే ఏం చేస్తుండేవారు?

## ప్రణీత
అమ్మానాన్నలిద్దరూ డాక్టర్లే. అందుకే నన్ను కూడా డాక్టర్‌ని చెయ్యాలనుకున్నారు. టెన్త్ అయ్యేవరకూ నేనూ అలాగే అనుకున్నాను. కానీ ఎందుకో బయాలజీ పాఠాలు నచ్చేవి కావు. దాంతో ఇంజినీరింగ్ చదవాలనుకున్నా. నటిని కాకపోయుంటే ఎలాగోలా అది కాస్తా చదివేసి, ఇంజినీర్‌గా స్థిరపడిపోయేదాన్ని.

## ఎస్పీ బాల సుబ్రహ్మణ్యం
మెకానికల్ ఇంజినీరింగ్ చదివాను కాబట్టి... గాయకుడిని కాకపోయుంటే నేను కచ్చితంగా మెకానికల్ ఇంజినీర్‌గానే స్థిరపడేవాడిని. ఏదో పెద్దస్థాయికి ఎదిగుండేవాణ్ణి. ఏదయినా కనిపెట్టేవాణ్ణేమో కూడా!

## శరణ్యమోహన్
కచ్చితంగా గొప్ప డ్యాన్సర్‌ని అయి ఉండేదాన్ని. డ్యాన్సంటే నాకు ప్రాణం. నటిగా మారినా దాన్ని వదిలిపెట్టలేదు. 'విలేజ్‌లో వినాయకుడు' సినిమా చేస్తున్నప్పుడు చిన్న చిన్న స్టెప్స్ కూడా కంపోజ్ చేశాను. నిజానికి మా నాన్న, అమ్మ, చెల్లెలు కూడా డ్యాన్సర్లే. నాకు కూడా ఓ డ్యాన్సర్‌గానే స్థిరపడిపోవాలని ఉంది.

## సునీల్
మనకు చిన్నప్పట్నుంచీ బాగా తెలిసింది డ్యాన్సే కాబట్టి, దానిమీదే ఆధారపడి ఉండేవాడిని. మా భీమవరంలో మావుళ్లమ్మ గుడి ఉంది. ఉత్సవాలలో రికార్డింగ్ డాన్స్ చేసేవాడినేమో! లేటెస్ట్ సాంగ్స్‌తో దుమ్మేసి... చదివింపులు జాగ్రత్తగా తీసుకునేవాడిని.

## శ్రద్ధాదాస్
నటిని కాకపోయుంటే కచ్చితంగా రాజకీయాల్లోకి వెళ్లేదాన్ని. ఒకవేళ అది కుదరకపోతే న్యూస్ రీడర్‌గానో, గాయనిగానో స్థిరపడేదాన్ని. నిజానికి ఇప్పుడు కూడా నేను వాటిని వదిలిపెట్టేయాల్సిన అవసరం లేదు. ఎందుకంటే... ఎప్పటికైనా, ఏ వయసులోనైనా సాధించగలిగే లక్ష్యాలవి! ఎప్పటికైనా సాధిస్తానేమో!



స్వీట్ ట్వీట్స్

సేకరణ: అనూష

### యువన్ శంకర్ రాజా
ఫాలోవర్లు: 1,61,110

**తండ్రి ఇళయరాజా టాలెంట్‌ను అక్షరాలా పుణికిపుచ్చుకున్నవాడు యువన్ శంకర్‌రాజా. స్వరాలతో ఆడుకుంటూ, సినీ సంగీత ప్రియులను అలవోకగా ఆకట్టుకునే యువన్... ఎక్కువగా మాట్లాడడు. ట్విటర్‌లో మాత్రం తన అభిప్రాయాలను, భావాలను నిక్కచ్చిగా వెలిబుచ్చుతూ ఉంటాడు.**



- నాకు మా నాన్న విషయంలో ఒక గర్వం ఉంటుందెప్పుడూ. ఎందుకంటే ఆయన ఒక్కరి సంగీతానికే ఎక్స్‌పయిరీ డేట్ లేదు!
- పెరుగుతున్న పెట్రోల్ ధరలను చూస్తుంటే నాకొకటి అనిపిస్తోంది. అతి తక్కువ సమయంలో ఎక్కువ లాభాలు రావాలంటే పెట్రోల్ వ్యాపారంలో పెట్టుబడి పెట్టాలి. అది బంగారం కన్నా, భూమి కన్నా ఎక్కువ లాభాలు తెచ్చిపెడుతుంది!
- నా వర్క్‌లో నన్ను నేను కొత్తగా ఆవిష్కరించుకునేందుకు ప్రయత్నిస్తుంటాను. అలా చేసినప్పుడు ఇతరుల నుంచి రకరకాల అభిప్రాయాలు వెలువడుతుంటాయి. నేను వాటిని సంతోషంగా అంగీకరిస్తాను... పాజిటివ్, నెగెటివ్ ఏదైనా సరే!
- నేటి సినిమా సంగీతంలో నాకూ భాగమున్నందుకు నేను గర్విస్తున్నాను. ఇక్కడ ఎవరికుండే అవకాశాలు వారికున్నాయి. నావరకూ నేను హ్యాపీ. ఇతరుల సంగతి నాకు అనవసరం. నా ప్లేట్‌లో నేను తృప్తిగా తినగలిగేంత ఆహారం ఉన్నప్పుడు ఇతరుల ప్లేట్లల్లోకి తొంగి చూడాల్సిన అవసరం నాకు లేదు!
- పోటీ విపరీతంగా పెరిగి సంగీత దర్శకులు ఒకరిపై ఒకరు ద్వేషాలు పెంచుకుంటున్నారు. వాళ్లకి నేను చెప్పేదొకటే. మనమిక్కడ సంగీతాన్ని అందించడానికి మాత్రమే ఉన్నాం, కొట్టుకోడానికి కాదు. నా వరకూ నాకు సంగీతం నా వృత్తి కాదు, ఆసక్తి. దానితో కొందరికి సంతోషాన్ని ఇవ్వగలగడం నా అదృష్టంగా భావిస్తాను నేను!

ఇంటర్వ్యూ

చక్రాల్లాంటి కళ్లను గిరగిరా తిప్పుతూ, చూపులతోనే అన్ని భావాలనూ పలికించేయగలరామె. నోరు తెరచి మాట్లాకుండా, ముఖ కవళికలతోనే అన్ని విషయాలనూ చెప్పేయగలరామె. పాజిటివ్ పాత్రలు చేసి ప్రేక్షకుల మనసులను కదిలించడమే కాదు, నెగెటివ్ పాత్రలతో భయపెట్టడమూ తెలిసిన అరుదైన నటి ప్రీతినిగమ్. పలు సీరియళ్లు, సినిమాల్లో నటించి మెప్పించిన ప్రీతి మనసులోని మాటలు...



# అదంత ఈజీ కాదు!

**'చంద్రముఖి'లో బాగా భయపెడుతున్నారు?**
చేస్తున్నప్పుడు నాకే భయమేస్తోంది. నెగెటివ్ రోల్ చేయడం చాలా కష్టం. కండరాలు బిగించి, కళ్లు బాగా విప్పార్చి చేయాలి. అదంత ఈజీ కాదు.

**నెగెటివ్ రోల్ చేయడం ఇదే మొదటిసారా?**
లేదు లేదు. టీడీ 2 లో ఒకసారి చేశాను. 'కస్తూరి'లో కూడా విలన్‌నే. 'సునీల' అనే ఆ పాత్ర పేరుతో ఇప్పటికీ నన్ను పిలుస్తుంటారు.

**అసలు నటి ఎలా అయ్యారు?**
నేను క్లాసికల్ డ్యాన్స్ నేర్చుకున్నాను. ఓసారి ఓ డ్యాన్స్ బేస్డ్ డాక్యుమెంటరీకి డ్యాన్సర్ కావాలంటూ మా మాస్టర్ అనిల్ కుమార్‌ను సంప్రదించారు. ఆయన నన్ను పంపించారు. ఆ తర్వాత ఒక టెలిఫిల్మ్‌కి కొరియోగ్రఫీ చేయడానికి పిలిచారు. అప్పుడా దర్శకుడు 'నువ్వు ఎందుకు నటించకూడదు' అన్నారు. నేను అంతగా ఆసక్తి చూపించకపోయినా నన్ను ప్రోత్సహించి, నాకోసం ఓ పాత్రను కూడా సృష్టించారు. అలా మొదలైన నటన ఈరోజు వరకూ సాగుతూనే ఉంది.

**ఆడపిల్లల్ని నటిని చేయడానికి ఇంట్లోవాళ్లు వెనుకాడతారు. మరి మీ పేరెంట్స్ ఏమన్నారు?**
అమ్మానాన్నలిద్దరూ టీచర్లే కావడంతో ఇంట్లో డిసిప్లిన్ ఎక్కువ. మేం నలుగురు అక్కాచెల్లెళ్లం. నలుగురం డ్యాన్సర్లమే. అసలు డ్యాన్స్ నేర్చుకుంటామన్నప్పుడే నాన్న ఇష్టపడలేదు. ఇక నటనా! అమ్మ మాత్రం సపోర్ట్ చేసేది. 'వాళ్లేం చేసినా నాకు అభ్యంతరం లేదు. నా పెంపకం మీద నాకు నమ్మకముంది' అనేది. దాంతో నాన్న కూడా సరే అన్నారు.

**మీ తెలుగులో కాస్త తేడా ఉంటుంది. తెలుగువారు కాదా?**
నా మాతృభాష హిందీ. మా ముత్తాతల కాలంలోనే మావాళ్లంతా హైదరాబాద్ వచ్చి స్థిరపడిపోయారు. దాంతో ఇక్కడే పుట్టి పెరిగాను. ఇంట్లో హిందీలోనే మాట్లాడుకునేవాళ్లం. మా చుట్టుపక్కల గుజరాతీవాళ్లు, మరాఠీవాళ్లే ఉండేవారు. దాంతో తెలుగు అంతగా రాలేదు.

**ఇంతవరకూ ఎన్ని సీరియల్స్ చేశారు?**
ఇన్ని అని చెప్పలేను కానీ అన్నీ మంచివి చేశానని మాత్రం చెప్పగలను. నేనంటే ఏంటో అందరికీ తెలిపిన రుతు రాగాలు, కస్తూరి, ఆడది, ఎండమావులు, రావ్యాంజలి, గోరింటాకు, శాంతినివాసం, చంద్రముఖి... ఎన్నో మంచి సీరియల్స్, మంచి పాత్రలు. హిందీలోనూ చేశాను.

**సినిమాలు తక్కువగా చేశారు! ఎందుకని?**
'స్టూడెంట్ నం.1' తీస్తున్నప్పుడు, తన 'శాంతినివాసం' సీరియల్ టీమ్‌ని తీసుకొమ్మని రాఘవేంద్రరావు చెప్పడంతో రాజమౌళి మాకందరికీ ఆ సినిమాలో చాన్స్ ఇచ్చారు. తర్వాత శ్రీరామ్, ఆప్తుడు వాళ్లిద్దరూ ఇష్టపడ్డారు, ఈ అబ్బాయి చాలా మంచోడు, కబడ్డీ కబడ్డీ, సంతోషం తదితర చిత్రాలు చేశాను. మంచి పాత్రలు వస్తే చేస్తున్నాను తప్ప అవే చేయాలని ఆశపడటం లేదు.

**ఈ మధ్య ఏదో కొత్త గెటప్పులో కనిపిస్తున్నారు?**
తెలంగాణ వీరనారి 'చాకలి ఐలమ్మ' జీవితాన్ని సినిమా తీస్తున్నారు. ఐలమ్మగా నేను చేస్తున్నాను. ఆ గెటప్పే అది.

**మీవారు (కర్ర నాగేష్) కూడా నటుడే కదా?**
అవును. రుతురాగాలులో కలిసి నటించాం మేము. అయితే నటన అనేది ఆయన వృత్తి కాదు, ప్యాషన్. శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్‌కి వైస్ ప్రెసిడెంట్‌గా ఎన్నో అవార్డులు అందుకున్నారు. అంతర్జాతీయ పత్రికల్లో వ్యాసాలు రాశారు. ఏదైనా మంచి పాత్ర దొరికితే చేస్తారు కానీ తన మొదటి ప్రాధాన్యత మాత్రం ఉద్యోగానికే.

**నటిగా సంతృప్తి పొందినట్టేనా?**
పూర్తిగా. ఎవరెవరో పొగడ్త చేసి మీరంటే ఇష్టమని చెప్తుంటే సంతోషమేస్తుంది. కానీ కొంతమంది ఏదేదో మాట్లాడేస్తుంటారు. దాంతో అవాయిడ్ చేయాల్సొస్తుంటుంది. వాళ్లేమో మాకు పొగరనుకుంటారు. మాకూ పర్సనల్ లైఫ్ ఉంటుందిగా. అర్థం చేసుకుంటే బాగుంటుంది.

**భవిష్యత్ ప్రణాళికలేమిటి?**
పిల్లల్ని పెంచి ప్రయోజకుల్ని చేయాలి. మా బాబు ఆర్యన్‌కి డ్రాయింగ్, స్పోర్ట్స్ ఇష్టం. పాప అదితిశ్రీకి వాళ్ల నాన్నలా ఎంతసేపూ చదువే. వాళ్లు కోరుకున్న లక్ష్యాల వద్దకు వాళ్లను జాగ్రత్తగా చేర్చడమే నా ముందున్న ఏకైక లక్ష్యం.

● సమీర నేలపూడి

భర్త పిల్లలతో ప్రీతి



# అన్నం ఎన్ని రకాలుగా తినొచ్చు!



మధ్యాహ్నపు ఎండ ఇంత తీవ్రంగా ఉండదనుకోలేదు. కాలాల్ని ఇక కొత్తగా విభజించుకోవాలేమో!

తారు వాసన మిళితమైన గాలి; తగలబడుతున్న చెత్త పొగ; రాంగ్ రూట్లో వస్తున్న బైకు; కొట్టుకు వస్తున్న కరపత్రం; రాడ్ విరిగిపోతే ఆధారం లేక బస్సులో నిలబడిన ప్రయాణికుడు అతలాకుతలం అయినట్టుగా... ఈ విధ్వంసక నాగరికతలో నెట్టుకోవడానికి ఎక్కడా చిన్నపాటి ఆకుపచ్చ ఆశ లేదు. అదేమైనా నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో దొరుకుతుందేమో చూద్దాం!

• • •

'ఆయుష్' శాఖ ఏర్పాటుచేసిన 'ఆరోగ్య 2012' బోర్డు స్వాగతం పలుకుతోంది. ఆయుర్వేద, యోగ (మరియు నేచరోపతి), యునాని, సిద్ధ, హోమియోపతి... ఆయుష్!

ఇప్పుడే లెక్చర్ ముగిసినట్టుంది. కుర్చీలు ఖాళీగా ఉన్నాయి. పక్కనే ఫ్రీ చెకప్ కోసం ఏర్పాటుచేసిన తెరల గదుల ముందు జనం వరుసల్లో నిల్చున్నారు. ఇవి కూడా మతాల్లాంటివే! అన్నింటి లక్ష్యం నయం చేయడమే. కానీ పరీక్ష వేరు, విధానం వేరు. ఇదే అందం... మతాలకైనా, వైద్యాలకైనా. ప్రత్యామ్నాయం లేకుంటే అంతకంటే నిస్సారత లేదు జీవితంలో.

తులసి, గుంటగలగర, కొండపిండి, వావుడు లాంటి కలుపుమొక్కలు దేనికి పనికొస్తాయో చెప్పే చార్ట్ ఒకటి వేలాడుతోంది. 'ఆరోగ్యం కోసం ఐదు సూత్రాలు' మరో చోట. రోజుకు రెండుసార్లు భోంచేయాలి; మూడు లీటర్ల నీళ్లు తాగాలి; గంట యోగా/వ్యాయామం చేయాలి; వారానికో రోజు ఉపవాసముండాలి; కాసేపు ధ్యానం చేయాలి.

అజీర్ణానికి ఏం ఆసనాలు వేయాలో; నడుంనొప్పికి వేయాల్సినవేమిటో చిత్రపటాలు తగిలించివున్నాయి.

మీడియా హడావుడి కనబడుతోంది. తెలియక కెమెరా వ్యూలోకి వస్తున్నవాళ్లను రిపోర్టర్ సున్నితంగా పక్కకు జరుపుతోంది. కొందరు సందర్శకులు... సమోసాలు తింటూ; కూల్‌డ్రింకులు తాగుతూ; ప్యాకేజ్డ్ నీళ్ల మూతలు విప్పుతూ; 'ఆకలి వేసినప్పుడే భోంచేయాలి' అని 'సిద్ధ' చెబుతోంది. ఎంత చిన్న సత్యం! కానీ అలా ఎప్పుడు తిన్నాం చివరిసారి?

'గ్రీన్‌హౌజ్'లో మూలికమొక్కలు అమ్ముతున్నారు. ''ఇవి ఏం విత్తనాలండీ?'' ఒకావిడ 'అశ్వగంధ' గురించి అడిగితే ప్రదర్శకుడు అదనపు సమాచారమిచ్చాడు: ''వేళ్ల దంచి ఆ పొడి పాలల్లో కలుపుకుంటే మంచి బలం.'' ఆమె పద్రూపాయలిచ్చి రెండు పాకెట్లు కొంది. 'నేలవాము' దేనికి పనికొస్తుందని మరొకాయన అడిగితే, అతడు అటూ ఇటూ చూసి రెండు వేళ్లు ఎత్తి చూపించాడు. ఈయన డీకోడింగ్: ''అవున్లే, అది సాఫుంటే అన్నీ సరిగ్గుంటయ్.''

'రెడ్ కార్పెట్' స్వాగతాన్ని స్వీకరిస్తూ, మరింత లోపలికి వెళ్తే... ఎన్నో స్టాల్స్. అమ్మకానికి ఉత్పత్తులు.

ఒకావిడ సీసా వంపుతూ చెప్తోంది: ''ఒరిజినల్ తేనె అయితే చుక్కగా కిందికి జారిపోతుంది. బెల్లం, చక్కెర కలిపితే ఇలా రాదు మీకు.''

ఆక్యుప్రెషర్ స్టాల్లో తెలుపు, ఎరుపు బల్బుల్లాంటి నొక్కులున్న చెప్పులున్నాయి. ఎక్కడ ఒత్తిడి పడితే శరీరంలోని ఏ అవయవం ఉత్తేజితం అవుతుందో రాసివుంది. చేతుల్ని నిరంతరం చైతన్యపరిచే రకరకాల 'టాయ్స్' ఉన్నాయి. ఒకదాంతో అతడు హెడ్ మసాజ్ చేసి చూపిస్తే, చక్కిలిగిలి పుట్టింది.

'ఆయుర్వేద దేవుడు' ధన్వంతరి విగ్రహం; మడ్‌బాత్ ఉపయోగాలేమిటో చూపిస్తున్న వీడియో; యునాని మెడిసిన్ ఇంకా ఎక్కడెక్కడ వ్యాప్తిలో ఉందో చూపించే మ్యాపు; అందులో ఉన్న అమ్మాయి నా చిరుగడ్డం వల్ల కావొచ్చు, నన్ను ముస్లిం అనుకొని ఉర్దూ బ్రోచర్ చేతికిచ్చింది(''ఆప్ ఐసా హీ దిఖ్తే'').

దుంపరాష్ట్రము(జ్వరం), కరివేప(డయేరియా), తిప్పతీగ(మూత్ర సంబంధ సమస్యలు), బావంచాలు(సోరియాసిస్) లాంటి మొక్కలు దేనికి పనికొస్తాయో చూస్తూ; త్రిఫల చూర్ణాలు కొంటూ; 'కడుపు నొప్పికి ఒక చెంచా వాముపొడిని వేడి నీళ్లతో సేవించాలి, దగ్గు ఉన్నవాళ్లు వేడిపాలలో ఒక చెంచా పసుపు వేసుకుని రోజుకు రెండుసార్లు తాగాలి' చదువుతూ;

• • •

మంచి కాలతాళీయత ఇది. ఇందులోనే 'ప్రజా జీవ వైవిధ్య ఉత్సవం' జరుగుతోంది. ఒకటి మనిషి ఆరోగ్యం గురించి, రెండోది నేల ఆరోగ్యం గురించి. రెండూ మళ్లీ వేర్వేరు కావు. నేల బాగే మనిషి బాగు.

ప్రవేశంలో కాటూరి వెంకటేశ్వరరావు వైర్లతో రూపొందించిన అరక దున్నుతున్న రైతు శిల్పం ఆకర్షిస్తోంది. ఎద్దు మెడలో వేలాడుతోన్న గంటను ఊపి చూశాడు పిల్లాడు.

పదుల కొలదీ స్టాల్స్ 'యూ' ఆకారంలో పెట్టారు. విత్తనాలు, వెదురు టోపీలు, గంపలు, బుట్టలు, మట్టిపాత్రలు; పీక్షణం, తాలకలి, రైతునేస్తం, మంచిపుస్తకాలు; రాష్ట్రంలోని వివిధ జిల్లాలు, దేశంలోని వివిధ ప్రాంతాల్లోని వైవిధ్యమంతా ప్రదర్శనకుంది. వీటన్నింటి ప్రధాన సూత్రం ఒకటే. సహజంగా పండిన పంట, మందులు వేయని పంట, హైబ్రిడ్ కల్తీకాని

ప్రకృతి పంట.

కొర్రలు, సజ్జలు, రాగులు, పెసర, శనగ, కంది, గోధుమ, మినుములు, ఉలవలు, మొక్కజొన్న; మిరపకాయల్లో పదారు రకాలు; అంగుళం మించని పొట్టి, సన్న, గుంట్రటి జాతులు;

''మీరు ఏ గవర్నమెంటు అధికారిని అడిగినా పురుగుమందు కొట్టమనే చెప్తారు. వాళ్ల ఏరియాల్లో అమ్మకాల్ని బట్టి వాళ్లకు పర్సెంటేజీలుంటాయి.'' మిలిట్రీ నుంచి రిటైరై వ్యవసాయం చేస్తున్నానని చెప్పిన ఒక పెద్దమనిషి కోపంగా అంటున్నాడు.

పుణే నుంచి పెట్టిన 'అంత్ర' స్టాల్లో బుల్లి చేటల్లో వివిధ వరి రకాలు నీటుగా సర్దిపున్నాయి. జీర కొలాంబా, అంబెమోహర్, తుల్సా, గుజ, దోడ్కి, గారా కొలాంబా; వాటిని వాళ్ల హైదరాబాద్ శాఖ నుంచి కావాలంటే కొనుక్కోవచ్చంది సంగీత.

ఒకచోట పిడదుంప, చెన్నదుంప, కర్రపెండ్లం, అడవి అరటి పెట్టిపున్నాయి. ఎప్పుడూ చూడనివి. ఒక అందమైన కొమ్మ... దాన్ని సవర భాషలో కూజింగ్ అంటారట. ఆ చెట్టు రాత్రుళ్లు పంటను కాపు కాస్తుందని ఉత్తరాంధ్ర సవరల నమ్మకం.

పాండిచ్చేరి నుంచి వచ్చిన దీపిక నైల్ల్ ప్లాంట్‌లా ఉంది. తన పెరల్ గార్డెన్‌లో పెంచిన విత్తనాలను ప్యాకెట్లలో ఉంచింది. బెండ, టమోటా, వంకాయ, చిక్కుడు, పాలకూర, తోటకూర; ఒకాయన 11 ప్యాకెట్లు కొన్నాడు. ''ఫిఫ్టీన్ సెవన్‌టీ... 165''.

మరొక స్టాల్ కాకరాపల్లి (శ్రీకాకుళం) కోసం కేటాయించింది. 'ఈస్ట్ కోస్ట్ థర్మల్ పవర్ ప్లాంట్ వ్యతిరేక పోరాట సమితి' ఛాయాచిత్ర మాలిక. సంబారి వెంకట్రావు చెప్పినదాని ప్రకారం... సముద్రపు పోటు వచ్చినప్పుడు వెళ్లివెళ్లే నీటిని ఇక్కడి బీల భూమి మాత్రమే ఫిల్టర్ చేయగలదు. ఇది ఆ నేల ప్రత్యేకత. ఆ నీటిలో కొట్టుకొచ్చే 'విత్తనం'లోంచి రకరకాల చేపలు పెరుగుతాయి. బల్ల, ఇసకదొంత, పొలదొంత, బొరుసుపరిగి, జాడిపరిగి, సవద, నల్లదొంత, మారుల; అలాగే, ఇక్కడికి సైబీరియా పక్షులు వలసకొస్తాయి. నాగాసరంపేరు, బలుసు, వాక లాంటి వనమూలికలు పెరుగుతాయి. ప్లాంట్‌ని సముద్ర మట్టం కంటే ఎత్తున కట్టడం వల్ల నీటి ప్రవాహానికి ఆటంకం కలుగుతోంది. 59 గ్రామాలు, పంటపొలాలు, అక్కడి

జీవవైవిధ్యం, 'సవరుసుల తల్లి నౌపాడ ఉప్పుగల్లి' నాశనం. దీనికోసమే పోలీసుల్తో దెబ్బలు తిని, గాయాలు చేసుకొని, 734 రోజులుగా దీక్ష చేస్తూ; జీరు నాగేశ్వరావు, బర్తిన బారికవాడు, సీరల ఎర్రయ్య ప్రాణాలు పోగొట్టుకుని; ప్రదర్శన కోసం దర్చిన పీతల్ని అతడు ఉరికే వేలాడగట్టినా, మనుషుల శవాలే వేలాడుతున్నట్టుగా ఉంది.

అనంతపురం 'టింబక్టు'వాళ్లు అక్కడి అటవీ ఉత్పత్తులు ప్రదర్శనకుంచారు. మగలింగ, యాదిగ, కలివి, తొనుపు, దునర, మల్లరేగి, తిగడ, యడతర, ఉల్లి, తెలుకొండి, కుటీర, పూదుమద్ది, తొల్లి, బందర, గిరిశనం, సరువ, యానిక, పంచపాండవులు, మంగ, మర్షమాతాంగి; ఇవి వేటికి పనికొస్తాయని అడిగితే పోతన్న

ఛత్తీస్‌గఢ్ బస్తర్
ప్రాంతానికి చెందిన
శివనాథ్ యాదవ్
వరి గొలకల్ని వరుసగా
అమర్చాడు. మొత్తం
256 రకాలు. ఒక్క
వరిలోనే.

ఉన్నాడు: ''సార్ ఇందులో పనికిరానిది లేనేలేదు.'' వాడుకోవడం తెలియాలిగానీ పనికిరానిదేముంటుంది! ఈ గిరిజన జ్ఞానం, ఈ పల్లీయుల జ్ఞానం ముందు తరాలకు ఎలా బదిలీ కావాలి?

'గ్రామీణ్ మాల్'లో కనబడ్డ జొన్న రకాలు: పసజొన్న, గౌరజొన్న, ముంతజొన్న, పసుపుజొన్న, రాతిజొన్న; డీడీఎస్ వాలంటీర్ నిఖిల ఉత్సాహంగా అంటోంది: ''ఇది ఆర్గానిక్ మూవ్‌మెంట్.'' రాబోయే మార్పేదో ఆమె కళ్ల కాంతిలో కనబడుతోంది.

ఈ ప్రదర్శనలో ప్రధానంగా ఆకర్షించింది వరి. మనం రోజూ తినే వరిని ఎన్ని రకాలుగా తినవచ్చు! ఛత్తీస్‌గఢ్ బస్తర్ ప్రాంతానికి చెందిన శివనాథ్ యాదవ్ వరి గొలకల్ని వరుసగా అమర్చాడు. మొత్తం 256 రకాలు. ఒక్క వరిలోనే. అదే రాష్ట్రపు బిలాస్‌పూర్ ప్రాంతానికి చెందిన ఓంప్రకాష్ సుమారు 200 వరి వంగడాలు తమ దగ్గర దొరుకుతాయన్నాడు. లాలు, నానా కాజల్, జల్‌దుబీ, లావాండీ, బాస్‌ముఖి, ఇట్బుండీ, కోలమ్, దుబ్‌రాజ్, విష్ణుభోగ్, సఫరీ; ఒక్క రాష్ట్రంలో ఇన్ని

వెరైటీలా? దేశంలో ఇంకెన్నుండాలి? ''మా దగ్గర సేకరించిన విత్తనాలు ఇవి. మా దగ్గర పిలిచే పేర్లు ఇవి. బస్తర్‌వి కూడా వేరే పేరుతో ఇందులో ఉండొచ్చు.'' అయినా తక్కువేమీ కాదే! రోజుకో రకం తిన్నా ఏడాది గడిచిపోతుందే! ఇవన్నీ మనకు అందకుండా ఎందుకున్నాయి?

బహుళజాతి సంస్థల మీద అక్కడే ఉపన్యసిస్తున్న గద్దర్ వ్యంగ్యం: ''ఈ విత్తనం పేరేందిరా అని మనం అడుగుతే వాడు 'సీడ్' అంటాడు. ఆ సీడును తెచ్చి భూమిల పెడితే మొలక రాదు. మొలకొస్తే గొలక రాదు... బిడ్డా సీడ్స్ అట్లుంటయి.''

మైసూర్ రాజులు ఒడెయర్లు తినే బియ్యం 'రాజ్‌ముడి'ని చూపుతూ కృష్ణప్రసాద్ బాధ: ''లైఫంటే చాలా పెద్దది. ఇన్ని రకాలుండగా ఒక్క సోనామసూరి, ఒక్క బాసుమతే తినడమేమిటి? ఏం తినాలి, ఏం తాగాలి, ఏవి పెంచాలని మన పిల్లలకు ఇప్పటికైనా చెప్పకపోతే ఎలా?''

• • •

సాంకేతికత ప్రబలడానికీ, విత్తన సంపద పోవడానికీ, ప్రతి మనిషీ విధిగా మధుమేహం, క్యాన్సర్, గుండెజబ్బులను దాటుకుంటూ రావడానికీ... అన్నింటికీ సంబంధం ఉంది. ఓ క్యాజువల్ సంభాషణలో ధనుంజయ్ అన్నాడు: ''వీడు పై స్థానంలో ఉన్నాడని ఎవరిమీదైతే మనం అసూయ పడతామో, వాడు కూడా సంతోషంగా లేడా.'' ఎవరూ సంతోషంగా లేని, ఎవరూ ఆరోగ్యంగా లేని ఈ విధ్వంసకర వ్యవస్థ ఇంకెందుకు?

'జ్వరానికి సూక్ష్మక్రిములు కారణం కాదు; రోగవర్ధకం శరీరంలో ప్రవేశించాక పరిస్థితులు అనుకూలించాయి కాబట్టే సూక్ష్మక్రిములు పెరుగుతాయంతే. కాబట్టి, జబ్బు నయం కావాలంటే రోగవర్ధకాన్ని తొలగించాలి,' అని నేచరోపతి చెబుతుంది. జీవావిర్భావ కీలకం ఏదో ఇందులో ఉంది. మనుషులు, చిలకలు, ఉడుతలు పెరిగే వాతావరణం అనుకూలించింది కాబట్టే మనం పుట్టాం, బట్టకట్టాం. అయితే, ఇప్పటికే 'రోగవర్ధకం' ప్రవేశించింది. పూర్తి ప్రతికూలత ఏర్పడిననాడు అందరమూ సామూహికంగా అంతమైపోతాం.

కానీ ఎక్కడో ఎవరో నిశ్శబ్దంగా తమ విధికిత్స చేసుకుంటూ వెళ్తున్నారు, విధ్వంసం స్థానే నవనిర్మాణానికి విత్తనాలు ఎత్తుతున్నారు.

● పూదూరి రాజిరెడ్డి

## ప్రేమలేక



గవర్నమెంట్ ఆఫ్ ఇండియా ఒక కొత్త నిర్ణయం తీసుకుంది.
**అందంగా కనిపించే వాళ్లను దేశబహిష్కరణ చేయాలని.**
ఏది ఏమైనా-
ప్రియా! నువ్వు మాత్రం సేఫ్. నీకు ఎలాంటి ముప్పూ లేదు. నేను చెప్పేది నమ్మకపోతే ఒకసారి అద్దం చూసుకో.
నేను చెప్పింది నిజమే కదా!

## ప్రేమచరణం

**ఏనాడైతే ఈ జీవితం రెట్టింపు బరువెక్కునో**
**తనువు మనసు చెరిసగమని పంచాలి అనిపించునో**
**సరిగా అదే శుభముహూర్తం సంపూర్ణమయ్యేందుకు**
**మనమే మరో కొత్తజన్మం పొందేటి బంధాలకు**



## లవ్ పొయెమ్

ఎప్పుడూ తెలుగులో రాయడమేనా?
అప్పుడప్పుడు ఇలా ఇంగ్లిష్‌లో
ప్రేమకవిత్వం రాయండి.
R ఈజ్ రెడ్
RED ఈజ్ బ్లడ్
BLOOD ఈజ్ ఫర్ హార్ట్
HEART ఈజ్ ఫర్ లవ్
LOVE ఈజ్ ఫర్ లైఫ్
LIFE ఈజ్ ఫర్ యూ!

## జర జాగ్రత్త తమ్ముడూ....

మ్యాథ్స్‌లో దేయి తిరిగిన అమ్మాయిలకు అబ్బాయిలు 'ఐ లవ్ యూ' చెప్పడం అంటే మాటలు కాదు. బీఎస్సీ(మ్యాథ్స్) చదివే సుష్మకు శ్రీను ప్రపోజ్ చేస్తే ఏమయిందో చూడండి....
**అబ్బాయి:** ఫ్రెండ్‌షిప్ చేసి చేసి బోర్ కొడుతుంది సుష్మా. ఇక మనం ప్రేమించుకుంటే మంచిదేమో!
**అమ్మాయి:** ఫ్రెండ్స్‌గానే ఉందాం శ్రీనూ. ఎందుకంటే ఫ్రెండ్‌షిప్ విలువ ప్రేమ కంటే రెట్టింపు... ఎలాగంటే..
A= 1, B= 2, C=3... Z=26
L+O+V+E= 54
F+R+I+E+N+D+S+H+I+P= 108



## అయ్‌బాబోయ్!

లవ్ అనేది
'చెస్' గేమ్‌లాంటిది.
ఒక్క రాంగ్ స్టెప్ వేస్తే...
ఆ... వేస్తే?
మీ 'పెళ్లి' అయిపోయినట్లే!

## ఒకే ఒక్కటి...



**అబ్బాయి:** ఖాళీ కడుపుతో ఎన్ని యాపిల్స్ తినగలవ్?
**అమ్మాయి:** నేనైతే ఆరు యాపిల్స్ తినగలను.
**అబ్బాయి:** అసాధ్యం....నువ్వు ఒకే ఒక యాపిల్ తినగలవు!
**అమ్మాయి:** ఎలా?
**అబ్బాయి:** ఒక్క యాపిల్ తిన్నాక... అది ఎంప్టీ స్టమక్ అని ఎలా అనగలవ్?

## మొబైల్ డే



**రాజు:** నీకో విషయం చెప్పడం మరిచాను. ఇవ్వాళ 'మొబైల్ డే' తెలుసా?
**రాధ:** మొబైల్ డే రోజు ఏం చేయాలి?
**రాజు:** మొదట మొబైల్ కవర్ తీయాలి. తరువాత బ్యాటరీని తీసి సబ్బు నీళ్లతో శుభ్రపరచాలి. ఆ తరువాత సిమ్‌కార్డ్‌కు చందనం, కుంకుమ రాసి కళ్లు మూసుకొని 'గోవింద గోవింద' అని అరవాలి.



## ట్వ్యోంట్వ్యోం

నా కలలో
నువ్వే నా జీవితం!
నా జీవితంలో మాత్రం
నువ్వు ఒక కల!

## అబ్బాయిల F రూల్స్!

FIND హర్
FOLLOW హర్
FRIEND హర్
FORGET హర్
FIND నెక్స్ట్

యాకుబ్ పాషా

మనీ

₹ భద్రం బి కేర్‌ఫుల్

# పిల్లలను పిసినారులను చేయొద్దు

ఇంతకుముందు మనకోసం, మన పిల్లల కోసం బతికేవాళ్లం. ఇప్పుడు అందరూ తమ పిల్లల కోసమే బతుకుతున్నారు. వారికి ప్రాధాన్యం ఇచ్చే క్రమంలో గారాబం పెరిగి కొన్ని విషయాల్లో వారు తప్పుదారిలో నడిచే పరిస్థితి కూడా తలెత్తుతోంది. వారికి తెలియజెప్పాల్సిన కొన్ని ఆర్థిక సూత్రాలు ఇక్కడ ఇస్తున్నాం.



- పిల్లలకు పొదుపు చేయడం కంటే ముందు తల్లిదండ్రులు డబ్బులు సంపాదించడం వెనుక ఎంత కష్టముందో తెలియాలి. తద్వారా వారికి డబ్బు విలువ తెలుస్తుంది. దీనివల్ల వారిలో డబ్బు, సంపాదన గురించి సరైన అవగాహన కలుగుతుంది.
- పొదుపు చేయడం నేర్వాలని చెప్పి ప్రతిదీ డబ్బుతో ముడిపెట్టి వారికి బాల్య జ్ఞాపకాలు లేకుండా చేయొద్దు. వారి చిన్ని చిన్ని సంతోషాలను డబ్బు కారణంతో దూరం చేయొద్దు. అలా అని పిల్లలు అడిగే ప్రతి కోరికనూ తీర్చవద్దు. తీర్చగలిగే స్తోమత ఉన్నా సరే. గారాబం ఎక్కడైనా చేయాలి గాని డబ్బు దగ్గర కూడదు. ఎందుకు ఆ కోరిక తీర్చట్లేదో చక్కగా వివరించండి.
- వారి చేత పొదుపు చేయించడం మంచిదే. అది- నూరు నూటాపది రూపాయలుగా ఎలా మారుతుందో అవగాహన పెంచేందుకు ఉపయోగపడాలి. అంతేగాని అమ్మో కష్టపడి కూడబెట్టింది ఖర్చుపెట్టకూడదనే సంకుచిత భావాన్ని పెంచకూడదు.
- డబ్బు దుబారాను తిట్టడం ద్వారా ఆపొద్దు. చేసిన ఖర్చులను తెలివిగా చేయడం వల్ల ఎలా మిగుల్చుకోవచ్చో, వృథాను ఎలా అరికట్టొచ్చో వివరించగలిగితే అది వారి భవిష్యత్తును నిర్మిస్తుంది.
- పిల్లల ప్రశ్నలకు సమాధానాలు దాటవేయొద్దు. చిన్నప్పటినుంచే లాస్ అండ్ ప్రాఫిట్ విధానం తెలియాలి. రూపాయి రాక-పోక తెలియాలి. దీర్ఘకాలిక పొదుపు గురించిన అవగాహన రావాలి. లేకపోతే అది వారిని కట్టడి చేసేలా ఉండొద్దు.
- మీరు ఆర్థిక పాఠాలు చెప్పడం కంటే పత్రికల్లో వచ్చే సరళ సూత్రాలను అప్పుడప్పుడూ వారిచేత చదివింపజేస్తే ఎక్కువ ఫలితముంటుంది.

మనీమాన్యితం

కొన్ని ఎంపీలను కొంటా కొత్త పీఎంని నేనేనంటా
స్కాములెన్నో చేసి స్విస్సు బ్యాంకుకేసి
డాలర్లలో తేలుతా
సుడివుంటే ఎవరైనా సూపర్‌స్టారే

# పాట సంపన్నుడు

₹ స్ఫూర్తిశం



ఓ బాపనొక గ్రామీణ కుర్రాడు. లేకపోతే ఆసక్తి పాళ్లు కాస్త ఎక్కువ. హరికథలో ఆరితేరిన తండ్రిని శ్రద్ధగా గమనించేవాడు. హరికథ చెప్పడం అంటే సినిమాలోని 24 కళలు ఒక్కటిగా పనిచేసినంత. పాడుతూ, ఆడుతూ, అలరిస్తూ చెప్పాలి. దాన్ని బాలా దగ్గర్నుంచి, బాలా చిన్నవయసు నుంచి గమనించిన బాలులో ఓ కొత్త మనిషి నిద్రలేచాడు. అలా చిన్నప్పుడే పాటకు దగ్గరయ్యాడు. స్కూల్లో, ఊర్లో, కాలేజీల్లో ఎక్కడ పోటీలు జరిగినా పాల్గొనేవాడు. స్థానం మెరుగు పరుచుకుంటూ చివరకు మద్రాసు సోషల్ అండ్ కల్చరల్ క్లబ్ ఏర్పాటుచేసిన పోటీల్లో పాల్గొన్నారు. అది జీవితంలో గొప్ప మలుపు. ఘంటసాల, పెండ్యాల, కోదండపాణి వంటి వారి దృష్టిలో పడ్డారు. అప్పుడు చిన్నవాడు కావడంతో కొంతకాలం ఆగాక ఎస్పీ కోదండపాణి ఆయన్ని 'శ్రీశ్రీశ్రీ మర్యాదరామన్న కథ'తో పరిచయం చేశారు. అది మొదలు బాలు తిరిగి చూసింది లేదు. పాటపై అవిశ్రాంతమైన పరిశ్రమ, అపరిమితమైన ప్రేమ ఆయనను అవకాశాలకు దగ్గర చేశాయి. అవకాశాలు అందరికీ రావొచ్చు, కానీ వాటిని మెట్లుగా చేసుకుని ఎదగడమే చేయాల్సింది. అందుకే 'ఎస్పీ బాలు' అన్నది భాషతో తేడా లేకుండా అందరు నిర్మాతలకూ గుర్తొచ్చే పేరు అయ్యింది. మన సృజనకు ఎప్పుడైతే ఆదరణ పెరుగుతుందో సంపద దానంతటదే పరుగులు తీస్తూ వస్తుంటుంది. ఆయన గాయకుడిగా మిగిలిపోలేదు, సంగీత దర్శకుడిగా, నటుడిగా, నిర్మాతగా విభిన్నంగా రాణించారు. బాలు పాటల రికార్డు మాత్రమే కాదు, గిన్నిస్ రికార్డు. అవార్డుల పుట్ట. ఆయన భారతప్రభుత్వపు పద్మభూషణుడు. పాట తనకు అవకాశం అయిన రోజు నుంచి బాలు సినిమాకే ఒక అవకాశం అనే రోజుకు చేరారు. కీర్తి శిఖరాలతో పాటు సంపన్న శిఖరాలను అధిరోహించగలిగారు. అదంతా కృషి! లేకపోతే ఒక్కరోజే పాతిక పాటలు పాడటం ఏంటి?!!

₹ టిప్స్

# కొంపముంచేది చిల్లర ఖర్చులే



"నాకు నెలకు పాతికవేలొస్తాయి. సరుకులు, అద్దె, పెట్రోలు, ఇంటి ఖర్చులు అన్నీ కలిపినా నెలకు 20 వేలు దాటవు. అయినా, నెల తిరిగేటప్పటికి చేతిలో రూపాయి ఉండదు. ఎందుకిలా?"... ఇది అత్యధికులకు వేధించే సమస్య. దీనికి పరిష్కారం ఎవరికి వారే కనుక్కోగలరు. ఎందుకిలా జరుగుతుందంటే ఇదంతా మనకొచ్చే చిల్లర ఖర్చుల ప్రభావం. అందుకే వెయ్యి కంటే ఎక్కువ ఖర్చులు ఎలాగూ గుర్తుంటాయి కాబట్టి 50-1,000 రూపాయల మధ్య పెట్టే ఏ ఖర్చును అయినా ఓ నాలుగు నెలల పాటు తప్పకుండా రాయండి. మీ జీతం ఇంకా ఎక్కువనుకోండి 100-1,500, 200-3,000... ఇలా మీ స్థాయిని బట్టి ఏ రేంజి చిల్లర ఖర్చులు నమోదు చేయాలో రాసుకోవడం మంచిది. అప్పుడు మీ అసలు ఖర్చు తెలుస్తుంది. ఆ ఐదువేలు ఎక్కడికి వెళ్తున్నాయో, దాన్ని ఎలా అదుపు చేయాలో అర్థమవుతుంది.

● ప్రకాష్ చిమ్మల

## పదశోధన - 223

నిర్వహణ : అద్భుతదీపక

| | | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|---|
| 1 | | 2 | | | 3 | | 4 | | |
| | ■ | | ■ | ■ | | ■ | | ■ | ■ |
| 5 | 6 | | | ■ | 7 | 8 | | ■ | 9 |
| 10 | | | ■ | 11 | | | ■ | 12 | |
| 13 | | ■ | ■ | | ■ | | ■ | | ■ |
| ■ | 14 | | | | 15 | | 16 | | |
| 17 | | ■ | ■ | 18 | | ■ | 19 | | ■ |
| 20 | | 21 | ■ | 22 | | | | ■ | 23 |
| | ■ | 24 | | | ■ | ■ | | ■ | |
| 25 | | | ■ | ■ | 26 | | | | |

ఆధారాలు

అడ్డం

1. నవంబర్ ఒకటి ప్రత్యేకత (10)
5. కన్నులపండుగ (4)
7. రూపుమారిన టక్కరి (3)
10. యౌవనంలో ఉన్న స్త్రీ (3)
11. మృదంగం (3)
12. చెమట (2)
13. అటు నుంచి పడు (2)
14. 'మాయాబజార్'లో గోంగూరకు పింగళి నిర్వచనం (3)
17. రాత్రి (2)
18. కాయలేని ఆవకాయ (2)
19. బరువు (2)
20. గుక్క (3)
22. అన్నం ఉడికే ధ్వని (4)
24. ఒకదానిని చూసిరాసిన ప్రతి (3)
25. దారితప్పిన మన్మథుడు (3)
26. పగడాల దండ (5)

నిలువు

1. హనుమంతుడు (5)
2. భర్తతో అంతమయ్యే బ్రహ్మ (4)
3. మంచి భర్తకోసం ఆడపిల్లలు ఆచరించే నోము (4)
4. దొంగలను పట్టే రాజభటుడు, ఉరి తీసేవాడు (3)
6. తడబడిన పటుపత్రకాయి (6)
8. పైకి లేచిన విమలక్క (4)
9. తాచేలు (2)
11. పట్టుపురుగుల ఆహారం (6)
12. గొప్పగా మొదలయ్యే కర్పూరం (4)
15. వేలుపు (3)
16. వేకువ సమయం (5)
17. బదరీ ఫలం (4)
21. బంగారం (3)
23. గుడి (3)

### పదశోధన - 222 జవాబు

| | | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|---|
| వి | జ | య | ద | శ | మి | ■ | బ | క్రీ | డ |
| క | ష్ణ | ■ | ■ | ర్య | ■ | కు | రి | డ | ■ |
| ■ | చె | మ | గి | డు | ■ | రం | జ | ■ | జె |
| పి | ట్ట | ద | ల | ■ | ఖ | గం | ■ | మే | క్కా |
| ర | ■ | మీ | క | డు | ■ | ■ | తీ | హ | ■ |
| శు | ధం | ■ | రా | ధ్య | వ | ■ | క | ష్మ | ల |
| వు | ■ | క | ష్ట | ■ | ధ | ని | ■ | డ | ■ |
| ■ | కిం | ద | ■ | ■ | ■ | యం | శ | ఖ్య | ■ |
| శ్రీ | మ | రి | ■ | పి | మం | త | ■ | వి | చ |
| క | న | క | దు | ర్గ | ■ | ■ | శ్రీ | కృ | లు |

## ● దాగుడు మూతలు

ఇందులో దాగి ఉన్న బొమ్మలను గుర్తించండి?



## ● పజిల్



ఈ గడులలో ఉన్న ఎరుపు, నీలం వృత్తాలను వాటి స్థానాలను మార్చి తిరిగి వేయండి. నిలువుగా, అడ్డంగా ఎలా చూసినా గడులలోని వృత్తాలు సరి సంఖ్యలో ఉండాలి.



● మెదడుకు మేత

## Food Facts



- స్ట్రాబెర్రీలు శరీరంలోని కొలెస్ట్రాల్‌ను కరిగించడమే కాక, గుండె పనితీరును మెరుగుపరుస్తాయి!
- రాగులు ఎముకలను పటిష్ఠపరుస్తాయి!
- కాలీఫ్లవర్ ఎక్కువగా తినేవారికి రొమ్ము క్యాన్సర్ వచ్చే అవకాశాలు తక్కువ!
- బీన్స్ మధుమేహాన్ని నియంత్రిస్తాయి!
- మహిళల్లో కొలొరెక్టల్ క్యాన్సర్‌కు కారణమయ్యే అడినోమా సోకకుండా చేపలు కాపాడతాయి.

## Interesting Facts




- నాటి అమెరికా అధ్యక్షుడు హెర్బర్ట్ హూవర్, తన భార్యకు రహస్యాలు చెప్పాల్సివస్తే చైనీస్ భాషలో మాట్లాడేవారట!
- 1838 ప్రాంతంలో ఆస్ట్రేలియాలో పగటిపూట బీచ్‌లో ఈత కొట్టడం నేరం!
- ఫారో రాజు రామేస్ 2కి చనిపోయేనాటికి 96 మంది కొడుకులు, 60 మంది కూతుళ్లు ఉన్నారట!
- 1631లో లండన్‌లో ఓ ముద్రణా సంస్థ వారు బైబిల్‌ను ప్రింట్ చేశారు. అందులో ఓ ఘోరమైన అచ్చు తప్పు పడింది. NO అన్న పదాన్ని ముద్రించకపోవడం వల్ల పది ఆజ్ఞల్లో ఒక వాక్యానికి అర్థమే మారిపోయింది. ఆ బైబిల్‌కు 'చెడ్డ బైబిల్ (wicked bible) అని పేరు పెట్టి భద్రపరిచారు.
- ప్రపంచంలోనే అత్యంత పురాతనమైన చెట్టు స్వీడన్‌లో ఉంది. దాని వేళ్లు 9,550 సంవత్సరాలుగా పెరుగుతూనే ఉన్నాయట!

## Animal Facts




- చాలావరకూ జింకలు ఒంటిమీద తెల్లమచ్చలతో పుడతాయి. కానీ సంవత్సరమయ్యేసరికి ఆ మచ్చలు పోతాయి!
- గోల్డెన్ ఈగల్ ఎంత బలంగా ఉంటుందంటే... అది మేకలు, పిల్లులు, నక్కలను కూడా వేటాడి చంపగలదు!
- తాబేలు పైన ఉండే డిప్పను క్యారపేస్ అంటారు!
- మనిషి కండరాల కంటే మిడతల కాలి కండరాలు వెయ్యిరెట్లు ఎక్కువ బలంగా ఉంటాయట!
- మన దేశంలో మూడు వందల రకాల ఆవులున్నాయి!

## Known Person Little known Facts



- నిర్మాత, దర్శకుడు, రచయిత, డబ్బింగ్ ఆర్టిస్ట్, యానిమేటర్, వ్యాపారి... ఇలా పలు రంగాల్లో నిపుణుడు వాల్ట్ డిస్నీ!
- పదహారేళ్ల వయసులో సైన్యంలో చేరాలనుకున్నారు. కానీ వయసు చాలదని నిరాకరించడంతో రెడ్ క్రాస్‌లో చేరారు. సంవత్సరం పాటు అంబులెన్స్ డ్రైవర్‌గా ఫ్రాన్స్‌లో పనిచేశారు.
- మిక్కీమౌస్‌ను రూపొందించిన డిస్నీకి నిజానికి ఎలుకలంటే చచ్చేంత భయం! మిక్కీ మౌస్‌కు మొదట మార్టిమర్ మౌస్ అని పేరు పెట్టారు. కానీ తన భార్యకు ఆ పేరు నచ్చకపోవడంతో మార్చేశారు. మిక్కీకి ఇరవయ్యేళ్ల పాటు డిస్నీయే డబ్బింగ్ చెప్పారు!
- డిస్నీకి బీన్స్, మిరపకాయలు కలిపిచేసే వంటకం చాలా ఇష్టం. ఒక్కోసారి మూడుపూటలూ అదే తినేవారట!
- 59 సార్లు ఆస్కార్‌కు నామినేటయ్యి, 22 సార్లు గెలుచుకుని అరుదైన రికార్డును సాధించారు డిస్నీ!

● చిట్టి కథ

# కృతజ్ఞత



ఒక అడవికి సమీపంలో అశ్వరాజపురం అనే ఊరుంది. ఒక గుర్రంపిల్ల తన తల్లి నుండి తప్పిపోయి ఆ ఊళ్లోకి వచ్చింది. గ్రామస్థులు దాన్ని దయతో సాకారు. వంతులవారీగా ఆహారం పెట్టి పెంచి పెద్ద చేశారు. నాటి నుండి అది ఊరుమ్మడి గుర్రంగా ఆ ఊళ్లోనే తింటూ తిరుగుతూ ఉండిపోయింది.

ఓసారి బందిపోటు దొంగలు ఆ ఊరిని దోచుకునేందుకు పన్నాగం పన్నారు. పగలంతా బిచ్చగాళ్ల వేషాలతో, ఊరంతా తిరిగి ఊరు తీరు తెన్నులు, సంపద, వీధుల్లోని దారులు పరిశీలించారు. ఇదంతా గమనించిన ఒక వృద్ధుడు వాళ్లు వెళ్లిపోయాక, ఊరివాళ్లందర్నీ పిలిచి, ''నాకెందుకో అనుమానంగా ఉంది. ఊళ్లోకి ఒక్కసారిగా ఇంతమంది యాచకులు రావటం, అన్ని వీధులూ తిరగటం చూస్తే, వాళ్లు బందిపోట్లేమో అని నా మనసు శంకిస్తోంది. మనం అప్రమత్తంగా ఉండాలి'' అని చెప్పాడు. ఊరి జనాలు భయపడ్డారు. వాళ్లని మనమేం ఎదిరించగలం? వాళ్ల వద్ద శూలాలు, చురకత్తులు, బల్లేలు ఉంటాయి అని భయంతో వణికిపోయారు. ఇదంతా ఆ గుర్రం చూసింది. తనను ప్రేమగా సాకిన ఆ ఊరివారిని ఎలాగైనా కాపాడాలనుకుంది. రాత్రవగానే ఊరి పొలిమేరకి వెళ్లి ఊరి చుట్టూ తిరగసాగింది.

అనుకున్నట్టుగా బందిపోటులు దొంగతనానికి వచ్చారు. అయితే గుర్రం డెక్కల చప్పుడు విని, రాజసైనికులు గ్రామం చుట్టూ పహారా కాస్తున్నారనుకున్నారు. దొరికితే తమ పని అంతే అని భయపడి అట్నుంచటే వెళ్లిపోయారు. అలా ప్రతి రాత్రీ వారు రావడం, గుర్రపు డెక్కల చప్పుడు వినబడి వెళ్లిపోవడం. చివరికి విసుగొచ్చి వారు వేరే ఊరికి వెళ్లిపోయారు. అలా గుర్రం తనను పెంచి పెద్దచేసిన ఊరివాళ్ల రుణం తీర్చుకుంది.

**నీతి: ఆదరించిన వారికి అవసరంలో సాయపడటం ఉత్తమ లక్షణం.**

● కాండూరి వెంకట సన్యాసిరావ్

RNI Reg No.APTEL/2008/23482




aimvyapthi.com